

'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 346

మంగళవారం 29-8-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నా లక్ష్యానికి పరిమితి లేదు

ఇంకా మెరుగైన ప్రదర్శన ఇవ్వగలనన్న వరల్డ్ చాంపియన్ నీరజ్‌చోప్రా - 12లో



'చవితి'కి జియో ఎయిర్‌ఫైబర్

బీమాలోకి జియో ఫైనాన్షియల్స్.. బోర్డులోకి వారసుల ఎంట్రీ - 13లో



2న ఆదిత్య–ఎల్‌1 ప్రయోగం

సౌర వాతావరణంపై అధ్యయనం కోసం సెప్టెంబర్ 2వ తేదీన ఆదిత్య–ఎల్‌1 ఉపగ్రహాన్ని ఇస్రో ప్రయోగించనుంది.

వివరాలు 6లో ▸



బీజేపీ గెలిస్తే నియంతృత్వమే

దేశంలో మళ్లీ బీజేపీ గెలిస్తే నియంతృత్వం రాజ్యమేలుతుందని ప్రజలను పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ హెచ్చరించారు.

వివరాలు 6లో ▸



ల్యాండర్ ప్రయోగం వాయిదా

ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా జపాన్ చేపట్టిన మూన్ ల్యాండర్ రాకెట్ ప్రయోగం వాయిదాపడింది.

వివరాలు 6లో ▸



విమానంలో చిన్నారికి ప్రాణదానం

రెండేళ్ల చిన్నారికి విమానంలో గుండెపోటు రాగా.. అందులో ఉన్న ఎయిమ్స్ వైద్యులు చికిత్స అందించి పాపను రక్షించారు.

వివరాలు 6లో ▸



చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన జగనన్న విద్యా దీవెన సభకు హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

దమ్ము లేకనే.. దత్తపుత్రుడు



చిత్తూరు జిల్లా నగరి సభలో సీఎం జగన్ ధ్వజం

- సొంత బలం, సొంత కుమారుడిపై చంద్రబాబుకు అప నమ్మకం
- ప్యాకేజీ చెల్లించి దత్తపుత్రుడిని అద్దెకు తెచ్చుకున్నారు
- అధికారం కోసం ఏ గడ్డి తినడానికైనా వెనుకాడరు
- అడుగడుగునా శవ రాజకీయాలు చేయాలనే కుతంత్రాలు
- దొంగ ఓట్లను వారే చేర్చి మనపై ఫిర్యాదు చేయటానికి ఢిల్లీ వెళ్లారు.. నాడు డీపీటీతో దోపిడీ.. నేడు డీబీటీతో అక్కచెల్లెమ్మలకు నేరుగా రూ.2.33 లక్షల కోట్లు
- అభివృద్ధి జరగడం లేదని విమర్శిస్తున్న వారందరికీ గట్టిగా సమాధానం చెబుదాం..

2 లో

చదువులతో పేదరికాన్ని ఎదిరిద్దాం

- ప్రతి ఇంట్లో విద్యా దీపాలు వెలిగిద్దాం: సీఎం జగన్
- 'జగనన్న విద్యా దీవెన'తో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఉన్నత చదువులకు అయ్యే పూర్తి ఖర్చును భరిస్తున్నాం
- 8,44,336 మంది తల్లుల ఖాతాల్లోకి విద్యా దీవెనతో రూ.680.44 కోట్లు.. నేరుగా బటన్ నొక్కి జమ చేసిన సీఎం.. 9,32,235 మంది విద్యార్థులకు లబ్ధి

2 లో

597 గ్రూప్‌–1, గ్రూప్‌–2 పోస్టుల భర్తీ

గ్రూప్‌–1లో 89, గ్రూప్‌–2లో 508 ఉద్యోగాలకు గ్రీన్ సిగ్నల్

ఏపీపీఎస్సీ ద్వారా నేరుగా భర్తీ

వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా శాఖలకు ఆర్థికశాఖ ఆదేశం

సాక్షి, అమరావతి: గ్రూప్‌–1, గ్రూప్‌–2 ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. వివిధ శాఖల్లో 89 గ్రూప్‌–1, 508 గ్రూప్‌–2 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి(హెచ్‌ఆర్) చిరంజీవి చౌధరి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ద్వారా ఈ పోస్టులను నేరుగా భర్తీ చేయనున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. వ్యవసాయ, సహకార, బీసీ సంక్షేమం, ఆర్థిక, హోం, మున్సిపల్ పరిపాలన, రెవెన్యూ, సాంఘిక సంక్షేమం, రవాణా, రహదారులు–భవనాల శాఖల్లో గ్రూప్‌–1 పోస్టులు

మిగతా 14వ పేజీలో ▶



ఫ్యాక్ట్ చెక్

పనులే పూర్తి కాలేదు..

అయినా తప్పుడు రాతలు



- విశాఖలో బస్ బేపై ఈనాడు అబద్ధాల కథనం
- ఆర్టీసీ బస్టాండు వద్ద పీఈబీ స్ట్రక్చర్‌తో బస్‌బే
- వర్షం కారణంగా శనివారం రాత్రి నిలిచిన వెల్డింగ్ పనులు
- ఆదివారం ఉదయం పాక్షికంగా ఒరిగిన కాంటిలివర్ ఫ్రేమ్
- వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్
- ఏదో జరిగిపోయిందంటూ పచ్చ బ్యాచ్ అబద్ధపు ప్రచారం
- ప్రజా ధనం దుర్వినియోగం కాలేదు: విశాఖ మేయర్

3 లో

ఎందుకంత తొందర రామోజీ!?



- వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలుచేస్తున్నాం
- ఇప్పటికే 60 వేల క్వింటాళ్ల విత్తనాలు ఆర్బీకేల్లో ఉంచాం
- డిమాండ్ మేరకు మరిన్ని విత్తన నిల్వలు.. సెప్టెంబర్ నెలాఖరు వరకు ఖరీఫ్ సీజన్
- ఆ తర్వాత పరిస్థితిని సమీక్షించి రైతులను ఆదుకుంటాం
- సీజన్ ముగియకుండా ఎలా అంచనా వేస్తాం?
- మీడియాతో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

14 లో

ఇదండీ సంగతి



మరి మనకు కనపడవేం!

చంద్రబాబు ఫిర్యాదే ఓ బోగస్

దొంగ ఓట్ల నమోదులో బాబు ప్రపంచ చాంపియన్

- నాడు సేవా మిత్ర నేడు మై టీడీపీ యాప్‌లతో చంద్రబాబు మాల్‌ప్రాక్టీస్
- ఓటరు కులమేంటని అడుగుతున్న కుల ఉన్మాది.. ఓటరు ప్రొఫైల్ సర్వే పేరిట అభ్యంతరకర ప్రశ్నలు
- ఆధారాలు, పట్టికల రూపంలో సీఈసీకి ఫిర్యాదు చేశాం.. ఒక్కరికి ఒక్క ఓటు ఉండాలన్నదే మా సిద్ధాంతం
- అదే విధానంతో పారదర్శక ఓటర్ల జాబితా కోరుతున్నాం.. ఆధార్‌తో ఓటరు కార్డు అనుసంధానం చేయాలి
- వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి



ఈసీకి ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

- బాబు దొంగ ఓట్లపై సీఈసీకి విజయసాయిరెడ్డి ఫిర్యాదు
- ఆధారాలను కూడా సమర్పించిన వైఎస్సార్‌సీపీ నేతలు

10 లో

పాఠశాలల్లో మొబైల్ ఫోన్ నిషేధం

- విద్యాశాఖ ఉత్తర్వులు
- ఉపాధ్యాయులు హెడ్మాస్టర్‌కు అప్పగించి తరగతులకు వెళ్లాలి
- బోధనకు ఆటంకం కలగకుండా పూర్తి ధ్యాస పాఠ్యాంశాలపైనే ఉండేలా నిర్ణయం
- మార్గదర్శకాలు విడుదల చేసిన పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్

- వివరాలు 5లో

పురందేశ్వరి టీడీపీ ఏజెంట్..

చంద్రబాబు స్క్రిప్టును బీజేపీ అధ్యక్షురాలిగా ఆమె చదువుతున్నారు

- వదిన, మరిది ఒక్కటయ్యారు..
- సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌పై విష ప్రచారం చేస్తున్నారు
- ఎన్నికల కోసం ఎన్టీఆర్ బొమ్మతో రూ.100 నాణేల పేరిట నాటకం
- ఇది ఎటువంటి కార్యక్రమమైనా ఎన్టీఆర్ భార్యగా నాకు ఆహ్వానం అందాలి
- ఎన్టీఆర్‌కు వెన్నుపోటులో పురందేశ్వరి ప్రధాన కుట్రదారు.. ఎన్టీఆర్ కుమారులను మాయమాటలతో మోసం చేశారు
- ఎన్టీఆర్ నన్ను వివాహం చేసుకున్నారో లేదో కుటుంబ సభ్యులే చెప్పాలి

10 లో



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నందమూరి లక్ష్మీపార్వతి

- లేకుంటే ఇల్లీగల్‌గా జీవించి ఉంటే ఎన్టీఆర్ యుగపురుషుడు ఎలా అవుతారు?
- ఎన్టీఆర్ నన్ను దైవసాక్షిగా వివాహం చేసుకున్నారు
- ఎన్టీఆర్ భార్య నందమూరి లక్ష్మీపార్వతి




చిరస్మరణీయుడు.. ఎన్టీఆర్

రూ. 100 స్మారక నాణెంను విడుదల చేసిన రాష్ట్రపతి ముర్ము

ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్‌పై రూపొందించిన రూ.100 స్మారక నాణెంను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విడుదల చేశారు. దేశ రాజకీయాల్లో ఎన్టీఆర్‌ది ప్రత్యేక అధ్యాయమని రాష్ట్రపతి ముర్ము అన్నారు.

- వివరాలు 10లో


సీఎం జగన్‌కు అభివాదం చేస్తున్న మహిళలు


జగనన్న విద్యా దీవెన చెక్‌ను విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


సీఎం జగన్‌కు పూలవర్షంతో స్వాగతం పలుకుతున్న నగరి వాసులు

చదువులతో పేదరికాన్ని ఎదిరిద్దాం

నగరి బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ ■ ప్రతి ఇంట్లో విద్యా దీపాలు వెలిగిద్దాం

- 'జగనన్న విద్యా దీవెన'తో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఉన్నత చదువులకు అయ్యే పూర్తి ఖర్చును భరిస్తున్నాం
- ఇది పిల్లల భవిష్యత్తును మార్చేసే కార్యక్రమం..
- విద్యాదీవెన, వసతి దీవెనతో నాలుగేళ్లలో రూ.15,600 కోట్లు ఇచ్చాం
- విద్యారంగంలో సమూల మార్పులు.. ఏకంగా రూ.69,266 కోట్లు వ్యయం చేశాం
- 8,44,336 మంది తల్లుల ఖాతాల్లోకి విద్యా దీవెనతో రూ.680.44 కోట్లు
- నేరుగా బటన్ నొక్కి జమ చేసిన సీఎం జగన్.. 9,32,235 మంది విద్యార్థులకు లబ్ధి


అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, తిరుపతి: మనందరి ప్రభుత్వంలో ఇంటింటా ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం, ఆర్థిక, సామాజిక, రాజకీయ, లింగ వివక్ష లేకుండా న్యాయం అందాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నామని.. పిల్లలు, అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, రైతులు, ప్రతి సామాజిక వర్గానికి మంచి చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ''నిన్నటి కంటే నేడు, నేటి కంటే రేపు, రేపటి కంటే భవిష్యత్తు ఇంకా బాగుండాలన్నదే నా తపన. పేదరికం పిల్లల పెద్ద చదువులకు, భవిష్యత్తుకు అడ్డు రాకూడదు. విద్యార్థుల ఉన్నత చదువులకు అయ్యే పూర్తి ఖర్చు, పూర్తి ఫీజుల మొత్తాన్ని మన ప్రభుత్వం భరిస్తోంది'' అని పేర్కొన్నారు. జగనన్న విద్యాదీవెన ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను క్రమం తప్పకుండా ఏ త్రైమాసికం ఫీజును అదే త్రైమాసికం ముగిసిన వెంటనే చెల్లిస్తున్న విషయం తెలిసిందే. 2023 ఏప్రిల్ – జూన్‌కి సంబంధించి 9,32,235 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ రూ.680.44 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం బటన్ నొక్కి 8,44,336 మంది తల్లుల ఖాతాల్లో జమ చేశారు. చిత్తూరు జిల్లా నగరిలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగం వివరాలివీ..

పిల్లలభవిష్యత్తును మార్చే కార్యక్రమం

ఈరోజు ఇక్కడ జరుగుతున్న కార్యక్రమం రేపటి మన పిల్లల భవిష్యత్తును మార్చబోయే కార్యక్రమం. తల్లిదండ్రుల పేదరికం పిల్లల పెద్ద చదువులకు, వారి భవిష్యత్తుకు అడ్డు రాకూడదన్న మంచి మనసుతో పూర్తి ఫీజుల మొత్తాన్ని మన ప్రభుత్వం భరించే కార్యక్రమమే జగనన్న విద్యాదీవెన. వంద శాతం పూర్తి ఫీజును ప్రతి మూడు నెలలకు ఒకసారి, ఆ మూడు నెలలు అయిన వెంటనే రీయింబర్స్ చేసే కార్యక్రమం ఇది. ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన ఫీజును ఈరోజు తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. జగనన్న విద్యాదీవెనతో వంద శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేస్తున్నాం.

> **వసతి దీవెనతో రూ.4,275 కోట్లు**
>
> ఈ నాలుగేళ్లలో ప్రతి ఐటీఐ విద్యార్థికి రూ.10 వేలు చొప్పున, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, మెడిసిన్, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏటా రూ.20 వేల చొప్పున సంవత్సరానికి రెండు దఫాల్లో జగనన్న వసతి దీవెన పథకం ద్వారా ఆ పిల్లల తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. జగనన్న వసతి దీవెన అనే ఒక్క పథకం ద్వారానే నాలుగేళ్లలో రూ.4,275 కోట్లు పెద్ద చదువుల కోసం తల్లుల ఖాతాల్లోకి జమ చేశాం. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాల ద్వారా రూ.15,600 కోట్లు అందజేశాం. ఫీజుల మొత్తాన్ని నేరుగా కాలేజీలకు ఇవ్వకుండా తల్లుల ఖాతాల్లోకి జమ చేస్తున్నాం. ప్రతి 3 నెలలకు ఒకసారి తల్లిదండ్రులు కాలేజీలకు వెళ్లి పిల్లలు ఎలా చదువుతున్నారో తెలుసుకోవాలి. ఆ కాలేజీలో విద్యా బోధన బాగా లేకున్నా, వసతులు సరిగా లేకున్నా యాజమాన్యాలను ప్రశ్నించే హక్కు తల్లిదండ్రులకు కల్పిస్తూ విద్యాదీవెన సొమ్మును తల్లుల ఖాతాల్లో జమ చేసి వారి ద్వారా ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకున్నాం.

విద్యాదీవెనతో నాలుగేళ్లలో రూ.11,317 కోట్లు

ఒక్క విద్యాదీవెన పథకం ద్వారానే 26,98,728 మంది పిల్లలకు మంచి చేస్తూ 24,53,389 మంది తల్లుల ఖాతాల్లోకి నాలుగేళ్లలో నేరుగా రూ.11,317 కోట్లు పంపించాం. నాలుగేళ్ల ప్రయాణంలో ప్రతి అడుగులో ప్రతి పిల్లాడిని చేయి పట్టుకుని నడిపిస్తూ చదువుల ద్వారా ఆ కుటుంబాలు పేదరికం నుంచి బయటకు రావాలని అడుగులు వేస్తున్నాం.

జీవితాలను మార్చేది విద్య మాత్రమే

17–20 ఏళ్ల మధ్యలో ఉన్న నేటితరం మరో 80 ఏళ్ల పాటు ఆత్మవిశ్వాసంతో రాణించాలంటే వారి ప్రయాణాన్ని, జీవన ప్రమాణాలను మార్చే శక్తి ఒక్క చదువుకు మాత్రమే ఉందని మనస్ఫూర్తిగా నమ్మాం. అటువంటి చదువులు ప్రతి పేద కుటుంబానికి, ప్రతి పిల్లాడికి అందాలని, అప్పుల పాలయ్యే పరిస్థితి ఆ తల్లిదండ్రులకు రాకూడదని ఫీజులను వందశాతం రీయింబర్స్ చేస్తూ తల్లుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమం జగనన్న విద్యాదీవెన. విద్యార్థుల చదువులకు అయ్యే ఖర్చులు మాత్రమే కాదు.. ఆ పిల్లల భోజన, వసతి ఖర్చులకు కూడా తల్లిదండ్రులు ఇబ్బంది పడకూడదని జగనన్న వసతి దీవెన పథకాన్ని చేపట్టాం.

అక్క చెల్లెమ్మలకు అధికారం..

మీ పిల్లలు చదువుతున్న కాలేజీలకు వెళ్లండి. అక్కడ వసతులు బాగా లేకున్నా, బోధన సరిగా లేకున్నా ప్రశ్నించే హక్కును మీ అన్న మీ చేతుల్లో పెడుతున్నాడు. ఆ కాలేజీలకు వెళ్లినప్పుడు ఇవాళ ఇస్తున్న పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు కాకుండా యాజమాన్యాలు ఇతర ఫీజుల కోసం డిమాండ్ చేస్తే 1902కు ఫోన్ చేయండి. 'జగనన్నకు చెబుదాం'కు ఫోన్ చేయండి. వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయం ఆ కాలేజీ యాజమాన్యాలతో మాట్లాడుతుంది. ఇటువంటి తప్పిదాలు జరగకుండా కట్టడి చేస్తుంది, యాక్షన్ తీసుకుంటుంది. అందుకే ఈ అధికారాన్ని నా అక్కచెల్లెమ్మల చేతుల్లో పెట్టాం.

చదువుల్లో సమూల మార్పులు

మన ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్లలోనే మునుపెన్నడూ చూడని విధంగా విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. అవి అందరికీ తెలిసి ఉండాలి కాబట్టి నాలుగు మాటలు మీతో పంచుకుంటున్నా. తల్లిదండ్రులకు ఇబ్బందులు లేకుండా, పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ ఏటా రూ.15 వేల చొప్పున అమ్మ ఒడి ద్వారా ఇస్తున్నాం. ప్రతి సంవత్సరం పిల్లలకు బ్యాగు, బైలింగ్యువల్ టెక్ట్స్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫాం, షూస్ అన్నీ కలిపి జగనన్న విద్యా కానుకగా స్కూల్ తెరిచే రోజే ఇస్తున్నాం. ప్రభుత్వ స్కూళ్ల రూపు రేఖలు సమూలంగా మారుస్తూ శిథిలావస్థలో ఉన్న వాటికి గొప్ప వైభవం తెచ్చేందుకు నాడు–నేడు కార్యక్రమంతో అడుగులు వేశాం. గవర్నమెంట్ బడుల్లో ఇంగ్లిష్ మీడియం తెచ్చాం. బైజూస్ కంటెంట్‌ను కరిక్యులమ్‌తో అనుసంధానం చేశాం. 3వ తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్ తీసుకొచ్చాం.

ట్యాబ్‌లు.. విదేశీ విద్యాదీవెన

పిల్లలకు సులభంగా అర్థం కావాలని తాపత్రయ పడుతూ వారు 8వ తరగతిలోకి రాగానే ట్యాబ్స్‌లు ఇచ్చే కార్యక్రమం కూడా మొదలుపెట్టాం. గవర్నమెంట్ స్కూళ్లలో రోజుకో మెనూతో మధ్యాహ్న భోజనం పథకాన్ని గోరుముద్ద ద్వారా భారీ మార్పులు తెచ్చాం. పిల్లలు తింటున్న తిండి గురించి ఆలోచించిన చరిత్ర రాష్ట్ర చరిత్రలో ఎప్పుడైనా జరిగిందంటే అది మీ అన్న పరిపాలనలోనే. విదేశాల్లో టాప్ 50 కాలేజీలలో, 21 ఫ్యాకల్టీల్లో దాదాపు 350 కాలేజీల్లో సీటు తెచ్చుకుంటే చాలు ఉన్నత విద్యకయ్యే ఖర్చు మొత్తం రూ.1.25 కోట్ల వరకు చెల్లిస్తున్న ప్రభుత్వం మీ బిడ్డ ప్రభుత్వం మినహా దేశంలో మరే రాష్ట్రంలోనూ లేదు.

> **3 శంకుస్థాపనలు..**
>
> నగరిలో రూ.5.40 కోట్లతో వంద పడకల వైద్య విధాన పరిషత్ ప్రాంతీయ వైద్యశాల పునరుద్ధరణ పనులతోపాటు రూ.7.25 కోట్లతో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (యానాదులు), పుత్తూరులోని నందిమంగళం వద్ద గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలుర) శాశ్వత భవన నిర్మాణం, రూ.1.89 కోట్లతో నగరి పోలీస్ స్టేషన్ శాశ్వత భవన నిర్మాణ పనులకు సభా వేదిక వద్ద నుంచి సీఎం శంకుస్థాపన చేశారు.

పౌష్టికాహారం..

అంగన్‌వాడీ పిల్లలు, బాలింతలు, గర్భిణీలకు మంచి పౌష్టికాహారాన్ని ఇస్తూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని, స్కూళ్లలో ఆడ పిల్లల కోసం స్వేచ్ఛ కార్యక్రమాన్ని తీసుకొచ్చాం. చదువులను ప్రోత్సహిస్తూ వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలను పొందేందుకు పదో తరగతి తప్పనిసరిగా పాస్ అయి ఉండాలనే నిబంధన విధించి అమలు చేస్తున్నాం.

ఆ బాధ్యత నాది.. ఎలాంటి కోతలు లేవు

కరిక్యులమ్‌లో కూడా భారీ మార్పులు తెచ్చాం. ఆన్‌లైన్ వర్టికల్స్ తెచ్చాం. జాబ్ ఓరియెంటెడ్‌గా అడుగులు వేస్తున్నాం. డిగ్రీ చదువులకు 10 నెలల పాటు తప్పనిసరి ఇంటర్న్‌షిప్ తెచ్చాం. నాలుగేళ్లలో విద్యారంగం కోసం మీ అన్న ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.69,266 కోట్లు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం నుంచి ఒక ఇంజనీర్, డాక్టర్ రావాలని ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మీ ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతున్నా ఫర్వాలేదు. చదువుల కోసం మీరు ఇబ్బంది పడకుండా పిల్లలను బడులకు, కాలేజీలకు పంపండి. విద్యా దీవెన, వసతి దీవెనలో ఎటువంటి కత్తిరింపులు లేవు. ప్రతి పిల్లాడిని చదివించే బాధ్యత నాది. మీరు అప్పుల పాలయ్యే పరిస్థితి రాకుండా ప్రతి పిల్లవాడికీ విద్యాదీవెన, వసతి దీవెన ఇచ్చి మీ అన్న, మీ తమ్ముడు చదివిస్తాడని చెబుతున్నా.

కార్యక్రమంలో డిప్యూటీ సీఎం కె.నారాయణ స్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషాశ్రీచరణ్, మేరుగ నాగార్జున, ఎంపీలు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, ఎన్.రెడ్డెప్ప, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తదితరులు పాల్గొన్నారు.

> **టోఫెల్‌కు శిక్షణ..**
>
> మూడో తరగతి నుంచే టోఫెల్ ఓరియెంటేషన్ బోధన వచ్చే ఏడాది నుంచి ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నాం. సీబీఎస్ఈ సిలబస్‌తో ప్రారంభించి ఐబీ, ఐజీసీఎస్ఈ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ దిశగా మన గవర్నమెంట్ స్కూళ్లు వేగంగా అడుగులు వేస్తున్నాయి. నాడు–నేడు పూర్తయిన బడుల్లో 6వ తరగతి నుంచి ప్రతి క్లాస్ రూమ్‌ను డిజిటలైజ్ చేస్తున్నాం. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 63 వేల క్లాస్ రూములకు సంబంధించి 31 వేల క్లాస్ రూముల్లో ఐఎఫ్‌పీలు ఏర్పాటయ్యాయి. అతి కొద్ది రాష్ట్రాల్లో మాత్రమే ఇటువంటి పరిస్థితులు ఉంటాయి. ఈ డిసెంబర్ నాటికల్లా మిగిలిన 33 వేల క్లాస్ రూముల్లో ఐఎఫ్‌పీలు ఏర్పాటవుతాయి.

> **నగరికి నజరానాలు..**
>
> కాసేపటి క్రితం నా చెల్లి (మంత్రి ఆర్కే రోజా) మాట్లాడుతూ నగరి నియోజకవర్గం కోసం కొన్ని పనులు అడిగింది. ఇక్కడ పవర్‌లూమ్స్ ఎక్కువగా ఉన్నాయి. వీటికి సంబంధించి ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.1 తగ్గించాలని కోరింది. ఇది చేస్తే చిన్న చిన్న వాళ్లు బాగుపడతారని అడిగింది. ఈ ఎలక్ట్రిసిటీ డ్యూటీని విత్‌డ్రా చేస్తున్నాం. నేను ఇక్కడకు రాకముందు రేణిగుంట కోపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించి ఉద్యోగుల బకాయిలు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్నాయి. రూ.21 కోట్ల బకాయిలుతో వారి జీవితాలు అతలాకుతలం అయ్యాయని చెప్పింది. ఆ రూ.21 కోట్లు కూడా ఇచ్చాం. గాలేరు, నగరి, సుజల స్రవంతిని అనుసంధానం చేసే మూడు రిజర్వాయర్లు వేణుగోపాలసాగర్, వేపగుంట, అడవి కొత్తూరు ప్రాజెక్టుల గురించి కూడా చెప్పింది. ఈ పనులను వేగవంతం చేసే దిశగా అడుగులు వేస్తాం.

దమ్ము లేకనే.. దత్తపుత్రుడు!

నగరి సభలో సీఎం జగన్ ధ్వజం

సాక్షి, తిరుపతి: సొంత బలంపై, సొంత కుమారుడిపై నమ్మకం లేని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్యాకేజీ చెల్లించి దత్త పుత్రుడిని అద్దెకు తెచ్చుకున్నారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. చంద్రబాబు రాజకీయ చరిత్ర అంతా వెన్నుపోట్లు, మోసం, అబద్ధాలేనని ధ్వజమెత్తారు. సోమవారం చిత్తూరు జిల్లా నగరిలో జగనన్న విద్యాదీవెన నిధులను తల్లుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. 'ఏ ఇంటికీ, ఏ సామాజిక వర్గానికీ, ఏ ప్రాంతానికీ ఎలాంటి మంచి చేయని గత పాలకులు ఎన్ని దుర్మార్గాలకు దిగుతున్నారో నాలుగు మాటలు మీ ముందుంచుతా. దుర్మార్గమైన ఆలోచనలు చేసే ఆ పెద్ద మనిషి మూడుసార్లు సీఎంగా ఉన్నాడు. 28 ఏళ్ల క్రితమే ఆయన సీఎం అయ్యాడు. మూడుసార్లు సీఎం అయిన ఆ వ్యక్తి పేరు చెబితే కనీసం ఒక్కటంటే ఒక్క మంచి స్కీమైనా మీ మెదడులో తడుతుందా? గత పాలనకు, ఈ నాలుగేళ్ల పాలనకు తేడా ఉందా? లేదా? అనేది ఆలోచన చేయండి' అని సీఎం జగన్ పేర్కొన్నారు. సభలో సీఎం ఏమన్నారంటే..

దత్తపుత్రుడిని అద్దెకు తెచ్చుకున్నాడు

ఆ మనిషి ఎలాంటివాడో అందరికంటే మీకే బాగా తెలుసు. ఆ మనిషి ఏదైనా మాట ఇస్తే నిలబెట్టుకున్నాడా? అనేది ఆలోచన చేయండి. అధికారం కోసం ఏ గడ్డి అయినా తినడానికి వెనుకాడడు. చివరికి పిల్లనిచ్చిన మామ ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడవడానికి కూడా ఏ మాత్రం వెనుకాడని మనిషి.. ఆ పెద్ద మనిషి!! ఆ పెద్ద మనిషికి సొంత బలం మీద గానీ, సొంత కుమారుడి మీద గానీ నమ్మకం లేదు. కాబట్టే దత్త పుత్రుడిని ప్యాకేజీ ఇచ్చి అద్దెకు తెచ్చుకున్నాడు.

ప్రతి అడుగులో కుళ్లు, కుతంత్రాలే!

ఈమధ్య కాలంలో ఆయన గానీ, ఆయన కుమారుడు గానీ, దత్తపుత్రుడు గానీ మీటింగుల్లో మాట్లాడుతున్నప్పుడు మాట్లాడుతున్న మాటలు చూసినప్పుడు, వారి భాషను చూసినప్పుడు ఆశ్చర్యం అనిపిస్తుంది. ప్రతి మాటలోనూ రెచ్చగొట్టాలి, కుతంత్రాలు చేయాలి, గొడవలు సృష్టించి శవ రాజకీయాలు చేయాలనే కుతంత్రాలు ప్రతి అడుగులోనూ కనిపిస్తాయి.

వీళ్లతో ఎల్లో మీడియా ప్రయాణం..

టీవీలో ఏదైనా వార్త వస్తే నిజమేనేమో అనుకునే పరిస్థితులు ఇవాళ లేవు. ఆ పాత రోజులు పోయాయి. ఈరోజు ఎల్లో మీడియా చంద్రబాబు నాయుడును ఏ రకంగా మోస్తోందో మీ అందరికీ తెలుసు. ప్రజలకు ఫలానా మంచి చేశామని చెప్పుకునేందుకు గత చరిత్ర ఏదీ లేదు కాబట్టే వీళ్లంతా అబద్ధాలు, కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోట్ల మీద ఆధారపడి వాటినే జీవితంగా మార్చుకుని రాజకీయాలు చేస్తున్నారు. దోచుకో, పంచుకో, తినుకో (డీపీటీ) అనేదే వారి లక్ష్యం.

కుర్చీ లాక్కుని ఫోటోలకు దండేస్తారు

ఇదే వ్యక్తి.. ఎన్టీఆర్ నుంచి సీఎం కుర్చీని లాగేసుకున్నారు. ఆయనకు వెన్నుపోటు పొడిచారు. ఎన్టీఆర్ పార్టీని కూడా లాగేసుకున్నారు. ఎన్టీఆర్ చావుకు కూడా చివరకు వీళ్లే కారణం అయ్యారు. ఇదే దుర్మార్గులు మళ్లీ ఎన్టీఆర్ చనిపోగానే ఆయన శవాన్ని లాక్కుకుంటారు. ఫొటోలకు దండలేస్తారు. ఫొటో ముందు ప్రతి రోజూ దండం పెడుతూ తిరుగుతారు. ఆయన పేరుతో ఒక కాయిన్ రిలీజ్ చేస్తుంటే ఆ కార్యక్రమంలో కూడా చంద్రబాబు నిస్సిగ్గుగా పాలు పంచుకుంటారు. ఎందుకు ఇంతగా చెబుతున్నానంటే... ఒకసారి ఆ మనిషి మనస్తత్వం ఏమిటో తెలుసుకోవాలని అడుగుతున్నా.

రైతులు, అక్కచెల్లెమ్మలకు దగా

ఆ పెద్దమనిషి (చంద్రబాబు) రైతులను మాయ మాటలతో మోసం చేశాడు. ఎన్నికల వేళ రూ.87,612 కోట్ల రైతుల రుణాలను మాఫీ చేస్తానన్నాడు. రుణాలు కట్టకండి.. బ్యాంకుల్లో పెట్టిన బంగారం బయటకు రావాలంటే బాబుకు ఓటేయాలని చెప్పి రైతులను నిట్ట నిలువునా మోసం చేశాడు. డ్వాక్రా మహిళలు రుణాలు కట్టొద్దు.. బాబు సీఎం అవుతాడు.. వెంటనే తీరుస్తాడని చెప్పి ఆ అక్కచెల్లెమ్మలను మోసం చేశాడు. వాళ్లను వంచించడమే కాకుండా వారి తరఫున కడుతున్న సున్నా వడ్డీని సైతం ఎగ్గొట్టాడు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు వాగ్దానాలు చేసి నిలువుగా దగా చేశాడు. ఆ పెద్ద మనిషి చివరకు పిల్లలను కూడా వదల్లేదు, నిరుద్యోగులనూ వదల్లేదు. 2014 ఎన్నికలకు ముందు జాబు రావాలంటే బాబు రావాలన్నారు. జాబు ఇవ్వలేకపోతే ప్రతి ఇంటికీ రూ.రెండు వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఎంత మందికి నిరుద్యోగ భృతి ఇచ్చాడని అడుగుతున్నా. ఆ పెద్ద మనిషి మనస్తత్వం చూస్తే... ఎన్నికలకు ముందు అందంగా ఉండే మేనిఫెస్టో తెస్తాడు. ఎన్నికలు అయిపోయిన తర్వాత దాన్ని చెత్తబుట్టలో వేస్తాడు. వెబ్ సైట్లలో కూడా మేనిఫెస్టో కనపడకుండా మాయం చేస్తాడు. ఎన్నికల ముందు స్వర్గాన్ని చూపిస్తానంటాడు. ఎన్నికలు అయిపోయాక ప్రజలకు నరకాన్ని చూపిస్తాడు. ఇలాంటి వ్యక్తికి.. చెప్పిన ప్రతి మాటనూ అమలు చేస్తున్న మనందరి ప్రభుత్వం మధ్య తేడా ఎంత ఉందో? ఆలోచన చేయాలని అడుగుతున్నా.

బాబు చేసిన అప్పులున్నా..

మన పార్టీ అధికారంలోకి వచ్చేసరికి రాష్ట్రంలో విపరీతమైన సమస్యలున్నాయి. చంద్రబాబు చేసిన అప్పులు విపరీతంగా ఉన్నాయి. అయినా మీ బిడ్డ వెనకడుగు వేయలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే వరుసగా రెండు సంవత్సరాలు కోవిడ్ సమస్యలు వచ్చాయి. ఖర్చులు పెరిగాయి, రాబడులు తగ్గాయి. అయినా మీ బిడ్డ కారణాలు, సాకులు చెప్పలేదు. ఎన్నికల మేనిఫెస్టోలో ఏదైతే చెప్పామో దాన్ని ఒక భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించాం. వెనకడుగు వేయలేదు. సాకులు వెతకలేదు. కారణాలు చెప్పి తప్పించుకోవాలని ఆలోచన చేయలేదు. నా అక్కచెల్లెమ్మలు, వారి కుటుంబాలు బాగుండాలనే తపన, తాపత్రయంతో మీ బిడ్డ బటన్లు నొక్కుతున్నాడు. నాలుగేళ్లలో రూ.2.33 లక్షల కోట్లు నేరుగా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి వెళ్లాయి. ఇవాళ ఎక్కడా లంచాలు, వివక్ష చూపించే వ్యవస్థ లేదు. అదే ప్రభుత్వం, అదే రాష్ట్రం, అదే బడ్జెట్. మారిందల్లా కేవలం ముఖ్యమంత్రి మాత్రమే. అప్పుడు చేసిన అప్పుల గ్రోత్ రేటు కన్నా ఇప్పటి అప్పుల గ్రోత్ రేటు తక్కువ. మరి మీ బిడ్డ ఎలా చేయగలుగుతున్నాడు? చంద్రబాబు ఎందుకు చేయలేకపోయాడు? అప్పటికీ, ఇప్పటికీ తేడా ఏమిటంటే.. అప్పట్లో దోచుకో, పంచుకో, తినుకో అనే పాలన సాగింది. ఈనాడుకి ఇంత, ఆంధ్రజ్యోతికి ఇంత, దత్తపుత్రుడికి కాస్తంత, మిగిలింది చంద్రబాబునాయుడికి అని డీపీటీ సాగింది. జన్మభూమి కమిటీల దగ్గర నుంచి మొదలుపెడితే ప్రతి అడుగులోనూ దోచుకోవడం, పంచుకోవడం, తినుకోవడమే! మనం మారీచులతో యుద్ధం చేస్తున్నాం. ఒకే అబద్ధాన్ని వంద సార్లు చెప్పి నిజమని నమ్మించే వ్యవస్థలు వాళ్ల దగ్గర ఉన్నాయి. వాళ్ల మాదిరిగా మీ బిడ్డకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడి అండ లేదు. వీళ్లను మీ బిడ్డ నమ్ముకోలేదు. మీ బిడ్డలో కల్మషం లేదు. మీ బిడ్డ నమ్ముకున్నది చేసిన మంచినే. మీకు ఒక్కటే చెబుతున్నా. వీళ్లు చెబుతున్న అబద్ధాలు, మోసాలను నమ్మకండి. మీ ఇంట్లో మీకుమంచి జరిగిందా? లేదా అన్నది ఒక్కటే కొలమానంగా తీసుకోండి. మీ ఇంట్లో మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు సైనికులుగా మీరే తోడుగా నిలబడండి.

> **బాబువి శవ రాజకీయాలు..**
>
> పుంగనూరు, అంగళ్లలో జరిగిన ఘటన మీ అందరికీ తెలిసిందే. అప్పుడు పోలీసులు చేసిన తప్పల్లా.. ''బాబు గారూ మీకు పర్మిషన్ ఉన్న రూట్లోనే ప్రయాణం చేయండి. మీకు అనుమతున్న రూట్లో కాకుండా వేరే రూట్లో ఎందుకు ప్రయాణం చేస్తారు? వేరే పార్టీ వాళ్లు అక్కడ ధర్నా చేస్తుంటే అక్కడికి వెళ్తామని ఎందుకు అంటున్నారు? మీరు అక్కడికి వెళ్తే లా అండ్ ఆర్డర్ ఇబ్బందులు వస్తాయి. ఆ రూట్ వద్దు'' అని చెప్పటమే!! అలా చెప్పినందుకు పోలీసులపై కర్రలు, బాటిళ్లతో దాడి చేశారు. చివరకి ఓ పోలీసు సోదరుడి కన్ను కూడా పోగొట్టారు. 47 మంది పోలీసులపై దాడి చేశారు. దాడి చేసి రెచ్చగొట్టి పోలీసులు కాల్పులు జరిపితే శవ రాజకీయాలు చేయాలనే దిక్కుమాలిన ఆలోచన చేసిన వ్యక్తి చంద్రబాబు మాత్రమే. ఈ పెద్ద మనిషి ఢిల్లీ వెళ్లాడు. ఎన్నికల కమిషన్‌ను కలిసి రాష్ట్రంలో పోలీసులు తనమీద హత్యాయత్నం చేశారని ఫిర్యాదు చేయడానికి వెళ్లాడు. దొంగ ఓట్లను వారే చేర్చి మనపై ఫిర్యాదు చేయటానికి బయల్దేరాడు. ఇలా అబద్ధాలు ఆడి, మోసం చేయగలిగే వ్యక్తి ఎవరైనా ఉంటారా? ఆలోచన చేయండి.

> **ఇది అభివృద్ధి కాదా..?**
>
> అభివృద్ధి జరగడం లేదని విమర్శిస్తున్న వారందరికీ గట్టిగా సమాధానం చెప్పండి. మన పాలనలో ఎప్పుడూ చూడని అభివృద్ధి ఇవాళ జరుగుతుంది. స్కూళ్ల పరిస్థితిని చూపించండి. నాడు–నేడుతో రూపురేఖలు మారిపోయి ఇంగ్లీష్ మీడియం, ఐఎఫ్‌పీ ప్యానెళ్లు వచ్చాయి. పిల్లల చేతుల్లో ట్యాబ్స్ కనిపిస్తున్నాయి. కరిక్యులమ్‌లో మార్పులతోపాటు విద్యా దీవెన, వసతి దీవెన వస్తోంది. మన పిల్లలు చదువుల్లో వేగంగా అడుగులు వేస్తున్నారు. ఇది కాదా అభివృద్ధి? అని ప్రశ్నించండి. నాడు – నేడుతో ఆసుపత్రుల రూపు రేఖలు మారుతున్నాయి. విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ విధానం మన కళ్లెదుటే కనిపిస్తోంది. 53 వేల మంది వైద్య సిబ్బందిని నియమించాం. కొత్తగా 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టాం. ఎవరైనా అభివృద్ధి గురించి మాట్లాడితే ఇది అభివృద్ధి కాదా? అని అడగండి. రాష్ట్రంలో 4 ప్రాంతాల్లో 6 పోర్టులు మాత్రమే ఉంటే ఈ నాలుగేళ్లలో మరో 4 సీ పోర్టులను కడుతున్నాం. మన రాష్ట్రం వరుసగా మూడేళ్ల పాటు ఈవోడీబీలో దేశంలోనే నంబర్ వన్‌గా కొనసాగుతోందని చెప్పండి.


పిల్లల చదువులకు పేదరికం అడ్డుకాకూడదు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: తల్లిదండ్రుల పేదరికం పిల్లల చదువులకు అడ్డుకాకూడదన్న సంకల్పంతో జగనన్న విద్యా దీవెన పథకాన్ని ప్రవేశపెట్టినట్లు సీఎం వైఎస్ జగన్ తెలిపారు. 'జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఏ త్రైమాసికానికి సంబంధించిన ఫీజును.. ఆ త్రైమాసికం ముగిసిన వెంటనే వారి తల్లుల ఖాతాల్లోకి రీయింబర్స్ చేస్తున్నాం. ఈ నాలుగేళ్ల కాలంలో ఈ పథకం కింద 24,53,389 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.11,317 కోట్లు జమ చేశాం' అని సీఎం జగన్ సోమవారం ట్వీట్ చేశారు.

చంద్రబాబు, పవన్‌కు విద్యాదీవెన ఇప్పించండి..

జగనన్నను ఓడించాలంటే ఆ పక్కన కూడా జగనన్నే ఉండాలి: మంత్రి ఆర్కే రోజా



''జగనన్న పేరు చెబితే.. చంద్రబాబు గుండెల్లో రీసౌండ్ రావాలి. దేశంలో ఏ సీఎంకీ రానంత గొప్ప ఆలోచన జగనన్నకు వచ్చింది. పెత్తందార్ల ఆస్తి అయిన విద్యను పేదవాడి హక్కుగా మార్చారు. కోటీశ్వరుల పిల్లలకు మాత్రమే పరిమితమైన నాణ్యమైన విద్యను తినడానికి తిండి లేని పేదలకు కూడా అందుబాటులోకి తెచ్చారు. జగనన్న సీఎం అయిన వెంటనే చంద్రబాబు ఎగ్గొట్టిన ఫీజుల బకాయిలు చెల్లించారు. మన బైలింగ్యువల్ బుక్స్‌ను ప్రధాని కూడా ప్రశంసించారు.

ఊగిపోతూ ఒకడు, జారిపోతూ ఒకడు, మరిచిపోతూ ఒకడు

జగనన్నకు ఒక చిన్న రిక్వెస్ట్.. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కి విద్యాదీవెన ఇప్పించండి. ఇంటర్‌లో తను సీఈసీ అని ఒకసారి, హెచ్ఈసీ అని ఒకసారి ఎంపీసీ అని పవన్ చెబుతుంటారు. ఇంజనీరింగ్ చదవాలంటే ఇంటర్‌లో బైపీసీ గ్రూప్ తీసు కోవాలని చంద్రబాబు అంటారు. వీరిద్దరికీ విద్యాదీవెన వర్తింప చేయాలంటే ఏపీలో వారికి ఇల్లు లేదు, ఓటు లేదు, ఆధార్ కూడా లేదు. సీఎంగా మీకు పవర్స్ ఉంటాయి. వాటిని ఉపయోగించి వారిద్దరికీ విద్యా దీవెనతో మంచి చదువు చెప్పించాలని కోరుతున్నా. పిచ్చిపిచ్చి మాటలతో ఊగిపోతూ ఒకడు, జారిపోతూ ఒకడు, మరిచిపోతూ ఒకడు ప్రజలను విసిగిస్తున్నారు.

ఆ పక్కన కూడా జగనన్నే ఉండాలి..

జగనన్నను కొంతమంది ఓడిస్తామని, కొంతమంది ఆడిస్తామని, కొంతమంది పాలిస్తామంటున్నారు. జగనన్నను ఓడించాలంటే ఆ పక్కన కూడా జగనన్నే ఉండాలి. జగనన్నను ఆడించాలంటే ఆ పక్కన కూడా జగనన్నే ఉండాలి. ఎమ్మెల్యేగా గెలవలేని వారు.. షూటింగ్ గ్యాప్‌లలో వచ్చి టైం పాస్ రాజకీయాలు చేస్తూ, ప్యాకేజీల కోసం మాట్లాడే మీరేం జగనన్నను ఓడిస్తారు? ఆడిస్తారు? జగనన్నా మీకు ఇంకో రిక్వెస్ట్.. చంద్రబాబు, పవన్‌కు ఆరోగ్యశ్రీ కింద జెలసీకి మంచి ట్రీట్మెంట్ ఇవ్వండి. ఇక్కడ షుగర్ ఫ్యాక్టరీ ఎంప్లాయిస్ 226 కుటుంబాలకు బకాయిలను ఇవ్వటానికి ఇదే జిల్లాలో పుట్టిన చంద్రబాబుకు మనసు రాలేదు. ఇదే జగనన్న నేను అడగగానే వారి ఖాతాల్లో జమ చేశారు.

> **మీరే మా ధైర్యం..**
>
> 
>
> బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. మా చెల్లి కూడా అదే కాలేజీలో సెకండియర్ చదువుతోంది. పదో తరగతిలో ఉండగా మా నాన్న చనిపోయారు. మా అమ్మ మమ్మల్ని ఉన్నత చదువులు చదివిస్తోందంటే మీరే కారణం. మీరు విద్యా రంగంలో సంస్కరణలు తీసుకొచ్చారు. డిగ్రీలు పూర్తిచేసిన వారికి ఇంటర్న్‌షిప్‌లు కల్పించారు. నైపుణ్యం లేకుండా డిగ్రీలు పొందే పద్ధతిని తొలగించారు. వెబ్ డిజైనింగ్‌పై ఇంటర్న్‌షిప్ చేస్తూ పట్టా పొందబోతున్న మొదటి బ్యాచ్‌కు చెందిన విద్యార్థిని నేను కావడం గర్వంగా ఉంది. మా కుటుంబం మీ వల్ల రూ. 3 లక్షలకు పైగా లబ్ధిపొందింది. బీటెక్ విద్యార్థులతో సమానంగా డిగ్రీ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. మీరే మా ధైర్యం, మీరే మా నమ్మకం!
>
> –మునెమ్మ, లబ్ధిదారు, బీఎస్సీ ఫైనల్ ఇయర్

క్లుప్తంగా...

చిన్నారి వైద్యానికి రూ.41.5 లక్షల సాయం

సీఎం సహాయనిధి నుంచి మంజూరు



సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న బేబీమీనాక్షి, డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి ప్రాణాన్ని కాపాడేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించారు. ఆమె వైద్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.41.50 లక్షలు మంజూరు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన తొమ్మిదేళ్ల బాలిక పలివెల బ్లెస్సీ కొన్నాళ్లుగా తలనొప్పితో బాధపడుతోంది. తల్లిదండ్రులు వైద్యులకు చూపించగా.. బ్రెయిన్ క్యాన్సర్‌గా వైద్యులు నిర్ధారించారు. చికిత్సకు రూ.41.50 లక్షలు అవుతుందని చెప్పారు. బిడ్డకు చికిత్స చేయించే స్తోమత లేకపోవడంతో తండ్రి రాంబాబు తల్లడిల్లిపోయారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11న అమలాపురం పర్యటనకు వచ్చిన సీఎం జగన్ దృష్టికి తన బిడ్డ సమస్యను రాంబాబు.. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ద్వారా తీసుకువెళ్లారు. ఆ చిన్నారి సమస్య విని చలించిపోయిన సీఎం జగన్ రూ.41.50 లక్షలు మంజూరు చేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును మంత్రి విశ్వరూప్ భార్య బేబీమీనాక్షి, కుమారుడు డాక్టర్ శ్రీకాంత్ సోమవారం ఆ కుటుంబానికి అందజేశారు.

సీఎం ఆదేశం.. దివ్యాంగుడికి ఆధునిక కృత్రిమ కాలు

జర్మన్ టెక్నాలజీతో తయారు చేయించి అందించిన అనంత కలెక్టర్ గౌతమి



సయ్యద్ ఖాజాకు కృత్రిమ కాలు అందిస్తున్న కలెక్టర్

అనంతపురం అర్బన్: సీఎం వైఎస్ జగన్ చొరవతో ఓ దివ్యాంగుడికి అతి ఖరీదైన కృత్రిమ కాలు అందింది. అనంతపురానికి చెందిన సయ్యద్ ఖాజా రోడ్డు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్నాడు. గత నెల 8న సీఎం జగన్ కళ్యాణదుర్గం పర్యటనకు రాగా, హెలిప్యాడ్ వద్ద సీఎంను కలిసి తన కష్టాన్ని చెప్పుకొన్నాడు. స్పందించిన సీఎం బాధితుడికి సాయం చేయాలని అనంతపురం కలెక్టర్ గౌతమిని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్ గౌతమి ఖాజాకు కృత్రిమ కాలు అందించాలనుకున్నారు. అయితే మామూలు కాలి పర్స్ కాకుండా నాణ్యమైన, సౌకర్యవంతంగా ఉండేలా కృత్రిమ కాలును సిద్ధం చేయించి సోమవారం బాధితుడికి అందించారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం

వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సినాక్ ఔషధ పరిశ్రమ ప్రొడక్షన్ బ్లాక్‌ను ప్రారంభించిన వైవీ సుబ్బారెడ్డి

పరవాడ(అనకాపల్లి జిల్లా): ఫార్మా రంగంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అనకాపల్లి జిల్లా పరవాడలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో సినర్జీస్ గ్రూప్ ఆధ్వర్యంలో రూ.150 కోట్లతో ఏర్పాటు చేసిన సినాక్ ఔషధ పరిశ్రమ ప్రొడక్షన్ బ్లాక్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. వేర్‌హౌస్‌ను పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, సినర్జీస్ గ్రూప్ సంస్థల చైర్మన్ నల్లా సూర్యప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ నేతలు మజ్జి శ్రీనివాసరావు, బొడ్డేడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమ కష్టాలు చెప్పుకుంటున్న చందు, సుమిత్ర, ఐశ్వర్య, షణ్ముగం, నాగరాజు, రెహమాన్ తల్లి, మత్తయ్య, గజేంద్ర



కలెక్టర్ సగిలి షణ్మోహన్, డీఆర్వో రాజశేఖర్ చేతుల మీదగా ఆర్థిక సాయం అందుకుంటున్న చందు, సుమిత్ర, ఐశ్వర్య, షణ్ముగం, నాగరాజు, రెహమాన్ తల్లి, మత్తయ్య, గజేంద్ర

పొదుపు సంఘాల రుణాలపై వడ్డీ తగ్గింపు

- సీఎం జగన్ విజ్ఞప్తి మేరకు ఎస్‌బీఐ సానుకూల స్పందన
- తాజా నిర్ణయంతో ఏటా వడ్డీభారం రూ.100కోట్లు తగ్గుతుందని అంచనా
- వడ్డీ రేటు 12.15 శాతం నుంచి 9.90 శాతానికి కుదింపు
- రూ.5 లక్షలు పైబడిన రుణాలకే ఇది వర్తింపు
- ఈ మేరకు ప్రభుత్వానికి ఎస్‌బీఐ లేఖ
- రాష్ట్రంలోని పొదుపు సంఘాల రుణాల్లో 22.5 శాతం ఎస్‌బీఐ నుంచే..
- మిగతా బ్యాంకులూ వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం : అధికారులు


SBI
STATE BANK OF INDIA
DAY-NRLM SHG ADVANCES
CONCESSIONS IN RATE OF INTEREST
WAIVER OF PROCESSING FEE & INSPECTION CHARGES
Yours faithfully
Deputy General Manager

సీఎం అడిగిన మేరకు వడ్డీ రేట్లు తగ్గిస్తూ ఎస్‌బీఐ రాసిన లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పొదుపు సంఘాల రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు.. ఈ రుణాలపై రెండున్నర శాతం మేర వడ్డీ తగ్గింపుతో పాటు ఆయా రుణాలపై ఎలాంటి అదనపు (ఇన్‌స్పెక్షన్, యాన్యువల్ రివ్యూ లేదా రెన్యూవల్ పేర్లతో వసూలు) చార్జీలను పూర్తిగా మినహాయించేలా నిర్ణయం తీసుకుంది. సాధారణంగా.. బ్యాంకులు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 'పొదుపు' రుణాలపై రూ.మూడు లక్షల వరకు కేవలం ఏడు శాతం వడ్డీకే రుణాలు ఇస్తుంటాయి. రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల మధ్య రుణాలపై ఆయా బ్యాంకులు నిర్దేశించుకునే నిర్ణీత ఎంసీఎల్‌ఆర్ (మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్ బేస్డ్ లెండింగ్ రేటు – రుణాలు ఇచ్చేందుకు ఆయా బ్యాంకులు నిర్దేశించుకున్న కనీస వడ్డీ రేటు) ప్రకారం మాత్రమే రుణాలు అందజేయాల్సి ఉంటుంది. ఈ ఎంసీఎల్‌ఆర్ అన్నది ఒక్కో బ్యాంకులో ఒక్కో విధంగా.. ఒకే బ్యాంకులో ఒక్కో సమయంలో ఒక్కొక్క వడ్డీరేటు కూడా ఉంటుంది. అయితే, రూ.5 లక్షల పైబడి పొదుపు సంఘాలకు ఇచ్చే రుణాలపై ఆయా బ్యాంకులు తమ విచక్షణ మేరకు వడ్డీ రేటుకు రుణాలు ఇచ్చుకోవచ్చు. ఇలా.. ఐదు లక్షలకు పైబడి పొదుపు సంఘాలకు ఇచ్చే రుణాలపై కొన్ని బ్యాంకులు గరిష్ఠంగా 13 శాతం వడ్డీ రేటుకు కూడా రుణాలిస్తున్నాయి. ఇప్పుడు.. ఎస్‌బీఐ పొదుపు రుణాలపై రూ.5 లక్షల నుంచి 10 లక్షల మధ్య ఉండే మొత్తాలపై 12.15 శాతం వడ్డీ రేటును 2.25 శాతం తగ్గించుకుని 9.90 శాతానికే రుణాలిచ్చేందుకు అంగీకారం తెలిపింది. అదే రూ.10 లక్షలకు పైబడి రూ.20 లక్షలలోపు రుణాలపై కూడా 12.15 శాతం ఉన్న వడ్డీ రేటును 2.45 శాతం తగ్గించుకుని 9.70 శాతానికి సంసిద్ధత వ్యక్తంచేసింది. పొదుపు రుణాలను సకాలంలో చెల్లించే విషయంలో ఏపీ దేశంలోనే ముందంజలో ఉండడంతో ఎస్‌బీఐ వడ్డీ రేటు తగ్గింపునకు సానుకూలంగా స్పందించినట్లు అధికారులు చెబుతున్నారు.

2024 మార్చి నెలాఖరు వరకు..

ఇక మహిళలు తీసుకునే 'పొదుపు' రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించాలంటూ ఈ ఏడాది మార్చి 10న జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో స్వయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బ్యాంకర్లను కోరారు. పొదుపు రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు, ఇన్‌స్పెక్షన్ తదితర పేర్లతో అదనపు ఫీజులు కూడా వసూలు చెయ్యొద్దని ఆ సమావేశంలో ఆయన విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత కూడా ఇదే అంశంపై ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాల మేరకు రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో ఎండీ ఇంతియాజ్ పలు దఫాలుగా వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులకు లేఖలు రాశారు. ఈ నేపథ్యంలో.. ఎస్‌బీఐ అప్పట్లోనే తాత్కాలికంగా నాలుగు నెలల కాలానికి, అంటే.. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జులై 31 వరకు తీసుకునే రూ.5 లక్షల పైబడిన పొదుపు రుణాలపై దాదాపు రెండు శాతం తగ్గించడానికి అనుమతి తెలిపింది. ఆ గడువు ముగియడంతో సెర్ప్ అధికారులు మళ్లీ రెండేళ్లపాటు వడ్డీ తగ్గించాలంటూ ఎస్‌బీఐకి లేఖ రాశారు. దీంతో ఆ బ్యాంకు ప్రాంతీయ డిప్యూటీ జనరల్ మేనేజర్ స్పందిస్తూ.. 2024 మార్చి నెలాఖరు వరకు రూ.ఐదు లక్షలకు పైబడిన పొదుపు రుణాలపై 2.15 శాతం నుంచి 2.45 శాతం తక్కువ వడ్డీరేటుకే రుణాలిచ్చేందుకు అంగీకారం తెలిపారు. అలాగే, రూ.20 లక్షల వరకు ఎలాంటి ప్రాసెసింగ్ చార్జీలు, ఇన్‌స్పెక్షన్ చార్జీలు, యాన్యువల్ రివ్యూ లేదా రెన్యూవల్ ఛార్జీలు వంటివి అదనంగా వసూలు చేయబోమని కూడా ఆయన ఆ లేఖలో తెలిపారు.

నాలుగో వంతు రుణాలు ఎస్‌బీఐ నుంచే..

రాష్ట్రంలోని పొదుపు రుణాల్లో దాదాపు నాలుగో వంతు ఎస్‌బీఐ నుంచే తీసుకుంటారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం.. గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపు సంఘాల మహిళలు ఒక్క ఎస్‌బీఐ నుంచే రూ.9,378.24 కోట్ల రుణాలు తీసుకోగా.. పట్టణ ప్రాంతాల్లో రూ.2,565 కోట్ల రుణాలు తీసుకున్నట్లు అధికారులు చెప్పారు. అలాగే, గ్రామీణ మహిళలు తీసుకున్న రూ.9,378.24 కోట్లలో ఐదు లక్షలకు పైబడి కేటగిరిలో రూ.2,765 కోట్ల దాకా ఉన్నాయని.. వీటిపై ఇప్పుడు ఆ బ్యాంకు తీసుకున్న వడ్డీ రేటు తగ్గింపు నిర్ణయంతో ఏటా రూ.వంద కోట్ల వరకు వడ్డీ భారం తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అదే విధంగా.. పట్టణ ప్రాంతంలో తీసుకున్న రుణం రూ.2,565 కోట్లలో రూ.5 లక్షల పైబడిన రుణాల్లో దాదాపు రూ.600 కోట్ల మొత్తంపై వడ్డీ రేటు తగ్గింపు వర్తించే అవకాశముంది. ఈ నేపథ్యంలో.. ఇతర బ్యాంకులు సైతం భవిష్యత్‌లో వడ్డీ రేటు తగ్గించే అవకాశం లేకపోలేదని అధికారులు చెబుతున్నారు.

మిగిలిన బ్యాంకులతోనూ సంప్రదింపులు..



ఇక పొదుపు రుణాలకు సంబంధించి అన్ని బ్యాంకుల ఉన్నతాధికారులతోనూ వడ్డీ రేటు తగ్గింపు గురించి ప్రభుత్వంతోపాటు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కార్యాలయం కూడా నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తోంది. త్వరలోనే ఆయా బ్యాంకులు కూడా నిర్ణయం తీసుకుంటాయని ఆశిస్తున్నాం.

– ఎండీ ఇంతియాజ్, సెర్ప్ సీఈవో

మాటిచ్చారు.. నెరవేర్చారు

సీఎం జగన్ ఆదేశాలతో గంటల వ్యవధిలోనే ఆర్థిక సాయం

నగరి: చిత్తూరు జిల్లా నగరి పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుగు ప్రయాణంలో నగరి డిగ్రీ కళాశాల హెలిపాడ్ వద్ద ప్రజల నుంచి వినతుల స్వీకరించారు. వివిధ అర్జీలతో వచ్చిన వారి సమస్యలను శ్రద్ధగా ఆలకించి తగిన చర్యలు తీసుకుంటానని మాటివ్వడమే కాకుండా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సత్వరమే ప్రభుత్వం తరపున న్యాయం చేయాలని కలెక్టర్ ఎస్.షణ్మోహన్‌కు ఆదేశాలిచ్చారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు యంత్రాంగం గంటల వ్యవధిలోనే ఆయా సమస్యలను పరిష్కరించింది.

మానవత్వంతో ఆదుకున్నారు

నగరి మండలం మిట్టపాలెంకు చెందిన ఎ.నాగరాజు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి తన కిడ్నీలు పని చేయడం లేదని.. డయాలసిస్ చేయించుకోవడానికి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తికి చెందిన ముస్లిం మహిళ తన ఆరేళ్ల కుమారుడు రహమాన్‌తో సీఎం జగన్‌ను కలిసింది. తన కుమారుడు బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడని.. వైద్యం కోసం ఖర్చయిన బిల్లులను మంజూరు చేయాలని వేడుకుంది. కార్వేటినగరం గొల్లకండ్రిగకు చెందిన ఎం.చందు (11) అనే బాలిక తన తండ్రితో వచ్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసింది. తాను బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నానని.. వైద్యం కోసం వెచ్చించిన బిల్లులను మంజూరు వేడుకుంది. శ్రీకాళహస్తి మండలం తూకివాకం గ్రామానికి చెందిన ఐశ్వర్య సీఎం వైఎస్ జగన్‌ను కలిసి తన ఇద్దరు బిడ్డల ఆరోగ్య సమస్యను వివరించి ఆదుకోవాలని కోరింది. వీరందరికీ మెరుగైన వైద్యం అందించాలని.. వైద్య ఖర్చుల కోసం వెచ్చించిన మొత్తాలను తిరిగి చెల్లించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశించారు. తక్షణం స్పందించిన కలెక్టర్ ఎస్.షణ్మోహన్ ఎ.నాగరాజుకు రూ.లక్ష, రహమాన్‌కు రూ.లక్ష, ఎం.చందుకు రూ.50 వేలు, ఐశ్వర్యకు రూ.లక్ష చొప్పున చెక్కుల అందజేశారు.

ఉపాధి నిమిత్తం ఆర్థిక సాయం

విజయపురం మండలం పన్నూరుకు చెందిన కె.షణ్ముగం, నగరి మండలం నెత్తం కండ్రిగకు చెందిన ఎం.గజేంద్ర, జి.మత్తయ్య అనే దివ్యాంగులతోపాటు ఎస్ఆర్ పురం మండలం పుల్లూరు హరిజనవాడకు చెందిన ఎస్.సుమిత్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. స్వయం ఉపాధి నిమిత్తం ఆర్థిక సాయం అందించాలని వేడుకున్నారు. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాలతో షణ్ముగంకు రూ.లక్ష, ఎం.గజేంద్ర రూ.50 వేలు, జి.మత్తయ్య రూ.50 వేలు, ఎస్.సుమిత్ర రూ.లక్ష చొప్పున చెక్కు రూపంలో ఆర్థిక సాయం అందజేశారు.

పుంగనూరు విధ్వంసం కేసుల్లో చల్లా బాబుకు లభించని ఊరట

- అన్ని కేసుల్లోనూ బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ

సాక్షి, అమరావతి/మదనపల్లె: చిత్తూరు జిల్లా పుంగనూరులో సాగించిన విధ్వంసంపై పోలీసులు నమోదు చేసిన వివిధ కేసుల్లో కీలక నిందితుడుగా ఉన్న పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి(చల్లా బాబు)కు హైకోర్టులో పూర్తిస్థాయి ఊరట లభించలేదు. అన్నీ కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఏడు కేసులకు గాను మూడు కేసుల్లో ముందస్తు బెయిల్ నిరాకరించింది. ఈ మూడింటిలో చల్లా బాబు పాత్రపై నిర్దిష్ట ఆరోపణలున్న నేపథ్యంలో అతనికి ముందస్తు బెయిల్ మంజూరు చేయట్లేదని స్పష్టం చేసింది. మిగిలిన నాలుగు కేసుల్లో షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. 4 కేసుల్లో చల్లా బాబు పాత్రపై ఎలాంటి నిందారోపణలు లేవని, అందువల్ల అతనికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. 10 రోజుల్లోపు పుంగనూరు పట్టణ పోలీసుల ముందు లొంగిపోవాలని ఆయన్ను ఆదేశించింది. రూ.లక్ష చొప్పున రెండు వ్యక్తిగత పూచీకత్తులు సమర్పించాలని స్పష్టం చేసింది. కాగా, బెయిల్‌పై విడుదలైన తరువాత నాలుగు వారాలపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అడుగు పెట్టకూడదని చల్లా బాబును ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులిచ్చారు. పుంగనూరు విధ్వంసంపై పోలీసులు తనపై నమోదు చేసిన వేర్వేరు కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని చల్లా బాబు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేయగా.. వీటిపై గత వారం విచారణ జరిపిన జస్టిస్ సురేష్‌రెడ్డి ఉత్తర్వులను రిజర్వ్ చేశారు. వీటిపై సోమవారం ఆయన తన నిర్ణయాన్ని వెలువరించారు.

అంగళ్లు కేసులో..


చంద్రబాబు యుద్ధభేరి పర్యటన సందర్భంగా అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తలు సృష్టించిన విధ్వంసంపై పోలీసులు నమోదు చేసిన కేసులో నిందితులుగా ఉన్న ఆ పార్టీ నేత దేవినేని ఉమా, పీలేరు టీడీపీ ఇన్‌చార్జ్ నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, పులివర్తి నానిలకు హైకోర్టు ఊరటనిచ్చింది. షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. 10 రోజుల్లోపు ముదివేడు పోలీసుల ముందు లొంగిపోవాలని ఉమా తదితరులను హైకోర్టు ఆదేశించింది. రూ.లక్ష చొప్పున రెండు వ్యక్తిగత పూచీకత్తులు సమర్పించాలంది. అనంతరం బెయిల్‌పై విడుదలయ్యాక 4 వారాలపాటు అన్నమయ్య జిల్లాలో అడుగుపెట్టకూడదని ఆదేశించింది. అలాగే నాలుగు వారాలపాటు ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 లోపు ఎస్‌హెచ్‌వో ముందు హాజరు కావాలని తేల్చిచెప్పింది. దర్యాప్తులో జోక్యం చేసుకోవడం గానీ, సాక్ష్యాలను తారుమారు చేయడం గానీ చేయరాదంది. ఈ మేరకు జస్టిస్ సురేష్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

నిందితులకు బెయిల్ నిరాకరణ

పుంగనూరు, అంగళ్లులో 4న చంద్రబాబు పర్యటన సందర్భంగా జరిగిన అల్లర్లు, పోలీసులపై దాడి కేసులో నిందితుల తరఫున బెయిల్ పిటిషన్లు దాఖలు చేసిన టీడీపీకి షాక్ తగిలింది. విధ్వంసకాండలో పాల్గొన్న 120 మంది నిందితుల తరఫున దాఖలు చేసిన అన్ని రెగ్యులర్, యాంటిసిపేటరీ బెయిల్ పిటిషన్లను మదనపల్లె రెండో ఏడీజే కోర్టు తిరస్కరించింది. టీడీపీ నాయకులకు బెయిల్ మంజూరు చేయాల్సిందిగా టీడీపీ నేతల తరఫున పిటిషన్లు దాఖలు కాగా.. వీటిపై ఈ నెల 24న మదనపల్లె రెండో ఏడీజే కోర్టులో వాదోపవాదాలు జరిగాయి. టీడీపీ నాయకులు దాఖలు చేసిన అన్ని బెయిల్ పిటిషన్లను డిస్మిస్ చేస్తూ సోమవారం మధ్యాహ్నం కోర్టు తీర్పు ఇచ్చింది.

గిడుగు వ్యవహారిక ఉద్యమంతోనే విద్య సరళీకృతం

సీఎస్ జవహర్ రెడ్డి వెల్లడి



సాక్షి, అమరావతి: గిడుగు వెంకట రామమూర్తి వ్యవహారిక భాషోద్యమంతోనే విద్య సరళీకృతమై ప్రజలందరికీ అందుబాటులోకి వచ్చిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి అన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ.. పరిపాలన భాషగా తెలుగును విస్తృత స్థాయిలో అమలు చేయాలని ఉద్యోగులకు సూచించారు. అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు పి.విజయబాబు మాట్లాడుతూ..తమిళులు తమ మాతృభాషతో పాటు ఆంగ్లానికి ప్రాధాన్యం ఇవ్వడంతోనే జాతీయ, అంతర్జాతీయంగా రాణిస్తున్నారన్నారు. దానిని గుర్తించిన సీఎం వైఎస్ జగన్ ఏపీలో ద్విభాషా విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్టు పేర్కొన్నారు. గిడుగు రామమూర్తి, శ్రీనాథుని కుటుంబ సభ్యులతో పాటు తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యంలో మంచి ప్రతిభ కనబర్చిన రాష్ట్ర సచివాలయ ఉద్యోగులను సత్కరించారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ సీఈవో మల్లికార్జున రావు, ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కే.వెంకట్రామిరెడ్డి, అధికార భాషా సంఘం సభ్యులు రామచంద్రా రెడ్డి, కత్తి వెంకటేశ్వరరావు, మస్తానమ్మ, వెంకటయ్య, గిడుగు రామమూర్తి వంశీకుల్లో నాలుగోవ తరం వ్యక్తి గిడుగు వెంకట నాగేశ్వరరావు, శ్రీనాథుని వంశీకుల్లో 13వ తరం కావూరి శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా తెలుగు భాషా చైతన్య వారోత్సవాలు

రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు భాషా చైతన్య వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు చెప్పారు. సోమవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గిడుగు రామమూర్తి 160వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో భాషా సంఘాన్ని లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే అధికార భాషా సంఘానికి పునరుజ్జీవం పోశారన్నారు. ఇది చూసి కళ్లు కుట్టి తట్టుకోలేని తీతువుపిట్టలు తమ రాతలతో చిన్న పొరపాట్లను భూతద్దంలో చూపించి విష ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు.

పనులే పూర్తి కాలేదు.. అయినా తప్పుడు రాతలు

విశాఖలో బస్ బేపై ఈనాడు అబద్ధాల కథనం

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): చీమ చిటుక్కుమన్నా జగన్ ప్రభుత్వం వల్లేనంటూ పచ్చ పత్రికలు రోత రాతలు రాయడం, వాటిని పట్టుకొని తెలుగుదేశం పార్టీ అండ్ కో హడావుడి చేయడం.. రాష్ట్రంలో ఇదో తంతుగా మారింది. విశాఖలో నిర్మాణంలో ఉన్న బస్ బే ఓ పక్కకు ఒరిగిన ఘటనపై ఇటువంటి అబద్ధాల కథనమే ఈనాడు రాసింది. దానిపై టీడీపీ హడావుడి మొదలెట్టింది. వాస్తవానికి అసలా బస్ బే నిర్మాణమే ఇంకా పూర్తి కాలేదు. ఇటీవలి వర్షాల వల్ల పనులు ఆగిపోయాయి. అందులో ఓ భాగం పక్కకు ఒరిగింది. ఈ చిన్న ఘటనపై ఈనాడు, ఇతర పచ్చ మీడియా, టీడీపీ హడావుడి చేస్తున్నాయి. వాస్తవాలేంటో ఓసారి పరిశీలిస్తే.. నగరవాసుల



బస్టాండ్ దక్షిణం వైపు ఉన్న బస్‌బే కేంటీలీవర్ షెడ్ పునరుద్ధరణ పనులు చేస్తున్న కార్మికులు

సౌకర్యం కోసం జీవీఎంసీ పరిధిలో రూ.4.62 కోట్లతో 20 బస్ బేల నిర్మాణం చేపట్టారు. 17 బస్‌బేల నిర్మాణం పూర్తయింది. మరో 3 నిర్మాణం జరుగుతున్నాయి. నాణ్యత నియంత్రణ సంస్థ పర్యవేక్షణలోనే వీటిని పటిష్ఠంగా నిర్మిస్తున్నారు. థర్డ్ పార్టీ (ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం) ద్వారా తనిఖీలు జరుగుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ దక్షిణం వైపు ఉన్న బస్‌బే కూడా నిర్మాణంలో ఉంది. రూ.16.94 లక్షలతో పీఈ స్ట్రక్చర్‌తో దీనిని నిర్మిస్తున్నారు. శనివారం సాయంత్రం వర్షం పడటంతో కార్మికులు పనులు ఎక్కడివక్కడే విడిచి పెట్టి వెళ్లిపోయారు. తూర్పు భాగంలో 10 మీటర్ల కాంటిలీవర్ షెడ్‌ను నిలువు పైపులకు అనుసంధానించే ప్రాంతంలో వెల్డింగ్ పనులు కూడా నిలిచిపోయాయి. ఆదివారం ఉదయం కాంటిలీవర్ కొంత భాగం ఒరిగింది. సివిల్ కట్టడాల్లో ఎలాంటి లోపం లేదు. కాంట్రాక్టర్ క్లీట్‌లను వాడకుండా వెల్డింగ్ పనులు చేపట్టడం వల్లే పాక్షికంగా ఒరిగింది. దీనినే పెద్ద ప్రమాదంగా పచ్చ పత్రికలు చిత్రీకరించాయి.

ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయడం సరికాదు: మేయర్

అన్ని బస్‌బేలు సరైన పద్ధతిలో డిజైన్ చేశామని విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి చెప్పారు. నాణ్యత నియంత్రణ సంస్థ పర్యవేక్షణలోనే పనులన్నీ జరుగుతున్నాయన్నారు. 'ఆర్టీసీ బస్టాండ్ దక్షిణం వైపు బస్‌బేను 33 మీటర్ల పొడవుతో కాంటిలీవర్ షెడ్‌తో నిర్మిస్తున్నాం. పనులు చివరి దశలో ఉన్నాయి. శనివారం రాత్రి వర్షం వల్ల స్ట్రక్చరల్ ఫ్రేమ్ వెల్డింగ్ చేయలేదు. ఆదివారం ఉదయం పని ప్రారంభించే లోపే పక్కకు ఒరిగింది. ఇందులో ఎలాంటి ప్రజాధనం దుర్వినియోగం జరగలేదు. కాంట్రాక్టర్ పునరుద్ధరణ పనులు చేస్తున్నారు. చిన్న సంఘటనను ఘోర ప్రమాదమంటూ ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేయడం సరికాదు. మిగిలిన బస్‌బేలని థర్డ్ పార్టీ ద్వారా మరోసారి పరిశీలిస్తాం. కాంట్రాక్టర్లకు ఇంతవరకు ఎలాంటి చెల్లింపులు చేయలేదు. అన్ని పనులు సక్రమంగా ఉన్నాయని నిర్ధారణ జరిగాకే బిల్లుల చెల్లింపుపై నిర్ణయం తీసుకుంటాం' అని చెప్పారు.

మరిన్ని ఫొటోల కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగలరు

నివేదికలు సిద్ధం చేయండి

- త్వరలో సీఎస్‌ల జాతీయ సమావేశం
- అందులో చర్చించాల్సిన అంశాలపై అధికారులతో సీఎస్ జవహర్‌రెడ్డి సమీక్ష

సాక్షి, అమరావతి: త్వరలో జరగనున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల(సీఎస్‌ల) జాతీయ సమావేశానికి సంబంధించిన వివిధ అంశాలపై సోమవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలపై సీఎస్ జవహర్ రెడ్డి చర్చించారు. ఫ్యామిలీ డాక్టర్, జీరో వేకెన్సీ, నగదు రహిత చికిత్సలు తదితర అంశాలను రానున్న సీఎస్‌ల సమావేశంలో చర్చించేందుకు వీలుగా నివేదికలు సిద్ధం చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు సీఎస్ సూచించారు. విద్యుత్ శాఖకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల చేపట్టిన పలు సంస్కరణలపై ముఖ్యంగా డిజిటల్ పేమెంట్ విధానం, నిరంతర విద్యుత్ సరఫరా తదితర అంశాలపై నివేదికలు సిద్ధం చేయాలన్నారు. తాగునీరు, విద్యలో చేపట్టిన సంస్కరణలపై కూడా నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆ శాఖ కమిషనర్ జె.నివాస్, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేశ్‌కుమార్, ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల భూముల క్లియరెన్స్‌కు చర్యలు తీసుకోండి..

రాష్ట్రంలో వివిధ ప్రధాన ప్రాజెక్టులకు సంబంధించి అటవీ, ఇతర భూములకు చెందిన పెండింగ్ క్లియరెన్స్‌లపై సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం సచివాలయంలో రాష్ట్రస్థాయి కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. వివిధ జాతీయ రహదారులు, రైల్వే, విద్యుత్ తదితర ప్రధాన ప్రాజెక్టులకు సంబంధించి ఇవ్వాల్సిన క్లియరెన్స్‌లు త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. సమావేశంలో ఉన్నతాధికారులు జి.సాయిప్రసాద్, జె.శ్యామలరావు, వై.మధుసూదన్‌రెడ్డి, ఏకే ఝూ, నాయక్ ప్రద్యుమ్న, బాగ్చి, చక్రధర్‌బాబు, ఇంతియాజ్, యువరాజ్, బాలునాయక్, డా.చలపతిరావు, విజయవాడ రైల్వే అదనపు డివిజనల్ మేనేజర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఇతరులను తప్పు పట్టేముందు, మిమ్మల్ని ముందుగా ఈ ప్రశ్న వేసుకోండి: నేను విమర్శించబోయే దానిని పోలిన తప్పు నాలో ఏం ఉంది?

– మార్కస్ అరీలియస్

సాక్షి

మంగళవారం, 29 ఆగస్టు 2023

మన బంగారు కొండ

భారత క్రీడాభిమానులకు ఇది హృదయం ఉప్పొంగే క్షణం. అథ్లెటిక్స్‌లోనూ మన ఆటగాళ్ళు విశ్వ విజేతలుగా నిలుస్తున్న అపురూప సందర్భం. నిన్నటి దాకా ఒలింపిక్ ఛాంపియన్ మాత్రమే అయిన ఓ క్రీడా దిగ్గజం ఇవాళ ప్రపంచ ఛాంపియన్ కూడా అయిన అపూర్వ ఘట్టం. బుడాపెస్ట్‌లో జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో పురుషుల జావెలిన్ త్రో విభాగంలో స్వర్ణం సాధించడం ద్వారా భారత అథ్లెట్ నీరజ్ చోప్రా ఆదివారం నాడు అక్షరాలా చరిత్ర సృష్టించారు. ప్రపంచ అథ్లెటిక్స్‌లో స్వర్ణపతకం సాధించిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించారు. దేశం గర్వపడేలా చేశారు. ఆదివారం నాడు రెండో ప్రయత్నంలో గరిష్ఠంగా 88.17 మీటర్ల దూరం ఈటెను విసిరి, నీరజ్ సాధించిన ఈ స్వర్ణపతకం ఇక భారత క్రీడాచరిత్రలో సువర్ణాక్షర లిఖితం.

భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక ఊరిలోని నీరజ్ ఇంట్లో ఆయన తండ్రి, బంధుమిత్రులు ఒక్కచోట కూడిన ఉత్కంఠగా చూసిన ఈ విజయఘట్టం వారికే కాదు... యావద్భారతావనికి కూడా ఉద్విగ్నభరితమైనది. ఆర్మీలో సుబేదార్ అయిన పాతికేళ్ళ నీరజ్ చోప్రా మాటల్లోనే చెప్పాలంటే, ఒలింపిక్స్ కన్నా వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ కఠినమైనది. ఒలింపిక్స్ ప్రత్యేకమైనది అయితే, వరల్డ్ ఛాంపియన్ అనేది అతి పెద్ద కిరీటం. పోటీ పరంగా చూసినా, అథ్లెట్లు అవిశ్రాంత సాధన చేసి వచ్చే వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ ఎప్పుడూ కాస్తంత ఎక్కువ కఠినమే. అలాంటి వేదికపై స్వర్ణసాధనతో నీరజ్ 'భారతదేశంలో ఆల్‌టైమ్ అతి గొప్ప అథ్లెట్'గా అవతరించారు. మొహమాటంగా ఆ పిలుపును పక్కనపెడుతూ, ఆయన వినయంగా వ్యవహరిస్తున్నప్పటికీ అది వాస్తవమే. అటు ఒలింపిక్స్ స్వర్ణం, ఇటు తాజా ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ స్వర్ణం – రెండూ సాధించిన ఏకైక భారత అథ్లెట్ ఈ సైనికుడే.

మధ్యతరగతి నుంచి వచ్చిన నీరజ్ ఈ స్థాయికి చేరడానికి ఎన్నో సవాళ్ళను ఎదుర్కొన్నారు. మోచేతికి గాయం కావడంతో 2019లో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. అలా అప్పట్లో దోహాలో ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌కు హాజరు కాలేకపోయారు. తర్వాత రెట్టించిన ఉత్సాహంతో వచ్చి, 2020 జనవరిలో టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. ఆలస్యంగా ఆ మరుసటేడు జరిగిన ఆ ఒలింపిక్స్‌లో ఏకంగా స్వర్ణం సాధించారు. మన దిగ్గజ అథ్లెట్లైన మిల్ఖాసింగ్, పీటీ ఉషకు సైతం అందని ఆ స్వర్ణకీర్తిని అందుకున్నారు. అలా రెండేళ్ళ క్రితం 2021 ఆగస్టులో జరిగిన టోక్యో ఒలింపిక్స్– 2020లో స్వర్ణసాధన నాటి నుంచి అందరి దృష్టి నీరజ్‌పై ఉంది. ఇప్పుడీ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లోనూ బంగారు పతకం తెచ్చి, అథ్లెటిక్స్‌లో మన దేశానికి పతకాలు పండించే బంగారు కొండ అయ్యారు. సౌత్ ఏషియన్ గేమ్స్ (2016), ఏషియన్ ఛాంపియన్‌షిప్స్ (2017), కామన్వెల్త్ గేమ్స్ (2018), ఏషియన్ గేమ్స్ (2018), ఒలింపిక్స్ (2020), డైమండ్ లీగ్ (2022), ఇప్పుడు వరల్డ్ ఛాంపియన్‌షిప్స్... ఇలా నీరజ్ సాధించిన స్వర్ణాలే అందుకు సాక్ష్యం.

మొత్తం ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ చరిత్రలో భారత్‌కు ఇది మూడో పతకం. ఇంతకు మునుపు జరిగిన 18 ఛాంపియన్‌షిప్‌లలో మన దేశానికి వచ్చినవి రెండు పతకాలే. ఆ రెండింటిలో కూడా ఒకటి నిరుటి ఛాంపియన్‌షిప్స్‌లో నీరజ్ చోప్రా సాధించిన రజతమే. అంతకు ముందెప్పుడో 2003లో మహిళల లాంగ్‌జంప్‌లో అంజూ బాబీ జార్జ్ కాంస్యం గెలిచారు. అప్పుడలా విశ్వవేదికపై మొదలైన మన పతకాల లెక్క ఇప్పుడు మూడుకు చేరడం ఒక రకంగా ఆనందమే అయినా, మరోరకంగా ఇన్నేళ్ళకు గానీ ఆ స్థాయికి చేరకపోవడం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశం. ప్రపంచ స్థాయికి చేరేలా మన ఆటగాళ్ళను ప్రోత్సహించేందుకు మనం చేయవలసినంత చేస్తున్నామా అన్నది ఆలోచించాల్సిన విషయం.

అయితే, ఒకప్పుడు అంతర్జాతీయ యవనికపై భారతీయ క్రీడ అంటే హాకీ. తర్వాత క్రికెట్, ఆ పైన చెస్, బ్యాడ్మింటన్, టెన్నిస్, రెజ్లింగ్ వగైరాల్లోనూ మన ప్రతిభకు తక్కువ లేదని నిరూపితమవుతూ వచ్చింది. నిజానికి, జావెలిన్ త్రోలో సైతం ఒకప్పుడు విశ్వవేదికపై మనం ఎక్కడ ఉన్నామో కూడా ఎవరికీ తెలీదు. కానీ, ఇప్పుడు ఏకంగా ముందు వరుసలో నిలిచాం. అందులోనూ తాజా పోటీలో కిశోర్ జెనా, డీపీ మను అనే మరో ఇద్దరు భారతీయ జావెలిన్ త్రో వీరులు కూడా ఉండడం, వారిద్దరు 5వ, 6వ స్థానాల్లో నిలవడం... ఇవన్నీ మారుతున్న పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. భవిష్యత్తు పట్ల ఆశలు రేపుతున్నాయి. ఆ ఆశలు నెరవేరడానికి నీరజ్ అన్నట్టు మన దగ్గర కూడా కీలకమైన మోండో ట్రాక్స్ వగైరాలను అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) సిద్ధం చేయడం అవసరం.

చెక్ రిపబ్లిక్‌కు చెందిన దిగ్గజ అథ్లెట్ జెలెజ్నీ 98.48 మీటర్ల దూరం ఈటె విసిరి, ప్రపంచ రికార్డ్ నెలకొల్పారు. మూడుసార్లు ఒలింపిక్స్‌లో, మరో 3 సార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో పసిడి పతకాలు గెలిచారు. అతనే తనకు స్ఫూర్తి అని చెప్పే నీరజ్ ఆ స్థాయికి చేరడానికి చేయాల్సిన శ్రమ, సాగించాల్సిన ప్రయాణం ఇంకా చాలానే ఉంది. ఆ ప్రయాణానికి మన ప్రభుత్వాలు, క్రీడా సంస్థలు అందించాల్సిన సహకారమూ అపారమే. నీరజ్ ఒలింపిక్స్ సాధన తర్వాత హరియాణాలోని పానిపట్ సహా అనేక గ్రామాల్లో పిల్లల్లో, ఇళ్ళల్లో క్రీడల పట్ల ఆసక్తి కొన్ని పదుల రెట్లు పెరిగింది. గుంపులుగా వచ్చి, ఆటలాడుతున్న ఆ భావి భారత ఆశాకిరణాలకు మైదానాలు, ఆస్పత్రుల లాంటి కనీస వసతులు కల్పించడం ప్రభుత్వ కర్తవ్యం. ఆ దిశగా కృషి చేస్తే, మరింత మంది నీరజ్‌లు ఈ గడ్డపై నుంచి వస్తారనడంలో సందేహం లేదు.

నిజంగానే అంత చెడ్డ దేశమా?!

కామెంట్



కరణ్ థాపర్


"పాక్ పాలకులపై ఆగ్రహంతో మనం ఎందుకని పాకిస్తాన్ పౌరులకు వీసాలను తిరస్కరిస్తున్నాం? పాకిస్తానీయులందరూ జిహాదీలేనని మనం నమ్ముతున్నామా? పాకిస్తానీ జనాభాలోని 99.99 శాతం మందికి ఏ మాత్రం సంబంధం లేని ఉగ్రవాద చర్యలకు ప్రతీకారం తీర్చుకోవడానికి సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌ను ఎందుకు రద్దు చేయాలి? పాకిస్తానీయులను భారతదేశంలోని తమ బంధువులతో కలవనీయకుండా చేస్తే హురియత్ తన ఆజాదీ పిలుపును విరమించుకుంటుందని నిజంగానే మనం భావిస్తున్నామా?"... ఈ ప్రశ్నలన్నిటినీ మనం ఎదుర్కోవలసిన అవసరం ఉందని మణి శంకర్ అయ్యర్ తన ఆత్మకథలో రాశారు. కరాచీలో కాన్సుల్–జనరల్‌గా ఆయన నాలుగేళ్ల కాలాన్ని పొందుపరచిన అధ్యాయం... మనవాళ్లలో చాలామంది శత్రువుగా భావించే దేశంలోని ప్రేమ, అవగాహనలను తెలియబరుస్తుంది.

మణి శంకర్ అయ్యర్ ఆత్మకథలోని మొదటి సంపుటం గురించి నా అభిప్రాయం ఏంటంటే – చెప్పడంలోని సొగసంతా క్లుప్తతలోనే ఉంటుందన్న మాటపై ఆయనకు నమ్మకం లేదని. 'మెమోయిర్స్ ఆఫ్ ఎ మావెరిక్'లోని ప్రారంభ అధ్యాయాలు మరీ అంత మితిమీరిన సమాచారంతో ఉండవలసింది కాదు. ఉల్లాసమైనవీ విసుగు తెప్పించేవీ, ఆసక్తికరమైనవీ అసంబద్ధమైనవీ, హాస్యభరితమైనవీ నిస్సారమైనవీ... అన్నిటినీ కూడా అయ్యర్ తనకు సాధ్యమైనంతగా వివరాలతో కిక్కిరిసిపోయేలా చేశారు. అందంగా రాశారు, అందులో సందేహం లేదు. కానీ అవసరంలేని దీర్ఘమైన నిరంతరాయ సాగతీతలు ఉన్నాయి. నిజానికి ఆ విషయాన్ని ఆయన ఒప్పుకొన్నారు. అనివార్యంగా కథనంలో అంతస్వాతంత్ర్యతను కోల్పోయానని తనను తాను తిట్టుకున్నారు కూడా.

అయితే అంతకుమించి ఆయన్ని తప్పు పట్టేందుకేమీ లేదని వెంటనే నేను గుర్తించాను. తన జన్మనక్షత్రాలు, కుటుంబ వివరాలు, పెంపుడు జీవుల విశేషాలు, లేదా తన డూన్ స్కూల్ నాటి జ్ఞాపకాలను అలుపు తెప్పించేలా చెప్పడంలోని ఆయన స్వీయ సంతృప్తిని మీరు క్షమించాలి. కేవలం యూనియన్ (విద్యార్థి సంఘం) అంటే ఉన్న మక్కువతో మాత్రమే ఆయన కేంబ్రిడ్జిలో చేరే సమయం రాగానే పుస్తకంలోని పఠనీయ పరిస్థితులు మెరుగవుతాయనడంలో సందేహం లేదు. యూనియన్ అధ్యక్షుడవడం ఆయన ఏకైక ఆశయం. పాపం ఆ ఆశయాన్ని సాధించలేకపోయారు. వాస్తవానికి యూనియన్ అధ్యక్ష స్థానానికి చేరువయ్యే సోపాన క్రమంలో అట్టడుగున ఉండే స్థాయీ సంఘానికి ఎన్నికవడానికి కూడా ఆయనకు కష్టమయింది. కానీ ఆయన ప్రయత్నంలోని మనోహరమైన నిజాయితీ మీ మనసును గెలుచుకుంటుంది. అంతేకాదు, 21వ శతాబ్దపు తొలి దశాబ్దానికి చెందిన ఈ రాజకీయ నాయకుడు పన్నెండవ శతాబ్దపు రౌండ్ చర్చి వెనుక ఉన్న కేంబ్రిడ్జి యూనియన్ చాంబర్‌లో రూపొందాడన్నది స్పష్టంగా తెలుస్తుంది.

బంజరు భూముల వంటి ఈ ప్రారంభ పుటలను దాటితే డిసెంబరు మాసపు మొఘల్ గార్డెన్స్‌లా పుస్తకం వికసించి కనిపిస్తుంది. హఠాత్తుగా ఆయన అలవిమాలిన సమాచారం... చూపు తిప్పని వివరాలతో కూడిన కథనంగా మారిపోతుంది. కథకు అందే ప్రతి చిన్న చేరికతో ఆయన చూపుతున్న ప్రపంచం మనల్ని మరింతగా ఆకర్షిస్తుంది. ఇక్కడికి వచ్చేసరికి నేను పుస్తకాన్ని కింద పెట్టలేకపోయాను.





రాత్రి బాగా పొద్దుపోయే వరకు కూడా, దానికి ఏదీ సాటిరాని స్కాట్‌లాండ్ జలాలతో బలోపేతం అయిన పేజీలను తిప్పుతూ ఉండిపోయాను. ఓ, ఢిల్లీలోని ఉష్ణోగ్రతల కారణంగా కొంచెం ఐసుతో కూడా!

ఆయన ఫారిన్ సర్వీసుకు ఎప్పటికీ ఎలా చేరుకోలేక పోయారనే గాథను పుస్తకంలోని ముఖ్యాంశంగా పత్రికలు ఇచ్చి తీరాలి. మన ప్రముఖ పత్రికలలో ఒకటేదైనా ఇస్తుందని నాకు గట్టి నమ్మకం కనుక ఆ వివరాలను ఇక్కడ వెల్లడించడం ద్వారా పాఠకుల ఆసక్తిని ముందే చెప్పి పాడు చేయలేను. ఒకటైతే చెబుతాను. పుస్తకంలోని ఈ ముఖ్యాంశాన్ని ఇవ్వకపోతే మీ అభిమాన దిన పత్రికను కొనడం మానేయండి.

ఏదేమైనా, కరాచీలో కాన్సుల్–జనరల్‌గా పాకిస్తాన్‌లోని ఆయన నాలుగేళ్ల కాలాన్ని పొందుపరచిన అధ్యాయం... మనవాళ్లలో చాలా మంది శత్రువుగా భావించే దేశంలోని ప్రేమ, అవగాహనలను తెలియబరుస్తుంది. మీలో చాలామందిని అది అక్షరాలా ఆకట్టుకునేలా ఉంటుంది. పాకిస్తాన్‌ని ఆయన ఉన్నదున్నట్లుగా లేదా, నిజాయితీగా చెప్పాలంటే పాకిస్తాన్ అప్పట్లో ఉన్న విధంగా... మనవాళ్లు మనలో కలిగించిన, విధేయతతో సత్యం అని మనం నమ్మిన అపోహలను, అబద్ధాలను చెల్లాచెదురు చేసేలా ఆయన చిత్రీకరించారు.

మర్యాదపూర్వకంగా, ఆప్యాయతతో ఉండండి, అప్పుడు పాకిస్తానీలు అదే విధమైన తమ ప్రతి స్పందనతో మిమ్మల్ని ముంచెత్తుతారు అని మణి కటువైనది కాని సూచనగా మీకు చెబుతారు. "భారతీయ శత్రుత్వం, లేదా శత్రుత్వ భావన పాకిస్తానీలను వారి ప్రభుత్వం లేదా సైన్యం వెనుక సమైక్యం అయ్యేలా చేస్తోంది" అంటారు మణి. ఇప్పుడూ అంతే కదా... మనం వారిని వారి సైన్యం బాహువుల్లోకి విజయవంతంగా నెట్టేస్తున్నాం.

మనం ఎదుర్కోవలసిన అవసరం ఉన్న ప్రశ్నలను మణి లేవనెత్తారు. "పాక్ పాలకులపై ఆగ్రహంతో మనం ఎందుకని పాకిస్తాన్ పౌరులకు వీసాలను తిరస్కరిస్తున్నాం? పాకిస్తానీయులందరూ మన దేశంలో విధ్వంసాన్ని సృష్టించే జిహాదీలేనని మనం నిజంగా నమ్ముతున్నామా? పాకిస్తానీ జనాభాలోని 99.99 శాతం మందికి ఏ మాత్రం సంబంధం లేని ఉగ్రవాద చర్యలకు ప్రతీకారం తీర్చుకోవడానికి సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌ను ఎందుకు రద్దు చేయాలి? మనం కనుక పాకిస్తానీయులను భారతదేశంలోని తమ బంధువులతో కలవనీయకుండా చేస్తే హురియత్ తన ఆజాదీ పిలుపును విరమించుకుంటుందని నిజంగానే మనం భావిస్తున్నామా?"

ఇందుకు ఆయన ఇచ్చిన సమాధానాన్ని నేను సమర్థిస్తాను... అది భౌగోళికంగా కచ్చితంగా లేకుండా ధ్వనిపూర్వకంగా మాత్రమే దగ్గరగా ఉన్నప్పటికీ. "పరాగ్వేలో మనం పడిపోకుండా ఉన్నాం. పొరుగు దేశమైన పాకిస్తాన్‌లో నిలబడలేకున్నాం."

మనలో చాలా మందికి తెలియని ఒక సత్యాన్ని సంగ్రహించే ఒక వాక్యాన్ని మీకు వదిలేస్తాను. అయితే కొద్ది మంది దానిని అంగీకరించరు. "శాంతి కోసం జరిగే ప్రయత్నాలు భారతదేశంలో కంటే పాకిస్తాన్‌లోనే ఎక్కువని అయిష్టంగానే నేను ముగించాల్సి వచ్చింది."

ఈ మాటను మీరు అంగీకరిస్తే... మీరు ఈ పుస్తకాన్ని చదివేందుకు, మీరెంత కచ్చితమైన వారో తెలుసుకునేందుకు అది మిమ్మల్ని ప్రలోభపెడుతుందని నా ఆశ. అలా కాకపోతే మీకు ఎన్నడూ చెప్పని, లేదా మీ నుండి దాచి పెట్టినవాటిని ఎదుర్కోడానికి మీలో కోపాన్నైనా రేకెత్తించనివ్వండి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఖండనార్హం



ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో ఒక ముస్లిం పిల్లాడు ఒక హిందూ టీచర్ చేతిలో దారుణమైన దౌర్జన్యానికి గురయ్యాడు. కశ్మీర్‌లోని కథువాలో ఒక హిందూ పిల్లాడు ఒక ముస్లిం చేతిలో దారుణమైన దౌర్జన్యానికి గురయ్యాడు. పరస్పర నిందల వల్ల ఉపయోగం లేదు. ఈ రెండు చర్యలూ హీనమైనవి. ఆరోగ్యకర ఆలోచనలు ఉన్న ప్రతి భారతీయుడూ వీటిని ఖండించాలి.

– సాకేత్ గోఖలే, తృణమూల్ ఎంపీ (రాజ్యసభ)

దేనికోసం?



మసీదులు, శ్మశానాలు, మదరసాలు, ఇతర సామాజిక కార్యకలాపాల్లో 'దళిత ముస్లింలు' కులతత్వం వల్ల వివక్షను ఎదుర్కొంటున్నారని అన్సారీ (సోషియాలజీ ప్రొఫెసర్ ఖాలిద్ అనీస్ అన్సారీ) వాదిస్తున్నారు. 1990లో లోక్‌సభలో వాజ్‌పేయి అడిగిన ప్రశ్ననే నేను మళ్లీ అడుగుతున్నాను: 'మరి వాళ్లెందుకు మతం మారినట్టు?'

– దిలీప్ మండల్, సంపాదకుడు

గుర్తించాలి



రాజ్యానికీ, మతానికీ మధ్య లౌకికవాదం అనేది ఒక గోడ వంటిది. పౌరుడికీ, మతానికీ మధ్య కమ్యూనిజం ఒక గోడ వంటిది. అందుకే కమ్యూనిజం అనేది లౌకికవాదం కాదు.

– అమిత్ షాండీలియా, కాలమిస్ట్

శాంతి శాంతి



టీవీ వ్యాఖ్యాతలతో సహా ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయం చెప్తుంటారు– ఇది మంచిది, అది చెడ్డది, ఇది ఒప్పు, అది తప్పు. నేను వాళ్లలా ఉండదలుచుకోలేదు. అందుకే సంగీతాన్ని మాట్లాడనిస్తాను.

– హరూకీ మురకామి, రచయిత

మళ్లీ మూసుకోవాలా?



నిష్ఫలమని రుజువైనప్పటికీ మళ్లీ మాస్కులు పెట్టుకోవాలనే, చెడు చేసిందని తెలిసీ లాక్‌డౌన్లు విధించాలనే విధానాన్ని ఏమనాలి? జనాల సహకారం లేకుండా ఈ విధానాలు పనిచేయవు. సహాయ నిరాకరణ చేస్తే ఎలా ఉంటుంది?

– జోసెఫ్ ఎ.లడాపో, యూఎస్ ఆరోగ్య అధికారి

వెనుకబడిన కులాలకు మహర్దశ!

సామాజిక న్యాయం అంటే అసలైన అర్థం ఇదేనని నేటి ఆంధ్రప్రదేశ్ పాలన గుర్తు చేస్తోంది. జనాభాలో అత్యధికులుగా ఉన్నప్పటికీ గత ప్రభుత్వాల్లో వారికి ఏ రంగంలో కూడా తగిన వాటా లభించలేదు. ఆఖరికి దారిద్ర్య రేఖకు దిగువనున్న బీసీలు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం పొందలేదు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్స్ కాదు... బీసీలంటే దేశానికి 'బ్యాక్ బోన్' అంటూ పాదయాత్రతో పాటు ఎన్నికల ముందు నిర్వహించిన బీసీ సదస్సుల్లో కొత్త నిర్వచనం చెప్పిన అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్... ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వారికి అన్ని రంగాల్లో తగిన వాటా ఇచ్చేశారు. ఇటు అభివృద్ధి, సంక్షేమాల్లో బీసీలకు సామాజిక న్యాయం చేస్తున్నారు. రాజ్యాధికారంలో కూడా బీసీలకు పెద్ద పీట వేశారు. మంత్రివర్గంలోనే కాకుండా వేల సంఖ్యలో నామినేటెడ్ పదవులు ఇచ్చారు.

'వైఎస్సార్ నవశకం' పేరుతో వలంటీర్ల ద్వారా అర్హతగల ప్రతి ఒక్కరినీ 'నవరత్నాల' పథకాలకు లబ్ధిదారులుగా గుర్తించారు. దీంతో ఎటువంటి వివక్షకు తావులేకుండా అర్హులైన బీసీలందరినీ ఆయా పథకాలకు ఎంపిక చేశారు. వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా నగదు బదిలీతో పాటు నగదేతర బదిలీ పథకాల ద్వారా మొత్తం 4.52 కోట్ల మంది బీసీలకు (పలువురికి ఒకటి కంటే ఎక్కువ పథకాల వల్ల) ప్రయోజనం చేకూరింది. ఇందులో నేరుగా నగదు బదిలీ ద్వారా 3.31 కోట్ల మంది బీసీలకు, నగదేతర పథకాల ద్వారా 1.21 కోట్ల మంది బీసీలకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చారనేది ఒక అంచనా.

'వైఎస్సార్ రైతు భరోసా'తో పాటు 'వైఎస్సార్ పెన్షన్ కానుక', 'జగనన్న అమ్మ ఒడి', ఇళ్ల స్థలాల పంపిణీ వంటి వాటి లబ్ధిదారుల్లో అత్యధికులు బీసీలే ఉండటం గమనార్హం. మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల... రాజకీయ, ఆర్థిక ఎదుగుదల కొరకు జగన్ ప్రభుత్వం 5 నూతన చట్టాలను తీసుకొచ్చింది. ఈ చట్టాలు సంబంధిత వర్గాల ఎదుగుదలలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొస్తాయనడంలో సందేహం లేదు.

శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటు (యాక్ట్ నం. 19), నామినేటెడ్ పదవులలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల రాజకీయ ఎదుగుదల కొరకు 50 శాతం రిజర్వేషన్లు(యాక్ట్ నం. 24), నామినేటెడ్ కాంట్రాక్టు పనులలో, నామినేటెడ్ సర్వీస్ కాంట్రాక్టులలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఆర్థిక ఎదుగుదల కొరకు 50 శాతం రిజర్వేషన్‌ను కల్పించడం (యాక్ట్ నం. 25), నామినేటెడ్ కాంట్రాక్టు పనులలో, నామినేటెడ్ సర్వీస్ కాంట్రాక్టులలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడం (యాక్ట్ నం. 26), నామినేటెడ్ పదవులలో మహిళల రాజకీయ ఎదుగుదల కొరకు 50 శాతం రిజర్వేషన్‌ను కల్పించడం (యాక్ట్ నం. 27) లాంటివి ఎన్నడూ ఊహించలేదు కదా! ఊహించని విధంగా సీఎం వైఎస్ జగన్ బహుజన మహిళ సాధికారత కోసం అనేక చర్యలు చేపట్టారు. అందుకే ఏపీలో బీసీలకు మహర్దశ పట్టిందనేది!

– డా॥ బి. కేశవులు నేత

తెలంగాణ మేధావుల సంఘం ఛైర్మన్ । 85010 61659

గిడుగు సాక్షిగా మరొక భాషోద్యమం రావాలి

సందర్భం



పి. విజయబాబు

వ్యవహారిక భాష అనగానే మన మదిలో మెదిలేది గిడుగు వేంకట రామమూర్తి పంతులు. నాలుగు దశాబ్దాలకు పైగా వ్యవహారిక భాషోద్యమం కోసం గ్రాంథిక వాదులతో అలు పెరగని పోరాటం చేశారు. వారు సలిపిన భాషోద్యమం అచ్చంగా అభ్యుదయ సమాజం కోసమే అని చెప్పాలి. నోటి మాటకు, చేతిరాతకు సంధానం కుదిరినప్పుడే భాష పోషకంగా ఉంటుందని భావించారు.

పండితులకే పరిమితమైన భాషను, కొద్ది మంది మాత్రమే చదువుకునే వెసులుబాటు ఉన్న విద్యను సామాన్య ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలని ఆయన పరితపించారు. శిష్ట వ్యవహారిక భాషకు పట్టం కట్టినప్పుడే ఇది సాధ్యమవుతుందని ఆయన సంప్రదాయ భాషా వాదులపై సుదీర్ఘ పోరాటం చేశారు. అయితే సంప్రదాయ భాషా వాదులు ఆయన వాదనను బలంగా తిరస్కరించారు, అయినా గిడుగు వారు ఉద్యమించారు.

ప్రజల భావాలకు అనుగుణంగా భాష ఉండాలనీ, వాళ్ళ భావాలను అందరికీ అర్థమయ్యే రీతిలో రాయగలగాలనీ, అందుకే వాడుక భాష చాలా అవసరం అని గిడుగు వారు వాదించారు.

సంప్రదాయ సాహిత్య వాదులు, కవులు అయిన తిరుపతి వేంకట కవులు కూడా భాషలో మార్పుల్ని సమర్థించారు. ప్రారంభంలో కందుకూరి వారు సంప్రదాయ సాహిత్య పక్షాన నిలిచినా తదనంతరం గిడుగు వారి ఉద్యమ దీక్షలో సత్యాన్ని గ్రహించి ఆయన కూడా వ్యవహారిక భాషోద్యమానికి బాసటగా నిలిచారు. ఫలితంగా గిడుగు వారి ఉద్యమం మరింత బలపడింది.

గురజాడ, గిడుగు ఇద్దరూ అభ్యుదయవాదులు మాత్రమే కాదు, అద్భుతమైన భావజాలాలను కలబోసుకున్న మిత్రులు. విజయనగరంలో ఇద్దరూ కలిసే చదువుకున్నారు.

ఎంతో కష్టపడి సవరభాష నేర్చుకొని అదే భాషలో పుస్తకాలు రాసి, సొంతడబ్బుతో బడులు ఏర్పాటు చేసి, సవరలకు చదువు చెప్పే ఏర్పాట్లు చేశారు గిడుగు. మద్రాసు ప్రభుత్వం వారు ఈ కృషికి మెచ్చి 1913లో 'రావు బహదూర్' బిరుదు ఇచ్చారు. ముప్ఫై అయిదేళ్ళ కృషితో 1931లో ఇంగ్లీషులో సవరభాషా వ్యాకరణాన్నీ, 1936లో 'సవర–ఇంగ్లీషు కోశా'న్నీ తయారు చేశారు. ప్రభుత్వం ఆయనకు 'కైజర్–ఇ–హింద్' అనే స్వర్ణ



గిడుగు రామమూర్తి పంతులు

పతకాన్ని ఇచ్చి గౌరవించింది.

1919–20ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కొరకు 'తెలుగు' అనే మాస పత్రిక నడిపారు. వ్యావహారిక భాషను ప్రతిఘటించిన 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు' సభలో నాలుగు గంటలపాటు ప్రసంగించి గ్రంథాల్లోని ప్రయోగాల్ని ఎత్తి చూపి తన వాదానికి అనుకూలంగా సమితిని తీర్మానింపజేశారు గిడుగు. 'సాహితీ సమితి', 'నవ్య సాహిత్య పరిషత్తు' వంటి సంస్థలు కూడా గిడుగు వాదాన్ని బలపరచాయి. గిడుగు రామమూర్తి ఊరూరా ఉపన్యాసాలిస్తూ గ్రాంథికంలో ఏ రచయితా నిర్దుష్టంగా రాయలేడని నిరూపించారు. ఆ క్రమంలో విశ్వవిద్యాలయాలన్నీ వ్యవహారిక భాషకు పట్టం కట్టడం ప్రారంభించాయి. కాగా మరోవైపు గిడుగు వారి అనుంగు శిష్యుడైన తాపీ ధర్మారావు సంపాదకీయాలతో ప్రారంభమైన వ్యవహారిక భాష... పత్రికల్లోనూ క్రమంగా విస్తరిస్తూ వచ్చింది.

1863 ఆగస్టు 29న శ్రీకాకుళానికి ఇరవై మైళ్ళ దూరంలో ముఖలింగ క్షేత్రం దగ్గర ఉన్న పర్వతాల పేట గ్రామంలో జన్మించిన గిడుగు అలుపెరుగని వ్యవహారిక భాషోద్యమం చేస్తూ జనవరి 1940 జనవరి 22న కన్ను మూశారు.


భాషను పరిపుష్టం చేయడం అనేది కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు. భాషాభిమానులందరూ కూడా ఇందులో మమేకం కావాలి. తెలుగువారు తెలుగుతో పాటుగా ఇంగ్లీషు వంటి అంతర్జాతీయ భాషలలో పట్టు సాధించగలిగితే మన సాహిత్య అనువాదాలు ప్రపంచవ్యాప్తమవుతాయి తెలుగు వారు ఉన్నత స్థితిలో నిలిచినప్పుడు మన భాష, సంస్కృతి, సంప్రదాయాలను కూడా అదే స్థాయిలో నిలబెట్ట గలుగుతారన్నదే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆలోచన. అందుకే మన కోసం, మన పాలనావసరాల కోసం, 'మన సంస్కృతి–సంప్రదాయాల కోసం, తెలుగు భాష... భవిష్యత్తు అవసరాల కోసం ఇంగ్లీష్ భాష' అనే లక్ష్యంతో సాగుతున్నారు. ఈ నేపథ్యంలో భాషావాదులు కువిమర్శలు పట్టించుకోకుండా వాస్తవాలను గ్రహించగలిగితే, తెలుగు భాష అజంతం, అజరామరం అనేదానికి సార్థకత ఉంటుంది. ప్రపంచ పటంలో తెలుగు కీర్తి రెపరెపలాడుతుంది.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు

(నేడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి)

భిక్ష–ధర్మోపదేశం

త్రిపిటకాల్లో... వాటి వ్యాఖ్యానప్రాయాలైన 'అట్ట కథ'ల్లో బుద్ధుడి దిన చర్య గురించిన వివరాలు మనకు లభిస్తాయి. ఈ సాహిత్యం ప్రకారం: బుద్ధుడు ఉదయం పూట కాలకృత్యాలు తీర్చుకొని, భిక్షాటనం చేసే సమయం దాకా ఒక్కడే ఏకాంత ప్రదేశంలో కూర్చొని ఉండేవాడు. భిక్షకు ఒక్కోసారి ఒక్కడే, కొన్నిసార్లు భిక్షువులతో కలిసి వెళ్ళేవాడు. ఊరిలోకి వచ్చాక, గృహస్థులు బుద్ధ భగవానుణ్ణి భోజనానికి రమ్మని కోరేవారు. వెంట, ఇంత సంఖ్యలో భిక్షువులు రావాలని కూడా చెప్పేవారు. అతడి చేతిలోని పాత్ర తీసుకొని, తమ ఇంటికి తీసుకుపోయేవారు. ఉచితాసనం పైన కూర్చుండ బెట్టి భోజనం వడ్డించేవారు. భోజనం తర్వాత బుద్ధుడు



చేతులు, ముఖము కడుక్కొని, పుణ్యానుమోదనం చేసి, గృహస్థునికి సమయానుకూలంగా ధర్మోపదేశం చేసేవాడు. తర్వాత భిక్షు సంఘంతో పాటు విహారానికి తిరిగి వచ్చేవాడు. అప్పుడప్పుడు ఇంటింటా కొంతకొంత మధుకరం తీసుకొని ఏకాంతంలో కూర్చొని భోంచేసేవాడు. అప్పుడప్పుడు భిక్షకు వెళ్ళేవాడు కాదు. భిక్షువులు తెచ్చిన దానినే తీసుకొనేవాడు. ఇది చాలా తక్కువసార్లు జరిగేది. భోజనం అయ్యాక ఆరుబయట కూర్చొనేవాడు. ఆయన రోజులో ఒకసారే మధ్యాహ్నం కంటే ముందే భోజనం చేసేవాడు. అటు తర్వాత కుటీరంలో కొంచెంసేపు శయ్య మీద కుడివైపు తిరిగి పడుకొని శరీరానికి విశ్రాంతి ఇచ్చేవాడు. సాయంకాలం అయ్యేసరికి, చుట్టుపక్కల జనులు పుష్పాలు వంటివి పట్టుకొని బుద్ధునికి నమస్కరించటానికి వచ్చేవారు. భగవానుడు వారికి సమయానుకూలంగా ధర్మోపదేశం చేసేవాడు. దీంతో పగటి కార్యకలాపాలు ముగిసేవి.

బుద్ధుడి రాత్రి చర్య మూడు భాగాలుగా విభజింపబడి ఉండేది. సాయంకాలం ధర్మోపదేశం తర్వాత, అతడు స్నానం చేసి కాసేపు ఒక్కడే మౌనంగా కూర్చొనేవాడు. తర్వాత భిక్షువులు వచ్చి చుట్టూ కూర్చొనేవారు. కొందరు వేసే ప్రశ్నలకు సమాధానం ఇచ్చేవాడు. కొందరికి సాధన గురించి చెప్పి ప్రోత్సహించేవాడు. ఈ విధంగా రాత్రి మొదటి భాగం గడిచిపోయేది. తరువాత రెండవ భాగంలో దేవ, బ్రహ్మ లోకాల్లోని దేవతా బ్రహ్మలు, శుక్రుడు వస్తే వారితో ధర్మ చర్చ చేసేవాడు. రాత్రి చివరి మూడవ భాగం, మళ్ళీ మూడు భాగాలుగా ఉండేది. మొదటి భాగంలో శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచటానికి ఆరుబయట అటూఇటూ తిరిగేవాడు. రెండవ భాగంలో కుటీరంలోకి వెళ్ళి, కుడిపక్క పడకమీంచి లేచి, ఆసనంపై కూర్చొని లోకాన్ని కరుణాపూర్ణ దృష్టితో చూసేవాడు. ఈరోజు ధర్మ శిక్షణ ఏ పుణ్య వ్యక్తికి దొరకాలి అని విచారించి, అతనిపై కరుణా దృష్టి కురిపించేవాడు. సూర్యోదయం సమయానికి రాత్రి మూడవ భాగం పూర్తయేది.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, తిథి: శు.త్రయోదశి ప.12.53 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: శ్రవణం రా.11.42 వరకు, తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: రా.3.24 నుండి 4.54 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.18 నుండి 9.06 వరకు, తదుపరి రా.10.53 నుండి 11.37 వరకు, అమృతఘడియలు: ప.1.58 నుండి 3.27 వరకు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 5.48, సూర్యాస్తమయం: 6.15.

క్లుప్తంగా...

నేడు ఏఎన్‌యూ స్నాతకోత్సవం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ) 30, 40వ స్నాతకోత్సవాలు మంగళవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్నాయి. దీనికి వర్సిటీ చాన్స్‌లర్ హోదాలో గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. సంపాదకులు పాలగుమ్మి సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. బెంగళూరు నాక్(నేషనల్ ఎసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) డైరెక్టర్ ఆచార్య గణేశన్ కన్నాభిరాన్ ముఖ్య అతిథిగా, మంత్రి బొత్స సత్యనారాయణ విశిష్ట అతిథిగా హాజరవుతున్నారు. కార్యక్రమానికి వీసీ ఆచార్య రాజశేఖర్ అధ్యక్షత వహిస్తారు.

శ్రీవారి సేవలో ఎన్వీ రమణ



తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, తమిళనాడు మంత్రి అన్బుమణి రాందాస్, సినీ నటి జాహ్నవి కపూర్ సోమవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ, ప్రసాదాలతో సత్కరించారు.

విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

- ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్

సాక్షి,అమరావతి: జగనన్న విద్యా దీవెన పథకంతో ప్రభుత్వ బడుల్లో హాజరు శాతం పెరిగిందని ఎమ్మెల్సీ ఇజ్రాయెల్ చెప్పారు. తాడేపల్లిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పేద విద్యార్థులు చదువు కోసం పడుతోన్న అష్ట కష్టాలను, ఇబ్బందులను తొలగించడం కోసం విద్యా దీవెన పథకం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. చదువుకునే ప్రతి విద్యార్థికి, ఉచిత విద్య, ఉన్నత విద్య , మెరుగైన విద్య, అందించడాన్ని ఓ లక్ష్యంగా సీఎం జగన్ భావించారని..రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ప్రజలకు దగ్గరగా.. పేద ప్రజలకు అండగా ఉంటోందని చెప్పారు. పేద విద్యార్థులు అభివృద్ధి వైపు పయనించటం ప్రతిపక్షాలకు కంటగింపుగా ఉందని వ్యాఖ్యానించారు. సమాజ అభివృద్ధికి దోహద పడుతున్న విద్యా దీవెనను ప్రతిపక్షాలు విమర్శించడం హేయమన్నారు.

ప్రపంచ బ్యాడ్మింటన్ పోటీలకు లింగేశ్వరరావు, నాయక్




లింగేశ్వరరావు, నాయక్ నాయుడు

ఉక్కునగరం: అంతర్జాతీయ క్రీడాకారులు బీవీఎస్‌కే లింగేశ్వరరావు, కేపీ నాయక్ నాయుడు ప్రపంచ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొననున్నారు. వరల్డ్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11–17 వరకు కొరియాలోని జియోంజులో వరల్డ్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో ఇండియన్ బ్యాడ్మింటన్ జట్టు నుంచి వీరు పాల్గొంటున్నారు. స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగి లింగేశ్వరరావు ఈ పోటీల్లో సింగిల్స్‌తో పాటు ఏవీ రాజు అనే క్రీడాకారునితో డబుల్స్ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ పోటీల్లో లింగేశ్వరరావు వరుసగా ఎనిమిదో సారి పాల్గొంటున్నారు. స్టీల్‌ప్లాంట్ ఏజీఎం కేపీ నాయక్ నాయుడు ఈ పోటీల్లో మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరీలో పాల్గొంటున్నారు. వీరిరువురు మంగళవారం కొరియాకు బయల్దేరుతున్నారు.

బోనులో చిక్కిన నాలుగో చిరుత



తిరుమల: అలిపిరి–తిరుమల నడకమార్గంలోని ఏడవమైలు వద్ద నాలుగో చిరుత సోమవారం అటవీశాఖ బోనులో చిక్కింది. వారం రోజులుగా చిరుతను పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతిరోజూ బోనువరకు వచ్చి వెనుదిరిగే చిరుత ఎట్టకేలకు సోమ వారం బోనులో చిక్కింది. దీంతో నడకమార్గంలో సంచరించే చిరుతలన్నింటిని అటవీశాఖ బంధించినట్లయింది. ఈ సందర్భంగా అటవీశాఖ సిసిఎఫ్‌వో నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బోనులో చిక్కిన చిరుతను తిరుపతి జూపార్కుకు తరలిస్తున్నట్లు తెలిపారు. లక్షితపై దాడి చేసింది చిరుతేనని, బాలిక మృతదేహం వద్ద చిరుత వెంట్రుకలు లభించాయన్నారు. వాటితో పాటు చిరుత రక్తం, సెలైవా సేకరించి డీఎన్ఏ పరీక్షలకు పంపామన్నారు. మరో పదిరోజుల్లో నివేదిక వస్తుందని పేర్కొన్నారు. తిరుమల నడకదారిలో భక్తుల భద్రత కోసం నిరంతరం ఆపరేషన్ చిరుత కొనసాగిస్తామన్నారు. ప్రస్తుతం 300 సీసీ కెమెరా ట్రాప్స్ ను వినియోగిస్తున్నామని చెప్పారు. త్వరలో మరో 500 ట్రాప్ కెమెరాలను శాశ్వతంగా నడకమార్గంలో ఏర్పాటు చేస్తామన్నారు.

విపత్తులు ఎదుర్కొనే యంత్రాంగం

బలోపేతం

- 50 ఎకరాల్లో అత్యాధునిక మౌలిక వసతులతో కమాండ్ కంట్రోల్ సెంటర్, శిక్షణ కేంద్రం
- విజయవాడ సమీపంలోని కొండపావులూరులో ఏర్పాటు
- అధునాతన సాంకేతిక, సమాచార పరికరాల కొనుగోలు
- సవరించిన డీపీఆర్‌కు ప్రభుత్వ ఆమోదం

సాక్షి, అమరావతి: ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొనే వ్యవస్థాగత యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేస్తోంది. ఇందుకోసం శాశ్వత ప్రాతిపదికన రాష్ట్ర విపత్తుల నిర్వహణ బలగాల (ఎస్‌డీఆర్‌ఎఫ్) ప్రధాన కేంద్రాన్ని ఏర్పాటుచేయనుంది. యుద్ధప్రాతిపదికన సహాయ, పునరావాస చర్యలు చేపట్టేందుకు అత్యాధునిక మౌలిక వసతులతో ఏర్పాటుచేసే ఈ ప్రధాన కేంద్రంలోనే శిక్షణా కేంద్రాన్ని కూడా నెలకొల్పనుంది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కొండపావులూరులో 50 ఎకరాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రధాన కేంద్రం, శిక్షణ కేంద్రం నిర్మాణానికి సవరించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (రివైజ్డ్ డీపీఆర్)ను ఖరారు చేసింది. ఈ మేరకు హోంశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

రూ.99.73 కోట్లతో ప్రధాన కేంద్రం

దేశంలో గుజరాత్ తర్వాత అతి పొడవైన సముద్ర తీరం (దాదాపు 972 కి.మీ) ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంది. దీంతో ఏటా తుపాన్లు, వరదల ముప్పును రాష్ట్రం ఎదుర్కొంటోంది. విపత్తులు సంభవించినప్పుడు ప్రజలను యుద్ధప్రాతిపదికన ఆదుకునేందుకు.. విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఎల్లప్పుడూ పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండే వ్యవస్థను ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన జాతీయ విపత్తుల నిర్వహణ బలగాలు (ఎన్‌డీఆర్‌ఎఫ్), జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్‌ఐడీఎం)లతోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రధాన కేంద్రాలను కృష్ణాజిల్లా గన్నవరం మండలం కొండపావులూరులో ఏర్పాటుచేయనున్నారు. ఇందుకోసం ఎన్‌డీఆర్‌ఎఫ్‌కు 50 ఎకరాలు, ఎన్‌ఐడీఎంకు 10 ఎకరాలు, ఎస్‌డీఆర్‌ఎఫ్‌కు 50 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఎస్‌డీఆర్‌ఎఫ్‌కు కేటాయించిన 50 ఎకరాల్లో ప్రధాన కేంద్రం, కమాండ్ కంట్రోల్ సెంటర్, శిక్షణ కేంద్రాలను నెలకొల్పుతారు. ఈ మేరకు ఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రణాళికకు సూత్రప్రాయ ఆమోదం తెలిపింది.



బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా చింతూరులో సహాయకచర్యల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది(ఫైల్)

ప్రధాన కేంద్రంలో 154 మంది..

ఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రధాన కేంద్రంలో 154 మంది అధికారులు, సిబ్బందిని నియమించాలని నిర్ణయించారు. వీరిలో పర్యవేక్షణ స్థాయి ఉన్నతాధికారులు నలుగురు ఉంటారు. అలాగే, రెండు రెస్క్యూ టీమ్‌లలో అత్యవసర సేవలు అందించే అధికారులు, సిబ్బంది 94 మంది ఉండనున్నారు. అదేవిధంగా క్వార్టర్ మాస్టర్ గ్రూప్ సభ్యులు 15 మంది, కమాండ్ కంట్రోల్ సెంటర్ అధికారులు, సిబ్బంది 8 మంది, రవాణా విభాగం అధికారులు, సిబ్బంది 15 మంది, ప్రధాన కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో వైద్య అధికారులు ఇద్దరు, ఫార్మసిస్టులు నలుగురు, మినిస్టీరియల్ సిబ్బంది 12 మంది ఉంటారు.

ఆధునిక మౌలిక వసతులతో..

తుపాన్లు, వరదలు, ఇతర విపత్తులు సంభవించినప్పుడు సమర్థంగా రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించేందుకు ఆధునిక మౌలిక వసతులను ఎస్‌డీఆర్‌ఎఫ్‌కు సమకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.65 కోట్లతో ప్రతిపాదనలకు సూత్రప్రాయంగా ఇప్పటికే ఆమోదం తెలిపింది. రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించేందుకు ఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రధాన కేంద్రంలో 309 అధునాతన పరికరాలను రూ.21.74 కోట్లతో కొనుగోలు చేయనున్నారు. అలాగే, రూ.39 కోట్ల వ్యయంతో వాహనాలను కూడా కొంటారు. ఇక కమాండ్ కంట్రోల్ సెంటర్ కోసం రూ.77 లక్షలతో కంప్యూటర్లు, జీపీఎస్ ట్రాకర్లు, ఇతర సాంకేతిక పరికరాలను కొనుగోలు చేస్తారు. అలాగే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమాచారాన్ని అనుసంధానించేందుకు అధునాతన సాంకేతిక, సమాచార పరికరాలను రూ.1.50 కోట్లతో కొంటారు. అదేవిధంగా శిక్షణ కేంద్రంలో 10 రకాల శిక్షణ అందించేందుకు రూ.2 కోట్లతో పరికరాలను కొనుగోలు చేస్తారు.

లైంగిక దాడి కేసులో దోషికి యావజ్జీవ శిక్ష



దోషి వాయల పోలయ్య (మధ్యలో)

వేటపాలెం:లైంగిక దాడి కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ.. ఒంగోలు సెషన్స్ కోర్టు జడ్జి ఎంఏ సోమశేఖర్ సోమవారం తీర్పు చెప్పారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం లక్ష్మీపురంలో నివాసం ఉండే వాయల పోలయ్య తన ఇంటి పక్కనే నివాసం ఉంటున్న ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన 6 సంవత్సరాల బాలిక ఒంటరిగా ఉండటం చూసి 2017 నవంబరు 4వ తేదీ ఉదయం బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాలిక అమ్మమ్మ వేటపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితుడిపై నేరం రుజువు కావడంతో యావజ్జీవ శిక్ష విధించారు. కాగా, ఎస్పీ వకుళ్ జిందాల్ మాట్లాడుతూ లైంగిక వేధింపులు, అత్యాచారాలు అఘాయిత్యాలకు పాల్పడే వారు ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టం నుంచి తప్పించుకునే వీలులేకుండా కోర్టు ట్రయిల్ మానిటరింగ్ వ్యవస్థను పటిష్ఠ పరచి నిందితులకు శిక్ష పడేలా కృషి చేస్తున్నామన్నారు.

ఎస్‌ఐపై టీడీపీ నేతల దౌర్జన్యం

- రెచ్చగొట్టే ప్రసంగాలు వద్దన్నందుకు రెచ్చిపోయిన టీడీపీ నేతలు
- నువ్వు దొంగవి అంటూ ఎస్‌ఐపై టీడీపీ నేత ఆదినారాయణ దురుసు ప్రవర్తన
- ఆగ్రహంతో ఊగిపోయిన మాజీ ఎంపీ కొనకళ్ల, మాజీ ఉప సభాపతి బుద్ధప్రసాద్

ఘంటసాల(అవనిగడ్డ): ఆందోళనలు, రెచ్చగొట్టే ప్రసంగాలు వద్దని చెప్పిన ఘంటసాల ఎస్‌ఐ శ్రీనివాస్‌పై మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ఊగిపోయారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు ఆయనకు వంతపాడారు. దీంతో టీడీపీ నేతలు ఎస్‌ఐపై రెచ్చిపోయారు. వారి తీరుతో కృష్ణా జిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళంలో చేపట్టిన టీడీపీ ఇసుక సత్యాగ్రహం కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. ఎస్‌ఐ కూచిపూడి శ్రీనివాస్ తెలిపిన వివరాలు..చంద్రబాబు పిలుపు మేరకు సోమవారం బుద్ధప్రసాద్ నేతృత్వంలో మాజీ ఎంపీ కొనకళ్లతో మరికొంతమంది టీడీపీ నేతలు శ్రీకాకుళం నుంచి ర్యాలీగా ఇసుక క్వారీ వరకు వెళ్లారు. అక్కడ టీడీపీ జెండాలు ఉంచి నిరసన తెలిపారు. ఎస్‌ఐ శ్రీనివాస్ ఈ ఆందోళన కార్యక్రమానికి ఒక గంట మాత్రమే అనుమతిచ్చారు. పామర్రు టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమారరాజా రావడం ఆలస్యం కావడంతో ఇచ్చిన సమయం దాటిపోయింది. అయినప్పటికీ కొంత మంది నేతలు మాట్లాడుతుండటంతో మీకిచ్చిన సమయం అయిపోయింది, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దని, ఏదైనా ఉంటే చట్టపరంగా చూసుకోవాలని ఎస్‌ఐ సూచించారు. దీంతో కోపోద్రిక్తుడైన బుద్ధప్రసాద్.. 'ఇసుక దోపిడీకి అనుమతిస్తావా, మేము మాట్లాడుతుంటే అడ్డుపడతావా' అంటూ ఎస్‌ఐపై విరుచుకుపడ్డారు. ఇసుక దోపిడీని అరికట్టకుండా మమ్మల్నే అడ్డుకుంటావా..అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. కొనకళ్ల కల్పించుకుని ఇసుక దోపిడీ గురించి మాట్లాడుతుంటే అడ్డుకుంటానికి మీరెవరు.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మచిలీపట్నం పార్లమెంటరీ టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ ఎస్‌ఐకి వేలు చూపిస్తూ.. నువ్వు దొంగవి అంటూ దురుసుగా ప్రవర్తించారు. అనంతరం జేపీ సిబ్బందిని తీసుకొచ్చిన ఎస్‌ఐ శ్రీనివాస్.. ఇసుక ధరలు, క్వారీ అనుమతుల గురించి బుద్ధప్రసాద్‌తో మాట్లాడించారు. ఇక్కడ నుంచి గుడివాడ, మచిలీపట్నం, పామర్రు నియోజకవర్గ పరిధిలో జగనన్న కాలనీలకు సంబంధించిన స్టాక్ పాయింట్లకు ఇసుక రవాణా చేయడం వల్ల వాటికి రేటు వేయరని చెప్పారు. మైనింగ్ అనుమతి గురించి ప్రశ్నించగా.. మా ఉన్నతాధికారుల వద్ద వివరాలున్నాయని సిబ్బంది చెప్పారు. ఇసుక క్వారీకి సంబంధించి అనుమతులు చూపించాలని లేదంటే రేపు పోలీస్ స్టేషన్ ఎదుట నిరాహార దీక్ష చేస్తామంటూ ఎస్‌ఐని బుద్ధప్రసాద్ హెచ్చరించారు.



నువ్వు దొంగ అంటూ ఎస్‌ఐకి వేలు చూపిస్తున్న టీడీపీ నేత ఆదినారాయణ, చిత్రంలో మండలి బుద్ధప్రసాద్, కొనకళ్ల నారాయణ

'నైపుణ్యం'తో విదేశాల్లోనూ విస్తృత ఉపాధి

- ఏపీ యువత వైపు దక్షిణ కొరియా, వియత్నాం చూపు
- ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ వినోద్‌కుమార్ వెల్లడి
- సైబర్ సెక్యూరిటీపై కేఎల్‌యూలో శిక్షణ ప్రారంభం

సాక్షి, అమరావతి/తాడేపల్లి రూరల్: విదేశాల్లోని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా రాష్ట్ర యువతకు నూతన సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్య శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఎండీ సీఈవో డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో సైబర్ సెక్యూరిటీపై నిర్వహిస్తున్న అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ వెహికల్స్, సైబర్ సెక్యూరిటీ తదితర అంశాల్లో శిక్షణపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఇప్పటికే డ్రోన్ టెక్నాలజీ, ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు సంబంధించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మలేసియా, ఆస్ట్రేలియా ప్రతినిధులతో ఇప్పుడు సైబర్ సెక్యూరిటీపై శిక్షణను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఉపాధి వేటలో నైపుణ్యం, టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తున్నాయని.. వియత్నాం, దక్షిణ కొరియా వంటి దేశాల్లో రాష్ట్ర యువతకు డిమాండ్ అధికంగా ఉందన్నారు. అక్కడి ప్రభుత్వ అధికారులు ఏపీ యువతను అమెరికాకు కాకుండా తమ దేశాలకు పంపాలని కోరినట్లు వివరించారు. ఆ రెండు దేశాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలన కోసం ఆయా విభాగాల అధిపతులకు పంపినట్లు తెలిపారు. నూతన టెక్నాలజీపై శిక్షణ కోసం యువత ఆసక్తిని చూపిస్తోందన్నారు. 'సైబర్ సెక్యూరిటీ'పై శిక్షణ అనగానే వారం రోజుల్లో సుమారు 900 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. అనంతరం కేఎల్ యూనివర్సిటీలోని స్కిల్ సెంటర్‌ను సందర్శించి.. అక్కడ జర్మన్ భాషపై అందిస్తోన్న ఉచిత శిక్షణను పరిశీలించారు. కార్యక్రమంలో 'అకాటి సెక్యూరిటీ' సీఈవో కృష్ణ రాజగోపాల్, డేవిడ్ షెర్లీ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ మూకల దాడి

- తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ నేత ప్రభాకర్‌నాయక్
- దాడిచేసిన వారిపై హత్యాయత్నం కింద కేసు నమోదు
- చిత్తూరు జిల్లా పుంగనూరులో ఘటన



పుంగనూరు(చిత్తూరు జిల్లా) : టీడీపీ శ్రేణులు మళ్లీ బరితెగించాయి. వైఎస్సార్‌సీపీ నేత ఇంట్లోకి జొరబడి రాళ్లు, కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. పుంగనూరు మండల వైస్ ఎంపీపీ సరోజమ్మ, ఆమె భర్త ప్రభాకర్‌నాయక్ మండలంలోని పాళ్యంపల్లెలో ఉంటున్నారు. ఈ నెల 4న చంద్రబాబు పర్యటనలో టీడీపీ శ్రేణులు పోలీసులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన విషయం తెలిసిందే. ఈ కేసులో మండలంలోని జెడీ తాండాకు చెందిన టీడీపీ నేత కృష్ణానాయక్, ఆయన కుమారులు నిందితులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు ప్రభాకర్‌నాయక్ తమ ఆచూకీ తెలిపి ఉంటారన్న అనుమానంతో కృష్ణానాయక్ ఆయన కుమారుడు శ్రీనివాస నాయక్, వారి అనుచరులు కలిసి పథకం ప్రకారం ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో ప్రభాకర్‌నాయక్ ఇంటిపై దాడి చేసి, భయానక వాతావరణం సృష్టించారు. ప్రభాకర్‌నాయక్‌పై రాళ్లు, కత్తులతో దాడి చేసి గాయపరిచారు. అడ్డు వచ్చిన ఆయన బావమరిది మునీంద్రనాయక్‌పైనా దాడి చేశారు. గ్రామస్తులు రావడంతో నిందితులు పరారయ్యారు. గాయపడిన ప్రభాకర్‌నాయక్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మోహన్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి నిందితులపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. కాగా, ప్రభాకర్‌నాయక్‌ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పరామర్శించి ధైర్యం చెప్పారు.

శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం యాగశాలలో హోమాలు చేశారు. సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పవిత్ర మాలలు సమర్పించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు.

బాబుకు రాజకీయ సన్యాసం తప్పదు

1,065వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అధికారంలో ఉన్నప్పుడు 29 గ్రామాల అభివృద్ధిని గాలికొదిలేసి ఇప్పుడు అమరావతి పేరుతో కుటిల రాజకీయాలకు తెరలేపి మొసలి కన్నీరు కారుస్తున్న బాబుకు రాజకీయ సన్యాసం తప్పదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 1,065వ రోజుకు చేరుకున్నాయి. పలువురు మాట్లాడుతూ.. అమరావతి బాబుకు కల్పవృక్షంలా లక్షల కోట్లు కురిపిస్తే 29 గ్రామాల ప్రజల పాలిట గుదిబండలా తయారైందన్నారు. రాజధాని పేరుతో అమరావతిలో జరిగిన అవినీతిపై పూర్తిస్థాయి విచారణ చేస్తే బాబు అండ్‌కో భాగోతం బయట పడుతుందని తెలిపారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు పేదవాడికి చేసిన మేలు ఏమీ లేదని, సీఎం జగన్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పాటుపడుతుంటే.. ఓర్వలేక తప్పుడు ప్రచారాలకు దిగడం సిగ్గుచేటన్నారు. రాజధాని ప్రాంతంలో సీఆర్‌డీఏ చట్టం ప్రకారం 53 వేల ఇళ్ల నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తుంటే..తప్పుడు కేసులు వేసిన బాబుకు బహుజనులు ఓట్లు ఎందుకు వేయాలో చెప్పి ప్రజాక్షేత్రంలో తిరగాలని డిమాండ్ చేశారు. నాయకులు ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, పులి దాసు, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.


ఏసీబీ వలకు చిక్కిన ఏపీపీ

- రూ.90 వేలు తీసుకుంటూ పట్టుబడిన ఏపీపీ, కానిస్టేబుల్

చిలకలపూడి (మచిలీపట్నం): వరకట్న వేధింపుల కేసులో బాధితుడి నుంచి లక్ష రూపాయలు డిమాండ్ చేసి రూ.90 వేలు తీసుకుంటూ ఎక్సైజ్ కోర్టు ఏపీపీ జె.విజయలక్ష్మి ఏసీబీకి పట్టుబడ్డారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలోని ఎక్సైజ్ కోర్టులో నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కోర్టు ప్రాంగణంలో ఏసీబీ అధికారుల దాడితో ఒక్కసారిగా కోర్టులో న్యాయవాదులు, న్యాయ శాఖ సిబ్బంది ఉలిక్కిపడ్డారు. ఈ ఘటనపై ఏసీబీ ఏఎస్పీ ఎం.స్నేహిత తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నంకు చెందిన వర్రె మురళీకృష్ణ ప్రొహిబిషన్, ఎక్సైజ్ కోర్టులో వరకట్న వేధింపుల కేసు నడుస్తున్నది. ఈ కేసుకు సంబంధించి అడ్వాన్స్ పిటిషన్ వేసేందుకు ఏపీపీ నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంది. సర్టిఫికెట్ ఇచ్చేందుకు ఏపీపీ విజయలక్ష్మి మురళీకృష్ణను లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. సర్టిఫికెట్‌కు లక్ష రూపాయలు ఇవ్వాల్సి వస్తుందన్న బాధతో మురళీకృష్ణ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అధికారుల సూచనల ప్రకారం మురళీకృష్ణ సోమవారం ఎక్సైజ్ కోర్టు ఏపీపీ అడిగిన ప్రకారం కాకుండా రూ.10 వేలు తగ్గించి రూ.90 వేలు ఏపీపీ విజయలక్ష్మి సమక్షంలో కోర్టు కానిస్టేబుల్ బాలకృష్ణకు అందజేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా విజయలక్ష్మి, కానిస్టేబుల్ బాలకృష్ణను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఏసీబీ ఏఎస్పీ తెలిపారు.

విశాఖలో బాహు'బల్లి'

- బల్లిలా ఉన్నా 8 కిలోల వరకు పెరుగుతుంది
- ఊసరవెల్లిలా రంగులు మార్చడం దీని నైజం
- విశాఖ జూలో అలరిస్తున్న 'గ్రీన్ ఇగ్వానా'



ఆకుపచ్చ రంగులో ఉన్న ఇగ్వానాల పిల్లలు (ఫైల్)

ఆరిలోవ (విశాఖ తూర్పు): విశాఖలోని ఇందిరాగాంధీ జూ పార్కులో 'గ్రీన్ ఇగ్వానా'లు సందర్శకులను అలరిస్తున్నాయి. పాముల జోన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రిపిటైల్స్ హౌస్‌లో వీటిని సందర్శకులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. గ్రీన్ ఇగ్వానా బల్లి జాతికి పెద్ద జంతువు. ఒక్కొక్కటీ 5 నుంచి 8 కిలోల బరువు పెరుగుతుంది. ఇది రంగులు మారుస్తుంది కానీ.. ఊసరవెల్లి మాత్రం కాదు. సాధారణంగా ఊసరవెల్లి అది సంచరించే స్థలంలో ఉన్న రంగుల్లోకి శరీరాన్ని మార్చుకుంటుంది. గ్రీన్ ఇగ్వానా మాత్రం పెరుగుతున్న కొద్దీ దాని రంగు మారిపోతుంది. ఇది పిల్లగా ఉన్నప్పుడు ఆకు పచ్చగా ఉంటుంది. పెరుగుతున్న కొద్దీ బూడిద రంగులోకి మారుతుంది. అధికారులు వాటి హౌస్‌లో అద్దాలు అమర్చారు. హౌస్ లోపల రెండు వైపులా చెట్ల మోడులు ఏర్పాటు చేశారు. వాటిపై అవి ఎక్కి తిరుగుతుంటాయి.

25 పైనే ఉన్నాయి

గ్రీన్ ఇగ్వానాలు జూలో ప్రస్తుతం 25కు పైగా ఉన్నాయి. 2010లో ఒక జత గ్రీన్ ఇగ్వానాలను చెన్నై నుంచి అధికారులు ఇక్కడకు తీసుకొచ్చారు. వాటిని సందర్శకులు కోసం చిన్న ఎన్‌క్లోజర్‌లో ఉంచారు. ఓ రోజు రాత్రి దొంగలుపడి వాటిని తీసుకుపోయారు. దీంతో జూ అధికారులు మరో జత ఇగ్వానాలను 2011లో చెన్నై నుంచి తీసుకొచ్చారు. అవి పలు విడతల్లో పెట్టిన పిల్లల సంఖ్య రానురాను పెరిగింది. ప్రస్తుతం వాటి సంఖ్య 25 దాటింది. ఆడ ఇగ్వానాలు ఇసుక, మెత్తని మట్టిలో గుడ్లు పెట్టి పొదిగి పిల్లల్ని చేస్తాయి.

శాఖాహారులే సుమా!

ఇగ్వానాలు సెంట్రల్ అమెరికా, బ్రెజిల్, కరేబియన్ దీవులలో ఉంటాయి. మనకు జూ పార్కులు, ప్రత్యేకమైన ఫామ్‌లలో కనిపిస్తాయి. వీటి మాంసాన్ని తింటారు. చెన్నైలో వీటిని పెంచే ఫామ్ కూడా ఉంది. ఇవి అడవులు, సవన్నా గడ్డి మైదానాలలో ఎక్కువగా సంచరిస్తాయి. ఇవి 15 నుంచి 20 ఏళ్ల జీవిస్తాయి. పువ్వులు, పండ్లు, ఆకులు, లేత చిగుళ్లు, కూరగాయలు తింటాయి. నీటి అడుగున 90 నిమిషాల వరకు గడుపుతాయి.

పాఠశాలల్లో మొబైల్ ఫోన్ నిషేధం

ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

సాక్షి, అమరావతి:పాఠశాలల్లో బోధనాభ్యసన ప్రక్రియలు సజావుగా కొనసాగించడం ద్వారా ఉత్తమ ప్రమాణాలు సాధించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లోని తరగతి గదుల్లో మొబైల్ ఫోన్ల వాడకాన్ని నిషేధించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ సోమవారం సర్క్యులర్ జారీ చేశారు. బోధనకు ఎలాంటి ఆటంకం రాకుండా ఉపాధ్యాయులు, విద్యార్థుల పూర్తి ధ్యాస పాఠ్యాంశాలపైనే ఉండేలా నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల యునెస్కో విడుదల చేసిన గ్లోబల్ ఎడ్యుకేషన్ మోనిటరింగ్ రిపోర్టు ఆధారంగా పాఠశాల విద్యాశాఖ ఈ చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలు సహా ఇతర భాగస్వామ్య పక్షాలతో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నతాధికారులు చర్చించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు తాజాగా విద్యాశాఖ ఈ ఆదేశాలు జారీ చేసింది.



నిబంధనల్ని ఉల్లంఘిస్తే చర్యలు

తాజా నిబంధనల్ని పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రధానోపాధ్యాయులు, ఆ పై అధికారులు వీటిపై విద్యాశాఖ సూచించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేసింది. టెక్నాలజీ వినియోగం ద్వారా విద్యారంగంలో మంచి ఫలితాలు రాబట్టే అవకాశాలున్నా.. పాఠశాల స్థాయిలో మొబైల్ ఫోన్లను వినియోగించాల్సిన అవసరం లేదు. పైగా తరగతి గదుల్లోకి విద్యార్థులు, ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్లు తీసుకురావడం వల్ల బోధనకు ఆటంకాలు ఏర్పడుతూ ప్రతికూల ఫలితాలకు దారితీస్తుంది. నిపుణులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు కూడా విద్యాశాఖ సమావేశంలో ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బోధన సమయాల్లో తరగతి గదుల్లో ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్లు వినియోగించడం వల్ల విద్యార్థుల దృష్టి మళ్లే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని విద్యాసంస్థల్లో మొబైల్ ఫోన్ వినియోగాన్ని నియంత్రించేలా విద్యాశాఖ మార్గదర్శకాలు జారీచేసింది.

హెడ్మాస్టర్‌కు అప్పగించి..

ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చిన తరువాత తమ ఫోన్లను సైలెంట్ మోడ్‌లో ఉంచి ప్రధానోపాధ్యాయునికి అప్పగించాలి. ఉపాధ్యాయేతర సిబ్బందికీ ఇదే నిబంధన వర్తిస్తుంది. ఒకవేళ బోధనాభ్యసన ప్రక్రియల్లో భాగంగా మొబైల్ ఫోన్‌ను వినియోగించాల్సి వస్తే కనుక అది పాఠ్యప్రణాళికలోని అంశమై ఉండాలి. దీనిపై ముందుగానే ప్రధానోపాధ్యాయుని అనుమతి తీసుకోవాలి. దాన్ని రికార్డులో కూడా నమోదు చేయాలి. మొబైల్ ఫోన్లను స్టాఫ్ రూమ్‌లో నిర్ణీత ప్రదేశంలో భద్రపరిచేందుకు హెడ్మాస్టర్లు తగిన ఏర్పాట్లు చేయాలి. తప్పనిసరి ఎమర్జెన్సీ పరిస్థితుల్లో హెడ్మాస్టర్ అనుమతితో మొబైల్ ఫోన్లను వినియోగించవచ్చు.

డివైస్‌ల వాడకం ఇలా..

ప్రభుత్వం అందించిన డిజిటల్ డివైస్‌లు (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీలు, టాబ్లెట్లు తదితరాలు) తరగతి గదుల్లో వినియోగించవచ్చు. నిషేధం నుంచి వీటికి మినహాయింపు ఉంది. అయితే వీటిని కూడా పూర్తిగా అకడమిక్ వ్యవహారాల మేరకు మాత్రమే వినియోగించాలి తప్ప నాన్ అకడమిక్ వ్యవహారాలకు వాడరాదు. స్కూళ్లలో తరగతి గదుల్లో మొబైల్ ఫోన్లను ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు టీచర్లు, సిబ్బంది వినియోగించకూడదు. అయితే మొబైల్ యాప్‌ల ద్వారా విద్యార్థుల హాజరు నమోదు, మధ్యాహ్న భోజనం వివరాల నమోదు వంటి అంశాలను బోధనా సమయాల ప్రారంభానికి ముందే పూర్తి చేయాలి. బోధనా సమయాల తరువాత చేయాల్సి వస్తే హెచ్ఎం అనుమతి తీసుకోవాలి.

చర్యలు ఇలా..

ఎవరైనా మొదటిసారి నిబంధనల్ని ఉల్లంఘిస్తే కనుక ఆ టీచర్ మొబైల్ ఫోన్‌ను హెచ్ఎం ఇతర పై అధికారులు స్వాధీనం చేసుకుని తమ వద్ద ఉంచుకోవాలి. పాఠశాల సమయం చివరిలో ఫోన్ తీసుకునే ముందు మొదటి తప్పుగా భావించి మరోసారి పునరావృతం చేయబోమని హామీ ఇవ్వాలి. రెండోసారి కూడా అదే తప్పు కనుక చేస్తే హెచ్ఎం టీచర్ మొబైల్‌ను స్వాధీనం చేసుకుని ఎంఈవోకు తెలియజేయాలి. ఎంఈఓ సూచనల తరువాత టీచర్‌కు హెచ్చరికలు జారీచేసి మొబైల్ ఫోన్లను తీసుకోవడానికి అనుమతించాలి. మూడోసారి కూడా టీచర్ తరగతి గదిలోకి మొబైల్‌ను తీసుకువెళ్తే కనుక మొబైల్‌ను స్వాధీనం చేసుకుని దాన్ని డీఈవోకు పంపుతారు. తప్పుచేసిన టీచర్ డీఈవో దగ్గరకు వెళ్లి మాట్లాడిన అనంతరం ఆ తప్పును సర్వీసు రికార్డులో నమోదు చేశాక మొబైల్‌ను తీసుకోవడానికి అనుమతిస్తారు. ఈ నిబంధనలన్నీ కచ్చితంగా అమలు జరిగేలా పైస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలి. తరగతి గదుల్లో ఎవరైనా టీచర్ మొబైల్ వినియోగిస్తున్నట్టు విద్యార్థులు, తలిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తే స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బాధ్యత వహించాల్సి ఉంటుంది. స్కూళ్లను పై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. ఎక్కడైనా లోపాలుంటే వాటిని నోటీసు పుస్తకాల్లో నమోదు చేసేలా చూడాలి. నోటీసు పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలన చేయాలి.

క్లుప్తంగా...

జపాన్ చందమామ ల్యాండర్ ప్రయోగం వాయిదా

టోక్యో: చందమామపై తొలిసారిగా అడుగుపెట్టాలన్న జపాన్ లక్ష్యం చివరి నిమిషంలో సాకారం కాలేదు. జాబిల్లి ఉపరితలంపై ల్యాండర్‌ను సురక్షితంగా దించి, పరిశోధనలు చేయడమే లక్ష్యంగా జపాన్ చేపట్టిన మూన్ ల్యాండర్ రాకెట్ ప్రయోగం వాయిదా పడింది. జాక్సా టానేగాషిమా స్పేస్ సెంటర్‌లోని యోషినోబు లాంచ్ కాంప్లెక్స్ నుంచి సోమవారం ఉదయం 9.26 గంటలకు హెచ్2-ఏ రాకెట్‌ను ప్రయోగించాల్సి ఉన్నది. ప్రతికూల వాతావరణం కారణంగా లాంచింగ్‌కు 27 నిమిషాల ముందు ఈ ప్రయోగాన్ని వాయిదా వేసినట్లు జపాన్ అంతరిక్ష పరిశోధనా సంస్థ 'జాక్సా' తెలియజేసింది. ప్రయోగ కేంద్రం వద్ద తీవ్రస్థాయిలో బలమైన గాలులు వీచడం, ఉపరితల వాతావరణంలో అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం వల్లే వాయిదా పడినట్లు తెలుస్తోంది. తదుపరి ప్రయోగ తేదీని ఇంకా ఖరారు చేయలేదు. సెప్టెంబర్ 15వ తేదీ తర్వాత తదుపరి ప్రయోగం ఉండొచ్చని సమాచారం. చంద్రుడిపై పరిశోధనల కోసం అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా), యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ సహకారంతో సాఫ్ట్ ల్యాండర్ ఫర్ ఇన్వెస్టిగేటింగ్ మూన్(స్లిమ్) అనే లూనార్ ప్రోబ్‌ను జపాన్ అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగం విజయవంతమైతే చంద్రుడిపై ల్యాండర్‌ను క్షేమంగా దించిన ఐదో దేశంగా జపాన్ రికార్డు సృష్టిస్తుంది. అయితే ప్రయోగించిన 4 నెలల తర్వాత ఈ స్పేస్‌క్రాఫ్ట్ చంద్రుడి కక్ష్యలోకి చేరనుంది. ఇదిలా ఉండగా, హెచ్-2ఏ రాకెట్ ద్వారా ఇప్పటిదాకా 46 ప్రయోగాలు చేయగా, అందులో 45 ప్రయోగాలు విజయవంతమయ్యాయి.


జీ20 సదస్సుకు హాజరు కాలేకపోతున్నా



న్యూఢిల్లీ: భారత్‌లో వచ్చే నెలలో జరిగే జీ20 కీలక సదస్సుకు తాను హాజరు కాలేకపోతున్నానని రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భారత్, రష్యా ద్వైపాక్షిక సహకారం, ఇతర ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ఇటీవల దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన 'బ్రిక్స్' సదస్సు ప్రస్తావనకు వచ్చింది. సెప్టెంబర్ 9, 10న జరిగే జీ20 సదస్సుకు హాజరయ్యే విషయంలో తన అశక్తతను పుతిన్ తెలియజేశారు. ఈ సదస్సుకు రష్యా తరఫున తమ విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ హాజరవుతారని పేర్కొన్నారు. జీ20కి సారథ్యంలో భాగంగా భారత్ నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నందుకు గాను పుతిన్‌కు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. బ్రిక్స్ సదస్సుకు కూడా పుతిన్ హాజరు కాలేదు.

అయ్యో పాపం నెప్ట్యూన్... మేఘాలన్నీ మటుమాయం

2002 నుంచి 2023 వరకు మేఘాలు మాయమైన తీరు



అవున్నిజమే! నెప్ట్యూన్ మీది మేఘాలన్నీ ఎవరో మంత్రం వేసినట్టు ఉన్నట్టుండి మటుమాయం అయిపోయాయి. ఈ వింతేమిటి? అందుకు కారణమేమిటి...?

నెప్ట్యూన్ మీది మేఘాలన్నీ ఉన్నట్టుండి అమాంతంగా తుడిచిపెట్టుకుపోయాయి. సూర్యుని 11 ఏళ్ల ఆవర్తన చక్రం ప్రభావమే ఇందుకు కారణం కావచ్చని సైంటిస్టులు భావిస్తున్నారు. సాధారణంగా సూర్యుని చురుకుదనం అత్యంత ఎక్కువగా ఉన్నప్పుడు నెప్ట్యూన్ మీద మేఘాల పరిమాణమూ చాలా ఎక్కువగా ఉంటుంది. అతి తక్కువగా ఉన్నప్పుడు అవి దాదాపుగా లుప్తమైపోతాయి. ఇది సాధారణ దృగ్విషయమే. అయితే గత కొన్నేళ్లుగా ఆ గ్రహం మీద మేఘాలన్నవే లేకుండా పోవడం ఆశ్చర్యంగా ఉందని వారు చెబుతున్నారు.

ఏమిటి కారణం?

- సూర్యరశ్మి నెప్ట్యూన్ వాతావరణపు పై పొరను తాకినప్పుడు అక్కడ మేఘాల సంఖ్యలో హెచ్చుతగ్గుల క్రమం వేగం పుంజుకుంటూ ఉంటుంది.
- సౌర శక్తి వల్ల అక్కడ మీథేన్ మేఘాలు ఏర్పడటంతో పాటు పలు రసాయనాలు కూడా పుడతాయి.
- 11 ఏళ్ల సౌర ఆవర్తన క్రమమే ఇందుకు కారణం కావచ్చన్నది సైంటిస్టుల అంచనా.
- కానీ సౌర కుటుంబంలో సూర్యునికి సుదూరంగా ఉండే గ్రహాల్లో నెప్ట్యూన్ ఒకటి. దానికంటే దూరంగా ఉండేది ప్లూటో మాత్రమే!
- దాంతో నెప్ట్యూన్‌కు అందే సూర్యరశ్మి భూమికి అందే దానిలో ఒక్కటంటే ఒక్క వంతు మాత్రమే!
- నెప్ట్యూన్ నుంచి చూస్తే సూర్యుడు మిలమిల మెరిసే ఒక చిన్న నక్షత్రంలా కనిపిస్తాడు తప్ప మనకు కనిపించేంత భారీ పరిమాణంలో కాదు.
- అలాంటప్పుడు నెప్ట్యూన్ మీద మేఘాలు సమూలంగా మాయం కావడానికి సౌర ఆవర్తన చక్రమే ఏకైక కారణమా, ఇంకా వేరే ఏమన్నా ఉన్నాయా అన్నది తెలుసుకునే ప్రయత్నంలో నాసా సైంటిస్టులు ఇప్పుడు బిజీగా ఉన్నారు.

\- నేషనల్ డెస్క్, సాక్షి

వేడెక్కాల్సింది పోయి... చల్లబడుతోంది

నెప్ట్యూన్ దక్షిణార్ధ భాగం గత 15 ఏళ్లుగా క్రమంగా చల్లబడుతోందట. అందులో ఆశ్చర్యం ఏముందంటారా? ఉంది...

- ఎందుకంటే... ఈ సమయంలో ఆ ప్రాంతం నిజానికి క్రమంగా వేడెక్కాలి.
- 2003 నుంచి అందుబాటులో ఉన్న డేటా ప్రకారం ఆ బుల్లి గ్రహం మీద వేసవి నానాటికీ తగ్గిపోతూ వస్తోంది.
- హబుల్‌తో పాటు ప్రపంచంలోని పలు అతిపెద్ద టెలిస్కోప్‌లు అందించిన డేటాను విశ్లేషించిన మీదట ఈ ఆసక్తికరమైన అంశం వెలుగులోకి వచ్చింది.
- అదే సమయంలో నెప్ట్యూన్ దక్షిణ ధ్రువం మాత్రం ఉష్ణోగ్రతలు 2018-2020 మధ్య కాలంలో ఏకంగా 11 డిగ్రీలు పెరిగిపోవడం విశేషం
- ఇది నిజంగా ఆశ్చర్యమే. ఎందుకంటే నెప్ట్యూన్ సూర్యుని చుట్టూ ఒక్కసారి తిరగడానికి మన లెక్కలో 165 ఏళ్లు పడుతుంది.
- గత 15 ఏళ్లలో అక్కడి ఉష్ణోగ్రత కనీసం 8 డిగ్రీ సెల్సియస్ మేరకు తగ్గిందట.
- అక్కడ ఒక్కో సీజన్ ఏకంగా 40 ఏళ్లుంటుంది.
- ఈ నేపథ్యంలో నెప్ట్యూన్ మీద ఇంతటి పరస్పరం విరుద్ధమైన వాతావరణ పరిస్థితులు చోటుచేసుకోవడం విచిత్రమేనని సైంటిస్టులు అంటున్నారు.



రోవర్ తప్పించుకున్న బిలం ఇదే..　　దారిమళ్లిన రోవర్ గుర్తులు

రోవర్‌కు తప్పిన ప్రమాదం

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చంద్రుడిపై పరిశోధనలకు పంపిన రోవర్‌కు చంద్రుడిపై పెద్ద ప్రమాదం తప్పింది. ల్యాండర్ నుంచి విడుదలైన రోవర్ చంద్రుడిపై తిరుగుతూ పలు రకాల పరిశోధనలు చేస్తూ భూనియంత్రిత కేంద్రాలకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉంది. రోవర్ ప్రయాణిస్తున్న మార్గంలో సుమారు నాలుగు మీటర్లు వెడల్పయిన బిలాన్ని గుర్తించింది. అయితే, బిలాన్ని మూడుమీటర్ల దూరంలో ఉండగానే రోవర్ గుర్తించిందని ఇస్రో తెలిపింది. ప్రమాదవశాత్తూ ఆ బిలంలో పడి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని పేర్కొంది. ప్రత్యేక ఆదేశాలతో మరో దారిని రోవర్ ఎంచుకుందని వివరించింది. ప్రస్తుతం రోవర్ సురక్షితమైన మార్గంలో ముందుకు సాగుతోందని ఇస్రో సోమవారం ఎక్స్(ట్విట్టర్)లో పేర్కొంది.

2న ఆదిత్య-ఎల్1 ప్రయోగం

ఏర్పాట్లు పూర్తి చేశామన్న ఇస్రో

బెంగళూరు: చంద్రయాన్-3 మిషన్ ఘన విజయంతో భారత అంతరిక్ష అధ్యయన సంస్థ (ఇస్రో) మరో ప్రయోగానికి సిద్ధమయింది. సౌర వాతావరణంపై అధ్యయనానికి ఉద్దేశించిన ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని శ్రీహరి కోట నుంచి పీఎస్ఎల్వీ సీ57 వాహక నౌక ద్వారా సెప్టెంబర్ రెండో తేదీన ఉదయం 11.50 గంటలకు ప్రయోగించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. బెంగళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో పూర్తి దేశీయంగా అభివృద్ధి పరిచిన ఈ శాటిలైట్‌ను రెండు వారాల క్రితమే శ్రీహరి కోటకు తరలించారు. సూర్యుడి వెలుపల పొరలు, ఫొటోస్ఫియర్ (కాంతి మండలం) క్రోమోస్పియర్ (వర్ణ మండలం), కరోనా వలయంలో పెరుగుతున్న వేడి వంటి వాటిపై ఆదిత్య-ఎల్1 అధ్యయనం జరుపుతుంది. సౌర వాతావరణంతోపాటు అంతరిక్ష వాతావరణం, భూ వాతావరణంపై దాని ప్రభావాన్ని ఇది అధ్యయనం చేస్తుందని ఇస్రో సోమవారం వెల్లడించింది.

నిరాటంకంగా పరిశోధనలు

భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలో వున్న సూర్య వలయం లాంగ్రేజ్ పాయింట్-1 (ఎల్1) చుట్టూ ఉన్న కక్ష్యలోకి ఈ ఉపగ్రహాన్ని ప్రవేశపెడతారు. భూమి నుంచి లాంగ్రేజ్ పాయింట్‌కి చేరుకోవడానికి ఆదిత్య ఉపగ్రహానికి 175 రోజులు పడుతుంది. లాంగ్రేజ్ పాయింట్ల వద్ద ఉపగ్రహాలు తక్కువ ఇంధనాన్ని వినియోగించుకుని నిర్దేశిత కక్ష్యలో ఎక్కువ కాలం కొనసాగడంతోపాటు నిర్దేశిత లక్ష్యాలను అందుకునే అవకాశముంటుందని అంచనా. ఈ కక్ష్యలో ఉండే ఆదిత్య-ఎల్1కు గ్రహణాలు, ఇతర గ్రహాలు అడ్డురావు. పరిశోధనలను నిరాటంకంగా జరిపేందుకు వీలుగా ఉంటుందని ఇస్రో తెలిపింది.

స్వదేశీ పరిజ్ఞానంతో..

సుమారు 1,500 కేజీల బరువైన ఈ శాటిలైట్‌లో ఏడు పేలోడ్లు ఉన్నాయి. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్(ఐఐఏ) ఆధ్వర్యంలో విజిబుల్ ఎమిషన్ లైన్ కొరోనాగ్రాఫ్(వీఈఎల్‌సీ) పేలోడ్‌ను తయారు చేసింది. పుణేలోని ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ శాస్త్రవేత్తలు సోలార్ అల్ట్రా వయోలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్(ఎస్‌యూఐటీ)ని తయారు చేశారు. సూర్యుడి ఉపరితలంపై 6వేల డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత మాత్రమే కాగా, కొరోనా వద్ద 10 లక్షల డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉండటానికి కారణాలపై వీఈఎల్‌సీ వివరాలు సేకరించనుందని ఇస్రో వివరించింది. యూవీ పేలోడ్‌ను, ఎక్స్‌రే పేలోడ్స్‌ను వినియోగించుకుంటూ కొరోనాతోపాటు సోలార్ క్రోమోస్పియర్‌లపై ఆదిత్య-ఎల్1 పరిశీలనలు జరపనుంది. స్పెషల్ వాంటేజ్ పాయింట్ ఎల్1ను ఉపయోగించుకుని నాలుగు పేలోడ్లు సూర్యుడిపై ప్రత్యక్ష పరిశీలన జరుపుతాయి. మిగతా మూడు పేలోడ్లలో అమర్చిన పరికరాలు సూర్య కణాలపై పరిశోధనలు సాగిస్తాయి. కొరోనాలో ఉండే మితిమీరిన ఉష్ణోగ్రతలు, కొరోనల్ మాస్ ఇంజెక్షన్(సీఎంఈ), అంతరిక్ష వాతావరణం వంటి వాటిపైనా ఎస్‌యూఐటీ అత్యంత కీలకమైన సమాచారం పంపుతుందని ఆశిస్తున్నట్లు ఇస్రో పేర్కొంది.

వేగవంతమైన వృద్ధి బాటలో మన ఆర్థికం

- త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్
- ఆటోమొబైల్, ఫార్మా, పర్యాటక రంగాల్లో కొత్త ఉద్యోగాలు
- రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ
- వివిధ రంగాల్లో 51,000 మందికి నియామక పత్రాలు



న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన వృద్ధి బాటలో పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. దేశంలో యువతకు భారీ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. సోమవారం రోజ్‌గార్ మేళాలో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. కేంద్ర పారామిలటరీ దళాలు, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, ఢిల్లీ పోలీసు శాఖలో ఉద్యోగాలు పొందిన 51,000 మందికిపైగా యువతకు ఈ సందర్భంగా నియామక పత్రాలు అందజేశారు. ఆటోమొబైల్, ఫార్మాస్యూటికల్, పర్యాటకం, ఆహార శుద్ధి రంగాల్లో మరింత వృద్ధి నమోదవుతుందని, యువతీ యువకులకు భారీ సంఖ్యలో కొత్త ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేస్తున్నట్లు మోదీ తెలిపారు. మన దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగంగా పురోగమిస్తోందని చెప్పారు. త్వరలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం ఖాయమని పునరుద్ఘాటించారు. అభివృద్ధి ఫలాలు సామాన్య ప్రజలకు అందుతాయని అన్నారు. అన్ని రంగాల అభివృద్ధితోనే ఆర్థిక వ్యవస్థ ముందడుగు వేస్తుందని చెప్పారు.

కోట్లాది కొత్త కొలువులు

దేశంలో 2030 నాటికి టూరిజం రంగంలో కొత్తగా దాదాపు 14 కోట్ల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని, దేశ ఆర్థిక వ్యవస్థలో ఈ రంగం వాటా రూ.20 లక్షల కోట్లకు చేరుతుందని ప్రధాని మోదీ వివరించారు. ఫార్మాస్యూటికల్ రంగం వాటా రూ.4 లక్షల కోట్లుగా ఉందని, 2030 నాటికి ఇది రూ.10 లక్షల కోట్లకు చేరుతుందని వెల్లడించారు. ఫార్మా రంగంలో యువత అవసరం ఎంతో ఉందన్నారు. ఆటోమొబైల్ రంగంలోనూ యువ శక్తి భాగస్వామ్యం కీలకమని చెప్పారు. ఆహార శుద్ధి రంగం విలువ ప్రస్తుతం రూ.26 లక్షల కోట్లుగా ఉందని, మరో మూడున్నరేళ్లలో ఇది ఏకంగా రూ.35 లక్షల కోట్లకు చేరుతుందని స్పష్టం చేశారు. ఆహార శుద్ధి పరిశ్రమ విస్తరిస్తున్నకొద్దీ కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుతూనే ఉంటుందని ఆయన అన్నారు.

ఇక 'మేడ్ ఇన్ ఇండియా' ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు

సుపరిపాలన, చట్టబద్ధ పాలన ఉన్న రాష్ట్రాల్లో పెట్టుబడులు వెల్లువెత్తుతాయని, అందుకు ఉత్తరప్రదేశ్ ఒక ఉదాహరణ అని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పెట్టుబడులు రావాలంటే శాంతిభద్రతలు ఉండాలన్నారు. వేగవంతమైన అభివృద్ధి కనిపించాలన్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో విశ్వాసం ఉండాలన్నారు. నేరాల రేటు అధికంగా ఉన్న రాష్ట్రాలకు పెట్టుబడులు పెద్దగా రావడం లేదని, ఉద్యోగ అవకాశాలు పడిపోతున్నాయని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. గత తొమ్మిదేళ్లుగా కేంద్ర ప్రభుత్వ కృషి వల్ల మార్పు కనిపిస్తోందన్నారు. గత ఏడాది రికార్డు స్థాయిలో ఎగుమతులు జరిగాయన్నారు. వస్తూత్పత్తి ఊపందుకుందని, ఉద్యోగాల సంఖ్య పెరగడంతో కుటుంబాల ఆదాయం పెరిగినట్లు మోదీ తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాల తయారీపై దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. మేడ్ ఇన్ ఇండియా ల్యాప్‌టాప్‌లు, వ్యక్తిగత కంప్యూటర్లు ప్రపంచ మార్కెట్లను ముంచెత్తే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. పారా మిలటరీ దళాల్లో కొత్తగా చేరిన వారిని మోదీ 'అమృత్ రక్షకులు'గా అభివర్ణించారు.

నూహ్‌లో ప్రశాంతంగా పూజలు

నూహ్(హరియాణా): సర్వజాతీయ హిందూ మహాపంచాయత్ సంస్థ సోమవారం నూహ్‌లో తలపెట్టిన శోభాయాత్రను అధికారులు అడ్డుకున్నారు. జూలై 31న నూహ్‌లో మత కలహాలు చెలరేగిన నేపథ్యంలో హరియాణా ప్రభుత్వం తాజాగా శోభాయాత్రకు అనుమతి నిరాకరించింది. మల్హర్, ఝిర్, శింగార్ శివాలయాల్లో పూజలు మాత్రం చేసుకోవచ్చని తెలిపింది. దీంతో, అధికారులు ఢిల్లీ-గురుగ్రామ్ సరిహద్దుల నుంచి నూహ్ వరకు అయిదు ప్రధాన చెక్ పాయింట్లను పోలీసులు ఏర్పాటు చేశారు. శోభాయాత్రలో పాల్గొనేందుకు అయోధ్య నుంచి బయలుదేరిన జగద్గురు పరమహంస ఆచార్య తదితరుల బృందాన్ని సోహ్నా వద్ద ఘమోర్జ్ టోల్ ప్లాజా వద్ద నిలిపివేశారు. అనంతరం అధికారులు నూహ్ జిల్లాలోకి అనుమతించిన 15 మంది సాధువులు, ఇతర హిందూ నేతలు సుమారు 100 మంది నల్హర్‌లోని శివాలయంలో జలాభిషేక పూజలు చేశారు. అక్కడ్నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో ఫిరోజ్‌పూర్‌లోని ఝిర్కా ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. శింగార్ ఆలయానికి కూడా వెళ్లారని అధికారులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని పోలీసులు వెల్లడించారు. ఇలా ఉండగా, సోమవారం సోహ్నా నుంచి నూహ్ వరకు పరిసరాలు నిర్మానుష్యంగా మారాయి. దుకాణాలేవీ తెరుచుకోలేదు. అధికారులు ముందు జాగ్రత్తగా విద్యాసంస్థలు, బ్యాంకులకు సెలవు ప్రకటించారు. మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు.

బీజేపీ మళ్లీ గెలిస్తే దేశంలో నియంత పాలనే



కోల్‌కతా: దేశంలో బీజేపీ వరుసగా మూడోసారి అధికారంలోకి వస్తే నియంతృత్వమే రాజ్యమేలుతుందని, అరాచకం తప్పదని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ) అధినేత, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. బీజేపీ దేశంలో మతాల మధ్య, కులాల మధ్య శత్రుత్వాన్ని పెంచిందని మమత మండిపడ్డారు. బీజేపీ గనుక మళ్లీ గెలిస్తే ప్రజల నడుమ విద్వేషాలు మరింత రగులుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్‌లో మూడు దశాబ్దాల కమ్యూనిస్టుల పాలనను అంతం చేశానని, వచ్చే ఎన్నికల్లో బీజేపీని సైతం మట్టికరిపిస్తానని చెప్పారు. వచ్చే ఏడాది జరగాల్సిన లోక్‌సభ ఎన్నికలు ఈ ఏడాది డిసెంబర్‌లోనే జరిగే అవకాశం ఉందని ఆమె తెలిపారు. డిసెంబర్‌లో ఎన్నికలకు బీజేపీ మొగ్గు చూపుతున్నట్లు చెప్పారు. ఒకవేళ అది సాధ్యం కాకపోతే వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు. ఎన్నికల ప్రచారం కోసం బీజేపీ నాయకులు ఇప్పటికే దేశంలోని అన్ని హెలికాప్టర్లను బుక్ చేసుకున్నారని వెల్లడించారు. ఇతర పార్టీలకు హెలికాప్టర్లు లభించకూడదన్నదే బీజేపీ ఎత్తుగడ అని విమర్శించారు. సోమవారం కోల్‌కతాలో టీఎంసీ యువజన విభాగం ర్యాలీలో మమతా బెనర్జీ ప్రసంగించారు.



మిస్ వరల్డ్ 2022 కరోలినా బియెలాస్కా సోమవారం జమ్మూకశ్మీర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీనగర్‌లో కశ్మీరీ సంప్రదాయ దుస్తుల్లో ఇలా ఫొటోలకు పోజిచ్చారు. ఆమె వెంట మిస్ వరల్డ్ ఇండియా సిని షెట్టీ తదితరులున్నారు.

42 ఏళ్లకు అమ్మను చూశాడు!

వాషింగ్టన్: దక్షిణ అమెరికా దేశం చిలీలో నెలలు నిండకుండానే జన్మించిన ఓ శిశువు అపహరణకు గురయ్యాడు. కిడ్నాపర్లు ఆ శిశువును అమెరికాకు చెందిన దంపతులకు దత్తతకిచ్చేశారు. ఇది జరిగి 42 ఏళ్లయింది. ప్రస్తుతం అతడి పేరు జిమ్మీ లిపర్ట్ థైడెన్. అమెరికాలోని వర్జీనియా రాష్ట్రం ఆష్‌బర్న్‌లో ఉంటూ లాయర్‌గా పనిచేస్తున్నాడు. కాగా, 1970, 80ల్లో నియంత పినోచెట్ హయాంలో చిలీలో వందలాదిగా శిశువులు అపహరణకు గురయ్యారు. ఓ స్వచ్ఛంద సంస్థ సాయంతో వారిలో కొందరు తిరిగి కన్నవారి చెంతకు చేరుతున్నారనే వార్తను మొన్న ఏప్రిల్‌లో థైడెన్ చూశాడు. ఆ సంస్థను సంప్రదించి తన డీఎన్ఏ వివరాల సాయంతో కన్న తల్లి జాడ కనుక్కున్నాడు. తోబుట్టువులు కూడా ఉన్నట్లు తెలిసింది. ఇంకేముంది? భార్య, ఇద్దరు పిల్లలను తీసుకుని చిలీలోని వల్దీవియాలో ఉండే తల్లి మరియా అంజెలికా గొంజాలెజ్ వద్దకు వెళ్లాడు. 'హాస్పిటల్ సిబ్బంది నెలలు నిండని నా కొడుకు చనిపోయాడని చెప్పగా విని, గుండెలవిసేలా రోదించాను. నా చిన్నారి ఎక్కడున్నా సుఖంగా ఉండాలని దేవుణ్ని కోరుకున్నా. నా ప్రార్థన ఫలించింది'అంటూ ఆమె కొడుకును హత్తుకుంది. తల్లి, కొడుకు కలుసుకున్న వేళ ఆ ఊరంతా పండగ చేసుకుంది.

రోజ్‌గార్ మేళా.. ఒక గిమ్మిక్కు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేకపోయారని కాంగ్రెస్ ఆరోపించింది. ఎన్నికల సమయంలో ఇమేజీని కాపాడుకునేందుకే ఆయన ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నారని విమర్శించింది. ఉద్యోగ మేళాలు ఒక గిమ్మిక్కని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే వ్యాఖ్యానించారు. రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ప్రకటించిన ప్రధాని మోదీ కేవలం కొన్ని వేల మందికి మాత్రమే నియామక కార్డులు పంపిణీ చేశారని అన్నారు.

విమానంలో రెండేళ్ల చిన్నారికి ఎయిమ్స్ వైద్యుల ప్రాణదానం

న్యూఢిల్లీ: పుట్టుకతో గుండె సంబంధిత సమస్య ఉన్న రెండేళ్ల పాప విమానంలో ప్రయాణిస్తుండగా హఠాత్తుగా శ్వాస పీల్చడం కష్టసాధ్యంగా మారింది. ఆ చిన్నారి శరీరం చల్లబడటంతోపాటు పెదవులు, వేళ్ల రంగు మారింది. ఈ విషయం గుర్తించిన విమాన సిబ్బంది అప్రమత్తమయ్యారు. అదే విమానంలో ప్రయాణిస్తున్న వైద్యుల సహాయాన్ని కోరారు. వారు ఆ పాపకు చికిత్స అందించి, ప్రాణదానం చేశారు. బెంగళూరు నుంచి ఢిల్లీకి బయలుదేరిన విస్తారా విమానంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఢిల్లీలోని ప్రఖ్యాత 'ఎయిమ్స్'కు చెందిన ఐదుగురు వైద్యులు బెంగళూరులో ఓ సెమినార్‌కు హాజరై విమానంలో ఢిల్లీకి తిరిగి బయలుదేరారు. అదే విమానంలో ఉన్న చిన్నారి శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించి, వెంటనే సీపీఆర్ ప్రారంభించారు. విమానంలో ఉన్న పరిమిత వనరులతోనే ఆ చిన్నారికి చికిత్స అందించారు. చికిత్సతో చిన్నారి శ్వాస తీసుకోవడం ప్రారంభించింది. ఇంతలోనే ఒకసారి గుండెపోటుకు గురైంది. ఎయిమ్స్ వైద్యులు ఆమెకు ఏఈడీ పరికరంతో చికిత్స అందించారు. ప్రాణాలు నిలబెట్టారు. మెడికల్ ఎమర్జెన్సీ నేపథ్యంలో విమానాన్ని మహారాష్ట్రలోని నాగపూర్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేశారు. అంబులెన్స్‌లో చిన్నారిని వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. ప్రాణాపాయం నుంచి బయటపడిన పాప ప్రస్తుతం సురక్షితంగా ఉంది. ఈ విషయాన్ని ఢిల్లీ ఎయిమ్స్ 'ఎక్స్'లో పోస్టు చేసింది. శ్వాస దాదాపు ఆగిపోయి, ఆ తర్వాత గుండెపోటుకు గురైన పాపను తమ వైద్యులు కాపాడినట్లు వెల్లడించింది.

కొచ్చి-బెంగళూరు విమానానికి బాంబు బెదిరింపు

కొచ్చి: ఇండిగో విమానయాన సంస్థకు చెందిన కొచ్చి-బెంగళూరు విమానంలో బాంబు ఉందంటూ వచ్చిన బెదిరింపు కాల్‌తో అధికారులు హైరానా పడ్డారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు బయలుదేరాల్సిన విమానంలో పూర్తి స్థాయి తనిఖీలు చేపట్టారు. ఎటువంటి బాంబు లేదని తేల్చారు. అనంతరం మధ్యాహ్నం 2.24 గంటలకు బెంగళూరుకు బయలుదేరింది. 6ఈ6482 విమానం మొత్తం 139 మంది ప్రయాణికులతో కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం ఉదయం బయలుదేరేందుకు సిద్ధంగా ఉంది. అంతలోనే, ఆ విమానంలో బాంబు ఉందంటూ గుర్తు తెలియని వ్యక్తి ఇంటర్నెట్ ద్వారా అధికారులకు ఫోన్ కాల్ చేశాడు. దీంతో, అధికారులు వెంటనే భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రయాణికులందరినీ కిందికి దించివేశారు. వారికి చెందిన లగేజీని కూడా క్షుణ్నంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వస్తువేదీ లేదని ధ్రువీకరించుకున్నారు. అనంతరం 2.24 గంటల సమయంలో ఆ విమానం తిరిగి బెంగళూరుకు టేకాఫ్ అయ్యింది. బాంబు బెదిరింపుపై కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సాంకేతిక సమస్యతో యూకేలో నిలిచిన విమానాలు

లండన్: సాంకేతిక సమస్య కారణంగా యూకేకు వెళ్లాల్సిన, అక్కడి నుంచి ఇతరదేశాలకు వెళ్లే విమాన సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో, వేలాది మంది ప్రయాణికులు ఎక్కడివారక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. బ్రిటిష్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థల్లో సమస్య ఇందుకు కారణమని అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్టుల్లో భద్రతా నిర్వహణ కోసం ట్రాఫిక్‌పై నియంత్రణలను విధించినట్లు యూకే నేషనల్ ఎయిర్ ట్రాఫిక్ సర్వీసెస్ తెలిపింది. అయితే, సమస్యకు కారణం, ఎప్పటివరకు పరిష్కారమవుతుందనే విషయం సంస్థ తెలపలేదు. సమస్యను సాధ్యమైనంత త్వరంగా పరిష్కరించేందుకు తమ ఇంజనీర్లు కృషి చేస్తున్నారని తెలిపింది. యూకే గగనతలాన్ని మాత్రం మూసివేయలేదని స్పష్టతనిచ్చింది.

ముంబైలో జరిగే 'ఇండియా' భేటీకి సోనియా

ముంబై: త్వరలో ముంబైలో జరిగే ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నేతల మూడో సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ హాజరుకానున్నారు. మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే సోమవారం ఈ విషయం వెల్లడించారు. ఆగస్టు 31, సెప్టెంబర్ ఒకటో తేదీల్లో ముంబై శివారులోని ఓ లగ్జరీ హోటల్‌లో నేతలు భేటీ కానున్నారు. డజనుకుపైగా పార్టీల కీలక నేతలు ఈ సమావేశంలో పాల్గొంటారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఎజెండాపై చర్చించడంతోపాటు ఇండియా కూటమి అధికారిక లోగోను ఖరారు చేయనున్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం । 29 । ఆగస్టు । 2023



అనుబంధం

అన్నదమ్ములకు కట్టడం కోసం సోమవారం బెళగావిలో రాఖీలు కొనుగోలు చేస్తున్న ఓ వృద్ధురాలు. ఈ నెల 30న రక్షాబంధనం పర్వదినం రానుంది

న్యూస్‌రీల్

ఆరు షాపులు బుగ్గి



కాలిన దుకాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గౌరిబిదనూరు: నగరంలోని మానస సర్కిల్ లో ఉన్న గుజరి, ఆటోమొబైల్, వాటర్ సర్వీస్, ఆటో కన్సల్టెన్సీ, బ్యాటరీ షాప్, కార్ స్కూటర్ గ్యారేజీలు కాలిపోయాయి. అందులోని సామగ్రి బుగ్గి కావడంతో సుమారు రూ. 20 లక్షల నష్టం వాటిల్లింది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో షాపుల్లో మంటలు చెలరేగాయి. స్థానికులు చూసి కేకలు వేయడంతో ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఐదారు షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సోమవారం ఉదయం ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ వచ్చి పరిశీలించి, కలెక్టర్‌కు నష్టంపై నివేదిక పంపాలని నష్టపరిహారం లభించేలా చూస్తానని అధికారులకు, యజమానులకు సూచించారు. కాగా అగ్నిప్రమాదం ఎలా జరిగిందన్నది తెలియాల్సి ఉంది. కరెంటు షార్ట్ సర్క్యూటా, మరేదైనా కారణం ఉందా అనేది విచారణ చేపట్టారు.

దాడి కేసులో మెడికో అరెస్టు

యశవంతపుర: స్నేహితునితో వెళుతున్న యువతిని నిందించటంతో పాటు, వీడియో చిత్రీకరించి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన కేసులో బెంగళూరు తూర్పు విభాగం సైబర్‌క్రైం పోలీసులు ఒక మెడికల్ విద్యార్థిని అరెస్ట్ చేశారు. కోలారు జిల్లా బంగారపేటకు చెందిన యువతి (21) ఫిర్యాదు చేసింది. రష్యాలో మెడిసిన్ చదువుతున్న నిందితుడు రెండునెలల పాటు సెలవుతో బెంగళూరుకు వచ్చారు. గోవిందపురలోని అక్క ఇంటికి వచ్చాడు. స్నేహితునితో కలిసి బైకుపై ఇంటర్వ్యూకి వెళుతున్న యువతిని అడ్డగించి నిందించి, వీడియో తీసి సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేశాడు. మానసికంగా ఆందోళనకు గురైన యువతి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయటంతో నిందితుడిని అరెస్ట్ చేశారు.

అన్నదాత ఆత్మహత్య



మైసూరు: అప్పుల భారంతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మైసూరు జిల్లా హుణసూరు తాలూకా మూకనహళ్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు రుద్రేగౌడ (56) ఆత్మహత్య చేసుకున్నాడు. రుద్రేగౌడ తన మూడు ఎకరాల పొలంలో పంటల సాగు కోసం బ్యాంకులో రూ. 3 లక్షల అప్పు తీసుకున్నాడు. రాగులు, పొగాకు సాగు చేశాడు. పంటలు సరిగా రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక దిక్కు తోచని స్థితిలో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నీట్ రద్దు కోసం డిమాండ్లు



శివాజీనగర: తమిళనాడు తరహాలోనే రాష్ట్రంలో కూడా నీట్ పరీక్షలు రద్దు చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. దేశంలోనే అత్యధిక మెడికల్ సీట్లు కలిగిన రాష్ట్రాల్లో కర్ణాటక 2వ స్థానం ఉంది. అయితే సీట్లు మాత్రం అతి తక్కువ స్థాయి లభిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని ప్రతిభావంత విద్యార్థులకు వైద్యవిద్యలోకి ప్రవేశించలేకపోతున్నారనే నినాదాలు బలంగా వినిపిస్తున్నాయి. కర్ణాటకలో ప్రైవేట్ కాలేజీల నుండి 6,995, ప్రభుత్వ కాలేజీల నుండి 3,150 సీట్లతో పాటుగా మొత్తం 10,145 మెడికల్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. 10,725 సీట్లను కలిగిఉన్న తమిళనాడు తొలి స్థానంలో ఉండగా, కర్ణాటక 2వ స్థానంలో 9,895 సీట్లను కలిగిఉన్న మహారాష్ట్ర 3వ స్థానంలో, 9,053 సీట్లను కలిగిఉన్న ఉత్తరప్రదేశ్ 4వ స్థానంలో ఉంది. ఇటీవల జరిగిన సీఈటీ పరీక్షల్లో రాష్ట్రంలో 2 వేల మంది విద్యార్థులకు మాత్రం లభించే అవకాశముంది. మిగతా 8 వేలకు పైగా సీట్లు ఇతర రాష్ట్రాల పాలవుతాయని అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. కొన్ని రాష్ట్రాలు నీట్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ చేయించి ర్యాంకింగ్‌లో అధిక స్థానాలు పొందేటట్లు చూసుకొంటున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మలబార్ షోరూం ప్రారంభం



బనశంకరి: ప్రముఖ జ్యువెలరీ రిటైలర్ మలబార్‌గోల్డ్ అండ్ డైమండ్స్ నగరంలో మారతహళ్లి స్టోర్‌ను పునః ప్రారంభించింది. కన్నడ నటి శ్రీనిధి శెట్టి, మలబార్ గ్రూప్ చైర్మెన్ ఎంపీ అహ్మద్, కర్ణాటక రీజినల్ హెడ్ పిల్సర్‌బాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్షణాల్లో మృత్యుకేళి

- కనకపుర వద్ద ఆర్టీసీ బస్సు ఢీ
- క్వాలిస్‌లోని ఆరుగురు దుర్మరణం
- మృతుల్లో విధానసౌధ ఉన్నతాధికారి, సిబ్బంది
- బస్సులోని కొందరికి గాయాలు





దుర్ఘటనలో ధ్వంసమైన బస్సు ముందు భాగం,



తుక్కయిన క్వాలిస్ కారు

దొడ్డబళ్లాపురం: దైవ దర్శనం చేసుకుని సంతోషంగా తిరుగుముఖం పట్టారు, కానీ మధ్యలోనే మృత్యువు కాటేసింది. కేఎస్ ఆర్టీసీ బస్సు, క్వాలిస్ కారు ముఖాముఖి ఢీకొన్న ప్రమాదంలో 6 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘోర ప్రమాదం కనకపుర పరిధిలో సాతనూరు కెమ్మాళ గేట్ వద్ద సాయంత్రం 5 గంటల సమయంలో జరిగింది. బెంగళూరుకు చెందిన నాగేశ్, జ్యోతిర్లింగప్ప, పుట్టరాజు, కుమార, గోవింద, మరొక గుర్తుతెలియని వ్యక్తి మృత్యువాత పడ్డారు.

తీవ్రమైన వేగం వల్లనే

బెంగళూరుకు చెందిన మృతులందరూ క్వాలిస్ వాహనంలో మలె మహదేశ్వరకొండకు వెళ్లి తిరిగి నగరానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎదురుగా వచ్చిన కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొట్టడం క్వాలిస్ తుక్కుతుక్కయింది, అందులోని ఆరుమంది అక్కడికక్కడే మృతిచెందగా బస్సులో ఏడుమంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. అయితే బస్సు డ్రైవర్ బీటీ నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. బస్సు కనకపుర డిపోదని, మండ్యకు వెళ్తోందని తెలిసింది. ప్రమాద సమయంలో రెండు వాహనాలు తీవ్రమైన వేగంతో ప్రయాణిస్తున్నాయని, ఇద్దరు డ్రైవర్లలో ఎవరు జాగ్రత్త తీసుకున్నా ప్రమాదం తప్పేదని పోలీసులు చెప్పారు.

మృతుల్లో సౌధ సెక్షన్ ఆఫీసర్

మృతుల్లో నాగేష్, గోవింద, కుమారలు బెంగళూరులో ఎమ్మెల్యేల వసతిగృహంలో వంటపనిచేసేవారు, జ్యోతిర్లింగప్ప విధానసౌధలో సెక్షన్ ఆఫీసర్‌గా ఉన్నతోద్యోగం చేస్తుండగా, గోవింద జూనియర్ ఉద్యోగి అని తెలిసింది. మృతదేహాలను కనకపుర ఆస్పత్రికి తరలించారు. క్వాలిస్ వాహనం బస్సు లోపలకు చొచ్చుకుపోయింది. ఫైర్ సిబ్బంది జేసీబీ, క్రేన్ సాయంతో వాహనాలను ఎంతో శ్రమించి విడదీయాల్సి వచ్చింది. సాతనూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

31 నుంచి శివమొగ్గకు విమానాలు



- ఎంపీ రాఘవేంద్ర వెల్లడి

శివమొగ్గ: శివమొగ్గ నగరం సమీపంలో ఉన్న విమానాశ్రయంలో ఆగస్టు 31వ తేదీ నుంచి విమానాల రాకపోకలు ప్రారంభమవుతాయని జిల్లా ఎంపీ బీ.వై. రాఘవేంద్ర తెలిపారు. ఈ ఎయిర్‌పోర్టును ప్రధాని మోదీ ఈ ఏడాది ఫిబ్రవరి 27న ఘనంగా ప్రారంభించడం తెలిసిందే. అప్పటి నుంచి మిగిలి ఉన్న చిన్న చిన్న పనులు జరుగుతున్నాయి. రాఘవేంద్ర సోమవారం విమానాశ్రయాన్ని పరిశీలించి మీడియాతో మాట్లాడారు.

బెంగళూరు నుంచి రాకపోకలు

ఈ నెల 31న ఉదయం 9.50 గంటలకు బెంగళూరు నంచి బయల్దేరే విమానం ఉదయం 11.05 గంటలకు శివమొగ్గలో దిగుతుందని ఎంపీ తెలిపారు. మళ్లీ 11.25 గంటలకు ఇక్కడి నుంచి బయల్దేరి 12.25 గంటలకు బెంగళూరుకు చేరుతుందని చెప్పారు. ఉడాన్ పథకంలో భాగంగా తిరుపతి, చెన్నై, గోవాకు మరో రెండు నెలల్లో ఇక్కడి నుంచి విమాన సర్వీసులు మొదలవుతాయని అన్నారు. విమానాశ్రయానికి సాహితీవేత్త కువెంపు పేరు పెట్టినట్లు తెలిపారు.



విమానంలో చిన్నారికి అస్వస్థత

- ప్రాణాలు కాపాడిన వైద్యులు

దొడ్డబళ్లాపురం: విమానంలో ప్రయాణిస్తున్న పసిపాప అనారోగ్యానికి గురికావడంతో అదే విమానంలో ప్రయాణిస్తున్న వైద్యులు చికిత్స అందించి ఊపిరి పోసిన సంఘటన బెంగళూరు నుండి ఢిల్లీకి బయలుదేరిన విస్తారా విమానం యూకే-814లో చోటుచేసుకుంది. ఇదే విమానంలో ప్రయాణిస్తున్న ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) కు చెందిన ఐదుమంది వైద్యులు చిన్నారికి చికిత్స అందించినవారు. విమానంలో ప్రయాణిస్తున్న రెండేళ్ల ఆడబిడ్డకు గతంలో గుండె శస్త్రచికిత్స జరిగింది. విమానంలో ప్రయాణిస్తుండగా చిన్నారి అస్వస్థతకు గురైంది. ఊపిరి తీసుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతుండడంతో విమానం సిబ్బంది వైద్యులు ఎవరైనా ఉంటే సాయం చేయాలని కోరగా వైద్యుల బృందం చిన్నారికి ప్రథమ చికిత్స అందించి ఊపిరి పోసారు. ఈ విషయాన్ని ఆ వైద్యులు ట్విట్టర్‌లో ఫోటోలతో సహా పోస్ట్ చేశారు.

మాకు నిధులు ఇవ్వరా ?

- డీసీఎంపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మండిపాటు

శివాజీనగర: నగరంలో మూడు నియోజకవర్గాలకు మాత్రం నిధులు విడుదల చేసిన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై కాంగ్రెస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు మండిపడుతున్నారు. కేఆర్ పురం, ఆర్ఆర్ నగర, యశ్వంతపుర నియోజకవర్గాలకు మాత్రం నిధులు విడుదల చేసిన ప్రభుత్వ ధోరణిపై ఆ ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీజేపీని విడిచి కాంగ్రెస్ పార్టీలోకి చేరనున్న ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు మాత్రం నిధులు విడుదల చేసి తమ నియోజకవర్గాలను నిర్లక్ష్యం చేస్తే అభివృద్ధి ఎలాగని కొందరు ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని విన్నవించినా కూడా ప్రభుత్వం నిధులు ఇవ్వటం లేదు. మౌలిక సదుపాయాల గురించి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిధులు ఇవ్వకపోతే తాము ఏమి చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే ఉంటే...బీబీఎంపీ ఎన్నికల్లో పార్టీకి అపాయం కావచ్చని కొందరు హెచ్చరించినట్లు తెలిసింది. గ్యారంటీ పథకాల నుండి రాజధానిలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగటం లేదు. సుమారు రూ.1700 కోట్ల మొత్తంలో అభివృద్ధి పనులు స్తంభించాయి. ఐదు నెలల నుంచి ఒక అభివృద్ధి పని కూడా జరగలేదు. తక్షణమే ముఖ్యమంత్రితో సమావేశం జరిపి చర్చించాలని వారు డిమాండ్ చేశారు.

కుక్క మొరిగిందని కత్తిపోట్లు

యశవంతపుర: రోడ్డుపై వెళుతుండగా కుక్క మొరగడం కత్తిపోట్లకు దారితీసింది. కుక్క పక్కనే ఉన్న వ్యక్తి దాని యజమాని అని భావించిన మరో వ్యక్తి కత్తితో పొడిచాడు. ఈ సంఘటన బెంగళూరు మల్లేశ్వరం పరిధిలో జరిగింది. తుమకూరు జిల్లా కుణిగల్ తాలూకాకు చెందిన రాజు (57) అనే వ్యక్తి ఈ నెల 21న రాత్రి 8 గంటల సమయంలో మల్లేశ్వరం 17వ క్రాస్, గణేష్ గుడి వద్ద వెళుతున్నాడు. అతన్ని చూసి ఒక కుక్క మొరిగింది. అక్కడే ఉన్న బాలసుబ్రమణ్యకు చెందిన కుక్కగా భావించి రాజు అతనిపై చాకుతో దాడి చేసి పరారయ్యాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో గాలించి రాజును అరెస్ట్ చేశారు.



త్వరలో వినాయక చవితి, శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగలు వస్తుండగా విగ్రహాలకు గిరాకీ పెరిగింది. సోమవారం బెళగావిలో ఏకదంత, నల్లనయ్య ప్రతిమల తయారీలో ఓ కళాకారిణి

రైతు కుటుంబాలకు వెంటనే పరిహారం ఇవ్వండి

- సీఎం సిద్దరామయ్య

మైసూరు: అకాల వర్షాలతో పంటలు నష్టపోయి అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు వెంటనే పరిహారం అందజేయాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం మైసూరు నగరంలోని జిల్లా పంచాయతీ హాల్లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్ప, స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలతో అధికారుల సమావేశంలో సీఎం మాట్లాడారు. ఆత్మహత్య చేసుకున్న ప్రతి రైతు కుటుంబాన్ని గుర్తించి పరిహారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఆత్మహత్యల కేసులు అంటూ ఆలస్యం చేయవద్దని, నిర్లక్ష్యం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సీఎం హెచ్చరించారు.

కరువు నివారణకు చర్యలు

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు ఛాయలు కమ్ముకున్నాయని, కరువు ప్రాంతాలను గుర్తించి ప్రకటించిన తరువాత అవసరమైన సాయం కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. సోమవారం ఆయన మైసూరు నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కరువుపై మంత్రి మండలి ఉప సమితితో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఇక రాష్ట్రంలో బీజేపీ దివాలా తీసిందని, ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా ప్రతిపక్ష నేతను ఎన్నుకోలేక పోతున్నారని సీఎం విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీలోకి ఎవరూ వచ్చినా స్వాగతిస్తామని చెప్పారు.



మైసూరులో అతిథిగృహం వద్ద సీఎంకు వందనం

అమ్మాయిపై కత్తితో దాడి

దొడ్డబళ్లాపురం: ఒక సైకో ప్రేమికుడు విద్యార్థినిపై కత్తితో దాడి చేసిన సంఘటన రామనగర పట్టణంలో చోటుచేసుకుంది. మహిళా పీయూ కళాశాలలో ద్వితీయ పీయూసీ చదువుతున్న విద్యార్థిని సోమవారం ఉదయం కళాశాలకు రాగా కళాశాల ఆవరణలోనే సైకో ప్రేమికుడు ఆమెపై కత్తితో దాడి చేసాడు. అయితే అతడే ఆమెను తన కారులో తీసికెళ్లి ఆస్పత్రిలో చేర్చాడు. అక్కడి నుండి పరారవడానికి ప్రయత్నిస్తుండగా అప్పటికే సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసారు. నిందితుడిని కనకపుర తాలూకా దాళింబ గ్రామానికి చెందిన చేతన్‌గా గుర్తించారు. బాధితురాలు ఇదే గ్రామానికి చెందిన యువతి. చాలా రోజులుగా ప్రేమ పేరుతో ఆమెను చేతన్ వేధిస్తున్నాడు.

కోమాలోకి చీఫ్ ఇంజినీర్

బనశంకరి: బీబీఎంపీ క్వాలిటీ కంట్రోల్ రూమ్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ శివకుమార్ ఆరోగ్యం విషమించి కోమాలోకి వెళ్లారు. ఈ ప్రమాదంలో మొత్తం 9 మంది గాయపడగా వీరిలో ఇద్దరిని అపోలో ఆస్పత్రిలో చేర్చారు. వీరిలో ఆపరేటర్ జ్యోతి ఆరోగ్యం మెరుగుపడగా శివకుమార్ కోమాలోకి వెళ్లిపోయారు. ప్రముఖ వైద్యులతో చికిత్స చేయించినా ఆయన ఆరోగ్యం విషయంలో ఎలాంటి మార్పు కనిపించలేదు.

క్యూలో ఉన్న బీజేపీ నేతలు

- కాంగ్రెస్ నేత శెట్టర్ వ్యాఖ్యలు



మాజీ సీఎం జగదీశ్ శెట్టర్

హుబ్లీ: బీజేపీలోని వ్యవస్థతో విసిగి చాలా మంది కాంగ్రెస్‌లో చేరుతున్నారని మాజీ సీఎం, ఎమ్మెల్సీ జగదీశ్ శెట్టర్ అన్నారు. సోమవారం నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నేతలు చేరడాన్ని బీజేపీ నేతలు ఆపరేషన్ హస్తం అంటున్నారు, స్వచ్ఛందంగా ఎవరైనా ఒక పార్టీ నుంచి మరొక పార్టీలోకి వెళితే అది ఆపరేషన్ కాదన్నారు. బీజేపీలోని అసంతృప్త నాయకత్వ కొరత వల్ల కార్యకర్తలు, నేతలు ప్రస్తుతం బీజేపీని వీడి కాంగ్రెస్‌లోకి చేరుతున్నారన్నారు. మాజీ మంత్రి శంకర్ పాటిల్ మునేనకొప్ప బీజేపీని వీడి కాంగ్రెస్‌లోకి వస్తారన్న సమాచారం లేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. సంఘటితం, నాయకత్వం లేకపోవడం వల్ల పార్టీ నానాటికీ అథోగతి పాలవుతోందని , కొందరు బీజేపీ నేతలు మనోవేదనకు గురై కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ 12 నుంచి 15 స్థానాలు గెలుస్తుందని అన్నారు.

కమనీయం ఓనం సంబరం



ఓనం వృత్తాంతాన్ని నాటిక ద్వారా ప్రదర్శిస్తున్న బాల కళాకారులు

ప్రశాంతి నిలయం: ప్రసిద్ధ పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో ఓనం వేడుకల్లో భాగంగా రెండవ రోజు సోమవారం తిరు ఓనం వేడుకలు కమనీయంగా నిర్వహించారు. కేరళకు చెందిన ప్రముఖులు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. వక్తలు మాట్లాడుతూ సత్యసాయి సత్యం ధర్మ శాంతి ప్రేమలను బోధిస్తూ ప్రపంచ మానవాళిని సన్మార్గంలో నడిపిన మహనీయుడన్నారు. ఆయన చూపిన మార్గం సదా ఆచరణీయమన్నారు. సత్యసాయి సేవలు అందరికీ ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా బాలవికాస్ విద్యార్థులు ఓనం వృత్తాంతాన్ని తెలిపే బలి చక్రవర్తి నాటికను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. కళాకారుల సంగీత కచేరీ, నృత్యాలు ఆద్యంతం ముగ్ధుల్ని గావించాయి.



వీనులవిందుగా సాగిన భక్తిగాన కచేరీ

ఆన్‌లైన్ మోసగాళ్ల అరెస్టు

యశవంతపుర: ఆన్‌లైన్ షాపింగ్ వ్యాపారంలో పనిచేస్తూ వినియోగదారుల సమాచారాన్ని సేకరించి మోసం చేస్తున్న 21 మందిని బెంగళూరు ఉత్తర విభాగం సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి నిందితుల నుంచి 7.50 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కొనుగోలుదారులు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మీసో, ఆజో సంస్థలకు ఆర్డర్లు ఇస్తుంటారు. ఆ సమయంలో నిందితులు నకిలీ వస్తువులను కవర్‌లో పెట్టి అసలైన వస్తువులను కొట్టేసేవారు. దీనిపై కొనుగోలుదారులు వరుసగా ఫిర్యాదులు చేశారు. అయితే తము పంపిన అసలైన వస్తువులకు బదులు నకిలీ వస్తువులు ఎలా వస్తున్నాయోనని అనుమానించిన సంస్థల ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు ఈ సంస్థల్లో పని చేస్తున్న 21 మంది సిబ్బంది అసలు వస్తువులను కాజేస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేశారు.

జోలెలో మోసుకుంటూ 15 కి.మీ.లు



బాధితున్ని జోలెలో తీసుకెళుతున్న దృశ్యం

- వైద్యం కోసం కెందరి గ్రామవాసుల అవస్థలు

యశవంతపుర: అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధిని సాధిస్తున్నామని పొగుడుకుంటున్నాం కానీ ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో రవాణా, వైద్య సదుపాయాలు మృగ్యమనే ఆరోపణలున్నాయి. తరచూ జరిగే దయనీయ సంఘటనలే ఇందుకు ప్రబల నిదర్శనం. ఉత్తర కన్నడ జిల్లా అంకోలా వద్ద గాయపడిన వ్యక్తిని జోలెలో 15 కిలోమీటర్లు దూరం మోసుకెళ్లి ఆస్పత్రిలో చేర్చారు. కెందరి గ్రామవాసి ఉమేశ్‌గౌడ పొలంలో పని చేస్తుండగా కొడవలి తగిలి కాలికి గాయమై పడిపోయాడు. చుట్టుపక్కల ఉన్న వాగులు, కాలువలు వర్షాలతో జోరుగా ప్రవహిస్తున్నాయి. దీంతో కొందరు గ్రామస్తులు కట్టెకు జోలె కట్టి అందులో బాధితున్ని తీసుకుని మోసుకుంటూ బయల్దేరారు. 15 కిలోమీటర్లు నడిచి కారవార మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చేర్చారు. ఈ గ్రామం దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంది. వస్తువులు కొనాలంటే 18 కిలోమీటర్ల దూరంలోని హట్టికేరికి వెళ్లాలి. లేదా మరోమార్గంలో కార్వారకు ప్రయాణించాలని గ్రామస్తులు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యంవచ్చి 77 ఏళ్లు అవుతున్నా తమ గ్రామానికి రోడ్డు మార్గం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, గర్భిణిలకు వైద్యం అవసరమైతే జోలెనే గతి అని తెలిపారు.

క్లుప్తంగా

కార్యవర్గం ఎంపిక


దేవానంద్


సుధాకర్

కంప్లి: బళ్లారిలోని రూపనగుడి రోడ్డులోని హులిగమ్మ దేవి, చౌడేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం తొగటవీర క్షత్రియ నేకార సంఘం నూతన పదాధికారుల ఎంపిక జరిగింది. నేకార కుల బాంధవులందరి సహకారంతో జిల్లా అధ్యక్షునిగా సీ.దేవానంద్‌ను, ప్రధాన కార్యదర్శిగా కంప్లి వాసి జీ.సుధాకర్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కంప్లి తొగటవీర క్షత్రియ నేకార యువక సంఘం అధ్యక్షులు ఎం.ఈశ్వర్, పదాధికారులు అభినందించారు.

నోటు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలను అందించిన ఆప్ నాయకులు

బళ్లారిఅర్బన్: ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ముఖ్యమంత్రి చంద్రు జన్మదినం సందర్భంగా సోమవారం 36వ వార్డు కురిహట్టి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేసినట్లు ఆప్ నగర అధ్యక్షులు జేవీ మంజునాథ్ తెలిపారు. విద్యార్థుల సమక్షంలో స్వీట్లను పంచిపెట్టి పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. ఈసందర్భంగా పాఠశాల ముఖ్య ఉపాధ్యాయులు షణ్ముఖస్వామి, కురిహట్టి మల్లికార్జున, జమాపుర వీరేష్, నిరంజన్, గురుప్రసాద్, ఉమేష్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరిహారం ఇవ్వండి


వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

రాయచూరు రూరల్: కొత్తదొడ్డిలో శుక్రవారం ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన విద్యార్థి మల్లేష్ కుటుంబానికి పరిహారం అందించాలని ఎస్ఆర్‌పీఎస్ పీయూ కళాశాల కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టిన సంచాలకులు అంబాపతి పాటిల్ మాట్లాడారు. యాదగిరి, రాయచూరు, కలబుర్గి జిల్లాల్లో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ ఇసుక రవాణా వల్ల అధికంగా సంభవిస్తున్న మరణాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు పరిహారం అందించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

కాంగ్రెస్‌లోకి వస్తే స్వాగతం: సీఎం

శివాజీనగర: కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాన్ని ఆమోదించి వస్తే పార్టీలోకి చేర్చుకొంటామని సీఎం సిద్దరామయ్య అన్నారు. ఆపరేషన్ హస్తం మాటలు వినిపిస్తుండగానే ఆయన స్పందిస్తూ పార్టీలోకి వచ్చేవారికి స్వాగతముందనే అర్థంలో మాట్లాడారు. మైసూరులో సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన, ఎవరైనా గానీ కాంగ్రెస్‌లో చేరవచ్చు. కాంగ్రెస్‌లోకి ఎవరు వచ్చినా స్వాగతిస్తామన్నారు.

కులదూషణ చేయలేదు


మాట్లాడుతున్న శివరాజ్

రాయచూరు రూరల్: జిల్లాలో కులం పేరుతో తాను ఎవరినీ దూషించలేదని బుడగ జంగమ సంఘం అధ్యక్షుడు శివరాజ్ పేర్కొన్నారు. ఆయన సోమవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమాజంలో జరిగిన పొరపాట్లకు రాజీ ప్రక్రియ పేరుతో జరిమానాలు విధిస్తున్నారన్నారు. కొంత మంది బుడగ జంగమ పేరుతో చేస్తున్న లోపాలను సవరించి వారిని సన్మార్గంలో వెళ్లమని చెప్పడం తప్పా? అని ప్రశ్నించారు.

రేపు గృహభాగ్య ప్రారంభం

కేజీఎఫ్: ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈ నెల 30న గృహలక్ష్మి పథకాన్ని మైసూరులో ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ నాగవేణి తెలిపారు. సోమవారం నగరసభ సభాగణంలో అధికారులతో సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆ కార్యక్రమాన్ని నగరంలోని కింగ్ జార్జి హాల్, నగరసభ సభాంగణం, గ్రామీణ ప్రాంతాల్లో వర్చువల్ ద్వారా వీక్షణకు అవకాశం కల్పిస్తారని తెలిపారు. గృహలక్ష్మి వర్చువల్ మీటింగ్‌కు పెద్ద సంఖ్యలో మహిళలను పిలుచుకు రావాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. గృహలక్ష్మి పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రూపా శశిధర్ పాల్గొంటున్నారని, కార్యక్రమానికి గృహలక్ష్మి లబ్ధిదారులందరినీ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నగరసభ కమిషనర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మంత్రాలయంలో ఆరాధనోత్సవాలు

- హాజరు కానున్న ఏపీ గవర్నర్
- పలువురికి రాఘవేంద్రస్వామి అనుగ్రహ అవార్డుల ప్రదానం


విద్యుత్ దీపాలంకరణలో రాఘవేంద్ర స్వామి మఠం


పుష్పాలంకరణలో స్వామివారి మూల విరాట్

రాయచూరు రూరల్: మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామి మఠంలో రాఘవేంద్ర స్వాముల 352వ ఆరాధనోత్సవాలు, సప్తరథోత్సవాలు ఈనెల 29వ తేదీ మంగళవారం నుంచి సెప్టెంబర్ 4 వరకు వైభవంగా జరుగుతాయి. 31న పూర్వారాధన, 1న మధ్యారాధన, 2న ఉత్తరాధన జరుగనుండగా, పూర్వారాధనలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొంటారు. రాఘవేంద్ర స్వామి అనుగ్రహ అవార్డులను విద్వాన్ విఠలాచార్య, విద్వాన్ గరికపాటి నరసింహారావు, చంద్రశేఖరన్, విశ్వనాథ్ కరడిలకు ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమాల కోసం విద్యుత్ దీపాలతో మఠాన్ని అలంకరించడంతో పాటు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆరాధనోత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర, గోవా, ఒడిశా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి భక్తుల సందడి అధికంగా ఉంటుంది. మంత్రాలయంలో భక్తులకు మౌలిక సౌకర్యాలు కల్పించారు.

కడసారి చూపునకు రాని బిడ్డలు

- విదేశాల్లో మంచి ఉద్యోగాల్లో సంతానం
- పోలీసులే వృద్ధుని అంత్యక్రియలు జరిపిన వైనం


మూల చంద్రశర్మ(ఫైల్), అంత్యక్రియలు చేసిన పోలీసులు

రాయచూరు రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన తండ్రి కడసారి చూపునకు విదేశాల్లో ఉన్న కొడుకు, కూతురు రాకపోవడంతో పోలీసులే అంత్యక్రియలు చేసిన ఘటన బెళగావి జిల్లా చిక్కోడి తాలూకా నగరమున్నోలిలో జరిగింది. రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ మూల చంద్రశర్మ(72) కొడుకు దక్షిణాఫ్రికాలో, కూతురు కెనడాలో మంచి ఉద్యోగాల్లో ఉన్నారు. ఆయన వద్ద ఓ పని మనిషిని నియమించి చిక్కోడి లాడ్జిలో ఉంచి బాగోగులు చూసుకునేలా ఏర్పాటు చేశారు. అయితే చంద్రశర్మ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో లాడ్జిలో మరణించారు. దీంతో ఆయన మరణవార్తను విదేశాల్లో ఉన్న కొడుకు, కూతురులకు పోలీసులు తెలిపినా అటు వైపు నుంచి అంత్యక్రియలకు హాజరయ్యే విషయంపై ఎలాంటి స్పందన లేకపోవడంతో పోలీసులే మానవతా దృష్టితో తామే అంత్య సంస్కారాలు జరపడంతో పోలీసుల సేవను ప్రజలు ప్రశంసిస్తున్నారు.

మణిపూర్ హింసను ఖండిస్తూ ధర్నా


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న వెంకప్ప డ్యానియల్

గంగావతి: మణిపూర్‌లో ఇటీవల జరిగిన హింసాత్మక ఘటనలను ఖండిస్తూ సోమవారం గంగావతి క్రైస్తవ సమాజం వారు బస్టాండ్ సర్కిల్‌లో ధర్నా చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి క్రైస్తవ కౌన్సిలింగ్ పదాధికారి వెంకప్ప డ్యానియల్ మాట్లాడుతూ ఇటీవల మైనార్టీలపై దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు, ఇళ్లను లూటీ చేయడం, నగ్నంగా ఊరేగించడం లాంటి పలు రకాల వేధింపులకు గురి చేశారన్నారు. ప్రభుత్వాలు మైనార్టీలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో పలు ప్రాంతాల్లో క్రైస్తవ సమాజంపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలన్నారు. పవిత్రంగా భావించే ప్రార్థన మందిరాలపై దాడి చేయడం తగదన్నారు. క్రైస్తవులు కూడా దేశభక్తి కలిగినవారేనని, భారతదేశం కోసం ప్రాణాలు సైతం అర్పించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. తమపై జరిగే దాడుల నుంచి రక్షణ కల్పించాలని ఒత్తిడి చేశారు. అంతకు ముందు వారు గండిలోని చర్చిలో నుంచి దుర్గమ్మ దేవస్థానం మీదుగా విచ్చేసి ధర్నాకు ఉపక్రమించారు. కార్యక్రమంలో క్రైస్తవ కౌన్సిలింగ్ ప్రముఖులు జాన్ ముళ్లూరు, విజయ్‌కుమార్, జాన్ అబ్రహం, జాన్ పలాం, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు సాగునీరు అందించండి


మాట్లాడుతున్న డివిజనల్ కమిషనర్ కృష్ణ వాజ్‌పేయి

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువలో సక్రమ నీటి నిర్వహణకు కలబుర్గి డివిజనల్ కమిషనర్ కృష్ణ వాజ్‌పేయి అధికారులకు పలు సూచనలు చేశారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన అధికారుల, రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 49, 69, 104వ మైళ్ల వద్ద నీటి నిర్వహణకు అధికారులు సహకరించి ఆయకట్టు చివరి భూములకు నీరందించడానికి గేజ్ సామర్థ్యాన్ని పెంచాలన్నారు. ఈ విషయంలో ఇంజినీర్లు సక్రమంగా కాలువలపై నీటి నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలన్నారు. పైభాగంలో అధికంగా అక్రమ నీటి చౌర్యం జరుగుతోందన్నారు. కాలువలో అక్రమ నీటి చౌర్యాన్ని అరికట్టాలన్నారు. 69వ మైలులో 12 మీటర్లు, 104వ మైలులో 10 మీటర్ల మేర నీరు వదిలితే ఆయకట్టు చివరి భూములకు నీరందుతాయని రైతులు వివరించారు. సమావేశంలో గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, ఎడమ కాలువ పోరాట సమితి గౌరవాధ్యక్షుడు చామరస మాలిపాటిల్, అధ్యక్షుడు శంకర్‌గౌడ, అమరేష్, శరణప్పగౌడ, బసనగౌడ, చుక్కి సూగప్పలున్నారు.

సాగునీటి కోసం రాస్తారోకో

కాగా తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు నీరందించాలని రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం సిరవారలో ఐదో రోజు రాస్తారోకో చేపట్టి రైతులు మాట్లాడారు. నీటి నిర్వహణలో గేజ్‌ను కాపాడాలని, ఆయకట్టు భూములకు నీరందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేశారు.

క-కలో 12 వేల ఉద్యోగాల భర్తీ

- మంత్రి రామలింగారెడ్డి

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటక(క-క)లో రవాణా శాఖలో ఖాళీగా ఉన్న 12 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం సింధనూరు ఆర్టీసీ బస్టాండ్‌లో వోల్వో మల్టీ యాక్సిల్ కళ్యాణరథ బస్సులను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ ఏడాది 700 కొత్త బస్సులను కేటాయిస్తామన్నారు. శక్తి పథకం ద్వారా బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగిందన్నారు. నగర సంచారానికి అనువుగా 150 విద్యుత్ చాలిత బస్సులను అందిస్తామన్నారు. గత ప్రభుత్వ పాలనలో అవినీతి, అక్రమాలు పెచ్చుమీరడంతో ప్రజలు విసుగు చెంది కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు హంపనగౌడ బాదర్లి, బసనగౌడ తుర్విహాళ, ఎమ్మెల్సీ శరణేగౌడ బయ్యాపూర్, అధికారులు రామచంద్రారెడ్డి, రాచప్ప, సంతోష్, చెన్నబోరయ్య, అరుణ్ కుమార్, మంజునాథ్‌లున్నారు.

ఇది నియంతృత్వ పాలన: బొమ్మై

శివాజీనగర: కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో ప్రజల విశ్వాసం పొందిందనటం అవాస్తవం. వారి ఎమ్మెల్యేల విశ్వాసాన్నే ప్రభుత్వం కోల్పోయింది. అన్ని రంగాల్లో విఫలం కావడం ఈ సర్కారు సాధన అని బీజేపీ నేత, మాజీ సీఎం బసవరాజ బొమ్మై ఎద్దేవా చేశారు. సర్కారుకు వ్యతిరేకంగా గళమెత్తే ప్రజలు, మీడియా, సంఘ సంస్థలపై పోలీస్ శాఖ ద్వారా అణచివేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన సోమవారం ట్విట్టర్లో స్పందిస్తూ ఇది రాజ్యాంగ వ్యతిరేక, నియంతృత్వ పాలన అనేది 100 రోజుల్లో చూపించారని విమర్శించారు. గ్యారంటీల నెపంతో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయని, కాంట్రాక్టర్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టుకొని కమీషన్ దందాకు పాల్పడుతోందని ఆరోపించారు. రైతులు కరువు కాటకాలకు గురవుతున్నా కూడా రైతుల వైపు తిరిగి చూడలేదన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు


గంధం అలంకరణలో కోట మల్లేశ్వర స్వామివారు

బళ్లారిఅర్బన్: శ్రావణమాసం సందర్భంగా సోమవారం నగరంలోని వివిధ శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. స్థానిక కోట మల్లేశ్వర ఆలయంలో, పెద్ద మార్కెట్ నీలకంఠేశ్వర ఆలయంలో, నగరేశ్వర ఆలయంలో, నాగేశ్వర ఆలయంలో, గ్రాహం రోడ్డు మల్లికార్జున ఆలయంలో, ఎస్ఎన్‌పేట్ కాశి విశ్వేశ్వర ఆలయం తదితర శివాలయాల్లో శ్రావణమాస పూజలు జరుపుకున్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

రాయచూరు రూరల్: బట్టలు ఉతికే వాషింగ్ మిషన్ షాక్ కొట్టడంతో ఓ వ్యక్తి మరణించిన ఘటన చోటు చేసుకుంది. సోమవారం మస్కి తాలూకా దుర్గా క్యాంప్‌లో నాగేంద్ర(32)అనే వ్యక్తి వాషింగ్ మిషన్‌లో బట్టలు వేయడానికి ప్రయత్నించగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటనపై మస్కి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అప్పల బాధతో రైతు ఆత్మహత్య

హొసపేటె: పంట నష్టంతో వ్యవసాయం కోసం చేసిన రుణాలను ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెంది ఓ రైతు ఆత్మహత్య చేసుకొన్న ఘటన ఆదివారం రాత్రి జరిగింది. హూవినహడగలి తాలూకా హ్యారడ గ్రామానికి చెందిన రైతు శివరాజ్(42) సుమారు రూ.1.50 లక్షలు ఖర్చు చేసి ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. కానీ వర్షాల లేమితో పంట ఎండిపోయింది. దీంతో రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నారు. ఘటనపై హూవినహడగలి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారం


బొమ్మనహళ్లి: సహకార రంగంలో అగ్రగామి బ్యాంక్ అయిన శ్రీచరణ్ సౌహార్ద కో ఆపరేటివ్ బ్యాంకు ఆర్‌బీఐ బ్యాంకు చే అత్యుత్తమ రేటింగ్ పొందడంతో పాటు గత ఆర్థిక సంవత్సరంలో రూ. 2.85 కోట్ల లాభాలను ఆర్జించిందని ఆ బ్యాంకు వ్యవస్థాపకుడు బి.వి. ద్వారకనాథ్ తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన బ్యాంకు 27వ వార్షిక సమావేశంతో పాటు వృత్తి విద్యా కోర్సుల్లో ఉత్తమ సాధన చేసిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసే కార్యక్రమంలో పాల్గొని సన్మానించారు.

లారీ ఢీకొని రైతు మృతి

క్రిష్ణగిరి: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో రైతు చనిపోయిన ఘటన సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు సూళగిరి సమీపంలోని సీకలపల్లి గ్రామానికి చెందిన రైతు వెంకటేషన్ (58). ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంలో హోసూరు-క్రిష్ణగిరి జాతీయ రహదారి సామలపల్లం వద్ద వెళుతుండగా ఆ మార్గంలో వెళ్లిన కంటైనర్ లారీ ఢీకొనింది. తీవ్ర గాయాలేర్పడిన వెంకటేష్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సూళగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

పోయిన బంగారు గొలుసు దొరికింది

- నిజాయతీ చాటిన ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్


సొంతదారుకు మంగళసూత్రాన్ని అందిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: ఆర్టీసీ బస్సు కండక్టర్, డ్రైవర్ల నిజాయతీతో బస్సులో పోయిందనుకున్న మంగళసూత్రం తిరిగి లభించిన సంఘటన చోటు చేసుకుంది. ఆదివారం సాయంత్రం మాన్వి డిపోకు చెందిన కేఏ-36 ఎఫ్-1335 నంబరుగల బస్సులో విజయపురకు చెందిన నూర్‌జహాన్ ఇనాందార్ నాలత్వాడ నుంచి విజయపురకు ప్రయాణించిన సమయంలో బస్సులో ఐదు గ్రాముల మంగళసూత్రం పోగొట్టుకుంది. అయితే కండక్టర్ శివానంద, డ్రైవర్ రామప్ప కుందర్గిలు బస్సులో తమకు దొరికిన మంగళసూత్రాన్ని విజయపుర డిపో ఏటీసీ దేవేంద్రప్పకు అందజేశారు. మంగళసూత్రాన్ని పోగొట్టుకున్న నూర్జహాన్ ఈ విషయంపై గాంధీచౌక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు డిపో అధికారులను సంప్రదించి అధికారులు, ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్ల సమక్షంలో మంగళసూత్రాన్ని సొంతదారుకు అందించారు. కాగా కండక్టర్, డ్రైవర్ల నిజాయతీని అధికారులు ప్రశంసించి అభినందించారు.

కోలారు వార్తలు...

క్రీడా స్ఫూర్తి అవసరం


పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు

కోలారు: ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలని దేవరాజ్ అరస్ విశ్వవిద్యాలయ సలహాదారు హనుమంతరావ్ అన్నారు. సోమవారం నగరంలోని దేవరాజ్ అరస్ నర్సింగ్ కళాశాలలో వార్షిక క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యం కోసం తరచుగా క్రీడల్లో పాల్గొనడం ఉత్తమం అన్నారు. మధుమేహం, రక్తపోటు వంటి రోగాలను దూరంగా ఉంచుతుందన్నారు. అనేక రోగాల నుంచి మనిషిని దూరం చేసి మానసిక ప్రశాంతతను అందిస్తుందన్నారు. పోటీల అనంతరం విజేత విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

యజ్ఞంగా మొక్కల పంపిణీ


మొక్కలను అందిస్తున్న దృశ్యం

మాలూరు: దైవ పూజ కంటే మొక్కల పోషణ ఎంతో పూజ్యనీయమని, అందువల్ల ప్రజలు మొక్కలను విరివిగా పెంచే అలవాటు చేసుకోవాలని పర్యావరణ ప్రేమికుడు వెంకటేషమూర్తి తెలిపారు. సోమవారం లక్కూరు ఫిర్కా డీఎస్ దొడ్డి జీపీలోని అంబేడ్కర్ వసతి పాఠశాలలో పలు జాతుల మొక్కలను ఉచితంగా పంపిణీ చేసి మాట్లాడారు. తాను గత నాలుగేళ్లుగా ఇళ్లు, పాఠశాలలు, కార్యాలయాలు, చర్చిలు, మసీదులు, ఆలయాలకు ఒక పెద్ద యజ్ఞంగా భావించి ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తున్నానన్నారు. పాఠశాల ఉపన్యాసకుడు ఎస్ఎం మునిరాజ్, ప్రిన్సిపాల్ జి ఉమాదేవి, ఉపన్యాసకుడు ఆర్‌టి మహేష్ పాల్గొన్నారు.

సమాజానికి నిస్వార్థ సేవ చేయాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: సమాజానికి మనందరం నిస్వార్థంగా సేవ చేయాలని న్యాయమూర్తి, ఉపలోకాయుక్త కేఎన్ ఫణీంద్ర తెలిపారు. సోమవారం నగరంలోని గోల్డెన్ వ్యాలీ విద్యా ట్రస్టు ఏర్పాటు చేసిన 41వ కెంగల్ హనుమంతయ్య న్యాయ డిగ్రీల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. మనం సంపాదించిన ఆస్తి ఇతరుల పాలు కావచ్చు కానీ నేర్చుకున్న విద్య ఎన్నటికీ ఇతరుల పాలు కాదన్నారు. అది సదా మన వెన్నంటే ఉండి మనలను ఉన్నత స్థానాలకు తీసుకెళుతుందన్నారు. హైకోర్టు న్యాయమూర్తి హెచ్‌పీ సందేశ్ మాట్లాడుతూ ఒక విద్యార్థి ఉత్తమ విద్యాభ్యాసానికి ఎంపిక చేసుకునే కళాశాల కూడా ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ టి.వెంకటవర్ధన్, ప్రిన్సిపాల్ మ్యాథ్యన్, వైస్ ప్రిన్సిపాల్ శెట్టి, కళాశాల పాలక మండలి సభ్యుడు వెంకటకృష్ణ పాల్గొన్నారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

కేజీఎఫ్: వ్యక్తిపై దాడి కేసుకు సంబంధించి గత తొమ్మిదేళ్లుగా పరారీలో ఉన్న నిందితుడిని బేతమంగల పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు..బేతమంగలకు చెందిన కృష్ణప్ప అనే వ్యక్తిపై 2014లో బేతమంగల పోలీస్ స్టేషన్‌లో వ్యక్తిపై దాడి కేసు నమోదైంది. అయితే అప్పటి నుంచి కోర్టుకు హాజరు కాకుండా నిందితుడు కృష్ణప్ప తప్పించుకు తిరుగుతున్నాడు. కోర్టు ఆదేశాల మేరకు బేతమంగల ఎస్ఐ సతీష్ తమ సిబ్బందితో కలిసి గాలించి ఎట్టకేలకు కృష్ణప్పను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

ఆహార ధాన్యాల గోదాము సందర్శన


గోదామును సందర్శించిన విద్యార్థులు, అధికారులు

కేజీఎఫ్: ప్రజలకు సరఫరా చేసే ఆహార ధాన్యాలను ఎలా సంరక్షిస్తారో తెలుసుకోవడానికి తాలూకాలోని దొడ్డచిన్నహళ్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సోమవారం నగరంలోని కోరమాండల్ ఆహార ధాన్యాల గోదామును ఉపాధ్యాయులతో కలిసి సందర్శించారు. గోదాము మేనేజర్ జగన్నాథన్ రేషన్ బియ్యాన్ని ఇక్కడ ఎలా నిల్వ చేస్తారు, ఇక్కడి నుంచి రేషన్ దుకాణాలను ఎలా చేరవేస్తారో విద్యార్థులకు వివరించారు. ఆహార ధాన్యాలను నిల్వ చేసేటప్పుడు ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకుంటారో తెలిపారు.

సక్రమంగా విద్యుత్ సరఫరా చేయరూ


బెస్కాం అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: తాలూకాలోని హుత్తూరు జీపీ పరిధిలో సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని ఒత్తిడి చేస్తూ రైతులు సోమవారం బెస్కాం కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఆందోళనకారులు మాట్లాడుతూ అసలే వానలు లేక కరువు పరిస్థితులు నెలకొనగా సక్రమంగా విద్యుత్‌ను సరఫరా చేయకపోవడం వల్ల రైతులు తమ పంటలను ఎండబెట్టుకోవాల్సి వస్తోందన్నారు. పెట్టిన పంట కూడా చేతికి అందక రైతులు లక్షలాది రూపాయలను నష్టపోవాల్సి వస్తోందని వాపోయారు. రాత్రివేళల్లో విద్యుత్‌ను బంద్ చేస్తుండడం వల్ల విద్యార్థుల విద్యాభ్యాసానికి కూడా అంతరాయం కలుగుతోందన్నారు. రైతులు, విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలని, లేని పక్షంలో ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. అనంతరం బెస్కాం ఇంజినీర్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో గ్రామానికి చెందిన సురేష్ బాబు, సంపత్‌కుమార్, చంద్రప్ప, సురేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

వర్షాల కోసం పూజలు

పావగడ: తాలూకావ్యాప్తంగా ఇంతవరకు బలమైన వర్షాలు కురవకపోవడంతో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. అరకొరగా సాగు చేసిన వేరుశనగ పంట చినుకులు పడక చిగురులోనే ఎండిపోతుంటే రైతులు దిగాలు పడిపోతున్నారు. మరోవైపు తాగు నీటి కొరత ఛాయలు కనిపిస్తున్నాయి. పొలాలు, ఊర్లలో బోర్లలో నీళ్ళు తగ్గాయి, దీంతో గ్రామాల ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో వైఎన్ హొసకోట గ్రామ పంచాయతీ లోని గౌడ తిమ్మనహళ్ళి గ్రామంలో దండిగా వర్షాలు కురవాలంటూ గ్రామస్థులు సోమవారం గంగమ్మ దేవికి పూజలు చేశారు. చెరువు కట్ట వద్ద పెద్దలు, మహిళలు, పిల్లలు కలసి భజనలు చేశారు.

ఎమ్మెల్యేలెవరూ జేడీఎస్‌ను వీడరు

- భూ మాఫియాకు సర్కారు అండ: దేవెగౌడ

శివాజీనగర: జేడీఎస్ పార్టీని ఏ ఎమ్మెల్యే విడిచి పెట్టరని, ఒకవేళ అటువంటి వారుంటే వారి పేర్లు చెప్పాలని పార్టీ అధినేత హెచ్.డీ.దేవెగౌడ సవాల్ చేశారు. సోమవారం బెంగళూరు జేడీఎస్ ఆఫీసులో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, ఈ వయస్సులో కూడా పార్టీని పటిష్టపరుస్తానన్నారు. జేడీఎస్‌ను కొందరు ఎమ్మెల్యేలు వదిలేస్తారనే వార్త అబద్ధమని అన్నారు. తాను ఏ పార్టీకి వ్యతిరేకంగా ద్వేష రాజకీయం చేయనని, సెప్టెంబర్ 10న ప్యాలెస్ మైదానంలో కార్యకర్తలతో సభ నిర్వహించి శక్తిని చాటుతామని చెప్పారు. రాష్ట్రంలో ఒక్క కార్యకర్తకు బాధ కలిగినా క్షమాపణ కోరుతాను. దేవేగౌడ ప్రాణాలతో ఉన్నాడు, ఈ సభకు రండి అని విన్నవించానని అన్నారు. కాగా, బెంగళూరులో భూమాఫియాకు ప్రభుత్వం కొమ్ము కాస్తోంది, సర్కారు భూముల కబ్జాకు గురవుతున్నాయన్నారు. దీనిపై తన వద్ద చాలా విషయాలు ఉన్నాయి, మునుముందు రోజుల్లో ఈ విషయమై మాట్లాడుతానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై కుమారస్వామి పెన్‌డ్రైవ్ విడుదల చేస్తానన్నారు, ఆయన ఏదీ అంత తేలికగా మాట్లాడరని కుమారున్ని సమర్థించారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని విమ్స్ మార్చురీకి తరలిస్తున్న పోలీస్, అంబులెన్స్ సిబ్బంది

బళ్లారిఅర్బన్: బ్రూస్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 13వ వార్డు మిల్లర్‌పేట్ గణేష్ గుడి ఎదురుగా నివసిస్తున్న ఆర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగి రామాంజినేయులు కుమారుడు రఘురాం(38) అనే వ్యక్తి అనారోగ్యంతో ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బ్రూస్‌పేట్ ఎస్ఐ సురేష్ తెలిపారు. సీఐ సింధూర్ ఆదేశాల మేరకు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అంబులెన్స్ ద్వారా విమ్స్ మార్చురీకి తరలించారు. షామియాన షాప్‌లో పని చేసే మూగ వ్యక్తి రఘురాం కిడ్నీ ఆపరేషన్ జరిగింది. అయినా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

పశువులు, ట్రాక్టర్ బుగ్గి



మృత్యువాతపడిన పశువులు

మండ్య: ఆకస్మికంగా మంటలు అంటుకొని ఒక పాత ఇంటిలో ఉన్న ఒక ఆవు, దాని దూడతో పాటు రెండు మేకలు, ట్రాక్టర్, ఇతర విలువైన సామగ్రి కాలిపోయాయి. మండ్య జిల్లాలోని మద్దూరు తాలూకాలోని దేవెగౌడన కొప్పలులో ఈ సంఘటన జరిగింది. ధనుంజయ, డి.ఉమేష్ అనేవారికి పాత ఇళ్లు ఉన్నాయి. అందులో సోమవారం తెల్లవారుజామున ఆకస్మికంగా మంటలు వ్యాపించాయి. పైన పేర్కొన్న పశువులు, ట్రాక్టర్ తదితరాలు బుగ్గి కావడంతో రూ. 10 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

జూదగాళ్ల అరెస్టు

యశవంతపుర: క్లబ్‌లో పెద్దమొత్తంలో జూదం ఆడుతుండగా పోలీసులు దాడి చేసి 32 మందిని అరెస్ట్ చేసి రూ. 1.85 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరులోని జయమహల్ రోడ్డులో గల క్లబ్‌లో స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పేకాట జూదం ఆడుతున్నట్లు తెలిసి పోలీసులు దాడి చేశారు. 32 మందిని అరెస్ట్ చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు.

కురూడిలో వరమహాలక్ష్మి పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

గౌరిబిదనూరు: శ్రీక్షేత్ర ధర్మస్థల సంస్థ సోమవారం కురూడి, కురుబరహళ్లి గ్రామాల్లోని మహిళా స్వసహాయ సంఘ సభ్యులతో వర మహాలక్ష్మీ పూజలు చేయించారు. ఈ కార్యక్రమం కింద మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు వితరణ చేశారు. ధర్మస్థల గ్రామీణాభివృద్ధి అధికారి నాగరాజ నాయక్ జ్ఞానవికాస కార్యక్రమాలను వివరించారు. తాపం మాజీ సభ్యురాలు సావిత్రమ్మ, లక్ష్మీపతి, అశ్విని, లక్ష్మి, కమలాక్షి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా కారంజి పోటీలు



సమర యోధుల వేషధారణలో చిన్నారులు

తుమకూరు: తుమకూరు నగరం శిరాగేట్ ఉత్తర లేఔట్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో క్లస్టర్ స్థాయి ప్రతిభా కారంజీ పోటీలను నిర్వహించారు. కార్యక్రమాన్ని తుమకూరు తాలూకా విద్యాశాఖ అధికారి డాక్టర్ సూర్యకళ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణతో ఆకట్టుకున్నారు.

బీజేపీని వీడను

యశవంతపుర: తాను బీజేపీని వీడుతున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని మాజీ మంత్రి, యశవంతపుర ఎమ్మెల్యే ఎస్టీ సోమశేఖర్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ...తన వెంట ఉండాలనుకున్న నాయకులు తనతోనే ఉన్నారని, వచ్చే స్థానిక సంస్థల్లో పోటీ చేయాలని ఆశలు పెట్టుకున్న వారు మాత్రమే బీజేపీ వీడి కాంగ్రెస్ వైపు వెళ్తున్నట్లు సోమశేఖర్ వివరించారు.

యువతుల పేరుతో ఎర

- ఇద్దరి అరెస్ట్



అరెస్టయిన నిందితులు

బొమ్మనహళ్లి: యువతుల పేరుతో వల వేసి వారిని రప్పించుకుని దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరి నగరలోని హెచ్‌ఎస్‌ఆర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను నదీంపాషా, నాగేశ్‌లుగా గుర్తించారు. వివరాలు... ఈ ఇద్దరు కేటుగాళ్లు ఆన్‌లైన్ యాప్ తయారు చేసి అందులో ప్రొఫైల్స్‌లో అందమైన యువతుల పాటోలు అప్‌లోడ్ చేసేవారు. వారిని కాంటాక్ట్ అయిన యువకులతో గొంతుమార్చి యువతులుగా మాట్లాడేవారు. అనంతరం మాయమాటలు చెప్పి యువకులను రప్పించుకుంటారు. ఆటోలో ఎక్కించుకుని తీసుకుని బెదిరిస్తారు. వారి వద్ద ఉన్న విలువైన వస్తువులు, నగదు బదిలీ చేయించుకుంటారు. ఇలా మోసపోయిన ఓ బాధితుడు ఈనెల 21న హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిఘా ఉంచి నిందితులను అరెస్ట్ చేశారు.

సకలం ప్రకృతి సౌందర్యం

- పర్యాటకులను మైమరిపించే సకలేశపుర
- పచ్చని పర్వతాలు, లోయలతో సుందరం
- అద్భుతం.. రైలు ప్రయాణం
- బెంగళూరుకు సమీపంలోనే టూరిస్ట్ స్పాట్



బిస్లే ఘాట్ వద్ద ప్రకృతి అందాల వీక్షణం




మంజరాబాద్ కోట

బనశంకరి: కన్నడనాట సుందరమైన పర్యాటక ప్రాంతాలకు కొదవలేదు. కొంచెం ఓపిక చేసుకుని వెళితే జీవితాంతం గుర్తుంచుకునే మధురమైన పర్యాటక యాత్రలు చేయవచ్చు. ఇదే కోవలోకి వస్తుందని హాసన్ జిల్లాలోని సకలేశపుర హిల్‌స్టేషన్. సకలేశపుర బెంగళూరు నుంచి 220 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది పశ్చిమకనుమల్లో కలిసిపోయిన ఒక చిన్న పర్వత ప్రాంతం. టూరిస్టులకు ఎంతో డిమాండ్ ఉన్న విహార స్థలంగా మారింది. ఈ ప్రాంత ఇటు బెంగళూరు అటు మైసూరుకు సమీపంలో ఉండటం వల్ల వారాంతాల్లో టూర్ కు చాలా అనువైన ప్రదేశం. సకలేశపుర పట్టణం సముద్రమట్టానికి 949 మీటర్లు ఎత్తున ఉండి బెంగళూరు, మైసూరు నుంచి తేలికగా ప్రయాణించేలా ఉంటుంది. పర్యాటకులకు ట్రెక్కింగ్‌కు తగినట్లుగా ఉంటుంది. పర్యాటకులు బిస్లే అభయారణ్యంలో యువత, దేశ విదేశాల నుంచి వచ్చే యువ పర్యాటకులు ట్రెక్కింగ్ చేసి ఆనందిస్తారు.

సకలేశపుర సమీపంలో అద్భుతమైన ఆకుపచ్చదనం కప్పుకున్న ఎత్తైన కొండలు, కాఫీ తోటలు పరుచుకున్న లోయలతో పర్యాటకులను ఆహ్వానిస్తాయి. ఈ రెండింటి మధ్యలో ఉండే సన్నటి ఘాట్ రోడ్డుపై మలుపులు తిరిగే ప్రయాణం మరచిపోలేని అనుభూతి కలిగిస్తుంది. దట్టమైన అడవులు, ఆకాశాన్ని తాకుతున్నట్లు అనిపించే ఎత్తైన వృక్షసంపద ఆహా అనిపిస్తాయి. జలపాతాల హోరు కొండల్ని చీల్చుకుంటూ రైలుపట్టాల ఏర్పాటుకోసం తవ్విన గుహలు, పాయల గుండా హోరెత్తుతుంటాయి. అప్పుడప్పుడూ శబ్దం చేస్తూ దూసుకొచ్చే రైళ్లు పర్యాటకులను పలకరిస్తాయి.

మధురం రైలు ప్రయాణం




సకలేశపుర నుంచి 59 కిలోమీటర్ల దూరంలో కుక్కె వరకు రైలు మార్గంలో సాహసయాత్ర మధురానుభూతి లభిస్తుంది. బెంగళూరు నుంచి సకలేశపుర –సకలేశపుర నుంచి కుక్కెకు రైలులో పరుగులు తీస్తుంటే పులకించే సంఘటనలు ఎదురవుతాయి. చిక్కని అడవి మధ్యలో పెద్దపెద్ద చీకటి సొరంగాల మధ్య నుంచి రైలు వెళ్తుంది. ఆ సమయంలో ప్రయాణికులు పిల్లా పెద్ద భేదం మరచి కేరింతలతో సందడి చేస్తారు.

ఆ పేరెలా వచ్చిందంటే

హాసన్ నుంచి 30 కిలోమీటర్ల దూరంలో గల సకలేశపుర ఊరు చిన్నదే. కాఫీ, యాలకులు, మిరియాల తోటలతో పాటు అక్కడక్కడ టీ తోటలతో సంపన్న ప్రాంతంగా కనిపిస్తుంది. పర్వతారోహకులకు స్వర్గం వంటిది సకలేశపుర. ఒకప్పుడు మైసూరు రాజుల పాలనలో ఉండేది వీరికి ముందు హొయసళులు, చాళుక్యులు పరిపాలించారు. హొయసళుల కాలంలో ఈ ప్రాంతానికి సకలేశపుర అనే పేరువచ్చింది. హొయసళులు అక్కడకు వచ్చినప్పుడు ఒక శివలింగం విరిగి పడి ఉండటం గమనించారని, అంతా ఈశ్వర మహిమ అని పేరు వచ్చేలా సకలేశ్వపుర అని పేరు పెట్టారని స్థానికులు చెబుతారు. కానీ మరికొందరు పట్టణనివాసులు వ్యవసాయం వల్ల ధనికులు కావడంతో ఈ పేరు పెట్టారని కూడా చెబుతారు.

మంజూరాబాద్ కోట



నక్షత్ర ఆకారంలో కోట

దగ్గరలో మంజురాబాద్ కోట ప్రధాన ఆకర్షణ. 1790లలో దీనిని టిప్పుసుల్తాన్ నిర్మించారు. ఆకాశం నుంచి చూస్తే ఇది నక్షత్ర ఆకారంలో కనిపిస్తుంది. టెక్నాలజీ లేని రోజుల్లో ఇంత కచ్చితత్వంతో నిర్మించడం అబ్బురమే. కోటలోకి వెళ్తే రహస్య సొరంగాలు అబ్బురపరుస్తాయి. అప్పట్లో ఇక్కడ టిప్పు సైన్యం ఉండేది.

సదాశివాలయం

నాగారం శైలిలో ఉండే గోపురంతో సదాశివాలయాన్ని ఏకకూట నిర్మాణశైలిలో నిర్మించారు. ఈ పుణ్యక్షేత్రంలోని గర్భగుడిలో పెద్ద శివలింగం ఉంది. రాతి గవాక్షాలతో కూడుకున్న ఒక పెద్ద గుడిలో అందంగా చెక్కిన నందివిగ్రహం ఉంచారు. అక్కడికి చేరుకోగానే అమ్మవారి గుడి వద్ద శివాలయం బయట రెండు వినాయకుడి విగ్రహాలు ఉండటం గమనించవచ్చు.

పర్వతాల శ్రేణులు

సకలేశపుర ప్రవేశంలోనే కాఫీ, టీ తోటల పరిమళాలు పర్యాటకులను స్వాగతం పలుకుతాయి. ఇక్కడ బిస్లే రిజర్వు ఫారెస్ట్, పుష్పగిరి వైల్డ్ లైఫ్ సాంచురీ చూడవచ్చు. అందమైన పడమటి కనుమల శ్రేణి మైమరిపిస్తుంది. కుమారపర్వతం, పుష్పగిరి, దొడ్డబెట్ట, పట్టబెట్ట పర్వతాలను ఎంతసేపు చూసినా తనివి తీరదు. సాహసక్రీడలను ఆస్వాదించేవారు కుమార పర్వతం అధిరోహణానికి వెళ్లవచ్చు.

ఎలా వెళ్లాలి

సకలేశపుర మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గరగా ఉంది. మంగళూరు, బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో ఆర్టీసీ బస్సులు, క్యాబ్‌లు, టూరిజం విభాగం వాహనాలు వెళ్తాయి. రైలు సౌకర్యం కూడా ఉంది.



సకలేశపురలో అక్కడక్కడా ఉన్న టీ తోటలు



కాఫీ తోటలు



కుమార పర్వతశ్రేణిలో పర్యాటకుల ట్రెక్కింగ్

బసవేశ్వర స్వామి ఆలయం ప్రారంభం



మాట్లాడుతున్న స్వామీజీ

మండ్య: ఆలయాలు దేశ సంప్రదాయాలను చాటి చెబుతాయని ఆదిచుంచనగిరి మఠాధ్యక్షుడు నిర్మలానందనాథ స్వామి అన్నారు. మండ్య జిల్లా మద్దూరు తాలూకా కొప్ప సమీపంలో ఉన్న మారసింగనహళ్లి గ్రామంలో నిర్మించిన శ్రీ బసవేశ్వర స్వామి ఆలయాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న మంత్రి చెలువరాయస్వామి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ భగవంతుడిపై నమ్మకంతో ఉండాలన్నారు. స్వామీజీ చేతుల మీదుగా ఆలయం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం

మైసూరు: తమకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని లేకుంటే ఆత్మహత్య చేసుకుంటామని ఇద్దరు కార్మికులు సంస్థ ఎదుట ధర్నా చేసిన ఘటన మైసూరు జిల్లా నంజనగూడులో చోటుచేసుకుంది. నంజనగూడు కళ్లహళ్లి పారిశ్రామిలేఔట్‌లో ఉన్న న్యూ హారిజన్ కంపెనీలో సురేశ్, నాగన్న 22 ఏళ్లు పనిచేశారు. ఉద్యోగం విడిచి పెట్టిన తరువాత కంపెనీ సెటిల్‌మెంట్ చేయలేదు. దీంతో బాధితులు సురేశ్, నాగన్న పెట్రోల్ బాటిల్‌తో వచ్చి కంపెనీ ఎదుట బైఠాయించారు. తమకు రావాల్సిన బకాయిలు చెల్లించకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.

ప్రత్యేక అలంకరణ



బనశంకరి: భక్తుల మొక్కులు తీర్చే కల్పవల్లి బనశంకరీదేవి సోమవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున ఆలయ అర్చకులు సత్యనారాయణశాస్త్రి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం, అర్చనలు చేపట్టి ప్రత్యేక అలంకరణ విశేష పూజలు చేశారు.

ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రవినారాయణరెడ్డి తదితరులు

గౌరిబిదనూరు: నగర ప్రదేశాలలో సేవా సంస్థలు నిర్వహించే ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకుడు రవినారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం వరకు బజారు రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణంలో బావికట్టి మిత్ర బళగ, సమృద్ధిసేవా ట్రస్ట్, బెంగుళూరు ఆకాశ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. నేటి రోజుల్లో వైద్యం ఎంతో ఖర్చుతో కూడుకున్నదని, పేదలు భరించలేరని అన్నారు. బీజేపీ నగర అధ్యక్షుడు మార్కెట్ మోహన్ మాట్లాడుతూ... ఆకాశ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డు, ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ మహిళా సభ్యులకు తగ్గింపు ధరలతో చికిత్స లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీధర్, రూరల్ అధ్యక్షుడు రమేశ్ రావ్, జయణ్ణ, వేణుమాధవ్, ఆకాశ్ ఆస్పత్రి వైద్యులు శ్రీకాంత్, మణికంఠ, మంజునాథ రావ్, మారుతి, దేవు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సంగీత పాఠశాల పదో వార్షికోత్సవం



పాఠశాల పదో వార్షికోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులను సన్మానించారు.

బొమ్మనహళ్లి: పదేళ్ల క్రితం కేవలం ఇద్దరు విద్యార్థులతో ప్రారంభమైన శ్రీవాణి సంగీత పాఠశాల ప్రస్తుతం సుమారు 120 మందికి పైగా శిక్షణ ఇవ్వడంతో పాటు బెంగళూరు నగరంతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రముఖ నగరాల్లో ప్రదర్శనలు ఇచ్చిన ఈ సంస్థ నృత్య కళాకారులు దేశ విదేశాల్లో సైతం తమ ప్రతిభను నిరూపించుకున్నారని సంగీత పాఠశాల నిర్వాహకులు మధురా అశ్విని ప్రసాద్, ఆశా నాగేష్‌లు తెలిపారు. సోమవారం నగరంలో సంగీత

దేవుడి చిత్తానుసారం సేవలు అందించాలి



ధృవీకరణ పత్రం పొందిన బ్రదర్ సీవీ ప్రకాశ్

శివాజీనగర: సర్వమానవాళి పాప పరిహార నిమిత్తం సిలువపై రక్తం చిందించిన ఏసుక్రీస్తు గురించి సువార్తను అందించే సేవకులు దేవుడి చిత్తానుసారంగా తమ జీవితాలను గడపుతూ ఉత్తమ సేవలు అందించాలని కే.జీ.ఎఫ్ ది హోరేబు తెలుగు అసెంబ్లీ అధ్యక్షుడు, సీనియర్ పాస్టర్ ఎం.సీ.రాజు ఉపదేశించారు. ఆదివారం కేజీఎఫ్ సుభాస్ నగర ది హోరేబు తెలుగు అసెంబ్లీ చర్చిలో బ్రదర్ సీ.వీ.ప్రకాశ్ అభిషేక కార్యక్రమంలో పాస్టర్‌గా అభిషేకం చేసి మాట్లాడారు. సేవకులు తమ వ్యక్తిగత జీవితంలో కళంకం లేకుండగా జీవించాలన్నారు. సంఘంలో సేవకు అంకితమయ్యేవారిని పాస్టర్లు అభిషేకం చేయటం ఎంతో సంతోషకరంగా ఉందని, మరికొందరు కూడా పరిశుద్ధ బైబిల్ గ్రంథం చదివి సేవకు అంకితం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ది హోరేబు తెలుగు అసెంబ్లీ కార్యదర్శి వీ.జార్జ్, పెద్దలు జాన్ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం గురించి ఘర్షణ

- ఎస్‌ఆర్ పాళ్యలో ఉద్రిక్తత



ఇంటి స్థలం వద్ద పోలీసుల పహరా

పావగడ: ఓ ఇంటి స్థలం కోసం రెండు గుంపుల మధ్య ఘర్షణ చెలరేగి దాడులు చేసుకోవడంతో పావగడ తాలూకాలోని ఎస్‌ఆర్ పాళ్య గ్రామం దళితవాడలో ఉద్రిక్తత నెలకొంది. గోవిందరాజు తనకు మంజూరైన గ్రామకంఠం స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి ప్రత్యర్థి నాగరాజు ఇప్పటికే ఆ స్థలం తనకు మంజూరైందని వాదిస్తూ ఆ ఇంటి స్థలంలో నిర్మించిన పునాది రాళ్ళను తొలగించాడు. దీంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. సోమవారం నాగరాజు వర్గీయులు గోవిందరాజు కుటుంబీకులపై దాడులు చేసి ఇద్దరు మహిళలను గాయపరిచారు. రెండు వర్గాలు ఫిర్యాదులు చేయగా 19 మంది పై కేసు నమోదు చేసినట్లు అరసికెర పోలీసులు తెలిపారు. ఇదిలా వుంటే సుమారు 15 సంవత్సరాలుగా ఆ రెండు వర్గాల మధ్య ఈ స్థల వివాదం కొనసాగుతునే ఉంది. స్థానిక తహసీల్దార్ తదితర రెవెన్యూ అధికారులు రెండు వర్గాల మధ్య రాజీ కుదిర్చి సమస్య పరిష్కారానికి ఎన్నిసార్లు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. అల్లర్లు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ధారాసింగ్ తెలిపారు.

హోసూరు వార్తలు..

ఏనుగుల సంచారంతో గుబులు

కెలమంగలం: డెంకణీకోట సమీపంలో రెండు ఏనుగులు సంచరిస్తూ చెరువులో మకాం వేయడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. డెంకణీకోట తాలూకా బాలతోటనపల్లి సమీపంలోని ఉబ్బరాయనపల్లి నంజయ్యన చెరువులో రెండు ఏనుగులు సోమవారం ఉదయం జలకాలాడుతూ ఆ ప్రాంత ప్రజలకు కనిపించాయి. వెంటనే స్థానిక ప్రజలు అటవీశాఖాధికార్లకు సమాచారం అందజేశారు. విషయం తెలుసుకొన్న అటవీశాఖ సిబ్బంది చెరువులోని ఏనుగులను కండగానపల్లి అటవీ ప్రాంతానికి మళ్లించారు. పట్టపగలే ఏనుగుల సంచారంతో బాలతోటనపల్లి, దిన్నూరు, తొట్టి, ఉబ్బరాయనపల్లి, కెంబత్తపల్లి, మేడుముత్తుకోట తదితర గ్రామాల ప్రజలు పొలాలకు వెళ్లాలంటే భయపడుతున్నారు.

వినతుల వెల్లువ

హోసూరు: జిల్లా కేంద్రం కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ శరయు అధ్యక్షతన జరిగిన ఫిర్యాదుల స్వీకారంలో ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. తాగునీరు, రోడ్ల వసతి, మురికి కాల్వల ఏర్పాటు, వృద్ధాప్య పెన్షన్, ఉచిత కుట్టు యంత్రాలు, ఆర్థిక సాయం, పంటల రుణాలు తదితరాలను కోరుతూ 387 వినతులు అందజేశారు. పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని ఆమె అధికారులను ఆదేశించారు.

మానవత్వం చాటుకున్న మంత్రి



క్షతగాత్రుడిని పరిశీలిస్తున్న మంత్రి

మైసూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలో ఉన్న ఇద్దరిని సకాలంలో ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్. వివరాలు...సోమవారం ఉదయం గృహలక్ష్మీ పథకంలో భాగంగా చామరాజనగర జిల్లాలో పలు ముందస్తు సమావేశాల్లో పాల్గొనేందుకు మంత్రి మండ్య బయలుదేరారు. చామరాజనగర సమీపంలోని సంతేమరహళ్లి మెయిన్ రోడ్డులో దొడ్డరాయపేట క్రాస్‌లో బైక్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి ఉన్నారు. దీనిని గమనించిన మంత్రి తన కాన్వాయ్‌ని ఆపి వెంటనే అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. సకాలంలో అంబులెన్స్ అక్కడికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. మంత్రి ఔదార్యాన్ని పలువురు ప్రశంసించారు.

వ్యాపారి కిడ్నాప్, రూ.25 లక్షల లూటీ



బాధితున్ని కిడ్నాప్ చేస్తున్న దృశ్యం, సీసీ కెమెరాలో నమోదైన పుటేజీ

హోసూరు: పోలీసులమని చెప్పి వ్యాపారిని కిడ్నాప్ చేసి అతని వద్ద రూ. 25 లక్షల నగదును లాక్కెళ్లిన దుండగుల ఉదంతమిది. తిరుపత్తూరు జిల్లా పులియనేరి గ్రామానికి చెందిన మేకల వ్యాపారి శరవణన్. 20 ఏళ్లుగా మేకల వ్యాపారం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం కావేరిపట్టణంలో తనకు రావలసిన రూ. 25 లక్షల నగదును వసూలు చేసుకొని బస్సులో హోసూరు సమీపంలోని బత్తలపల్లి ప్రాంతానికి చేరుకొన్నాడు. ఈ సమయంలో నంబర్‌ప్లేట్ లేని కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు తాము పోలీసులమని, గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందిందని, విచారణ జరుపాలని కారులో అతన్ని ఎక్కించుకుని వెళ్లారు. మధ్యలో కొట్టి రూ. 25 లక్షల నగదును లాక్కొని దించి పరారయ్యారు. ఈ ఘటనపై బాధితుడు శరవణన్ హడ్కో పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని కిడ్నాపర్ల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

తెలుగు సాహితీ వేడుక



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వక్తలు

హోసూరు: హోసూరు కామరాజ్‌కాలనీలోని ఆంధ్ర సాంస్కృతిక సమితి భవనంలో సాహితీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ అగరం వసంత్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విశాఖపట్నంకు చెందిన కవి సన్యాసిరావు, బెంగళూరుకు చెందిన కవి దేవిప్రియ, తెలుగు భాషాభిమాని, గాయకుడు, కవి, సంగీత, సాహిత్య కళాకారుడు హేమభూషణం తదితరులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం హర్షదాయకమని, మాతృభాషను కాపాడుకోవడం ఎంతైనా అవసరముందని సూచించారు. ఈ సందర్భంగా హసరిచంద్ర ఘట్టంపై పద్య పఠనం, సంగీత విభావరి వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

రాజకీయ ద్వేషంతో విచారణ చేయం : డీసీఎం

శివాజీనగర: కోవిడ్ కాలంలో కొనుగోలు చేసిన వాటిలో భారీ అవినీతి జరిగిందని, దీనికి సంబంధించి విచారణ చట్టపరిధిలో చేస్తామని, దీనిలో ఎటువంటి రాజకీయ ద్వేషం లేదని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ...బీజేపీ వారు అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారం వ్యవహరించారని, దీనికి సంబంధించి చట్టపరంగా కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంతకు ముందు కాంట్రాక్టర్ సంతోష్ పాటిల్ ఆత్మహత్య విషయంలో ఆరోపణలు ఎదుర్కొన్న మాజీమంత్రి ఈశ్వరప్ప నిజాయితీగా బయటకు వస్తారని బీజేపీ నేతలు ముందుగా ప్రకటించారని, తాము అలా చేయమన్నారు. ఇంతకు ముందు తనపై తప్పుడు ఆరోపణలను చేసి చర్యలు తీసుకున్నారు కదా, జైలుకు పంపలేదా, తాము ఇప్పటికీ దానిని అనుభవిస్తున్నామని డీకే శివకుమార్ తెలిపారు. బీజేపీ వారు నిజాయితీగా ఉంటే విచారణ పట్ల భయమెందుకని ప్రశ్నించారు.

అభివృద్ధి పనులకు ఆదేశాలు



బసవరాజ్‌కు ఆదేశపత్రం అందజేస్తున్న కమిషనర్ బసవ రాజేంద్ర

బనశంకరి: బనశంకరి పరిధిలోని ఈశ్వరనగర వద్ద గల శ్రీ బనశంకరీదేవి ఆలయ ప్రాంతంలో ప్రహరీ నిర్మాణం, కొత్త రథంతో పాటు ఆలయ సేవలకు ఆన్‌లైన్ అప్లికేషన్, మరుగుదొడ్లు, మార్కెట్ స్థలం ఆధునీకరణ తదితర పనులకు దేవాదాయ శాఖ కమిషనర్ బసవరాజేంద్ర ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బనశంకరీ ఆలయ వ్యవస్థాపక సమితి అధ్యక్షుడు బసవరాజ్‌కు ఆదేశ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర స్థానిక సహాయకురాలు పద్మ, సమితి సభ్యులు హెచ్.హనుమంతరాయప్ప, సుగుణాబాలకృష్ణ, చంద్రు, విజయ్ పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం



బనశంకరి: బెంగళూరు జ్ఞానజ్యోతి సభాంగణంలో సోమవారం కర్ణాటక ఆర్యవైశ్య మహామండలి స్థాపక అధ్యక్షుడు టీఏ.శరవణ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు– 2023 ప్రదానోత్సవం జరిగింది. ఎస్ఎస్ఎల్సీ, పీయూసీలో 90 కిపైగా మార్కులు సాధించిన 1000 మంది విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. ప్రతి విద్యార్థికి రూ.5 వేల చెక్కు, ఆహూతులకు తిరుపతి లడ్డూలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి గిరీశ్, ఐపీఎస్ ఆర్.శ్రీనివాస్‌గౌడ కేఏఎస్ దీపశ్రీ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ విక్రేతల అరెస్ట్

యశవంతపుర: మంగళూరు నగరంలో మత్తు పదార్థాలను విక్రయిస్తున్న ఇద్దరిని సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు సురత్కల్‌కు చెందిన షాకీబ్, నిసార్ హుసైన్‌లను అరెస్ట్ చేశారు. వీరి నుంచి 2.60 లక్షలు విలువైన 52 గ్రాముల ఎండిఎంఏతో పాటు కారు, కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా...

రవాణా, పర్యాటక, సాంస్కృతిక స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ : రవాణా, పర్యాటక, సాంస్కృతిక స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి మరోసారి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాజ్యసభ సచివాలయం బులెటిన్ విడుదల చేసింది. ఈ కమిటీలో 31 మంది సభ్యులు ఉన్నారు. కమిటీ చైర్మన్‌గా ఆయా శాఖల వ్యవహారాలను విజయసాయిరెడ్డి సమీక్షించనున్నారు.

సీఆర్డీఏ పరిధిలో లేఅవుట్ నిబంధనల సడలింపు

సాక్షి, అమరావతి: ఏపీ సీఆర్డీఏ పరిధిలోని లేవుట్ అభివృద్ధి నిబంధనలను సడలిస్తూ పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో గ్రామం నుంచి 500 మీటర్ల పరిధిలో మాత్రమే లే అవుట్లను అభివృద్ధి చేయాలని నిబంధన ఉంది. ఈ పరిధి దాటితే నిర్మాణ అనుమతులు సైతం రావడం లేదు. దీంతో అనుమతి లేని లేఅవుట్లు పెరిగిపోవడంతో వాటిని కొన్న సామాన్యులు ఇబ్బందులకు గురవుతున్నారు. సాధారణ ప్రజల విజ్ఞప్తి మేరకు ఈ నిబంధనను తొలగిస్తూ మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సీఆర్డీఏ పరిధిలోని ఏ ప్రాంతంలోనైనా లే అవుట్‌ను అభివృద్ధి చేసుకునే వెసులుబాటు లభించినట్లయింది.

లోకేశ్ నుంచి నాకు ప్రాణహాని..

- నాపేరు ఆయన రెడ్ బుక్‌లో రాసుకున్నాడు
- హైదరాబాద్‌కు చెందిన ఆకుల వెంకటేశ్వరరావు ఆందోళన



సాక్షి, న్యూఢిల్లీ : టీడీపీ అధినేత చంద్రబాబు కుమారుడు నారా లోకేశ్ నుంచి తనకు ప్రాణ హాని ఉందని హైదరాబాద్‌కు చెందిన ఆకుల వెంకటేశ్వరరావు ఆరోపించారు. తనకు న్యాయం చేయడంపై చంద్రబాబును కలవడానికి పదేళ్లుగా ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలవడానికి చంద్రబాబు వెళ్తుండగా.. తనకు న్యాయం చేయాలంటూ వెంకటేశ్వరరావు నినాదాలు చేశారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ చంద్రబాబు తనను పట్టించుకోలేదంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. బంజారాహిల్స్‌లో తన 400 గజాల స్థలాన్ని చంద్రబాబు మనిషి కేఎల్ నారాయణ లాక్కున్నారని, దీనిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తన పేరును లోకేశ్ రెడ్ డైరీలో రాసుకున్నారని, ఆయన నుంచి ప్రాణ హాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 33 ఏళ్లుగా టీడీపీ కోసం పనిచేసి ఆస్తులు పోగొట్టుకుని రోడ్డున పడ్డానని, జూబ్లీహిల్స్ కార్పొరేటర్‌గా పోటీ చేసి రూ.కోట్లలో పోగొట్టుకున్నట్టు తెలిపారు. పార్టీ లేదు.. బొక్కా లేదు.. అన్న అచ్చెన్నాయుడిని మాత్రం పార్టీలో ఉంచారని ఆకుల వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

హింసను ప్రోత్సహిస్తున్న టీడీపీ గుర్తింపును రద్దు చేయాలి

కేంద్ర ఎన్నికల సంఘానికి నవ సమాజ్ పార్టీ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో హింసాత్మక కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న టీడీపీ గుర్తింపు రద్దు చేయాలని సోమవారం కేంద్ర ఎన్నికల సంఘానికి నవ సమాజ్ పార్టీ అధ్యక్షుడు చంద్రమౌళి వినతిపత్రం ఇచ్చారు. నెల్లూరు జిల్లా కందుకూరు, గుంటూరు, చిత్తూరు జిల్లా పుంగనూరు తదితర ప్రాంతాల్లో టీడీపీ అధినేత చంద్రబాబు సభలు, ర్యాలీల్లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలను ప్రస్తావించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం రాజకీయ పార్టీలు హింసను ప్రోత్సహించరాదని, ఆయా ఘటనలను దృష్టిలో ఉంచుకుని టీడీపీ గుర్తింపును రద్దు చేయాలని వినతిపత్రంలో చంద్రమౌళి కోరారు.

ఆధార్ సీడింగ్ చేస్తేనే పీఎం కిసాన్ లబ్ధి

వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ ద్వివేది

సాక్షి, అమరావతి: పీఎం కిసాన్ లబ్ధి పొందాలంటే రాష్ట్ర వెబ్ ల్యాండ్‌లోని భూమి వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేయించుకోవాల్సిందేనని వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది స్పష్టంచేశారు. రాష్ట్రంలో 1.9 లక్షల మంది పీఎం కిసాన్ లబ్ధిదారులు ఇంకా తమ భూమి వివరాలను వెబ్ ల్యాండ్‌తో ఆధార్ అనుసంధానం చేయించుకోవాల్సి ఉందన్నారు. సీసీఎల్ఏ కమిషనర్ సాయిప్రసాద్, అదనపు కార్యదర్శి మహ్మద్ ఇంతియాజ్, వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరు హరికిరణ్‌లతో కలిసి ఆయన సోమవారం మంగళగిరి నుంచి జిల్లా కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వెబ్‌ల్యాండ్‌లో భూమి కలిగి ఆధార్ సీడింగ్ కాని రైతులు మ్యుటేషన్ తర్వాత తమ భూమి వివరాలకు ఆధార్ నంబర్ లింకు చేయించుకునేందుకు వీఆర్వో లాగిన్‌లలో అవకాశం కల్పించారని ద్వివేది తెలిపారు. ఈ ప్రక్రియను రెండు వారాల్లోపు పూర్తి చేయాలన్నారు. అర్హత లేని రైతులను పీఎం కిసాన్ పోర్టల్‌లో అనర్హులుగా గుర్తించాలని అధికారులకు సూచించారు.

చిరస్మరణీయుడు

- దేశ రాజకీయాల్లో ఎన్టీఆర్‌ది ప్రత్యేక అధ్యాయం
- సినిమాను, సంస్కృతిని సుసంపన్నం చేశారు.
- ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ పలు కార్యక్రమాలు చేపట్టారు

ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



ఎన్టీఆర్ స్మారక రూ.100 నాణెం విడుదల చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము. పక్కన ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు

సాక్షి, న్యూఢిల్లీ: తన అసాధారణ వ్యక్తిత్వంతో దివంగత ఎన్టీఆర్ దేశ రాజకీయాల్లో ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. రామాయణ, మహాభారతంలోని పాత్రలకు ప్రాణం పోసి భారతీయ సినిమాను, సంస్కృతిని సుసంపన్నం చేశారని కొనియాడారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్‌పై రూపొందించిన రూ.100 స్మారక నాణెంను ఆమె విడుదల చేసి మాట్లాడారు.

రిక్షా దిగి నేలకు నమస్కారం..

'ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ప్రత్యేక నాణెం ముద్రించాలని కేంద్ర ఆర్థిక శాఖ నిర్ణయించింది. ఈ ప్రక్రియను ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ముందుకు తీసుకెళ్లారు. ఆమెకు ప్రత్యేక అభినందనలు. ఓ గొప్ప వారసత్వానికి ఆమె వారసురాలు. ఎన్టీఆర్ తెలుగు సహా పలు భారతీయ భాషల్లో తన నటనా చాతుర్యాన్ని ప్రదర్శించారు. నటుడు, ప్రజా సేవకుడు, నాయకుడు ఇలా అన్నింటా ఆయన ప్రజాదరణ పొందారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఆయన చేపట్టిన పలు కార్యక్రమాలు నేటికీ గుర్తుంటాయి' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

అన్ని తరాలకు ఆదర్శ హీరో: పురందేశ్వరి

తన తండ్రి ఎన్టీఆర్ ఒక్క తరానికి మాత్రమే కాకుండా అన్ని తరాలకు ఆదర్శ హీరో అని ఏపీ బీజేపీ



బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో చంద్రబాబు ముచ్చట్లు

అధ్యక్షురాలు పురందేశ్వరి చెప్పారు. సినీ, రాజకీయ రంగాల్లో ప్రత్యేక ముద్రతోపాటు మహిళలకు ఆస్తి హక్కు కల్పించింది ఎన్టీఆర్ అని గుర్తు చేశారు.

నేటి నుంచి మూడు చోట్ల విక్రయాలు

ఎన్టీఆర్ స్మారక నాణెం మంగళవారం నుంచి హైదరాబాద్‌లోని మూడు ప్రాంతాల్లో అందుబాటులో ఉంటుందని మింట్ అధికారులు తెలిపారు. ఓ వ్యక్తి స్మారకార్థం నాణెం హైదరాబాద్‌లో రూపొందించడం ఇదే తొలిసారని హైదరాబాద్ మింట్ చీఫ్ జనరల్ మేనేజర్ వీఎన్ఆర్ నాయుడు చెప్పారు. నాణెం తయారీలో 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్ వినియోగించామన్నారు. రూ.100 నాణెం అయినప్పటికీ దీని ధర రూ.3,500 నుంచి రూ.4,850 వరకు ఉండవచ్చన్నారు. ప్యాకింగ్ మెటీరియల్‌ను బట్టి ధర వేర్వేరుగా ఉంటుందన్నారు. స్మారక నాణెం కాబట్టి చలామణీలో ఉండదని స్పష్టం చేశారు. తొలి విడతలో 12వేల నాణేలను రూపొందించామని, 50 వేల నాణేల వరకు డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్, చర్లపల్లి మింట్, మింట్ మ్యూజియం వద్ద విక్రయాలు నిర్వహిస్తామని తెలిపారు.

జీవిత విశేషాలతో వీడియో..

ఎన్టీఆర్ జీవిత విశేషాలతో కూడిన 20 నిమిషాల వీడియోను రాష్ట్రపతి భవన్‌లోని సాంస్కృతిక కేంద్రంలో ప్రదర్శించారు. స్మారక నాణెం విడుదల కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, నారా బ్రాహ్మణి, నందమూరి కుటుంబ సభ్యులు, ఎంపీలు కనకమేడల రవీంద్రకుమార్, రామ్మోహన్ నాయుడు, కేశినేని నాని, సీఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వెల్‌కమ్ బాస్..!!



బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో చంద్రబాబు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి, సీఎం రమేశ్

- చంద్రబాబుకు స్వాగతం పలికిన సీఎం రమేశ్, సుజనా
- జేపీ నడ్డా పక్క సీట్లో కూర్చుని కొద్దిసేపు బాబు మంతనాలు
- పురందేశ్వరితో కలసి రాజకీయాలపై చర్చ

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రపతి భవన్‌లో సోమవారం ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదల కార్యక్రమానికి హాజరైన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో టీడీపీ అధినేత చంద్రబాబు మాట కలిపారు. నాణెం విడుదల కార్యక్రమానికి 15 నిమిషాల ముందే రాష్ట్రపతి భవన్ చేరుకున్న చంద్రబాబుకు టీడీపీ మాజీ నేతలు, ప్రస్తుతం బీజేపీలో ఉన్న ఎంపీ సీఎం రమేశ్, సుజనా చౌదరి స్వాగతం పలికారు. చంద్రబాబును స్వయంగా తీసుకెళ్లి వేదిక ముందు వరుసలో కూర్చోబెట్టారు. జేపీ నడ్డా సైతం కార్యక్రమానికి హాజరవుతున్న నేపథ్యంలో చంద్రబాబు పక్క సీటును ఖాళీగా ఉంచారు. అనంతరం జేపీ నడ్డా హాల్‌లోకి రాగానే సీఎం రమేశ్ ఆయనకు ఆహ్వానం పలికి చంద్రబాబు పక్కన కూర్చోబెట్టారు. పరస్పరం పలకరించుకున్న నడ్డా, చంద్రబాబు కార్యక్రమం ముగిసిన అనంతరం సైతం అక్కడే కొద్దిసేపు ముచ్చటించారు. నడ్డాను విడిగా కలిసేందుకు చంద్రబాబు సమయం కోరినట్లు తెలిసింది.

తేనీటి విందులో ముగ్గురు..

ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం అక్కడే నిర్వహించిన తేనీటి విందుకు జేపీ నడ్డా, చంద్రబాబును ఆహ్వానించిన బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కొద్దిసేపు రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడుకున్నారు. చంద్రబాబు ఏపీలో రాజకీయ పరిస్థితులతోపాటు ఓటర్ల నమోదు ప్రక్రియలో అక్రమాలు జరిగాయని నడ్డా దృష్టికి తెచ్చినట్లు అక్కడ ఉన్న నేతలు పేర్కొన్నారు. వలంటీర్ వ్యవస్థను రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నారని, టీటీడీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారని పురందేశ్వరి, చంద్రబాబులు నడ్డాకు ఫిర్యాదు చేసినట్లు ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది. సుమారు 10 – 15 నిమిషాల పాటు జరిగిన ఈ చర్చలో ఇతర రాజకీయ అంశాలు సైతం ప్రస్తావనకు వచ్చినట్లు చెబుతున్నారు.


ఏపీలో ఓట్ల పరిశీలనకు కమిటీ వేయండి

- కేంద్ర ఎన్నికల సంఘానికి చంద్రబాబు విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఓట్లు పరిశీలనకు హైలెవెల్ కమిటీ వేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ అధినేత చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి ఐఏఎస్‌లను పంపి ఓటర్ల జాబితా తనిఖీ చేయించాలన్నారు. పరిశీలకుల్ని కూడా పంపాలన్నారు. ఓటరు జాబితాలు క్షుణ్నంగా పరిశీలన జరిపిన తర్వాతే రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. చంద్రబాబు సోమవారం ఇక్కడ కేంద్ర ఎన్నికల సంఘం అధికారులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఓటరు జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయని, తమ వద్ద ఆధారాలు ఉన్నాయంటూ ఓ వినతి పత్రం అందజేశారు. అనంతరం టీడీపీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. 2019 ఎన్నికల తర్వాత పార్లమెంటు ఉప ఎన్నిక, ఎమ్మెల్సీ తదితర నాలుగు ఎన్నికల్లో అనేక అవకతవకలు జరిగాయని అన్నారు. ఎన్నికల విధుల్లోకి ఉపాధ్యాయుల్ని కాకుండా పంచాయతీ సెక్రటేరియట్ ఉద్యోగుల్ని తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోందన్నారు. వలంటీర్లు టీడీపీ ఓట్లు తొలగిస్తున్నారని చెప్పారు. ఈ విషయం విని ఎన్నికల అధికారులు షాక్ అయ్యారని చంద్రబాబు తెలిపారు. పలు చోట్ల వేలాది ఓట్లు తీసేశారని సాక్ష్యాధారాలతో సహా ఎన్నికల అధికారులకు అందజేశామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లోగా ఓటరు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయాలని అన్నారు. నాలుగున్నర సంవత్సరాల ముందు ఏదో జరిగిపోయిందంటూ అధికార పార్టీ డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నారని, తనకే రక్షణ లేకుండా పోయిందని మీడియాతో ఆవేదన వెళ్లగక్కారు. 45 ఏళ్ల తన రాజకీయ చరిత్రలో ఎన్నికల సంఘాన్ని ఎన్నోసార్లు కలిశానని, కానీ ఇలాంటి విచిత్ర సమస్య ఇప్పుడే వచ్చిందని తెలిపారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇచ్చే వరకూ కేంద్రంపై పోరాటం చేస్తామని చంద్రబాబు చెప్పారు.

ఎన్టీఆర్ కుటుంబాన్ని వాడుకునేందుకే చంద్రబాబు కుట్ర

ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



కాకినాడ రూరల్: ఎన్టీఆర్ కుటుంబాన్ని రాజకీయంగా మళ్లీ వాడుకునేందుకే చంద్రబాబు కుట్ర చేస్తున్నారని మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు విమర్శించారు. కాకినాడలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్ ఎన్నిబాధలు పడ్డారో రాష్ట్రం అంతా చూసిందన్నారు. మనోవేదనతోనే ఆయన మరణించారన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎన్టీఆర్‌ను కొత్తగా మార్కెట్ చేసేందుకు స్మారక నాణెం విడుదల కార్యక్రమం పేరిట చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన మొదటిసారి ఎన్టీఆర్ ఫొటోను తీసేశారన్నారు.

పురందేశ్వరి టీడీపీ ఏజెంట్

- ఎన్నికల కోసం ఎన్టీఆర్ బొమ్మతో రూ.100 నాణేల పేరిట నాటకం
- ఇది ఎటువంటి కార్యక్రమమైనా ఎన్టీఆర్ భార్యగా నాకు ఆహ్వానం అందాలి
- ఎన్టీఆర్ భార్య నందమూరి లక్ష్మీపార్వతి

సాక్షి, అమరావతి: ఏపీ బీజేపీ అధ్యక్షురాలి హోదాలో పురందేశ్వరి టీడీపీ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని తెలుగు, సంస్కృత అకాడెమీ అధ్యక్షురాలు, మాజీ సీఎం ఎన్టీఆర్ భార్య నందమూరి లక్ష్మీపార్వతి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలైనప్పటికీ, ఆమె చంద్రబాబు స్క్రిప్టునే చదువుతున్నారన్నారు. ఎన్నికల కోసం వారిద్దరూ కలిసిపోయారని, సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మూకుమ్మడిగా విష ప్రచారం చేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల తర్వాత ప్రజా తీర్పును చూసి చంద్రబాబు, పురందేశ్వరి మూటాముల్లె సర్దుకుని ఊరేగాల్సిందేనని ఎద్దేవా చేశారు. లక్ష్మీపార్వతి సోమవారం మంగళగిరిలో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచి పదవిని లాక్కోవడంలో పురందేశ్వరి ప్రధాన కుట్రదారని ఆరోపించారు. రాజకీయాల్లోకి వస్తానంటే ఎన్టీఆర్ వద్దన్నారన్న కోపంతోనే ఆమె ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టారని అన్నారు. చంద్రబాబు పార్టీలో కుట్రలు చేస్తుంటే.. పురందేశ్వరి, భువనేశ్వరి అమాయకులైన తోబుట్టువు (ఎన్టీఆర్ కొడుకులు)లకు మాయ మాటలు చెప్పి కుటుంబంలో తండ్రిపై వ్యతిరేకత తీసుకొచ్చారని తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్‌కు 'భారతరత్న' ఇవ్వాలనుకుంటే పురందేశ్వరి అడ్డుకున్నారని చెప్పారు. చట్టప్రకారం ఎన్టీఆర్ భార్యగా తానే భారతరత్నను అందుకుంటాననే ఇలా చేశారని అన్నారు. చంద్రబాబు, పురందేశ్వరి స్వార్థ రాజకీయాల కోసం ఎన్టీఆర్ పేరును మరింత దిగజారుస్తున్నారని చెప్పారు. ఇప్పుడు ఎన్టీఆర్ బొమ్మతో రూ.100 నాణెం పేరిట నాటకాలాడుతున్నారని తెలిపారు.

వదిన, మరిది కలిసిపోయారు

గతంలో పార్లమెంట్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తే చంద్రబాబుని ఆహ్వానించని పురందేశ్వరి.. ఇప్పుడెలా రూ.100 నాణెం కార్యక్రమానికి పిలుస్తారని నిలదీశారు. అప్పట్లో విగ్రహం ఏర్పాటును ఎవరికి వారు ఖాతాల్లో వేసుకునే ప్రయత్నం చేయలేదా.. అని ప్రశ్నించారు. ఇప్పుడు చంద్రబాబు స్క్రిప్టునే వదిన చదవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో ఇలాంటి వాళ్ల వల్లే బీజేపీ నాశనం అయిందని, ఇప్పుడైనా బీజేపీ పెద్దలు గ్రహించాలని సూచించారు. ఎన్టీఆర్‌పై రూ.100 నాణేన్ని కేంద్ర ప్రభుత్వమే విడుదల చేస్తే ఆయన చట్టబద్ధమైన అర్ధాంగిగా తనను ఆహ్వానించాలన్నారు. ప్రైవేటు కార్యక్రమం అయినా కూడా ఎన్టీఆర్ కుటుంబంలో తానే ప్రథమ వ్యక్తినని చెప్పారు. దీనిపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి సీతారామన్‌కు లేఖ రాసినప్పటికీ సమాధానం రాలేదన్నారు.

అలాగైతే ఎన్టీఆర్ యుగపురుషుడా?

ఎన్టీఆర్ తనను వివాహం చేసుకోలేదని టీడీపీ దుర్మార్గపు ప్రచారం చేస్తోందని అన్నారు. ఎన్టీఆర్ జ్ఞాపకార్థం రూ.100 నాణెం విడుదల కార్యక్రమానికి తనను రానివ్వకుండా పురందేశ్వరి అడ్డుకున్నారని చెప్పారు. మరి ఎన్టీఆర్ నాతో ఇల్లీగల్‌గా జీవించారా? అలా అయితే ఇల్లీగల్ పనులు చేసే వ్యక్తి యుగ పురుషుడు ఎలా అవుతారని, దీనికి ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, టీడీపీ సమాధానం చెప్పాలని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. తిరుపతిలో బహిరంగంగా ప్రకటించిన తర్వాతే ఎన్టీఆర్ 1993లో శ్రేయోభిలాషుల మధ్య దైవసాక్షిగా తనను వివాహం చేసుకున్నారని చెప్పారు. అప్పటి పత్రికలు వార్తలు రాయడంతోపాటు అనేకసార్లు ఎన్టీఆర్ బహిరంగంగా తమకు వివాహమైనట్టు ప్రకటించారన్నారు. ఇప్పుడు తండ్రికి వెన్నుపోటు పొడిచిన వ్యక్తులు కుటుంబ సభ్యులుగా చెలామణీ అవుతుంటే తాను జీవితాంతం ఎన్టీఆర్ భార్యనని మెడలో బోర్డు కట్టుకుని తిరగాలా.. అంటూ నిలదీశారు.

చంద్రబాబు, పురందేశ్వరిని తరమికొడతా

రాష్ట్రం నుంచి చంద్రబాబు, పురందేశ్వరిని తరమికొట్టడమే లక్ష్యంగా తాను ఎన్టీఆర్ కుటుంబంపై పోరాటం చేస్తానని లక్ష్మీపార్వతి హెచ్చరించారు. 'వచ్చే ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో పర్యటిస్తా. ఎన్టీఆర్‌ను ఏ విధంగా కుటుంబం మోసం చేసిందో ఆయనే ఆవేదనతో చెప్పారు. ఆ మాటలనే ఊరూరా ప్రచారం చేస్తా. నేను రాకుంటే ఎన్టీఆర్ లేచి నిలబడేవారా? మీరు బిడ్డలుగా ఆయన్ని ఏనాడైనా చూశారా? ఇప్పుడు నన్ను చులకన చేస్తూ ఎన్టీఆర్‌ను అవమానిస్తున్నారు. అందరికీ రావాల్సిన తెలివితేటలు పురందేశ్వరికి మాత్రమే వచ్చాయని ఎన్టీఆర్ చెబుతుండేవారు. తండ్రి మరణానంతరం పురందేశ్వరి కాంగ్రెస్‌లో చేరి కేంద్ర మంత్రిగా భారీ అవినీతికి పాల్పడ్డారు' అని లక్ష్మీపార్వతి చెప్పారు.

బాబు ఫిర్యాదే ఓ బోగస్

- వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి
- బాబు దొంగ ఓట్లపై సీఈసీకి ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: దొంగ ఓట్ల నమోదులో ప్రపంచ ఛాంపియన్ అయిన చంద్రబాబు బోగస్ ఫిర్యాదులు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ఎద్దేవా చేశారు. దొంగే.. దొంగా..దొంగా అనడానికి సరైన అర్థం చంద్రబాబు అని తెలిపారు. ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి తిరిగి అదే ఎన్టీఆర్‌కు పూలమాల వేయగలగడం చంద్రబాబుకే సాధ్యమన్నారు. ఎన్టీఆర్‌ను బతికున్న రోజుల్లో బాగా చూసుకున్న వారిని వదిలేసి.. ఆయన్ని వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు ఈరోజు ఎన్టీఆర్ పేరుతో రూపొందించిన రూ.100 నాణెం ఆవిష్కరణ సభలో పాల్గొనడం చాలా ఆశ్చర్యంగా ఉందని చెప్పారు. విజయసాయిరెడ్డి సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ ఎంపీలతో కలిసి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ బృందంతో భేటీ అయ్యారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో దొంగ ఓట్లు ఎలా నమోదయ్యాయో ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించడంపై చర్చించారు. దొంగ ఓట్ల నమోదుపై టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

2015 నుంచి టీడీపీ దొంగ ఓటర్ల వివరాలిచ్చాం

చంద్రబాబు హయాంలో జరిగిన దొంగ ఓటర్ల మాల్‌ప్రాక్టీస్‌పై ఎన్నికల సంఘం అధికారులతో సుదీర్ఘంగా చర్చించాం. అధికారులు సానుకూలంగా స్పందించారు. బాబు హయాంలో మా పార్టీ ఓట్ల గల్లంతు, టీడీపీ వ్యక్తుల దొంగ ఓట్లపై అన్ని ఆధారాలతో ఎన్నికల సంఘానికి వివరించాం. ఉదాహరణకు లక్ష్మి అనే మహిళ పేరును రకరకాల స్పెల్లింగ్‌లతో, వయస్సులు, ఇంటిపేర్లు, భర్త పేర్లు, డోర్‌నెంబర్ సబ్‌డివిజన్ చేసి .. ఇలా రకరకాల మార్పులతో అనేక ఓట్లుగా చంద్రబాబు ఎలా చేర్పించారో ఆధారాలతో అందించాం. ఎన్నికల కమిషన్ ఉన్నతాశయాలను దుర్వినియోగం చేస్తూ రోడ్లపై అనాథల్లా తిరిగే వారిని, స్థిరనివాసం లేని సంచారులను సైతం ఏదొక డోర్ నెంబర్ మీద ఓటర్లుగా చేర్చి పెట్టుకున్నాడు చంద్రబాబు. 2015 నుంచి 2017 వరకు అన్ని వివరాలు ఇచ్చాం. 2019 ఎన్నికలకు ముందు 3.98 కోట్ల మంది ఓటర్లు ఉంటే.. ఈ రోజుకు 3.97 కోట్ల ఓటర్లు ఉన్నారు. తేడా లక్ష మాత్రమే. సగటున ప్రతి వెయ్యి మందికి ఓటర్ల వివరాల్ని చూశాం. రాష్ట్రంలో 63 నియోజకవర్గాల్లో 20 చోట్ల 15,800 దొంగ ఓట్లు నమోదైనట్లు తేలింది. 40 నియోజకవర్గాల్లో 5,800 నుంచి 6,000 వరకు దొంగ ఓట్లు తేలాయి. ఇవన్నీ ఏయే జిల్లాల్లో ఏ ఏ నియోజకవర్గాల్లో ఉన్నాయో టేబుల్ రూపంలో అందించాం. ఓటర్ల జాబితాలో వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు. చంద్రబాబు ఆనాడు ఏ విధంగానైతే రాజకీయంగా ఓటర్ల జాబితాలను తారుమారు చేశాడో.. ఆ విధానాల్ని మా పార్టీ అమలు చేయలేదు. చంద్రబాబు ఓటర్ల జాబితాలపై ఎందుకు వణుకుతున్నాడో కూడా ఎన్నికల సంఘానికి వివరించాం. 2019 ఎన్నికలకు ముందు చేర్చిన దొంగ ఓటర్లే ఈనాటి దాకా జాబితాలో ఉన్నారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో జాబితాలపై రీసర్వే చేస్తూ.. ఆధార్‌తో ఓటర్ ఐడీని లింక్ చేస్తే ఆయన దొంగ ఓట్లన్నీ బయటకొస్తాయి. ఇదే జరిగితే మరోసారి ఆయన ఓటమి ఖాయం. ఆ ఫ్రస్టేషన్‌తోనే వైఎస్సార్‌సీపీపై ఎన్నికల సంఘానికి తప్పుడు ఫిర్యాదు ఇచ్చారు.



మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి. పక్కన ఎంపీలు అయోధ్యరామిరెడ్డి, మాగుంట, భరత్, సత్యవతి, శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే చెవిరెడ్డి

నాడు సేవా మిత్ర.. నేడు మై టీడీపీ యాప్‌తో

గతంలో సేవామిత్ర యాప్ ద్వారా ఇతర పార్టీల సానుభూతిపరులెవరో తెలుసుకొని, వైఎస్సార్‌సీపీ ఓటర్లను జాబితాల్లో నుంచి తొలగించారు. ఈ విషయం తెలుసుకుని మేం ఆనాడు పోరాటం చేశాం. ఇప్పుడు అదే బాటలో 'మై టీడీపీ' యాప్ అంటూ ఓటర్ల నుంచి ఎలాంటి సమాచారాన్ని సేకరిస్తున్నారో, దానిని చంద్రబాబు ఎలా దుర్వినియోగం చేస్తున్నారో ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాం. అశోక్ దాకవరం అనే వ్యక్తి టీడీపీ తరఫున ఓటర్ల సమాచారాన్ని సేకరించడం, దాంతో ఓటర్‌కు తెలియకుండానే ఓటు తొలగింపు, కొత్త ఓటర్లను చేర్చుకొనే దరఖాస్తుల్ని ఎలా మేనేజ్ చేస్తున్నాడో ఆధారాలతో సహా వివరించాం. ఓటరు సర్వేలో అభ్యంతరకరమైన ప్రశ్నలతో చంద్రబాబు మెథడాలజీని అశోక్ అమలు చేస్తున్నారు. ఓటర్ పొలిటికల్ ప్రిఫరెన్స్, పార్టీ ఛాయిస్‌తో ఏం సంబంధం ఉందని అశోక్ అడుగుతున్నారు? అతని అవసరమేంటి? ఓటరు కులం ఏమిటో కూడా అడుగుతున్నారు. దీన్నిబట్టి చంద్రబాబులో కుల ఉన్మాదం ఎంతగా పెరిగిందో అర్థమవుతుంది. సభ్య సమాజంలో ఏ వ్యక్తి, ఏ నాయకుడైనా ఓటరును కులం అడగగలరా? ఇవి చాలా నేరపూరితమైన విషయాలుగా వైఎస్సార్‌సీపీ భావిస్తోంది. ఇదే విషయాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాం.

పారదర్శక ఓటర్ల జాబితా వైఎస్సార్‌సీపీ సిద్ధాంతం

బోగస్ ఓట్లను ఏరివేయాలని, పూర్తి పారదర్శకంగా ఓటర్ల జాబితాతో ఎన్నికలు జరగాలనేది వైఎస్సార్‌సీపీ సిద్ధాంతం. ఇదే విషయాన్ని ఎన్నికల సంఘం అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ముందు ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచాం. ఓటరు ఐడీతో ఆధార్ కార్డు లింకు చేయాలని కోరాం. దీనిద్వారా చంద్రబాబు దొంగ ఓట్లు చేర్పించే దురాలోచనకు బ్రేకులు పడతాయి. అదేవిధంగా ఆధార్ లింకుతో బయోమెట్రిక్ సదుపాయం ఉంటుంది. ఒక వ్యక్తికి ఒకే ఓటు (వన్ సిటిజన్.. వన్ ఓట్) అనే వైఎస్సార్‌సీపీ సిద్ధాంతం నెరవేరుతుంది. చంద్రబాబు ఈరోజు వైఎస్సార్‌సీపీ దొంగ ఓట్లు చేరుస్తోందంటూ దొంగే.. దొంగా, దొంగా.. అన్నట్లు రంకెలేస్తున్నారు. వాస్తవానికి ఆయన ఓటర్ల జాబితా మాల్‌ప్రాక్టీస్‌పై మేము వైఎస్సార్‌సీపీ తరఫున 2018లోనే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం. 2014 నుంచి నేటి వరకు ఓటర్ల జాబితాలపై ప్రత్యేక విచారణ చేయాలని కోరుతున్నాం. దొంగ ఓట్లు చేర్చడం, నిజమైన ఓటర్ల వివరాల గల్లంతుకు ఎవరు పాల్పడ్డారనే వాస్తవాన్ని నిగ్గు తేల్చాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశాం.

జనం లేక లోకేశ్ పాదయాత్ర వెలవెల

లింగపాలెం/చింతలపూడి: ఏలూరు జిల్లా లింగపాలెం, చింతలపూడి మండలాల్లో సోమవారం నారా లోకేశ్ పాదయాత్ర జనం లేక వెలవెలబోయింది. లింగపాలెం మండలంలోని సుందరరావుపేట నుంచి లోకేశ్ పాదయాత్ర ప్రారంభించారు. అక్కడి నుంచి చింతలపూడి మండలం వెలగలపల్లి, ఫాతిమాపురం గ్రామాల మీదుగా చింతలపూడి శివారు క్యాంప్ సైట్‌కు చేరారు. ఎస్‌ఎంఎస్ కాలనీ సమీపంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని లోకేశ్ ప్రారంభించారు. పాదయాత్రలో నాయకులు, యువగళం టీం సభ్యులు మినహా స్థానిక ప్రజలు ఎక్కడా పెద్దగా కనిపించలేదు. అక్కడక్కడా టీడీపీ నాయకులు, కార్యకర్తలు లోకేశ్‌తో కరచాలనం చేసేందుకు ప్రయత్నించగా, తనకు ఒక చెయ్యి నొప్పిగా ఉందని చెబుతూ మరో చేతిని ఊపుతూ వెళ్లిపోయారు. లింగపాలెం గ్రామ శివారుకు వెళ్లిన తర్వాత మాజీ ఎమ్మెల్యే, స్థానిక మాజీ ప్రజాప్రతినిధిని 'మీ గ్రామంలో జనం ఏరి..' అంటూ లోకేశ్ ప్రశ్నించారు. కాగా, లోకేశ్ క్యాంప్ సైట్‌లో పామాయిల్ రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నేతలు ముందుగానే ఎంపిక చేసిన తమ పార్టీకి చెందిన రైతులనే ఈ కార్యక్రమానికి అనుమతించారు. తన తండ్రి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పామాయిల్ రైతులకు ఎంతో మేలు చేసినట్లు చెప్పినా రైతుల నుంచి స్పందన రాకపోవడంతో 'కనీసం చప్పట్లన్నా కొట్టండయ్యా..' అంటూ లోకేశ్ అడిగి మరీ చప్పట్లు కొట్టించుకోవడంతో రైతులు నవ్వుకున్నారు.



లింగపాలెంలో పాదయాత్ర చేస్తున్న లోకేశ్

వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

లోకేశ్ పాదయాత్ర చింతలపూడి వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు చేరుకోగానే 'సైకో పోవాలి, సైకిల్ కావాలి...' అంటూ మైకులో కేకలు వేయడంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆగ్రహంతో 'జై జగన్... వైఎస్సార్‌సీపీ జిందాబాద్...' అంటూ నినాదాలు చేశారు. దీంతో లోకేశ్ ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందితోపాటు టీడీపీ కార్యకర్తలు ఒక్కసారిగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపైకి దూసుకువచ్చారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు.

కూలి ఇవ్వలేదని జెండాలు పారేసి వెళ్లిన వైనం..

ముసునూరు: ఏలూరు జిల్లాలో జరుగుతున్న లోకేశ్ పాదయాత్రలో పెయిడ్ ఆర్టిస్టులే కనిపిస్తున్నారు. పల్లెల్లో ప్రజల్లో స్పందన కరువవడంతో పెయిడ్ ఆర్టిస్టులతో పాదయాత్ర సాగిస్తున్నారు. పాదయాత్రకు కూలి డబ్బులిస్తామని జనాన్ని తరలించిన విషయం సోమవారం వెలుగుచూసింది. శనివారం యువగళం పాదయాత్ర నూజివీడు మండలం పోతురెడ్డిపల్లిలో ప్రారంభమై మండలంలోని కొర్లగుంట–ముసునూరుల మీదుగా వలసపల్లి వరకు జరిగింది. ఈ క్రమంలో కొందరు ఆటోలో కాట్రేనిపాడు గ్రామం మీదుగా దగ్గర దారిలో హనుమాన్‌జంక్షన్ వైపు వెళుతూ జెండాలను రహదారి పక్కనే పడేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు.. అలా పడేశారేంటని ఆటోలోని వారిని ఆరా తీశారు. కూలి డబ్బులు ఇస్తామని పాదయాత్రకు తీసుకొచ్చారని, కానీ డబ్బులివ్వకుండా తమను మోసం చేశారని ఆటోలోనివారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే వెనుదిరిగి వెళ్లిపోతున్నామని చెప్పారు. పాదయాత్రలో పాల్గొనేందుకు తమకు ఇచ్చిన జెండాలు, చొక్కాలను విప్పి దారిలో పారేసి వెళుతున్నామని తెలిపారు. ఈ ఘటనపై కాట్రేనిపాడుకు చెందిన కంబాల రాజేశ్ సోషల్‌మీడియాలో పెట్టిన వీడియో వైరల్‌గా మారింది. ఈ సందర్భంగా రాజేష్ సోమవారం 'సాక్షి'తో మాట్లాడుతూ ఈ వివరాలు వెల్లడించారు. పాదయాత్ర తమ గ్రామం మీదుగా జరగలేదని, దగ్గర దారి కావడంతో వీరంతా ఇటువైపు వెళ్లారని చెప్పారు. వారు ఏ గ్రామానికి చెందినవారో చెప్పలేదని ఆయన తెలిపారు.



యువగళం పాదయాత్రలో కూలి ఇవ్వలేదని కాట్రేనిపాడు వద్ద విసిరేసిన టీడీపీ టీ షర్ట్‌లు

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
మంగళవారం ॥ 29-8-2023



● కజిరంగా సిబ్బందితో సొనాలి ఘోష్

న్యూస్‌మేకర్



● సొనాలి ఘోష్

మహారణ్యానికి మహిళా బాస్

అస్సాంలో వెయ్యి చదరపు కిలోమీటర్ల కజిరంగా నేషనల్ పార్క్... 118 ఏళ్ల ఘన చరిత్ర... కాని ఇంతకాలం వరకూ ఒక్కసారి కూడా ఫీల్డ్ డైరెక్టర్ బాధ్యతలు మహిళలకు అప్పజెప్పలేదు. ఇన్నాళ్లకు ఐ.ఎఫ్.ఎస్ అధికారి సొనాలి ఘోష్ చరిత్ర సృష్టించింది. సెప్టెంబర్ 1 నుంచి కజిరంగాలోని చెట్టూ పుట్టా ఖడ్గమృగాలూ ఏనుగు గుంపులూ సొనాలి కనుసన్నల్లో మెలగనున్నాయి. శక్తి సామర్థ్యాలతో ఈ స్థాయికి ఎదిగిన సొనాలి ఘోష్ పరిచయం.

మొత్తానికి ఒక స్త్రీ రక్షించిన అరణ్యానికి మరో స్త్రీ సర్వోన్నత అధికారి కావడం విశేషం అనే చెప్పుకోవాలి. అస్సాంలో గోలఘాట్, నగాన్ జిల్లాల మధ్య విస్తరించి ఉన్న కజిరంగా నేషనల్ పార్క్ ఒకప్పుడు, ఇప్పుడు ఒంటికొమ్ము ఖడ్గమృగానికి ఆలవాలం. అయితే ఏనాటి నుంచో వందల, వేల ఖడ్గమృగాలు ఇక్కడ వేటగాళ్ల బారిన పడేవి. 1904లో నాటి వైస్రాయ్ లార్డ్ కర్జన్ భార్య మేరీ కర్జన్ వన విహారానికి వచ్చినప్పుడు ఇక్కడ యథేచ్ఛగా సాగుతున్న ఖడ్గమృగాల హననం చూసి చలించిపోయింది. వెంటనే ఆమె భర్తకు ఈ విషయం చెప్పి ఎలాగైనా ఈ వేటకు అడ్డుకట్ట వేసి ఖడ్గమృగాలను కాపాడమని కోరింది. దాంతో అతడు 1905లో కజిరంగా అరణ్యాన్ని రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించి ఈ ప్రాంతాన్ని కాపాడాడు. అప్పటి నుంచి మొదలయ్యి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పూనికతో కజిరంగా నేషనల్ పార్క్‌గా రక్షణ పొందడమే కాక యునెస్కో వారి గుర్తింపు కూడా పొందింది. అయితే ఇంత ఖ్యాతి ఉన్న ఈ పార్క్‌కు ఫీల్డ్ డైరెక్టర్‌గా ఇంత కాలం వరకూ పురుషులే పని చేశారు. ఇన్నేళ్లకు సెప్టెంబర్ 1 నుంచి ఈ బాధ్యతలను సొనాలి ఘోష్ స్వీకరించనుంది.

అడవి అంటే ప్రేమ

సొనాలి ఘోష్ ఒక ఆర్మీ కుటుంబంలో జన్మించింది. తండ్రి ఉద్యోగరీత్యా అడవులు ఆమెకు బాల్యం నుంచే తెలుసు. అలా వాటిపై ప్రేమ ఏర్పడింది. డిగ్రీ అయ్యాక వైల్డ్‌లైఫ్ సైన్స్ చదివి, ఆ తర్వాత ఎన్విరాన్‌మెంట్ లా చదివింది. మానస్ నేషనల్ పార్క్‌లో పులులను ట్రాక్ చేసేందుకు రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీ



ఉపయోగించడం వల్ల కలిగే లాభనష్టాలను పరిశోధించి డాక్టరేట్ పొందింది. ఈ చదువంతా ఆమెకు ఐ.ఎఫ్.ఎస్. ర్యాంకు సాధించడంలో ఉపయోగపడింది. ఐ.ఎఫ్.ఎస్. 2000–2003 బ్యాచ్‌లో టాపర్‌గా నిలిచింది. ఆమెకు అస్సాం కేడర్ కేటాయించారు. అప్పటి నుంచి ఆమె తన ఉద్యోగరంగంలో దూసుకుపోసాగింది.

స్త్రీలకు సవాలు

'అడవుల్లో పని చేయడం స్త్రీలకు సవాలే. కాని ఆ సవాలును స్త్రీలు సమర్థంగా ఎదుర్కొంటున్నారు. నేను ఐ.ఎఫ్.ఎస్.లో చేరేనాటికి 100 కు లోపే ఐ.ఎఫ్.ఎస్. మహిళాధికారులు ఉండేవారు. ఇప్పుడు వారి సంఖ్య బాగా పెరిగింది. ఇక రేంజర్లుగా, డిప్యూటి రేంజర్లుగా స్త్రీలు పెద్ద సంఖ్యలో ఇప్పుడు ఉద్యోగాలు చేస్తున్నారు. వారంతా ఏదో ఒక ఉద్యోగం అని అడవుల్లోకి రాలేదు. అడవులంటే ఇష్టం కాబట్టే వచ్చారు. అయితే మాకు సమస్యల్లా కుటుంబ జీవనం, వృత్తి జీవనం బేలెన్స్ చేసుకోవడం. అటవీశాఖలో పని చేసే మహిళల పిల్లలను చూసుకునే శిశు కేంద్రాలు సరైనవి ఉంటే తల్లులు నిశ్చింతతో ఇంకా బాగా పని చేయగలరు. అంతే కాదు అడవుల్లో తిరిగే ఈ మహిళా ఉద్యోగులకు తగినన్ని టాయిలెట్లు, స్నానాల గదులు ఉంటే వారికి సౌకర్యంగా ఉంటుంది. నా ఉద్దేశంలో మంచి బడి, మంచి వైద్యం అందుబాటులో ఉంటే గనక అటవీశాఖలో పని చేసే స్త్రీలు తమ పిల్లల్ని అడవులతోపాటుగా పెంచాలని కోరుకుంటారు. ఎందుకంటే అడవికి మించిన గురువు లేదు. స్త్రీలు మంచి కమ్యూనికేటర్లు. అడవుల అంచున జనావాసాలు ఉంటాయి. మనుషుల వల్ల అటవీ జీవులకు వచ్చే ప్రమాదాలను నివారించడంలో మనుషులు ఎలా వ్యవహరించాలో పురుషులు చెప్పడం కంటే స్త్రీలు చెప్తే ఎక్కువ వింటారు. అందుకని కూడా అటవీశాఖలో ఎక్కువమంది పని చేయాలి. అడవులంటే వేటగాళ్లను నిరోధించడం మాత్రమే కాదు. అన్ని జీవుల సమగ్ర జీవన చక్రాలను కాపాడాలి. అది ముఖ్యం' అంటుంది సొనాలి ఘోష్.

ఆమె ఆధ్వర్యంలో కజిరంగా మరింత గొప్పగా అలరారుతుందని ఆశిద్దాం.

సేవాపథం



'ఎవరైనా సరే నిద్రలేస్తూనే నేను ఉద్యోగం కోసం ఎదురు చూడడం లేదు. పదిమందికి ఉపాధి కల్పించడం కోసం ఎదురుచూస్తున్నాను' అనుకోవాలి. 'ఆశాపూరిత ప్రపంచాన్ని ఊహించుకున్నప్పుడే, దాన్ని నిజంగా సృష్టించగలం. నీ మార్గం ఏమిటి అనే విషయంలో స్పష్టత ఉంటేనే అక్కడికి చేరుకుంటావు. అలా చేరుకోవడానికి నీలోని ఉత్సాహం, అంకితభావం ఇంధనంలా ఉపయోగపడతాయి'...'మైక్రోఫైనాన్స్ దారిదీపం'గా ప్రసిద్ధుడైన మహ్మద్ యూనస్ చెప్పిన ఇలాంటి మాటలెన్నో శాన్‌ఫ్రాన్సిస్కోలోని శీతల్ మెహతా వాల్ష్‌కు ఇష్టం. ఆ ఇష్టమే ఆమెను యూనస్ బాటలో నడిపించి 'శాంతి లైఫ్'కు శ్రీకారం చుట్టేలా చేసింది. సూక్ష్మరుణ సంస్థగా మొదలైన 'శాంతి లైఫ్' ఎన్నో గ్రామాల ముఖచిత్రాన్ని మార్చింది....

శాంతి లైఫ్

● స్త్రీ సాధికారతే జీవనాడి



● శీతల్ మెహతా వాల్ష్

కెనడాలో పెరిగిన శీతల్ అక్కడి గుజరాతీ అసోసియేషన్‌లో భాగం కావడంతో ఎన్నో కుటుంబాలతో పరిచయం ఏర్పడింది. కమ్యూనిటీ లైఫ్‌లో భాగం కావడం ద్వారా పాశ్చాత్యజీవన విధానానికి భిన్నమైన భారతీయ జీవన విధానాన్ని చూసింది. ఎన్నోవిలువలు నేర్చుకుంది.

వెంచర్-క్యాపిటల్ ఫండింగ్ సెక్టర్‌లో రెండు దశాబ్దాల అనుభవాన్ని సంపాదించిన శీతల్ బంగ్లాదేశ్ సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్ మహ్మద్ యూనస్ స్ఫూర్తితో అహ్మదాబాద్ కేంద్రంగా 'శాంతి లైఫ్' అనే సూక్ష్మరుణ సంస్థను ప్రారంభించింది. ఇది పేద మహిళల జీవితాల్లో వెలుగులు నింపింది.

గతంలో ఎలా ఉండేదంటే...

పేద మహిళలకు రుణాలు లభించడం కష్టం. ఒకవేళ లభించినా బారెడు వడ్డీ కట్టలేక అష్టకష్టాలు పడేవాళ్లు. ఇలాంటి పరిస్థితుల్లో తక్కువ వడ్డీతో 'శాంతి లైఫ్' రుణాలు ఇవ్వడం మొదలుపెట్టింది. ఎన్నో గ్రామాల్లో ఎంతో మంది మహిళలు రుణాలు తీసుకొని వ్యాపారాలు చేస్తూ సొంతకాళ్ల మీద నిలబడ్డారు.

కేవలం రుణాలు ఇవ్వడమే కాకుండా గ్రామీణప్రాంత మహిళలకు స్కిల్స్ ట్రెనింగ్, ఫైనాన్షియల్ లిటరసీ... మొదలైన వాటిలో శిక్షణ ఇస్తోంది శాంతి లైఫ్.

క్షేత్రస్థాయిలో పనిచేయడం ద్వారా అక్కడి పరిస్థితులపై స్పష్టమైన అవగాహన రావడానికి శీతల్‌కు అవకాశం ఏర్పడింది. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు, వాటిని దూరం చేయాలంటే ఏంచేయాలి... మొదలైన విషయాలను తెలుసుకుంది శీతల్.

'శాంతి లైఫ్' ఎన్నో గ్రామాలను దత్తత తీసుకుంది.

పారిశుద్ధ్య లోపం వల్ల గ్రామీణ ప్రాంతాలలో మహిళలు అనారోగ్యానికి గురవుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'సేఫ్ శానిటేషన్' నినాదంతో గ్రామీణప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. ఈ అవగాహనతో వారు డబ్బు పొదుపు చేసి మరుగుదొడ్లు నిర్మించుకున్నారు.

'రుణం తీసుకోవడం అనేది ఆర్థిక వ్యవహారమే కాదు. ఒక బాధ్యతను నిరంతరం గుర్తు చేస్తుంది. శాంతి లైఫ్ ద్వారా రుణం తీసుకున్న ఒక మహిళ రిక్షా కొనుగోలు చేసింది. ఈ రిక్షాను ఆమె భర్త నడిపేవాడు. గతంలో అతడి ప్రవర్తన ఎలా ఉన్నా ఇప్పుడు మాత్రం క్రమశిక్షణతో నడుచుకుంటున్నాడు. ఏరోజు డబ్బును ఆరోజే భార్యకు ఇస్తుంటాడు.

భార్య పేరు మీద లోన్ ఉంది కాబట్టి ఆమెకు చెడ్డ పేరు రావద్దని అనుకునేవాడు భర్త. ఇలాంటి భర్తలు ఎందరో! రుణసహాయం మాత్రమే కాదు క్రమశిక్షణ పాదుకొల్పడంలో 'శాంతి లైఫ్' తనదైన పాత్ర నిర్వహిస్తోంది.

గ్రామీణ వృత్తికళాకారులు తయారు చేసిన యోగా బ్యాగులు, చీరెలు, దుప్పట్లను ఆన్‌లైన్ ద్వారా అమ్మడం మొదలుపెట్టింది.

'ప్రతి ఒక్కరికీ తమదైన నైపుణ్యం ఉంటుంది. అది ఇతరుల కంటే ఏ రకంగా భిన్నమైనది, ఆ నైపుణ్యం సమాజానికి ఏ రకంగా ఉపయోగపడుతుంది అనేది ఆలోచించాలి. నైపుణ్యాలను ఉపయోగించి క్షేత్రస్థాయిలో పనిచేయడం ద్వారానే పేదరికాన్ని దూరం చేయవచ్చు' అంటుంది శీతల్.

లాభాలు గడించాలనే దృష్టితో కాకుండా సమాజానికి తిరిగి ఇవ్వాలి అనే అవగాహనతో 'శాంతి లైఫ్'కు శ్రీకారం చుట్టింది శీతల్. సామాజిక నిబద్ధతతో మొదలైన 'శాంతి లైఫ్' అనుకున్న లక్ష్యాన్ని చేరుకుందా అని ప్రశ్నించుకుంటే 'అంతకంటే ఎక్కువే' అని జవాబు చెప్పుకోవచ్చు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఫైనాన్స్, టెక్నాలజీలకు సంబంధించి నైపుణ్యాల శిక్షణ ద్వారా గుజరాత్‌లోని ఎన్నోగ్రామాల ముఖచిత్రాన్ని'శాంతి లైఫ్' మార్చింది.

సాగుబడి

మఖ కార్తె : ఆగస్టు 30 వరకు
పుబ్బ కార్తె : 31 నుంచి

ఆ క్యాట్‌ఫిష్‌లతో ముప్పు!

● అమెరికన్/ ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్‌లతో దేశీయ చేపల జీవవైవిధ్యానికి ముప్పు
● మన చేపల రైతులు, మత్స్యకారుల ఆదాయానికి గండి
● విదేశీ క్యాట్‌ఫిష్‌ల నియంత్రణకు తోడ్పడేందుకు సిద్ధమంటున్న 'సిసిఎంబి'


నిషిద్ధ ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్‌లను మన ప్రజలు ఇష్టంగా తినే కొర్రమీను చేపలుగా చూపి అక్రమంగా విక్రయిస్తున్న వారిపై, తరలిస్తున్న వారిపై మత్స్యశాఖ అధికారులు కేసులు పెడుతున్న సందర్భాలు అడపాదడపా మనం చూస్తున్నాం. అయితే, ఈ ఆఫ్రికన్/ అమెరికన్ క్యాట్‌ఫిష్‌లపై ఎందుకు నిషేధం విధించారు? ఇవి చేపల జీవవైవిధ్యానికి ఏ విధంగా విధ్వంసకరంగా పరిణమిస్తున్నాయి? ఇవి మన చేపల రైతులు, మత్స్యకారుల ఆదాయానికి గండికొట్టే ముప్పు పొంచి ఉందా? వీటిని అరికట్టే మార్గాలేమిటి?.. ఇటువంటి ప్రశ్నలకు సికింద్రాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మోలెక్యులర్ బయాలజీ (సిఎస్ఐఆర్-సిసిఎంబి) సీనియర్ ప్రధాన శాస్త్రవేత్త డా. జి.ఉమాపతి సమాధానాలు.. 'సాక్షి సాగుబడి' పాఠకుల కోసం ఆయన మాటల్లోనే...



డా. జి.ఉమాపతి

మన దేశపు నీటి వనరుల్లోకి చొరబడిన అమెరికన్, ఆఫ్రికన్ కాట్ ఫిష్‌ల వంటి విదేశీ జాతి చేపలు స్థానిక చేపల జాతుల మనుగడకు, జీవవైవిధ్యానికి, చేపల రైతులు/ మత్స్యకారుల జీవనోపాధికి గొడ్డలిపెట్టుగా పరిణమించాయి. ఈ విదేశీ చేపలు మన చెరువుల్లో, కాలువల్లో, వాగులు, వంకలు, సరస్సులు, నదుల్లోకి చేరిపోయి తమ సంతతిని ఇబ్బడిముబ్బడిగా పెంచుకుంటున్నాయి. సాధారణంగా అమెరికన్, ఆఫ్రికన్ కాట్ ఫిష్‌లు విపరీతమైన మాంసాహారులు కాబట్టి, అవి మన చేపల గుడ్లు, చేపపిల్లలతో పాటు ఇతరత్రా జలచరాలను ఈ బకాసుర కాట్‌ఫిష్‌లే ఆరగించేస్తుంటాయి. ఆ విధంగా స్థానిక చేపల సంతతి బాగా తగ్గిపోతోంది. ఒక్కోసారి ఇవి పూర్తిగా అంతరించిపోయే ముప్పు కూడా ఉంది. అమెరికన్ / ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్‌ల తీవ్రమైన ఆహారపు అలవాట్లు, భూమిని తవ్వి బొరియలు చేసే అలవాట్ల వల్ల నీటి మొక్కల పెరుగుదలను, నీటి ప్రవాహదారులు మారిపోతున్నాయి. జలచరాల ఆవాసాలు చెల్లాచెదురవుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే స్థానిక జాతులను ఇవి చెలకట్టనియ్యట్లేదు.

దుష్ప్రభావాలు



● అమెరికన్ క్యాట్‌ఫిష్

విదేశీ జాతుల క్యాట్‌ఫిష్‌ల వల్ల చేపల రైతులు.. చెరువులు, సరస్సులు, జలాశయాల్లో చేపలపై ఆధారపడి జీవించే మత్స్యకారుల ఆదాయాలు తీవ్రంగా దెబ్బతింటాయి. మనోల్లాసం కోసం చేపలు పట్టడం వంటి వ్యాపకాల ద్వారా ఆదాయం తగ్గిపోతోంది. ఆ విధంగా చెరువులు, సరస్సులు, నదుల్లో స్థానిక చేప జాతుల జీవవైవిధ్యం నశిస్తుంది. కొన్నిసార్లు ఈ జాతులు అంతరించిపోనూ వచ్చు. ఈ నష్టం ఆహార చక్రాల్లో, పర్యావరణ వ్యవస్థ అందించే సేవల్లో ప్రతికూల మార్పులు చోటుచేసుకొని, మొత్తంగా పర్యావరణ వ్యవస్థ గొలుసు కట్టు దుష్ప్రభావాలకు లోనవుతోంది. వీటి సంతతిని నియంత్రించడం లేదా నిర్మూలించడం అంత సులభసాధ్యమైన పని కాదు సరికదా, ఖరీదైనది కూడా. వీటి నిర్మూలనకు రసాయనాలు ప్రయోగించటం లేదా ఏరివేయటం వంటి సాంప్రదాయ నిర్వహణ పద్ధతుల వల్ల పెద్దగా ఫలితం ఉండకపోవచ్చు. అంతేకాదు, ఈ పనుల వల్ల పర్యావరణానికి అనుకోని రీతిలో హాని జరగొచ్చు.

చెరువులు, జలాశయాలు, సరస్సుల్లో విధ్వంసక విదేశీ జాతుల చేపల జాడను ఈ-డిఎన్ఎ విశ్లేషణ పద్ధతిని ఉపయోగించి గుర్తించటం, పర్యవేక్షించడం, వాటి సంతతిని అంచనా వేయడం వంటి పనులు చేయొచ్చు. ఈ విషయంలో సీసీఎంబీలోని జీవ జాతులు అంతరించిపోకుండా సంరక్షించే 'లకోన్స్' విభాగం సహాయపడుతుంది. విదేశీ క్యాట్‌ఫిష్ జాతుల వల్ల ఉన్న ప్రమాదాల గురించి స్థానికులకు, ఆక్వా రైతులకు అవగాహన కల్పించడానికి 'లకోన్స్' వర్క్‌షాప్‌లు నిర్వహిస్తుంది. విదేశీ చేప జాతుల డేటాబేస్‌ను ఏర్పాటు చేసే వీలుంది. దేశవ్యాప్తంగా సమర్థవంతమైన పరిష్కారాలు వెతికేందుకు పరిశోధకులు, రైతుల మధ్య లకోన్స్ అనుసంధానం చేస్తుంది. విదేశీ జాతుల ఉనికిని క్షేత్రస్థాయిలో ముందస్తుగా గుర్తించే పరీక్షను అభివృద్ధి చేయడంలో 'లకోన్స్' సహాయపడుతుంది. మత్స్య శాఖ అధికారులకు, స్థానిక ఆక్వా రైతులకు శిక్షణ ఇవ్వటానికి కూడా 'లకోన్స్' సహాయపడుతుంది.



● ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్

జిల్లా స్థాయిలో నిఘా అవసరం

చేపలు ఇతర జలచరాలకు సంబంధించిన చట్టాల్లోని నిబంధనలను స్థానిక ప్రభుత్వ యంత్రాంగాలు అమలు చేయాలి. ఆక్వా చెరువులను తనిఖీ చేయటం (అక్రమ చెరువులను అరికట్టడం), విదేశీ చేప జాతుల ముప్పుపై అవగాహన కలిగించేలా ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం, జిల్లా స్థాయిలో నిఘా ఏర్పాటు చేయడం అవసరం. మత్స్య శాఖ పరిశోధనా సంస్థల సహకారంతో విదేశీ చేప జాతులను అరికట్టే పద్ధతులను అభివృద్ధి చేయవచ్చు. ఈ పద్ధతులను అనుసరించే రైతులు, మత్స్యకారులకు ప్రోత్సాహకాలను అందించవచ్చు.

ఆఫ్రికన్/అమెరికన్ క్యాట్‌ఫిష్‌లను నియంత్రించాలి

మన దేశంలోని చేపల జాతులతో సంకరం చేసి కొత్త జాతులను అభివృద్ధి చేయడానికి పరిశోధనల నిమిత్తం ఆఫ్రికా, అమెరికా ఖండాల నుంచి క్యాట్‌ఫిష్‌లను కొన్ని దశాబ్దాల క్రితం మన దేశానికి తీసుకొచ్చారు. అయితే, కాలక్రమంలో అవి సహజ జలవనరుల్లోకి చేరిపోయి, ఇప్పుడు చేపల జీవవైవిధ్యానికి ముప్పుగా పరిణమించాయి. వీటిని తింటే ఫలానా ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్పలేం. అయితే, ఆఫ్రికన్ / అమెరికన్ క్యాట్‌ఫిష్‌లు అత్యంత కలుషిత నీటి సరస్సుల్లో కూడా నిక్షేపంగా పెరుగుతాయి. కాబట్టి ఈ చేపలు అత్యంత కలుషితాలతో కూడి ఉంటాయి. ఇవి మన చేపల చెరువుల్లో, సరస్సులు, జలాశయాల్లో జీవవైవిధ్యానికి ముప్పుగా పరిణమించినందున వీటి పెరుగుదలను నిశితంగా గమనిస్తూ, శాస్త్రీయ పద్ధతుల్లో నియంత్రించాల్సిన అవసరం ఉంది.



– వినయ్ కె నందికూరి, సంచాలకులు, సిఎస్ఐఆర్–సిసిఎంబి, సికింద్రాబాద్
director@ccmb.res.in

నిర్వహణ: పంతంగి రాంబాబు
సాగుబడి డెస్క్

నేల సాగు కన్నా బ్యాగు సేద్యం మిన్న

● ఆరుబయట పొలాల్లో సేంద్రియ కూరగాయల బ్యాగు సేద్యంపై డా. రామానాయుడు ఏకలవ్య కేవీకేలో వినూత్న ప్రయోగాత్మక సాగు
● నేలపైన పాదుల్లో సాగు.. ఎకరానికి 4.48 టన్నుల కాకర దిగుబడి ● పొలంలోనే బ్యాగుల్లో సాగు.. ఎకరానికి 8 టన్నుల కాకర దిగుబడి వచ్చింది
● బ్యాగు సాగులో కాకరతో పాటు అదనంగా ఎకరానికి 3.64 టన్నుల టొమాటోలు, క్యాబేజీలు, పుదీనా దిగుబడి కూడా పొందటం విశేషం

సేంద్రియ కూరగాయ పంటలను పొలంలో సాధారణ పద్ధతిలో నేలలో కన్నా.. ప్రత్యేకమైన బ్యాగుల్లో సాగు చేయటం ద్వారా రెట్టింపు కన్నా ఎక్కువగా దిగుబడి తీయవచ్చని తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా తునికిలోని డా. రామానాయుడు ఏకలవ్య సేంద్రియ కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ ఏడాది ఫిబ్రవరి–జూలై నెలల మధ్య ప్రయోగాత్మక సాగులో రుజువైంది. ఈ పంటల సాగును శాస్త్రవేత్తలు ఆసాంతమూ సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసి, శాస్త్రీయంగా గణాంకాలను నమోదు చేశారు.

నగరాలు, పట్టణాలకు దగ్గర్లోని భూసారం అంతగా లేని భూముల్లో, రసాయనాలతో కలుషితమైన లేదా చౌడు తదితర సమస్యాత్మక భూముల్లో బ్యాగు సేద్యం ద్వారా పెద్ద ఎత్తున సేంద్రియ కూరగాయల ఉత్పత్తి పొందడానికి, తద్వారా అన్‌సీజన్‌లో రైతులు అధికాదాయం పొందడానికి అవకాశం ఉన్నట్లు ఈ ప్రయోగం ద్వారా వెల్లడైందని కేవీకే అధ్యక్షుడు టి. వినోద్‌రావు తెలిపారు. సేంద్రియ రైతు శాస్త్రవేత్త ఎం.ఎస్. సుబ్రహ్మణ్యం రాజు మార్గదర్శకత్వంలో కేవీకే శాస్త్రవేత్తల బృందం బ్యాగు సాగులో అద్భుత దిగుబడులు రాబడుతోంది.



● తునికి కేవీకే ప్రాంగణంలో గత వేసవిలో బ్యాగుల్లో సాగైన కాకర పంట





● బ్యాగుల్లో టొమాటోలతో పాటు పుదీనా

● ఎకరంలో ఇలా 2,500 బ్యాగుల్లో 5 వేల కూరగాయ మొక్కలు సాగు చేయొచ్చు

ఎత్తు బెడ్లపై సేంద్రియ కాకర సాగు

కాకరను వేసవి పంటగా నేలపై ఎత్తు బెడ్లపై ఏక పంటగా సాగు చేయగా.. ఎకరానికి 4,480 కిలోల (4.48 టన్నులు/ఎకరం) సేంద్రియ కాకర కాయల దిగుబడి వచ్చింది. తునికి కేవీకే ప్రాంగణంలోని 12.5 సెంట్ల భూమి (0.125 ఎకరం)లో సాధారణ పందిరి పద్ధతిలో 1,000 కాకర విత్తనాలను ఎత్తయిన బెడ్లపై ఫిబ్రవరి 25న విత్తారు. పూర్తిగా సేంద్రియ పద్ధతిలో బిందు సేద్యం ద్వారా పండించారు. పంట కోత ఏప్రిల్ 17 నుంచి జూలై 12 వరకు కాకర కాయలు కోశారు. ఈ వెయ్యి మొక్కల నుంచి 560.5 కిలోల దిగుబడి వచ్చింది. ఒక్కో మొక్క నుంచి 0.56 కిలోల కాకర కాయల దిగుబడి వచ్చింది. ఈ లెక్కన.. ఎత్తు బెడ్స్ పద్ధతిలో సగటున ఎకరానికి 4,480 కిలోల కాకర దిగుబడి రాగా, సగటున ఎకరానికి రూ. 1,92,000 ఖర్చయినట్లు (కౌలు కాకుండా) శాస్త్రవేత్తలు రికార్డు చేశారు.

బ్యాగుల్లో కాకర సాగు

పక్క పొలంలోనే ప్లాస్టిక్ బ్యాగుల్లో కాకర పంటను పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయగా.. సగటున ఎకరానికి 8,000 కిలోల (8 టన్నులు /ఎకరం) సేంద్రియ కాకర కాయల దిగుబడి వచ్చింది. 25 సెంట్ల భూమిలో 2023 ఫిబ్రవరి 2న 616 బ్యాగుల్లో, ఒక్కో బ్యాగులో రెండు చొప్పున, కాకర విత్తనాలను పెట్టి, మొక్కలను పందిరికి పాకించారు. విత్తిన 70 రోజులకు మొదలై 175 రోజుల (జూలై 25) వరకు కాయలు కోశారు. మొత్తం 2 టన్నుల కాకర కాయల దిగుబడి వచ్చింది. ఈ లెక్కన.. సగటున ఎకరానికి 8 టన్నుల కాకర దిగుబడి వచ్చింది. బ్యాగుల్లో కాకర సాగుకు సగటున ఎకరానికి (కౌలు కాకుండా) రూ. 2,40,000 ఖర్చయినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

కాకరతో పాటు.. అదే పొలంలో టొమాటో, పుదీనా, క్యాబేజీ కూడా..

ఎత్తు బెడ్ల సాగులో కాకర ఒక్కటే పంట సాగు చేయగా, బ్యాగు సాగులో కాకరతో పాటు మరికొన్ని బ్యాగుల్లో టొమాటో, పుదీనా, క్యాబేజీ పంటలు కూడా సాగు చేశారు. ఈ పంటల ద్వారా 3,640 కిలోల(3.64 టన్నులు/ఎకరం) దిగుబడి అదనంగా రావటం విశేషం. 25 సెంట్ల భూమిలో మొత్తం 1,566 బ్యాగులు పెట్టారు. అందులో 616 బ్యాగుల్లో రెండేసి కాకర మొక్కలు (2 టన్నుల దిగుబడి), 410 బ్యాగుల్లో రెండేసి క్యాబేజీ మొక్కలు (374 కిలోల దిగుబడి), 180 బ్యాగుల్లో రెండేసి టొమాటో మొక్కలు పెట్టారు. మరో 360 బ్యాగుల్లో ఒక్కోటి చొప్పున టొమాటో, పుదీనా మొక్కలు కలిపి నాటారు. మొత్తం 453 కిలోల టొమాటోలు, 83.6 కిలోల పుదీనా దిగుబడి వచ్చింది.

బ్యాగుల్లో సేంద్రియ సాగు ఇలా..

అడుగున్నర ఎత్తు, అడుగు వెడల్పు ఉండే పాలిథిన్ బ్యాగులో 15 కిలోల పశువుల ఎరువు, 15 కిలోల ఎర్రమట్టి, 100 గ్రా. వేపపిండి కలిపిన మిశ్రమాన్ని నింపారు. జీవామృతం ప్రతి 10–15 రోజులకోసారి పాదుల్లో పోశారు. పంచగవ్య, రాజ్మాగింజల ద్రావణం, కొబ్బరి నీరు నాలుగైదు సార్లు పిచికారీ చేశారు. వేసవిలో కురిసిన అకాల వర్షాల వల్ల లీఫ్ బ్లైట్ వంటి తెగుళ్లు సోకినప్పటికీ సేంద్రియ పద్ధతుల్లోనే వాటిని నియంత్రించటం విశేషం. ఈ కేవీకేలో బ్యాగు సేద్యంపై (గత ఏడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు) రెండు బ్యాచ్‌లలో ప్రయోగాలు పూర్తయ్యాయి.

10న నందిగామలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

సెప్టెంబర్ 10(ఆదివారం)న ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇవ్వనున్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రచారకులు విజయ్ రామ్ అవగాహన కల్పిస్తారు. ప్రవేశం ఉచితం. ముందుగా పేరు నమోదు చేసుకోవాలి. 150 మందికి అవకాశం ఉంటుందని నిర్వాహకులు బాలకృష్ణారెడ్డి తెలిపారు. వివరాలకు.. 90281 85184, 64091 11427.

వచ్చే నెల 4 నుంచి తేనెటీగల పెంపకంపై శిక్షణ

ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని సకశేరుక చీడల యాజమాన్య విభాగం సెప్టెంబర్ 4 నుంచి 9వ తేదీ వరకు తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇవ్వనుంది. తేనెటీగల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులు, నిరుద్యోగ యువత ఈ శిక్షణకు అర్హులని ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ వి. సునీత తెలిపారు. అభ్యర్థులకు ఉచిత భోజన వసతులు కల్పిస్తామన్నారు. వివరాలకు.. 94948 75941.



బిగ్‌బాష్ లీగ్‌కు స్మృతి మంధాన దూరం!

భారత్‌లో మహిళల ప్రీమియర్ లీగ్ కంటే ఎంతో ముందుగా ఆస్ట్రేలియాలో ప్రారంభమై అలరిస్తోన్న మహిళల బిగ్‌బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్) ప్లేయర్ల తుది జాబితా (డ్రాఫ్ట్) సిద్ధమైంది. 2023–24 కొత్త సీజన్ కోసం సెప్టెంబర్ 3న లీగ్ ఫ్రాంచైజీలు ఈ జాబితాలో ఉన్న క్రికెటర్లతో ఒప్పందాలు చేసుకుంటాయి. భారత్ నుంచి 18 మంది క్రికెటర్లు ఈ డ్రాఫ్ట్‌లో ఉన్నారు. అయితే భారత స్టార్ ఓపెనర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన తన పేరును ఇందులో నమోదు చేసుకోలేదు. గతంలో డబ్ల్యూబీబీఎల్‌లో స్మృతి బ్రిస్బేన్ హీట్, సిడ్నీ థండర్ జట్లకు ఆడింది.

వచ్చే 10-15 ఏళ్లలో 'క్రీడా భారత్'...



మరో పది, పదిహేనేళ్లలో దేశం 'క్రీడా భారత్'గా ఎదుగుతుందని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ అన్నారు. చెస్‌లో ప్రజ్ఞానంద, బ్యాడ్మింటన్‌లో ప్రణయ్, అథ్లెటిక్స్‌లో నీరజ్ చోప్రా ప్రపంచ క్రీడా వేదికల్లో పతకాలతో మెరిశారు. దీనిపై స్పందించిన గావస్కర్ 'గతంలో కొన్ని క్రీడలే భారత్‌లో వెలుగొందేవి. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ తదితర క్రీడలకు కవరేజీ, ప్రేక్షకాదరణ పెరిగాయి' అని అన్నారు.

నా లక్ష్యానికి పరిమితి లేదు

ఒలింపిక్స్ స్వర్ణం, ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణం, ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ చాంపియన్, ఆసియా క్రీడల స్వర్ణం, కామన్వెల్త్ క్రీడల స్వర్ణం, జూనియర్ ప్రపంచ చాంపియన్... భారత జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా అసాధారణ కెరీర్‌లో అందుకున్న అద్భుత విజయాలెన్నో. వాస్తవంగా ఈ ప్రదర్శనలను పరిగణనలోకి తీసుకుంటే మేజర్ ఈవెంట్లలో అతను సాధించేందుకు ఇక ఏమీ మిగలనట్లే! కానీ నీరజ్ మాత్రం తాను ఇంకా సుదీర్ఘ ప్రయాణం చేయాల్సి ఉందని చెబుతున్నాడు. జావెలిన్‌ను మరింత బలంగా, మరింత దూరం విసరగలనని అతను చెబుతున్నాడు.

- ఇంకా మెరుగైన ప్రదర్శన ఇవ్వగలను
- ప్రపంచ చాంపియన్ నీరజ్ చోప్రా వ్యాఖ్య



రూ. 57 లక్షల 84 వేలు
ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచి నీరజ్ 70 వేల డాలర్ల (రూ. 57 లక్షల 84 వేలు) ప్రైజ్‌మనీ అందుకున్నాడు.

బుడాపెస్ట్ (హంగేరి): ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత్‌కు తొలి స్వర్ణ పతకం అందించిన ప్లేయర్‌గా కొత్త చరిత్ర సృష్టించిన నీరజ్ చోప్రా భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధిస్తానని వ్యాఖ్యానించాడు. పసిడి పతకం గెలిచినందుకు నీరజ్ చోప్రాకు 70 వేల డాలర్ల (రూ. 57 లక్షల 84 వేలు) ప్రైజ్‌మనీ లభించింది. ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఈ ఈవెంట్‌లో నీరజ్ పసిడి పతకం గెలిచాక మీడియాతో పంచుకున్న భావాలు అతని మాటల్లోనే...

- త్రోయర్లకు ఎప్పటికీ ఫినిషింగ్ లైన్ అనేదే ఉండదు అంటారు. మా చేతుల్లో జావెలిన్ ఉన్నంత వరకు ఎంత దూరమైన విసరగలం. మా లక్ష్యానికి పరిమితి లేదు. నేను ఎన్ని పతకాలు గెలిచినా ఇంకా ఎక్కువ దూరం బల్లెంను విసరాలనే ప్రేరణ అలాగే ఉంటుంది. ఈ పతకాల వల్ల నేను ఇప్పటికే అన్నీ సాధించానని అనుకోను. మరింత కష్టపడి నా దేశానికి మరిన్ని పతకాలు తీసుకొస్తా. పోడియంపై నా పక్కనే ఎవరైనా భారతీయులు నిలబడగలిగితే అది ఇంకా బాగుంటుంది.
- 90 మీటర్ల దూరం కూడా సాధ్యమే. అయితే సాధారణంగా దృష్టంతా గెలుపుపైనే ఉంటుంది. గత కొంత కాలంగా 90 మీటర్ల దూరంపై చర్చ జరుగుతోంది. ఈ ఏడాది సాధించగలననే అనుకున్నా గాయాల వల్ల కొంత ఇబ్బంది పడ్డా. అయితే ఈ విషయంపై ఒత్తిడి పెంచుకోదల్చుకోలేదు. అయితే ఒక ఈవెంట్‌లో అన్నింటికంటే పతకం గెలవడం ముఖ్యం. ఒక్కసారి 90 మీటర్ల మార్క్ అందుకుంటే అదే నిలకడను కొనసాగించాలని నేను నమ్ముతా. ఒలింపిక్ క్రీడల తర్వాత వరల్డ్ చాంపియన్ ఎలాగైనా గెలవాలని భావించా. ఇప్పుడు ఆ కల నిజమైంది.
- భారత ఆల్‌టైమ్ గ్రేట్ అథ్లెట్ అని నా గురించి నేను ఏనాడూ చెప్పుకోలేదు. భవిష్యత్తులోనూ ఎప్పుడూ చెప్పను. వరల్డ్ చాంపియన్‌షిప్ స్వర్ణం లేదని ఇప్పటి వరకు కొందరు అన్నారు. ఇప్పుడు దానిని సాధించాను. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. దానిపైనే దృష్టి పెడతాను తప్ప ఇలాంటి చర్చలోకి రాను. నిజంగా గ్రేటెస్ట్ ఎలా ఉండాలని అడిగితే మాత్రం నేను ఆరాధించే చెక్ రిపబ్లిక్ త్రోయర్ జాన్ జెలెజ్నీలాగా ఉండాలని చెబుతా.
- నా దృష్టిలో ఒలింపిక్స్‌తో పోలిస్తే ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనే గట్టి పోటీ ఉంటుంది. టాప్ అథ్లెట్లంతా దీని కోసమే సన్నద్ధమై వస్తారు. భవిష్యత్తులో భారత అథ్లెట్లు మరిన్ని విజయాలు సాధిస్తారు. పాకిస్తాన్ ఆటగాడు అర్షద్ నదీమ్‌తో పోటీని ప్రత్యేకంగా చూడవద్దు. మా ఆటను భారత్, పాకిస్తాన్ మధ్య పోరుగా కొందరు చిత్రీకరిస్తున్నారు. నా ఫోన్‌లో కూడా అంతా భారత్, పాక్ గురించే మెసేజ్‌లు ఉన్నాయి. మన దేశంలో ఇలాంటి వాతావరణం సహజమే. కానీ దీనిని మా ఇద్దరి మధ్య పోటీగా చూడవద్దు. రెండు దేశాల పేర్లతో ఒత్తిడి పెంచవద్దు. ఈవెంట్‌లో ఇతర ప్రత్యర్థులందరినీ దృష్టిలో ఉంచుకొని సిద్ధం కావాల్సి ఉంటుంది. సరిగా చూస్తే యూరోపియన్లతో పోటీ పడి రెండు దేశాలు విజయాలు సాధించడం మంచి పరిణామం.

18 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పతకాల పట్టికలో భారత్ స్థానం. ఒక్కో స్వర్ణ పతకం గెలిచిన బహ్రెయిన్, బుర్కినా ఫాసో, డొమినికన్ రిపబ్లిక్, వెనిజులా, సెర్బియా దేశాలతో కలిసి భారత్ సంయుక్తంగా 18వ ర్యాంక్‌లో నిలిచింది. 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నీరజ్ చోప్రా రజత పతకం కారణంగా భారత జట్టు మరో ఐదు దేశాలతో కలసి సంయుక్తంగా 33వ స్థానంలో నిలిచింది.

15 ఇప్పటి వరకు 19 సార్లు ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈసారీ అమెరికా తమ ఆధిపత్యాన్ని చాటుకుంటూ పతకాల పట్టికలో 15వసారి అగ్రస్థానంలో నిలిచింది. అమెరికా 12 స్వర్ణాలు, 8 రజతాలు, 9 కాంస్యాలతో మొత్తం 29 పతకాలతో టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంది.

195 ఈసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న దేశాలు. మొత్తం 2100 మంది అథ్లెట్‌లు పోటీపడ్డారు. 120 దేశాల నుంచి నాలుగు లక్షల మంది ప్రేక్షకులు వచ్చి ఈ మెగా ఈవెంట్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు.

46 తాజా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కనీసం ఒక్క పతకమైనా సాధించిన దేశాలు. జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్ రజత పతకంతో ఈ పోటీల చరిత్రలో తొలిసారి పాకిస్తాన్ ఖాతాలో తొలి పతకం చేరింది.

2019 ప్రపంచకప్‌కు ముందులాగే...

ఒత్తిడికి దూరంగా ఉండాలనుకుంటున్నా • భారత కెప్టెన్ రోహిత్ శర్మ



బెంగళూరు: నాలుగేళ్ల క్రితం ఇంగ్లండ్ గడ్డపై జరిగిన వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ హవా సాగింది. ఈ టోర్నీలో 5 సెంచరీలతో 648 పరుగులు సాధించి అతను అగ్రస్థానంలో నిలిచాడు. ఆ సమయంలో తాను మానసికంగా ఎంతో ప్రశాంత స్థితిలో ఉన్నానని, ఇప్పుడు కూడా అదే తరహాలో ఉండాలని కోరుకుంటున్నట్లు రోహిత్ చెప్పాడు. గత టోర్నీతో పోలిస్తే ఈసారి అతను కెప్టెన్ హోదాలో బరిలోకి దిగబోతున్నాడు. 'సానుకూలమైనా, ప్రతికూలమైనా ఎలాంటి బయటి అంశాలు నాపై ప్రభావం చూపించకుండా జాగ్రత్త పడుతున్నా. ఏమీ పట్టించుకోకుండా ప్రశాంతంగా ఉండటం ఎంతో ముఖ్యం. సరిగ్గా చెప్పాలంటే 2019 ప్రపంచకప్‌కు ముందు ఎలా ఉన్నానో అలాంటి మానసిక దృక్పథం ఇప్పుడు కావాలి. ఆటగాడిగా, వ్యక్తిగతంగా కూడా అప్పటి నా పరిస్థితిని గుర్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నా. అలాగే ఉండాలని భావిస్తున్నా. అప్పుడు అన్నీ చక్కగా కుదిరాయి. అంతా కలిసిరావడంతో ఎంతో బాగా సన్నద్ధమయ్యా' అని రోహిత్ వ్యాఖ్యానించాడు. భారత క్రికెట్‌పై తన ముద్ర ఏమిటనేది తాను చెప్పనని, అది అభిమానులు నిర్ణయిస్తారన్న రోహిత్... జట్టు సెలక్షన్ విషయంలో మాత్రం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదని అన్నాడు. 'వరల్డ్ కప్ టీమ్‌లో స్థానం దక్కకపోతే ఎంత బాధగా ఉంటుందో నాకు బాగా తెలుసు. 2011లో చోటు కోల్పోయినప్పుడు యువరాజ్ సింగ్ నన్ను ఓదార్చి ఏం పర్లేదు, భవిష్యత్తు బాగుంటుందని భరోసా ఇచ్చాడు. నిజంగానే ఆ తర్వాత నేను గొప్పగా రాణించాను. ఇప్పుడు కూడా ఎవరినైనా తప్పిస్తే అందుకు బలమైన కారణం ఉంటుందే తప్ప వ్యక్తిగత ఇష్టాఇష్టాలు ఉండవు' అని రోహిత్ స్పష్టం చేశాడు.

భారత మహిళల హాకీ జట్టుకు టైటిల్



సలాలా (ఒమన్): మహిళల హాకీ ఆసియా కప్ ఫైవ్స్ (ఐదుగురు ఆడే) టోర్నమెంట్‌లో భారత జట్టు విజేతగా నిలిచింది. తద్వారా 2024 ప్రపంచకప్ టోర్నీకి అర్హత పొందింది. సోమవారం జరిగిన ఫైనల్లో భారత్ 7–2 గోల్స్ తేడాతో థాయ్‌లాండ్ జట్టును ఓడించింది. భారత్ తరఫున జ్యోతి, మరియానా కుజుర్ రెండు గోల్స్ చొప్పున సాధించగా... కెప్టెన్ నవ్‌జ్యోత్ కౌర్, మోనికా టొప్పో, మహిమా చౌదరీ ఒక్కో గోల్ చేశారు. ఐదుగురు సభ్యులతో కూడిన జట్లు తలపడే తొలి హాకీ ఫైవ్స్ ప్రపంచకప్ వచ్చే జనవరి 24 నుంచి 27 వరకు మస్కట్‌లో జరుగనుంది.

'ప్రసారం' కోసం ముక్కోణపు పోటీ

క్రికెట్ హక్కుల బరిలో స్టార్, సోనీ, వయాకామ్ • ఈ నెల 31న ఆన్‌లైన్ వేలం

ముంబై: భారత్‌లో జరిగే అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ల ప్రసార హక్కుల కోసం ఈ నెల 31 బీసీసీఐ ఇ–వేలం నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది. బోర్డు ప్రతిపాదిత నియమ నిబంధనల్ని పూర్తిచేసుకున్న మూడు ప్రముఖ బ్రాడ్‌కాస్టింగ్ సంస్థలు ఈ ఆన్‌లైన్ వేలానికి అర్హత పొందాయి. డిస్నీ స్టార్, సోనీ స్పోర్ట్స్, వయాకామ్ 18లు టీమిండియా సిరీస్‌ల మీడియా హక్కులు పొందేందుకు పోటీపడుతున్నాయి. దేశీయ బ్రాడ్‌కాస్టర్లు జీ, ఫ్యాన్‌కోడ్ అంతర్జాతీయ కంపెనీలైన గూగుల్, అమెజాన్‌లు కూడా ఈ మీడియా హక్కుల కోసం ప్రాథమికంగా దరఖాస్తు చేసుకున్నాయి. అయితే సోమవారం సాంకేతిక బిడ్‌లు దాఖలు చేసే అర్హతను ఆ నాలుగు సంస్థలు పొందలేకపోయాయి. దీంతో సంప్రదాయ ప్రసారకర్తలు సోనీ, స్టార్‌లతో కొత్త బ్రాడ్‌కాస్టర్ 'వయాకామ్ 18' పోటీకి రెడీ అయ్యింది. గతేడాది ఐపీఎల్ హక్కులతో (పాక్షిక) రిలయన్స్‌కు చెందిన 'వయాకామ్ 18' రేసులోకి వచ్చింది.

సంచలనంతో షురూ

తొలి రౌండ్‌లోనే ఓడిన ఎనిమిదో సీడ్ మరియా సాకరి



సాకరి

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ సంచలన ఫలితంతో మొదలైంది. మహిళల సింగిల్స్‌లో ఎనిమిదో సీడ్ మరియా సాకరి (గ్రీస్) తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. ప్రపంచ 71వ ర్యాంకర్ రెబెకా మసరోవా (స్పెయిన్) 6–4, 6–4తో ఎనిమిదో ర్యాంకర్ సాకరిపై గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. తొమ్మిదోసారి యూఎస్ ఓపెన్‌లో ఆడుతున్న సాకరి 2016 తర్వాత ఈ టోర్నీలో మళ్లీ తొలి రౌండ్‌లో ఓడిపోయింది. మరోవైపు టాప్ సీడ్ స్వియాటెక్ (పోలాండ్) 6–0, 6–1తో రెబెకా (స్వీడన్)పై, మాజీ నంబర్‌వన్ అజరెంకా (బెలారస్) 6–1, 6–2తో ఫియోనా ఫెరో (ఫ్రాన్స్)పై, 15వ సీడ్ బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్) 6–2, 6–4తో రఖిమోవా (రష్యా)పై నెగ్గి రెండో రౌండ్‌కు చేరారు.

సినిమా

ఇంటర్వ్యూ

'నిన్ను రోడ్డు మీద చూసినది..' అంటూ కుర్రాళ్లు ఫ్లాట్ అయ్యేంత గ్లామర్... మితి మీరిన ఆత్మవిశ్వాసానికి.. అహంభావానికి చిరునామా... ఓ నీలాంబరి. భక్తులను రక్షించే తల్లి... ఓ అమ్మోరు. నా మాటే శాసనం.. ఓ శివగామి... ఇలా ఏ పాత్ర చేస్తే అందులో ఒదిగిపోయారు రమ్యకృష్ణ. గ్లామరస్ రోల్స్ చేస్తున్నప్పుడే 'నరసింహ'లో నెగటివ్ షేడ్ ఉన్న నీలాంబరి, 'అమ్మోరు'లో అమ్మవారిగా మెప్పించారామె. ఇక 'బాహుబలి'లో శివగామిగా కనబర్చిన నటన అద్భుతం. ఇటీవల రిలీజైన 'జైలర్'లో రజనీకాంత్ భార్యగా నటించారు. అలాగే భర్త కృష్ణవంశీ డైరెక్షన్‌లో 'రంగ మార్తాండ' చేశారు. ఇక 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రమ్యకృష్ణ చెప్పిన విశేషాలు తెలుసుకుందాం.

జీవితంలో మార్పు ఒక్కటే స్థిరమైనది

- రమ్యకృష్ణ



'పడయప్ప' ('నరసింహ')లో నీలాంబరిగా నరసింహ (రజనీకాంత్ పాత్ర)ని ఎదిరించారు. చాలా ఏళ్ల తర్వాత 'జైలర్'లో రజనీ కాంబినేషన్‌లో సాఫ్ట్ క్యారెక్టర్ చేయడం గురించి..

ఇన్నేళ్ల తర్వాత రజనీగారి కాంబినేషన్‌లో 'జైలర్' చేయడం, అది సూపర్ హిట్ కావడం నా జీవితంలో మరచిపోలేను. 'జైలర్'లో ఎందుకంత సున్నితమైన పాత్ర చేశారని అందరూ అనుకోవచ్చు. అయితే మళ్లీ రజనీగారితో నీలాంబరిలాంటి పాత్ర వస్తేనే చేయాలనుకుని 'జైలర్'లో విజయలాంటి మంచి పాత్రని వదులుకోలేను కదా.

ఈ 24 ఏళ్లలో రజనీగారు, మీరు ఆర్టిస్టులుగా ఎదిగారు.. వ్యక్తులుగా మారారు. ఆయనలో మీరు గమనించిన మార్పు?

'జైలర్' షూటింగ్ మొదటి రోజే 'పడయప్ప' చేసి అప్పుడే 24 ఏళ్లు అయిపోయిందా అని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేస్తే.. అవునన్నాను. అప్పటికీ, ఇప్పటికీ ఆయనలో అదే ఉత్సాహం, అదే నిరాడంబరత, అంతే నిశ్శబ్దం.

'జైలర్' తెలుగు–తమిళంలో చాలా పెద్ద హిట్ అయింది. ఈ హిట్ మీ కెరీర్‌కి ఎంతవరకు అడ్వాంటేజ్ అవుతుంది?

యాక్టర్స్ కెరీర్‌కి హిట్ అనేది వంద శాతం అవసరం, తప్పనిసరి. అయితే హిట్ మాత్రమే కెరీర్ కాదు. మంచి పాత్రలు కూడా కావాలి. కొన్నిసార్లు మంచి పాత్రలుంటాయి. అభినందనలు వస్తాయి కానీ వసూళ్లు ఉండవు. అలాగే ఓ కాంబినేషన్ మన కెరీర్‌కి ఎంతవరకు ఉపయోగపడుతుంది? అన్నది ముఖ్యం. వంద శాతం నా కెరీర్‌కి రజనీకాంత్‌గారి కాంబినేషన్, 'జైలర్' హిట్ ఉపయోగపడతాయి.

'రంగ మార్తాండ', 'జైలర్' సినిమాల్లో పాత్ర పరంగా మీకు సంతృప్తి ఇచ్చిన మూవీ ఏది?

'రంగ మార్తాండ' లాంటి నటనకు ఆస్కారం ఉన్న సినిమా హిట్ అయినా, అవకపోయినా మనసుకు సంతృప్తి ఉంటుంది. అయితే 'జైలర్' లాంటి హిట్స్ వస్తే 'రంగ మార్తాండ' లాంటి సినిమాలు చేసే అవకాశాలు మరిన్ని వస్తాయి.. నా కెరీర్ కూడా మరింత విస్తరిస్తుంది. అయితే 'రంగ మార్తాండ' లాంటి సినిమాలు కూడా హిట్ కావాలి. కొన్నిసార్లు అలాంటి సినిమాలకు ఎక్కువ అభినందనలు వస్తాయి.. వసూళ్లు రాకపోవచ్చు. ఆర్టిస్ట్‌లకు అభినందనలూ కావాలి.. కలెక్షన్స్ కూడా కావాలి (నవ్వుతూ).

ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో 'క్వీన్' వెబ్ సిరీస్ తర్వాత కొత్త సిరీస్‌లు చేయడం లేదు. ఎందుకు?

'క్వీన్' తర్వాత 'క్వీన్ 2' షూటింగ్ 70 శాతం పూర్తి చేశాం. మిగిలిన 30 శాతం షూటింగ్ కొన్ని కారణాల వల్ల ఆలస్యమవుతోంది. 'క్వీన్' కంటే 'క్వీన్ 2' అద్భుతంగా వచ్చింది. ఇక సినిమాలతో బిజీగా ఉండటంవల్ల వేరేవి ఒప్పుకోలేకపోతున్నాను.

అప్పట్లో మీ తరం వాళ్లకి సినిమాలు తప్ప వేరే ఏమీ లేవు. కానీ, ఈ తరం వాళ్లకి సినిమాలు, సీరియల్స్, వెబ్ సిరీస్, టీవీ షోలు.. ఇలా చాలా ఉన్నాయి. ఈ మార్పు మీకు ఎలా అనిపిస్తోంది?

సోషల్ మీడియాలోని చాలామంది ఇన్‌ఫ్లుయర్స్‌లో నటీనటులకంటే ఎక్కువ పాపులర్ అవుతున్నవాళ్లు ఉన్నారు. ఇవన్నీ చూస్తుంటే ప్రపంచం ఎంతలా మారింది? అనిపిస్తోంది. మనం కూడా మారుతున్న ప్రపంచంతో పోటీ పడుతూ ముందుకు సాగాలి.

అయితే ఇప్పుడొస్తున్న కథానాయికలకు మీలా 20, 25 ఏళ్ల లాంగ్విటీ ఉండటంలేదు కూడా...

మాకు తప్పులు చేయడానికి, దిద్దుకోవడానికి టైమ్ ఉండేది. ఇప్పుడు ఆ టైమ్ లేదు. వస్తున్నారు.. వెళుతున్నారు.. కానీ మేం అన్ని సంవత్సరాలకు సంపాదించుకున్నది ఇప్పుడు సక్సెస్ అయితే తక్కువ టైమ్‌కే సంపాదించుకుని వెళ్లిపోతున్నారు. టైమ్ ఎలా మారుతుందో దాన్నిబట్టి అన్నీ మారుతున్నాయి. దాంతో పాటు మనం మారాలి. జీవితంలో స్థిరమైనది ఏది అంటే.. అది మార్పు మాత్రమే. ఆ మార్పుకి మనం అడ్జస్ట్ అవ్వాలి. దాంతో పాటు కొనసాగాలి. మనం హ్యాపీగా ఉన్నామనుకోండి అది మారుతుంది. ఒకవేళ దుఃఖంలో ఉన్నాం అనుకోండి అది కూడా మారుతుంది. సో.. ఏదీ నిరంతరంగా ఉండదు.. మార్పు సహజం.

మీ అబ్బాయి రుత్విక్ ఏం చేస్తున్నాడు... హీరో అవుతాడా? తన నాన్న (కృష్ణవంశీ)లా డైరెక్టర్ అవుతాడా?

రుత్విక్‌కి ఇప్పుడు 18 ఏళ్లు. ప్రస్తుతానికి ఫోకస్ అంతా చదువు మీదే. వాడికేం అవ్వాలో వాడికే తెలియదు.. నాకేం తెలుస్తుంది (నవ్వుతూ). తనేం కావాలో రుత్విక్ తెలుసుకుని, మాతో చెబితే మేం సపోర్ట్ చేస్తాం.

ఈ మధ్య రోజాగారు, మీరు కలుసుకున్నారు.. మీ ఇద్దరి అనుబంధం గురించి?

రోజా నాకు ఎప్పట్నుంచో తెలుసు. అప్పట్లో ఎలా ఉండేవాళ్లమో ఇప్పుడూ అలానే ఉన్నాం. చాలా సంవత్సరాల తర్వాత నేను తిరుపతి వెళ్లాను. తనే నాకు దర్శనం ఏర్పాటు చేసింది. అద్భుతమైన దర్శనం దక్కింది. సో.. తనకి థ్యాంక్స్ చెప్పడానికి వెళ్లాను.

ఇద్దరూ సినిమాలు, రాజకీయాల గురించి మాట్లాడుకున్నారా?

రెండింటి గురించి మాట్లాడుకోలేదు. లైఫ్ గురించి మాట్లాడుకున్నాం. నా అబ్బాయి ఏం చేస్తున్నాడు.. తన పిల్లలు ఏం చేస్తున్నారు? అనే విషయాలు మాట్లాడుకున్నాం. ఉదయం నిద్ర లేచిన దగ్గర్నుంచి ఇంత బిజీగా ఎలా ఉండ గలుగుతున్నావ్ అని అడిగాను. ఇలాంటివే...

రోజాగారితో మాట్లాడాక మీక్కూడా పాలిటిక్స్ పై ఏమైనా ఆసక్తి కలిగిందా? మీరూ పాలిటిక్స్‌లోకి వచ్చే అవకాశం ఉందా?

పాలిటిక్స్ పై ఇంట్రస్ట్ అనేది ఒకర్ని చూసి వచ్చేది కాదు. ఎవరికి వాళ్లకి ఉండాలి. కొందరికి ఇంట్రస్ట్ ఉంటుంది.. కొందరికి ఉండదు. బట్.. రోజా చాలా హార్డ్ వర్కింగ్ పర్సన్. నేను కళ్లారా చూశాను.

భవిష్యత్తులో ఏదైనా పార్టీ నుంచి మీకు ఆఫర్ వస్తే పాలిటిక్స్‌లోకి ఎంటర్ అవుతారా?

ఏమో.. నాకు తెలియదు. వచ్చినప్పుడు చూద్దాం.

ఈ సినిమా మరో ఎత్తు - విశాల్



''ఇప్పటివరకు ఎన్నో వైవిధ్యమైన పాత్రలు చేశాను. ప్రేక్షకులు ఆదరిస్తూ వచ్చారు.. వారి ఆదరాభిమానాలతోనే నేనీ స్థాయికి వచ్చాను'' అని హీరో విశాల్ అన్నారు. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో విశాల్, రీతూ వర్మ జంటగా నటించిన చిత్రం 'మార్క్ ఆంటోని'. ఎస్‌జే సూర్య, సునీల్, సెల్వ రాఘవన్ ముఖ్య పాత్రల్లో నటించారు. ఎస్. వినోద్ కుమార్ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 15న పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది. కాగా నేడు విశాల్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''ఈ పుట్టినరోజు నాకెంతో ప్రత్యేకం. ఎందుకంటే 'మార్క్ ఆంటోని' వంటి వైవిధ్యమైన సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను. ఇప్పటివరకు నేను చేసిన సినిమాలన్నీ ఒక ఎత్తు అయితే ఇది మరో ఎత్తు. ఇందులో రెండు విభిన్నమైన పాత్రలు చేశా. ఈ సినిమా ప్రేక్షకులకు మంచి అనుభూతినిస్తుంది'' అన్నారు.

కామెడీ అనుకున్నా.. మాస్‌లా ఉంది - 'దిల్' రాజు



• మన్నారా చోప్రా, శివకుమార్, 'దిల్' రాజు, రవికుమార్, రాజ్ తరుణ్

''తిరగబడర సామీ' కామెడీ సినిమా అనుకున్నా. కానీ, టీజర్ చూస్తుంటే ఫుల్ మాస్ సినిమాలా ఉంది. రాజ్ తరుణ్ యాక్షన్ ఇరగదీసినట్లు కనిపిస్తోంది. రాజ్ తరుణ్, రవి కుమార్‌కి ఇది మంచి కమ్ బ్యాక్ మూవీ అవుతుంది. టీమ్‌కి ఆల్ ది బెస్ట్'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. రాజ్ తరుణ్ హీరోగా, మాల్వీ మల్హోత్రా, మన్నారా చోప్రా హీరోయిన్లుగా ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వం వహించిన చిత్రం 'తిరగబడర సామీ'. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియాపై మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని 'దిల్' రాజు విడుదల చేశారు. రాజ్ తరుణ్ మాట్లాడుతూ– ''రవికుమార్ చౌదరిగారు ఈ సినిమాతో నాలో కొత్త కోణం (యాక్షన్) చూపించారు. సినిమా చాలా బాగా వచ్చింది.. ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు. ''కొన్నేళ్ల గ్యాప్ తర్వాత తెలుగులో నాకు మళ్లీ పునర్జన్మ ఇచ్చిన శివకుమార్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు ఏఎస్ రవికుమార్ చౌదరి. ''త్వరలో రిలీజ్ కానున్న మా సినిమా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు మల్కాపురం శివకుమార్. నిర్మాత బెక్కం వేణుగోపాల్, దర్శకుడు సముద్ర, నటుడు తాగుబోతు రమేష్ తదితరులు మాట్లాడారు.

డైరెక్టర్‌గా హీరో విజయ్ తనయుడు

తమిళ స్టార్ హీరో విజయ్ తనయుడు జాసన్ సంజయ్ విజయ్ దర్శకుడిగా పరిచయం కానున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా సుభాస్కరన్ మాట్లాడుతూ– ''కొత్త ఆలోచనలతో ఉండే యంగ్ టాలెంటెడ్ పర్సన్స్ ఎప్పుడూ గేమ్ చేంజర్స్ అవుతారని మా నమ్మకం. జాసన్ సంజయ్ విజయ్ చెప్పిన యూనిట్ పాయింట్ మాకు నచ్చింది. సంజయ్ లండన్‌లో స్క్రీన్ రైటింగ్‌లో బీఏ (హానర్స్), టొరంటో ఫిల్మ్ స్కూల్‌లో ఫిల్మ్ ప్రొడక్షన్ డిప్లొమా పూర్తి చేశారు. ఈ చిత్రంలో ప్రముఖ నటీనటులు, సాంకేతిక నిపుణులు పని చేయబోతున్నారు'' అన్నారు. ''లైకా ప్రొడక్షన్స్ వంటి అగ్ర నిర్మాణ సంస్థలో నా ఫస్ట్ మూవీ చేయడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. ఈ సంస్థకు నా స్క్రిప్ట్ నచ్చటం నాకు హ్యాపీగా ఉంది'' అన్నారు జాసన్ సంజయ్ విజయ్.



• సుభాస్కరన్, జాసన్ సంజయ్


సారా ప్రేమలో టైగర్

రవితేజ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నూపుర్ సనన్ (నటి కృతీ సనన్ చెల్లెలు), గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లు. 'ది కాశ్మీర్ ఫైల్స్, కార్తికేయ 2' వంటి వరుస విజయాలు అందుకున్న అభిషేక్ అగర్వాల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ మూవీలో సారా పాత్రలో నటిస్తున్నారు నూపుర్. 'టైగర్ లవ్ సారా' అంటూ సోమవారం నూపుర్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ''రవితేజ కెరీర్‌లో అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. అక్టోబర్ 20న సినిమాని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. అనుపమ్ ఖేర్, రేణూ దేశాయ్ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, కెమెరా: ఆర్. మది, సమర్పణ: తేజ్ నారాయణ్ అగర్వాల్, సహనిర్మాత: మయాంక్ సింఘానియా.



• నూపుర్ సనన్

ప్రేమకథ



• నేహా, రవితేజ

రవితేజ నున్న, నేహా జురెల్ జంటగా సత్య రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'రాజుగారి అమ్మాయి –నాయుడు గారి అబ్బాయి'. రామిసెట్టి సుబ్బారావు, ముత్యాల రామదాసు నిర్మించారు. సంగీత దర్శకుడు కోటి తనయుడు రోషన్ సాలూరి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఐ లవ్ యు..' అనే లిరికల్ సాంగ్‌ని విడుదల చేశారు. రెహమాన్ సాహిత్యం అందించిన ఈ పాటని యాజిన్ నిజర్, నూతన్ మోహన్ పాడారు. ''అందమైన ప్రేమకథతో రూపొందిన చిత్రం ఇది. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులనూ అలరిస్తుంది'' అని దర్శక–నిర్మాతలు పేర్కొన్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
29-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	110	64,997
నిఫ్టీ ▲	40	19,306

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,692	▲	101
డోజోన్స్	34,569	▲	222
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,339	▲	5
డాక్స్	15,792	▲	167
షాంఘై	3,064	▼	18
నికాయ్	32,170	▲	546

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.ల్లో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	58,667
బంగారం (99.5 స్వచ్ఛత)	58,432
వెండి (కిలో)	73,636

ఫారెక్స్ రేట్లు రూ.ల్లో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.80	83.47
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.44	105.82
€	యూరో	ఎస్‌బీఐ	87.80	90.88
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.54	57.28
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.06	54.35
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.99	61.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.08	22.70
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.60	23.39
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.21	12.28

జియో ఎయిర్‌ఫైబర్ వచ్చేస్తోంది..

వినాయక చవితికి షురూ

- బీమాలోకి జియో ఫైనాన్షియల్స్
- సీబీజీ ప్లాంట్ల భారీ విస్తరణ
- 2026 నాటికి బ్యాటరీ గిగా ఫ్యాక్టరీ
- రిలయన్స్ ఏజీఎంలో చైర్మన్ ముకేశ్ అంబానీ వెల్లడి
- బోర్డులోకి వారసుల ఎంట్రీ



అత్యధిక డిమాండ్ ఉన్నవి, అనేక దశాబ్దాల పాటు ఆరోగ్యకరమైన వృద్ధి సాధించగలిగేవి అయిన వ్యాపారాలను మేము ఎంచుకున్నాం. తద్వారా అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారాలను నిర్మించగలిగాం. మా మూడు వృద్ధి చోదకాలు .. (ఓ2సీ, రిటైల్, జియో డిజిటల్ సర్వీసులు) మరింత విలువ జోడించగలవు. కొత్తగా మా నాలుగో వృద్ధి ఇంజిన్ జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ కూడా వీటికి తోడుగా చేరింది.
– ముకేశ్ అంబానీ, రిలయన్స్ చైర్మన్

ముంబై: పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ భారీ వృద్ధి లక్ష్యాల సాధన దిశగా ప్రణాళికలు ప్రకటించింది. ఇందులో భాగంగా వినాయక చవితి కల్లా జియో ఎయిర్‌ఫైబర్‌ను అందుబాటులోకి తేనుంది. అలాగే, జియో ఫైనాన్షియల్స్ విభాగం ద్వారా బీమా ఉత్పత్తులను ఆవిష్కరించనుంది. వచ్చే అయిదేళ్లలో 100 కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్లను నెలకొల్పాలని లక్ష్యంగా పెట్టుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ 46వ సర్వ సభ్య సమావేశంలో (ఏజీఎం) చైర్మన్ ముకేశ్ అంబానీ ఈ విషయాలు ప్రకటించారు. అదే క్రమంలో వారసత్వ ప్రణాళికలను కూడా వెల్లడించారు. ఆయన ముగ్గురు సంతానం (ఆకాశ్, ఈషా, అనంత్) కంపెనీ బోర్డులో నియమితులైనట్లు పేర్కొన్నారు. అలాగే, 2024 ఏప్రిల్ 19తో తన పదవీకాలం ముగియనున్నప్పటికీ.. మరో అయిదేళ్ల పాటు చైర్మన్‌గా కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు. ఏజీఎంలో మరిన్ని విశేషాలు..

ఎయిర్‌ఫైబర్‌తో వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్..

సెప్టెంబర్ 19న వినాయక చవితి సందర్భంగా జియో ఎయిర్‌ఫైబర్ సర్వీసులు ప్రారంభమవుతాయి. ఇది వైర్ల అవసరం లేని 5జీ బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులాంటిది. నెట్ కనెక్టివిటీకి ఎదురయ్యే అవరోధాలను అధిగమించేందుకు .. 5జీ నెట్‌వర్క్‌ను, అధునాతన వైర్‌లెస్ టెక్నాలజీలను ఉపయోగించుకుని ఇది వరుసలో చిట్టచివర్న ఉన్న వారికి కూడా బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందుబాటులోకి తేగలదని ముకేశ్ అంబానీ తెలిపారు. ఆప్టికల్ ఫైబర్‌తో రోజూ 15,000 ప్రాంగణాలను కనెక్ట్ చేయగలుగుతుంటే, జియోఎయిర్‌ఫైబర్ దీనికి పది రెట్లు అధికంగా కనెక్ట్ చేయగలదు. తద్వారా 20 కోట్ల గృహాలు, ప్రాంగణాలకు జియో మరింత చేరువ కాగలదు. ఈ సందర్భంగా జియో ట్రూ5జీ డెవలపర్ ప్లాట్‌ఫాంను కూడా రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ ప్రకటించారు. రిలయన్స్ కార్పొరేట్ పార్క్‌లో ఏర్పాటు చేసే తొలి జియో ట్రూ5జీ ల్యాబ్‌లో టెక్నాలజీ భాగస్వాములు, ఎంటర్‌ప్రైజ్ కస్టమర్లు .. వివిధ పరిశ్రమలకు అవసరమైన సొల్యూషన్స్‌ను రూపొందించవచ్చు. వాటిని పరీక్షించవచ్చు. అటు, కృత్రిమ మేధ (ఏఐ) ప్రయోజనాలను అందరికీ, అన్నిచోట్ల అందుబాటులోకి తెచ్చేందుకు జియో ప్లాట్‌ఫామ్స్ కృషి చేస్తోందని ముకేశ్ అంబానీ చెప్పారు. డిసెంబర్ ఆఖరు నాటికి దేశవ్యాప్తంగా 5జీ నెట్‌వర్క్ విస్తరణ పూర్తి చేసే దిశగా పనులు సాగుతున్నాయని తెలిపారు. జియో సినిమా వినోదానికి దేశీయంలోనే అతి పెద్ద డిజిటల్ వేదికగా మారిందని ఆయన పేర్కొన్నారు.

సీబీజీ ప్లాంట్లు.. గిగా ఫ్యాక్టరీలు..

2035 నాటికి కర్బన ఉద్గారాల విషయంలో తటస్థ స్థాయిని సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ముకేశ్ అంబానీ తెలిపారు. జామ్‌నగర్‌లో రెండు కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) డెమో యూనిట్లను నెలకొల్పాక, కేవలం 10 నెలల వ్యవధిలోనే ఉత్తర్ ప్రదేశ్‌లోని బారాబంకీలో వాణిజ్యావసరాల కోసం తొలి సీబీజీ ప్లాంటును ఏర్పాటు చేసినట్లు అంబానీ చెప్పారు. వీటిని త్వరితగతిన 25కి, అటుపైన వచ్చే అయిదేళ్లలో 100కు పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు ఆయన వివరించారు. 2026 నాటికి బ్యాటరీ గిగా ఫ్యాక్టరీ నెలకొల్పే లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. సోలార్ ప్యానెళ్లు, బ్యాటరీల తయారీ కోసం జామ్‌నగర్ రిఫైనరీ కాంప్లెక్స్‌లో రూ. 75,000 కోట్లతో నాలుగు గిగాఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

వారసత్వ ప్రణాళికలు..



ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో భాగమైన వివిధ వ్యాపార విభాగాల కార్యకలాపాలు నిర్వహిస్తున్న ముకేశ్ అంబానీ ముగ్గురు సంతానం తాజాగా రిలయన్స్ ఇండస్ట్రీస్ బోర్డులో చేరారు. నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా నియమితులయ్యారు. వారు ఈ హోదాను 'కష్టపడి సంపాదించుకున్నారని' అంబానీ తెలిపారు. "ఈషా, ఆకాశ్, అనంత్‌లో నేను, మా తండ్రిగారు ధీరుభాయ్ అంబానీ నాకు కనిపిస్తారు. ధీరుభాయ్‌లోని ఆ మెరుపు వారిలో నాకు కనిపిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం జియో ఇన్ఫోకామ్‌ను ఆకాశ్, రిటైల్ వ్యాపారాన్ని ఆయన కవల సోదరి ఈషా (31), కొత్త ఇంధన వ్యాపార విభాగాన్ని అనంత్ (27) పర్యవేక్షిస్తున్నారు. 2002లో ధీరుభాయ్ మరణానంతరం సోదరుడు అనిల్ అంబానీతో వ్యాపార పంపకాలపరంగా వివాదం తలెత్తిన నేపథ్యంలో ముకేశ్ తాజా వారసత్వ ప్రణాళికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, రిలయన్స్ ఫౌండేషన్ కార్యకలాపాలపై మరింతగా దృష్టి పెట్టే ఉద్దేశంతో ముకేశ్ సతీమణి నీతా అంబానీ రిలయన్స్ బోర్డు నుంచి తప్పుకున్నారు. అయితే, ఫౌండేషన్ చైర్‌పర్సన్‌గా శాశ్వత ఆహ్వానితురాలు హోదాలో ఆమె బోర్డు సమావేశాలన్నింటికి యథాప్రకారంగా హాజరవుతారు.

బీమాలోకి జేఎఫ్ఎస్...

జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ (జేఎఫ్ఎస్) బీమా రంగంలోకి విస్తరించనున్నట్లు ముకేశ్ అంబానీ తెలిపారు. ఇది సరళమైన ఆరోగ్య, జీవిత, సాధారణ బీమా పాలసీలను అందిస్తుందని పేర్కొన్నారు. మ్యూచువల్ ఫండ్స్ వ్యాపారంలోకి విస్తరించేందుకు బ్లాక్‌రాక్‌తో కలిసి జేఎఫ్ఎస్ జాయింట్ వెంచర్‌ను ప్రకటించింది. టెలికం విభాగం జియోకి ఉన్న 45 కోట్ల మంది మొబైల్ ఫోన్ యూజర్లకు తమ ఉత్పత్తులను విక్రయించే యోచనలో ఉంది.

టాప్ 4లో రిటైల్..



పలు అంతర్జాతీయ దిగ్గజాలు రిలయన్స్ రిటైల్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు ముకేశ్ అంబానీ చెప్పారు. ఒకవేళ దీన్ని స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేసి ఉంటే ప్రస్తుత వేల్యుయేషన్ ప్రకారం టాప్ 4 లిస్టెడ్ సంస్థల్లో రిటైల్ కూడా ఒకటిగా ఉండేదని ఆయన తెలిపారు. "2020 సెప్టెంబర్‌లో నిధులు సమీకరించినప్పుడు రిటైల్ వేల్యుయేషన్ రూ. 4.28 లక్షల కోట్లుగా ఉంది. మూడేళ్ల కన్నా తక్కువ వ్యవధిలోనే ఇది రెట్టింపయింది. రూ. 8.278 లక్షల కోట్ల వేల్యుయేషన్‌తో ఇటీవలే ఖతర్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (క్యూఐఏ) 1 శాతం వాటాను కొనుగోలు చేసింది. నాణ్యత, నవకల్పన, కస్టమరు ప్రధానంగా కార్యకలాపాలు నిర్వహించడం, పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలను మార్చుకోగలుగుతుండటం వంటి సామర్థ్యాలకు ఇది నిదర్శనం" అని అంబానీ తెలిపారు. అటు రూ. 22 కోట్లకు కొనుగోలు చేసిన సాఫ్ట్‌డ్రింక్ క్యాంపా కోలాను ఆసియా, ఆఫ్రికాతో పాటు అంతర్జాతీయ మార్కెట్లకు కూడా తీసుకెళ్లనున్నట్లు ఈషా అంబానీ తెలిపారు.

టీబీజెడ్‌లో 'మంగళ 2023 కలెక్షన్'



హైదరాబాద్: ఆభరణాల విక్రయ సంస్థ టీబీజెడ్ 'మంగళ 2023 కలెక్షన్' ఆవిష్కరించింది. పంజాగుట్ట షోరూంలో నిర్వహించిన వరలక్ష్మి వ్రతం వేడుకలో సినీ నటి రకుల్ ప్రీత్ సింగ్ ఈ కొత్త కలెక్షన్ విడుదల చేసింది. "భారతదేశ సంస్కృతి స్ఫూర్తితో తీర్చిదిద్దిన ఈ బంగారు వజ్రాభరణాలు ఏ సందర్భంలో ధరించినా ప్రత్యేకత చాటుతాయి. ఆవిష్కరణ కార్యక్రమంలో భాగం కావడం గౌరవంగా ఉంది" అని రకుల్ తెలిపారు. పంజాగుట్ట స్టోర్ పునః ప్రారంభంతో భాగ్యనగరంలో తమ కార్యకలాపాలు మరింత విస్తరించనున్నాయని టీబీజెడ్ మార్కెటింగ్ ఆఫీసర్ అభిషేక్ మాలూ ఆశించారు.

రెండు రోజుల తర్వాత లాభాలు

- కలిసొచ్చిన ప్రపంచ సానుకూలతలు
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు ర్యాలీ
- 65 వేల స్థాయి చేరువలో సెన్సెక్స్
- 19,300 పైకి నిఫ్టీ



ముంబై: రెండు రోజుల వరుస నష్టాల తర్వాత సోమవారం స్టాక్ సూచీలు స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు(1%)రాణించడంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. ఫలితంగా సెన్సెక్స్ 110 పాయింట్లు పెరిగి 64,997 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 40 పాయింట్లు బలపడి 19,306 వద్ద నిలిచింది. ఉదయం అతి స్వల్ప లాభంతో మొదలైన సెన్సెక్స్ ట్రేడింగ్‌లో 327 పాయింట్లు ఎగసి 65,213 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, మెటల్, ఆటో, రియల్టీ, ఇన్‌ఫ్రా, క్యాపిటల్ గూడ్స్, టెలికం, విద్యుత్ రంగాల షేర్లు లాభపడ్డాయి. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, టెక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- విష్ణు ప్రకాశ్ ఆర్ పుంగ్లియా ఐపీఓ చివరి రోజు నాటికి 87.81 రెట్లు అధిక స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 2.19 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయగా మొత్తం 192 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. అర్హత కలిగిన సంస్థాగత కొనుగోలుదారులు 171.69 రెట్లు, సంస్థాగతేతర పెట్టుబడిదారులు 111.02 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్లు 32 రెట్లు సబ్‌స్క్రైబ్ చేసుకున్నారు.
- టెలికం, రిటైల్ వ్యాపార విభాగాల ఐపీఓల నిర్వహణపై యాజమాన్యం నుంచి సరైన స్పష్టత కొరవడడంతో రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో ఫైనాన్సియల్ సర్వీసెస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఆర్ఐఎల్ ఒకశాతం షేర నష్టపోయి 2442 వద్ద, జియో ఫైనాన్స్ షేరు 0.30% పతనమై రూ.212 వద్ద నిలిచాయి.
- ఆర్థిక సంవత్సరం 2023 గానూ ప్రతి షేరుపై రూ.2 డివిడెండ్‌ను ప్రకటించడంతో ప్రభుత్వ రైల్వే సంస్థ ఐఆర్‌సీటీసీ షేరు 3% లాభపడి రూ.678 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నాలుగుశాతం లాభపడి రూ.684 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- ఎన్ఎస్ఈ కరెన్సీ డెరివేటివ్స్ మంగళవారం నాటికి 15 ఏళ్లు పూర్తి చేసుకోనుంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఇప్పటి వరకు రూ.609 లక్షల కోట్ల విలువైన 2,000 కోట్ల కాంట్రాక్టుల లావాదేవీలు నమోదయ్యాయి.

గల్ఫ్ ఆయిల్ చేతికి టైరెక్స్

డీల్ విలువ రూ. 103 కోట్లు



ముంబై: ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) చార్జర్ల తయారీ కంపెనీ టైరెక్స్ ట్రాన్స్‌మిషన్‌లో నియంత్రణ వాటాను కొనుగోలు చేయనున్నట్లు హిందుజా గ్రూప్ కంపెనీ గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ ఇండియా తాజాగా పేర్కొంది. ఇందుకు రూ.103 కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొంది. తద్వారా ఈవీ విభాగంలో కంపెనీ కార్యకలాపాలు మరింత విస్తరించనున్నట్లు అంచనా వేసింది. ఈవీ చార్జింగ్ మార్కెట్ ప్రస్తుత అంచనా విలువ 20 బిలియన్ డాలర్లుకాగా.. 2030కల్లా భారీగా 200 బిలియన్ డాలర్లను తాకగలదన్న అంచనాలున్నట్లు తెలిపింది.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్, కాకినాడలో 825 పోస్టులు

కాకినాడలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ధాన్య సేకరణకు సంబంధించి రెండు నెలల కాలానికి ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 825
» **పోస్టుల వివరాలు:** టెక్నికల్ అసిస్టెంట్–275, డేటాఎంట్రీ ఆపరేటర్–275, హెల్పర్–275.

అర్హత

» **టెక్నికల్ అసిస్టెంట్:** బీఎస్సీ(అగ్రికల్చర్/మైక్రోబయాలజీ/బయోకెమిస్ట్రీ /బయోటెక్నాలజీ)/ బీఎస్సీ(బీజెడ్‌సీ)/బీఎస్సీ(లైఫ్ సైన్సెస్/డిప్లొమా(అగ్రికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **డేటా ఎంట్రీ ఆపరేటర్:** ఏదైనా డిగ్రీతో పాటు పీజీడీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **హెల్పర్: అర్హత:** 8, 10 వతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** టీఏ/డీఈవో పోస్టులకు 21 నుంచి 40 ఏళ్లు, హెల్పర్‌కు 18నుంచి 35ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కులు, పని అనుభవం, అదనపు విద్యార్హతలు(టీఏ/డీఈవో పోస్టులకు) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** నోటిఫికేషన్ ప్రకారం నిర్ణీత నమూనాలో ఆఫ్‌లైన్ దరఖాస్తులను సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను జతచేసి రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా డిస్ట్రిక్ట్ సప్లైస్ మేనేజర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం, కలెక్టరేట్ కాంపౌండ్, కాకినాడ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 02.09.2023.
» **వెబ్‌సైట్:** eastgodavari.ap.gov.in

హెచ్‌పీసీఎల్, ముంబైలో 276 పోస్టులు

ముంబైలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 276
» **పోస్టుల వివరాలు:** మెకానికల్ ఇంజనీర్–57, ఎలక్ట్రికల్ ఇంజనీర్–16, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్–36, సివిల్ ఇంజనీర్–18, కెమికల్ ఇంజనీర్–43, సీనియర్ ఆఫీసర్–సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్(సీజీడీ)ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్–10, సీనియర్ ఆఫీసర్–ఎల్ఎన్‌జీ బిజినెస్–02, సీనియర్ ఆఫీసర్/అసిస్టెంట్ మేనేజర్–బయో ఫ్యూయల్ ప్లాంట్ ఆపరేషన్స్–01, సీనియర్ ఆఫీసర్/అసిస్టెంట్ మేనేజర్–జీబీజీ ప్లాంట్ ఆపరేషన్స్–01, సీనియర్ ఆఫీసర్–సేల్స్(రిటైల్/లూబ్స్/డైరెక్ట్ సేల్స్/ఎల్‌పీజీ)–05, సీనియర్ ఆఫీసర్–ఈవీ ఛార్జింగ్ స్టేషన్ బిజినెస్–04, ఫైర్ అండ్ సేఫ్టీ ఆఫీసర్–ముంబై రిఫైనరీ–02, ఫైర్ అండ్ సేఫ్టీ ఆఫీసర్–విశాఖ రిఫైనరీ–02, క్వాలిటీ కంట్రోల్(క్యూసీ) ఆఫీసర్–06, చార్టర్డ్ అకౌంటెంట్స్–24, లా ఆఫీసర్లు–09, లా ఆఫీసర్లు–హెచ్ఆర్–05, మెడికల్ ఆఫీసర్–04, జనరల్ మేనేజర్(ఆఫీస్ ఆఫ్ కంపెనీ సెక్రటరీ) –01, వెల్ఫేర్ ఆఫీసర్–ముంబై రిఫైనరీ–01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఈ, బీటెక్, ఎంబీబీఎస్, సీఏ, ఎంబీఏ, పీజీడీఎం ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూ, మూట్ కోర్ట్(లా ఆఫీసర్లు/లా ఆఫీసర్లకు మాత్రమే) తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.09.2023
» **వెబ్‌సైట్:**www.hindustanpetroleum.com

టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు

తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ తెలంగాణ గిరిజన గురుకుల లా కళాశాల సంగారెడ్డిలో యూజీ(లా సబ్జెక్టు) స్థాయిలో బోధించుటకు తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** అభ్యర్థులు పీజీలో సంబంధిత సబ్జెక్ట్‌లో 55శాతం మార్కులతో ఉత్తీరులవ్వాలి. సెట్/నెట్/పీహెచ్‌డీ ఉండాలి. పని అనుభవం ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా
» **దరఖాస్తు ప్రారంభతేది:** 20.08.2023.
» **దరఖాస్తులకు చివరితేది:** 02.09.2023.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.ttwrdcs.ac.in https://tgtwgurukulam.telangana.gov.in.

ఇండియన్ బ్యాంక్‌లో 11 స్పోర్ట్స్ కోటా పోస్టులు

చెన్నైలోని ఇండియన్ బ్యాంక్ స్పోర్ట్స్ పర్సన్స్ కోటాలో క్లర్క్/ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11
» **స్పోర్ట్స్:**బాస్కెట్ బాల్,క్రికెట్,హాకీ, వాలీబాల్.
» **అర్హత:**12వ తరగతి/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి
» **వయసు:** 18 నుంచి 26 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.17,900 నుంచి రూ.63,840 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**05.09.2023.
» **వెబ్‌సైట్:** www.indianbank.in

సైంటిస్ట్‌లకు ఐసీఏఆర్ స్వాగతం

» ప్రిన్సిపల్ సైంటిస్ట్స్, సీనియర్ సైంటిస్ట్స్ పోస్టులు
» ఏఎస్ఆర్‌బీ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ
» ఎంపికైతే.. ఉజ్వల భవిష్యత్తు ఖాయం

ఐసీఏఆర్.. ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్! దేశవ్యాప్తంగా పలు పరిశోధనశాలలు ఉన్న ఐసీఏఆర్.. పీహెచ్‌డీ ఉత్తీర్ణులకు స్వాగతం పలుకుతోంది. మొత్తం 368 సైంటిస్ట్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఏఎస్ఆర్‌బీ) ఆధ్వర్యంలో.. నియామకాలు చేపట్టనుంది. ఈ నేపథ్యంలో.. ఏఎస్ఆర్‌బీ నోటిఫికేషన్ వివరాలు, పోస్టులు, ఎంపిక ప్రక్రియ తదితర వివరాలు..

అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్.. సంక్షిప్తంగా ఏఎస్ఆర్‌బీ. కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ విభాగం ఏర్పాటు చేసిన సంస్థ. భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్), ఇతర వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో సైంటిస్ట్ పోస్టులకు ఎంపిక ప్రక్రియను ఏఎస్ఆర్‌బీ చేపడుతుంది. ఈ సంస్థ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి నిరంతరం నోటిఫికేషన్లు విడుదల చేస్తుంటుంది. తాజాగా ఐసీఏఆర్‌కు దేశ వ్యాప్తంగా ఉన్న పరిశోధనశాలల్లో సైంటిస్ట్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తు ప్రకియ ప్రారంభించింది.

మొత్తం పోస్టులు 368

తాజా నోటిఫికేషన్ ద్వారా ఏఎస్ఆర్‌బీ.. ప్రిన్సిపల్ సైంటిస్ట్స్, సీనియర్ సైంటిస్ట్ హోదాలో మొత్తం 368 పోస్టులను భర్తీ చేయనుంది. ప్రిన్సిపల్ సైంటిస్ట్ హోదాలో 80 పోస్టులు, సీనియర్ సైంటిస్ట్ హోదాలో 288 పోస్టులు ఉన్నాయి.

అగ్రికల్చర్ నుంచి ఎకానమీ వరకు

పలు స్పెషలైజేషన్లలో ప్రిన్సిపల్ సైంటిస్టులు, సీనియర్ సైంటిస్ట్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. అగ్రికల్చర్, అనుబంధ విభాగాలతోపాటు ఎకానమీ, బిజినెస్ పాలసీ, హ్యూమన్ రిసోర్సెస్ వంటి స్పెషలైజేషన్లలోనూ ఈ పోస్టుల నియామకం చేపట్టనున్నారు.

పీహెచ్‌డీ అర్హతగా

ప్రిన్సిపల్ సైంటిస్ట్, సీనియర్ సైంటిస్ట్ రెండు పోస్టులకు పీహెచ్‌డీని అర్హతగా నిర్దేశించారు. అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకుంటున్న స్పెషలైజేషన్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసి ఉండాలి. తమ అర్హతలకు సరితూగే అన్ని పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలో ఆయా పోస్టులకు సంబంధించి ప్రాథమ్యత క్రమాన్ని పేర్కొనాల్సి ఉంటుంది.

అనుభవం తప్పనిసరి

- ప్రిన్సిపల్ సైంటిస్ట్, సీనియర్ సైంటిస్ట్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారికి పని అనుభవం తప్పనిసరి.
- ప్రిన్సిపల్ సైంటిస్ట్ పోస్టులకు సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ తర్వాత పదేళ్ల అనుభవం ఉండాలి.
- సీనియర్ సైంటిస్ట్ పోస్టులకు సంబంధిత విభాగంలో ఎనిమిదేళ్ల పని అనుభవం తప్పనిసరి.

వయసు

- ప్రిన్సిపల్ సైంటిస్ట్‌కు గరిష్టంగా 52 ఏళ్లు, సీనియర్ సైంటిస్ట్‌కు గరిష్టంగా 47 ఏళ్లు ఉండాలి.

వేతన శ్రేణి

- ప్రిన్సిపల్ సైంటిస్ట్, సీనియర్ సైంటిస్ట్ పోస్టులకు వేతన శ్రేణి కూడా భారీగా ఉంటోంది.
- ప్రిన్సిపల్ సైంటిస్ట్స్‌కు వేతన శ్రేణి రూ.1,44,200 –రూ.2,18,200, సీనియర్ సైంటిస్ట్‌లకు వేతన శ్రేణి రూ.1,31,400–2,17,100గా పేర్కొన్నారు.



ఇంటర్వ్యూలో ప్రతిభ

ప్రిన్సిపల్ సైంటిస్ట్, సీనియర్ సైంటిస్ట్ పోస్టులకు పర్సనల్ ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా నియామకాలు ఖరారు చేస్తారు. ఆయా స్పెషలైజేషన్లలో వచ్చిన దరఖాస్తులు, పోస్టుల సంఖ్య, రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకొని దరఖాస్తులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఆ జాబితాలో నిలిచిన వారికి పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** సెప్టెంబర్ 8, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్:** https://asrb.org.in/noticeboard

ఫుల్‌స్టాక్ డెవలపర్స్‌కు ఫుల్ డిమాండ్!

ఐటీ రంగంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, వెబ్3 మొదలైన టెక్నాలజీల ప్రవేశంతో.. డిజిటల్ నైపుణ్యాల పరిధి వేగంగా మారుతోంది. ఫుల్‌స్టాక్ డెవలపర్‌లకు డిమాండ్ పెరుగుతోంది. ఐటీ కంపెనీలు లక్షల వేతనాలతో వీరికి అవకాశాలు కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫ్రెష్ గ్రాడ్యుయేట్లు ఫుల్‌స్టాక్ డెవలపర్‌గా కెరీర్ ప్రారంభించాలంటే.. ఏయే నైపుణ్యాలు అవసరం, అర్హతలేంటి? ఫుల్ స్టాక్ డెవలపర్లు ఐటీ సంస్థల్లో నిర్వర్తించే విధులు తదితర వివరాలు..


ఒక అప్లికేషన్ లేదా వెబ్‌సైట్.. ఫ్రంట్ ఎండ్, బ్యాక్ ఎండ్ అభివృద్ధిని ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్ అంటారు. ఫుల్‌స్టాక్ డెవలపర్లు అప్లికేషన్‌కు సంబంధించిన ప్రోగ్రామింగ్, డిజైన్, డేటా బేసెస్, డీబగ్గింగ్ వంటి విధుల్లో కీలకంగా వ్యవహరిస్తారు. అలాగే యూజర్ ఎక్స్‌పీరియెన్స్, బిజినెస్ లాజిక్, అప్లికేషన్ లుక్, ఫంక్షనింగ్‌ల్లో నిష్ణాతులుగా ఉంటారు.

అందుకే అధిక డిమాండ్

సాంకేతిక రంగంలో ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్ కీలక మైలురాయిగా నిలుస్తోంది. నైపుణ్యాల బృందంగా ఫుల్‌స్టాక్ డెవలపర్లను అభివర్ణిస్తున్నారు. వీరు ఫ్రంట్ ఎండ్, బ్యాక్ ఎండ్ ఇంజనీరింగ్‌కు వారధిగా నిలుస్తూ కీలకంగా వ్యవహరిస్తున్నారు. విభిన్న అప్లికేషన్స్‌కు సంబంధించి అన్ని దశల్లో ఫుల్‌స్టాక్ డెవలపర్లు పనిచేయగలరు. ఒక దశకు మరొక దశకు మధ్య అనుసంధానకర్తలుగా వ్యవహరించగలరు. ఆయా డొమైన్లకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ నాలెడ్జ్‌తో పాటు టీమ్‌లో ఏ పనినైనా వీరు చేయగలరు. ఫ్రంట్ ఎండ్, బ్యాక్ ఎండ్ ఇంజనీరింగ్‌పై అవగాహన, పని చేయగలిగే సామర్థ్యాలు ఫుల్‌స్టాక్ డెవలపర్ల సొంతం. అందుకే ప్రస్తుతం ఫుల్‌స్టాక్ డెవలపర్లకు జాబ్ మార్కెట్‌లో మంచి డిమాండ్ నెలకొంది.

నేర్చుకోవాల్సిన టూల్స్

- అప్లికేషన్స్‌కు సంబంధించిన అన్ని స్థాయిల్లో పని చేయగలిగే ఫుల్‌స్టాక్ డెవలపర్‌గా మారేందుకు బేసిక్ టూల్స్‌పై అవగాహనతోపాటు ఆపరేటింగ్ సిస్టమ్, వెబ్ బ్రౌజర్, టెక్స్ట్ ఎడిటర్, ఫ్రంట్ ఎండ్, బ్యాక్ ఎండ్ టూల్స్, ప్యాకేజ్ మేనేజర్స్, డేటా బేసెస్‌పై పరిపూర్ణ అవగాహన పెంచుకోవాలి. ఇంజనీరింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్ సర్టిఫికేషన్స్, శిక్షణ ద్వారా ఈ విభాగంలో కెరీర్‌ను ప్రారంభించొచ్చు.
- ఫుల్ స్టాక్ డెవలపర్‌లు సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, లాంగ్వేజెస్, డేటాబేస్‌కు సంబంధించిన టెక్నికల్ నైపుణ్యాలు నేర్చుకోవాలి. ఫ్రంట్, బ్యాక్ ఎండ్ వెబ్ డెవలపర్‌లకు ఒకే విధమైన సాఫ్ట్ స్కిల్స్ అవసరం అయినప్పటికీ.. సాంకేతిక సామర్థ్యాలు భిన్నంగా ఉంటాయి. ఫుల్‌స్టాక్ వెబ్ డెవలపర్ విభిన్న ఫ్రేమ్‌వర్క్ రకాలపై పని చేయడానికి నిర్దిష్ట నైపుణ్యాలను కలిగి ఉండాలి.
- బ్యాక్‌బోన్.జేఎస్, కోడ్‌పెన్, విజువల్ స్టూడియో కోడ్, టైప్ స్క్రిప్ట్, వెబ్‌స్టోమ్, గిట్‌హబ్, స్లాక్, ఎలక్ట్రాన్ వంటి టూల్స్ నేర్చుకోవాలి. ఫుల్‌స్టాక్ డెవలపర్లు వెబ్‌సైట్‌కు సంబంధించిన సమాచారాన్ని డేటాబేసెస్‌ల్లో నిక్షిప్తం చేసి.. అవసరమైనప్పుడు వినియోగించుకుంటారు. దాంతో ఫుల్‌స్టాక్ డెవలపర్లకు డేటాబేసెస్, ఒరాకిల్, రెడిస్, మ్యాంగోడీబీ, ఎస్‌క్యూఎల్ సర్వర్ వంటి నైపుణ్యాలు అవసరమవుతాయి.



ముఖ్యమైన విధులు

- ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవసరమైన వాటిని సమకూర్చుకోవడం.
- డేటాబేసెస్, సర్వర్ల ఏర్పాటు సంబంధిత విషయాలు.
- అప్లికేషన్ టెస్టింగ్.
- వేర్వేరు వేదికల్లో(పరికరాలు)ప్రొడక్ట్‌ను పరీక్షించడం.
- ఎడిటింగ్ అండ్ మాడిఫయింగ్ కోడ్స్ మొదలైనవి.

కంపెనీల మొగ్గు

ఫుల్‌స్టాక్ డెవలపర్లను నియమించుకుంటే.. ఆయా టాస్కులకు ప్రత్యేక స్పెషలిస్టుల అవసరం ఉండదు. అందుకే కంపెనీ నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకొనే క్రమంలో ఫుల్‌స్టాక్ డెవలపర్ల వైపు సంస్థలు మొగ్గుచూపుతున్నాయి. ఐటీ రంగంలో సాంకేతికత ఎప్పటికప్పుడు మారుతోంది. ఫుల్‌స్టాక్ డెవలపర్లు కొత్త టెక్నాలజీని వేగంగా నేర్చుకోవడంలో ముందుంటున్నారు. దాంతో ఫుల్‌స్టాక్ డెవలపర్లు కలిగిన కంపెనీలకు రిక్రూట్‌మెంట్, శిక్షణల పరంగా అదనంగా ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు. అందుకే ప్రస్తుతం కంపెనీల తొలి చాయిస్ ఫుల్‌స్టాక్ డెవలపర్లు అవుతున్నారు.

స్టార్టప్స్ ఎంపిక

ప్రాజెక్టుకు సంబంధించిన సమస్యల పరిష్కారంతో పాటు, అప్లికేషన్ డెవలప్‌మెంట్‌కు అవసరమైన అన్ని నైపుణ్యాలను ఫుల్‌స్టాక్ డెవలపర్లు కలిగి ఉంటారు. దాంతో స్టార్టప్‌లు సైతం నియామకాల్లో ఫుల్‌స్టాక్ డెవలపర్లకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. తద్వారా మొత్తం ఉద్యోగులపై చేసే వ్యయాన్ని తగ్గించుకుంటున్నాయి.

క్లుప్తంగా...

మెడికల్ పీజీ జాయినింగ్ గడువు పొడిగింపు



సాక్షి, అమరావతి: 2023–24 విద్యా సంవత్సరానికిగానూ వైద్య విద్య పీజీ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లు పొందిన విద్యార్థులు రిపోర్ట్ చేసే గడువును సెప్టెంబర్ రెండో తేదీ వరకూ పొడిగిస్తూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. తొలుత ఆగస్టు 30వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు విద్యార్థులు రిపోర్ట్ చేయాలని ఆదేశించగా తాజాగా రెండో తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు రిపోర్ట్ చేయవచ్చని స్పష్టం చేశారు. ఈ మేరకు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మరోవైపు నాలుగేళ్ల డిగ్రీ బీఎస్సీ(నర్సింగ్), రెండేళ్ల డిగ్రీ పోస్ట్ బేసిక్ బీఎస్సీ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువును వచ్చే నెల మూడో తేదీ సాయంత్రం 4 గంటల వరకూ పొడిగించారు. నాలుగేళ్ల డిగ్రీ బీఎస్సీ (నర్సింగ్) కోర్సులో ప్రవేశాల కోసం https://-ugnursing.ysruhs.com, రెండేళ్ల పోస్ట్ బేసిక్ బీఎస్సీ(నర్సింగ్) ప్రవేశాల కోసం https://ugpostbasic.ysruhs.com వెబ్‌సైట్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ వివరాలకు https://dr-ysr.uhsap.in లో సందర్శించవచ్చు.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ సేవలను విస్తరిస్తాం

- వీసీ ప్రొఫెసర్ సీతారామారావు

సాక్షి, అమరావతి: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని వర్సిటీ సేవలను మరింత విస్తరిస్తామని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే సీతారామారావు తెలిపారు. విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపు మరింత బాధ్యతను పెంచిందన్నారు. తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం ఏర్పాటుచేసిన కోఆర్డినేటర్ల సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలకు విద్యనందించే వర్సిటీ సిబ్బంది సానుకూల దృక్పథంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో టీటీడీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్ రెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ, అభ్యాసక సహాయ సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎల్ విజయకృష్ణారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ దస్సల్ రాజేందర్ రెడ్డి, శ్రీ పద్మావతి మహిళా కళాశాల ప్రిన్సిపల్ మహాదేవమ్మ తదితరులు పాల్గొని మాట్లాడారు.

30 నుంచి పాలిసెట్ తుది దశ ప్రవేశాలు

సాక్షి, అమరావతి: పాలిసెట్–2023 తుది దశ ప్రవేశాల ప్రక్రియను ఆగస్టు 30 నుంచి ప్రారంభిస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, పాలిటెక్నిక్ అడ్మిషన్ల కన్వీనర్ చదలవాడ నాగరాణి సోమవారం తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ ఫీజు చెల్లింపు, సర్టిఫికేషన్ పరిశీలన ఉంటుందన్నారు. 2 నుంచి ఆప్షన్ల ఎంపిక, మార్పులు చేసుకోవచ్చన్నారు. 4న సీట్లు కేటాయిస్తామన్నారు. 7లోగా విద్యార్థులు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

ఆన్‌లైన్ రమ్మీపై కమిటీ నివేదికను పరిశీలించండి

- హైకోర్టుకు సుప్రీంకోర్టు సూచన

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఆన్‌లైన్ రమ్మీకి సంబంధించి ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించాలని ఏపీ హైకోర్టుకు సుప్రీంకోర్టు సూచించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఆన్‌లైన్ రమ్మీపై నిషేధం విధించవద్దని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా హైకోర్టు ఆదేశాలను మధ్యంతర ఉత్తర్వులుగా పరిగణించాలని పేర్కొంది. ఆన్‌లైన్ రమ్మీ గేమా? లేదా అదృష్టమా? అని నిర్ధారించడానికి హైకోర్టే కమిటీ ఏర్పాటు చేసినందున... ఆ కమిటీ నివేదిక అందిన తర్వాత అన్ని అంశాలు పరిశీలించాలని హైకోర్టుకు సూచించింది. కేంద్రం నిబంధనలు కూడా పరిగణించాలని పేర్కొంది.

స్పెషల్ అలవెన్స్ మంజూరు హర్షణీయం

- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య

సాక్షి, అమరావతి: డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌లో పనిచేస్తోన్న సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (సీఎస్ఎస్), డిప్యూటీ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్(డీసీఎస్ఎస్), సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ (సీఎస్ఎస్) వైద్యులందరికీ దేశంలో ఏ రాష్ట్రంలో లేనట్టుగా రూ.15,000 స్పెషల్ అలవెన్స్‌ను ప్రభుత్వం మంజూరు చేయడం హర్షణీయమని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ రోహిత్, ఏపీ వీవీపీ డాక్టర్స్ జేఏసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ జయప్రకాశ్‌లు తెలిపారు. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ సోమవారం ప్రకటన విడుదల చేశారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లిన వెంటనే పరిష్కరించడం సంతోషకరమన్నారు. ఈ నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందించడానికి మరింత మంది స్పెషలిస్ట్ వైద్యులు ముందుకు వస్తారని పేర్కొన్నారు.

597 పోస్టుల భర్తీ

గ్రూప్-1, గ్రూప్-2

▶ మొదటి పేజీ తరువాయి

భర్తీ చేయనున్నారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్థిక, సాధారణ పరిపాలన, న్యాయ, లేజిస్లేచర్ తదితర శాఖల్లోనూ గ్రూప్–2 పోస్టులు భర్తీ చేయనున్నారు. గ్రూప్–1లో అత్యధికంగా హోంశాఖలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్–కేటగిరి–2లో 25 పోస్టులు భర్తీ చేయనున్నారు. గ్రూప్–2 కేటగిరీలో రాష్ట్ర సచివాలయంలో అత్యధికంగా 161 అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. సంబంధిత శాఖలు ఆయా పోస్టుల వివరాలతో పాటు జోన్, జిల్లాల వారీగా ఖాళీలతో పాటు రోస్టర్ పాయింట్స్, విద్యార్హత వివరాలను వెంటనే ఏపీపీఎస్సీకి సమర్పించాల్సిందిగా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.



గ్రూప్-1 పోస్టులు

విభాగం	విభాగాధిపతి	పోస్టు పేరు	ఖాళీల సంఖ్య
ఏ అండ్ సీ	రిజిస్ట్రార్ ఆఫ్ కో–ఆపరేటివ్ సొసైటీస్	డిప్యూటీ రిజిస్ట్రార్	05
బీసీ సంక్షేమం	కమిషనర్ ఆఫ్ బీసీ వెల్ఫేర్	డిస్ట్రిక్ట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అసిస్టెంట్ డైరెక్టర్‌తో కలిపి	01
ఎస్‌డీ అండ్ టీ	డైరెక్టర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్	డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్	04
ఫైనాన్స్	డైరెక్టర్ ఆఫ్ స్టేట్ ఆడిట్	అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్	02
ఫైనాన్స్	డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్	అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్/ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్	06
హోం	డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్	డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, కేటగిరీ–2	25
హోం	డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్	డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్ (పురుషులు)	01
హోం	డీజీ ఆఫ్ డిజాస్టర్ అండ్ ఫైర్ సర్వీసెస్	డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్	01
ఎంఏ అండ్ యూడీ	కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మిన్	మున్సిపల్ కమిషనర్ గ్రేడ్–2	01
రెవెన్యూ	చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్	డిప్యూటీ కలెక్టర్	12
రెవెన్యూ	ఇన్‌స్పెక్టర్ జనరల్, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్	డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్	03
రెవెన్యూ	చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్	అసిస్టెంట్ కమిషనర్(ఎస్‌టీ), గతంలో సీటీవో	18
రెవెన్యూ	కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్	అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్	01
సాంఘిక సంక్షేమం	డైరెక్టర్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్	డిస్ట్రిక్ట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్	03
టీఆర్ అండ్ బీ	కమిషనర్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్	రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్	06
మొత్తం			89

గ్రూప్-2 పోస్టులు

విభాగం	విభాగాధిపతి	పోస్టు పేరు	ఖాళీల సంఖ్య
ఆర్థిక	సెక్రటేరియట్	అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్	23
జీఏడీ	సెక్రటేరియట్	అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్	161
న్యాయ శాఖ	సెక్రటేరియట్	అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్	12
లెజిస్లేచర్	సెక్రటేరియట్	అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్	10
ఎంఏ అండ్ యూడీ	కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మిన్	మున్సిపల్ కమిషనర్ గ్రేడ్–3	04
రెవెన్యూ	చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్	డిప్యూటీ తహసీల్దార్ గ్రేడ్–2	114
రెవెన్యూ	ఇన్‌స్పెక్టర్ జనరల్, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్	సబ్‌రిజిస్ట్రార్ గ్రేడ్–2	16
రెవెన్యూ	కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్	ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్	150
ఎల్ఎఫ్‌బీ అండ్ ఐఎంఎస్	కమిషనర్ ఆఫ్ లేబర్	అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్	18
మొత్తం			508

వృక్షాబంధన్



గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 'వృక్షాలను పరిరక్షించండి–పచ్చని వాతావరణం నెలకొల్పండి' అనే కార్యక్రమంలో భాగంగా విశాఖ నగరం రైల్వేస్టేషన్ రోడ్డులోని 136 ఏళ్ల చరిత్ర కలిగిన భారీ మర్రి చెట్టుకు సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు సోమవారం రాఖీలు కట్టి వృక్షాబంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా రాఖీ పౌర్ణమికి ముందు విద్యార్థులతో చెట్లకు రాఖీ కట్టించడం 20 ఏళ్లుగా చేస్తున్నామని తెలిపారు. –తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర)

మారిటైమ్ ఇండస్ట్రీని శాసించే దిశగా భారత్

- కేంద్ర పోర్టులు, జలరవాణా శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్

సాక్షి, విశాఖపట్నం: మారిటైమ్ ఇండస్ట్రీ ప్రపంచాన్ని శాసించే దిశగా భారత్ అడుగులు వేస్తున్నదని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ అన్నారు. ఢిల్లీలో జరిగే గ్లోబల్ మారిటైమ్ ఇండియా సమ్మిట్‌కు అనుబంధంగా డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డీసీఐ) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన ముఖ్య అతిథిగా వర్చువల్‌గా పాల్గొన్నారు. ఆయనతో పాటు కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖ సహాయ మంత్రులు శాంతనుఠాకూర్, శ్రీపాద యశోనాయక్ వర్చువల్‌గా పాల్గొన్నారు. శర్బానంద మాట్లాడుతూ పోర్టులు, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఒప్పందాలకు జీఎంఐఎస్–2023 కీలకంగా మారనుందని అభిలషించారు. ప్రపంచవ్యాప్తంగా స్టేక్‌హోల్డర్లకు ఏకీకృత వేదికగా ఢిల్లీలో అక్టోబర్ 17 నుంచి 19 వరకు జీఎంఐఎస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత్‌ని గ్లోబల్ మారిటైమ్ హబ్‌గా మార్చేందుకు అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. కేంద్ర సహాయ మంత్రులు శాంతనుఠాకూర్, శ్రీపాద యశోనాయక్ మాట్లాడుతూ సముద్ర అనుబంధ పరిశ్రమలతో పోర్టులు జతకట్టేందుకు రూ.లక్షల కోట్ల ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ప్లాట్‌ఫామ్‌గా జీఎంఐఎస్ మారనుందన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా మేక్ ఇన్ ఇండియాని ప్రపంచానికి చాటి చెప్పేందుకు అనుబంధ పరిశ్రమలన్నీ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డీసీఐ చైర్మన్ డా.ఎం. అంగముత్తు, ఎండీ కెప్టెన్ దివాకర్ పాల్గొన్నారు.



వర్చువల్‌గా మాట్లాడుతున్న సోనోవాల్

భారత్ వైపు విదేశీ పెట్టుబడిదారుల చూపు

- కేంద్ర మంత్రి భగవంత్ ఖుబా

సాక్షి, విశాఖపట్నం: భారత్‌లో పెట్టుబడులకు విదేశీ పెట్టుబడిదారులు ఆసక్తి చూపిస్తున్నారని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయమంత్రి భగవంత్ ఖుబా తెలిపారు. మన దేశంలో పెట్టుబడులు లాభదాయకం, సురక్షితం అన్న భావన వారిలో ఉండడమే ఇందుకు కారణమన్నారు. ఈ అవకాశాన్ని మోదీ ప్రభుత్వం సద్వినియోగం చేసుకుంటున్నదని చెప్పారు. విశాఖపట్నంలో సోమవారం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ప్రతినిధులతో జరిగిన సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ ఆర్థిక పరిస్థితి గణనీయంగా పురోభివృద్ధి చెందుతోందని, 2047 నాటికి ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానానికి చేరుకుంటుందని చెప్పారు. ఏ రంగంలోనైనా ఇతర దేశాలపై ఆధారపడకూడదన్నది ప్రధాని మోదీ ఆలోచన అన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు విశాఖ ఎంతో అనుకూలమైన ప్రాంతమని, అందుకే విశాఖలో పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందుతోందని చెప్పారు. విశాఖలో సోమవారం సీఐఐ ప్రతినిధులతో ఇంధన, ఫార్మా, పరిశ్రమల రంగాలపై చర్చించానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర మేడపాటి పాల్గొన్నారు.

వానలొస్తున్నాయ్..

- వచ్చే నెల నుంచి వర్షాలు
- హిమాలయాల నుంచి దక్షిణాదికి మారనున్న రుతుపవన ద్రోణి
- ద్రోణి మార్పుతో చురుగ్గా మారనున్న 'నైరుతి'
- రాష్ట్రంలో సాధారణానికి మించి వర్షపాతానికి అవకాశం



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో వచ్చే నెల ఆరంభం నుంచి విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. నైరుతి రుతు పవనాలు ముఖం చాటేయడంతో ఈ సీజన్‌లో కొద్దిరోజులుగా కానరాని వర్షాలు నాలుగైదు రోజుల్లో తిరిగి ప్రారంభమవుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఆగస్టు నెలలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. నైరుతి రుతుపవనాల సీజను ఆరంభమైన జూన్‌లో మోస్తరుగా, జూలైలో విస్తారంగా వానలు కురిశాయి. ఆగస్టులో వర్షాల జాడ లేదు. ఈనెల ఆరంభం నుంచే రుతుపవన ద్రోణి (మాన్సూన్ ట్రఫ్) హిమాలయాల వైపు వెళ్లిపోయింది. వారం పది రోజుల తర్వాత తిరిగి ఇది దక్షిణాది వైపు రావడం సహజంగా జరిగే ప్రక్రియ. హిమాలయాల నుంచి కదిలి మధ్యప్రదేశ్‌పై కొన్నాళ్లు స్థిరంగా ఉంటుంది. ఇది ఆంధ్రప్రదేశ్‌లో విస్తారంగా వర్షాలు కురవడానికి దోహదపడుతుంది. ఆ మధ్య సమయంలోనే కొద్దిరోజుల పాటు బ్రేక్ మాన్సూన్ (వర్షాలకు విరామం) ఏర్పడి వానలకు అడ్డుకట్ట వేస్తుంది. అయితే ఈసారి అందుకు భిన్నంగా మూడు వారాలకు పైగా హిమాలయాల వద్దే రుతుపవన ద్రోణి తిష్ట వేసింది. ఫలితంగా హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో కుంభవృష్టి కురిపించి వరదలకు కారణమైంది. రుతు పవన ద్రోణి దక్షిణాది వైపు కదలకపోవడంతో నైరుతి రుతుపవనాలు బలహీనమైపోయి ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆగస్టు నెలలో అప్పుడప్పుడు అక్కడక్కడ కొద్దిపాటి వర్షాలు కురిశాయి తప్ప సాధారణ వర్షాలు లేవు. ఈ ద్రోణి వచ్చే నెల ఒకటో తేదీ వరకు హిమాలయాల వద్దే కొనసాగి, ఆ తర్వాత దక్షిణాదికి మారుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తాజాగా వెల్లడించింది. ఆ ప్రక్రియ మొదలైన నాలుగైదు రోజులకు రాష్ట్రంలో వర్షాలు మళ్లీ మొదలవుతాయని వాతావరణ శాఖ రిటైర్డ్ అధికారి రాళ్లపల్లి మురళీకృష్ణ 'సాక్షి'కి చెప్పారు. రుతుపవన ద్రోణి ప్రభావంతో బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడి సెప్టెంబర్ మొదటి వారం నుంచి వానలు సమృద్ధిగా కురిసేందుకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. సెప్టెంబర్‌లో ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం లేదా అంతకు మించి ఒకింత ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని ఐఎండీ కూడా అంచనా వేసింది.

జాడలేని అల్పపీడనాలు..

అరేబియా సముద్రం, బంగాళాఖాతం శాఖల నుంచి వేర్వేరుగా పయనించే రుతుపవనాల ప్రభావంతో అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పడి, వర్షాలు కురుస్తాయి. కానీ ఈ సీజన్‌లో ఇప్పటిదాకా చెప్పుకోదగిన స్థాయిలో అల్పపీడనాలు ఏర్పడలేదు. ఈ ఏడాది 'నైరుతి' సీజను ఆరంభమైన కొన్నాళ్లకు రుతుపవనాలు చైనా, జపాన్ వైపు వెళ్లిపోయాయి. రుతుపవన ద్రోణి దిగువకు (దక్షిణం వైపునకు) రాకపోవడం, ఎల్‌నినో ప్రభావం వెరసి ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులేర్పడ్డాయని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

అమ్మభాషను అక్కున చేర్చుకో..



తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటుతూ తూర్పుగోదావరి జిల్లా రంగంపేటకు చెందిన సోహిత, ధన్యత (దేవిన సిస్టర్స్) సోమవారం సైకత శిల్పాన్ని రూపొందించారు. దానిపై గిడుగు రామ్మూర్తి ముఖ చిత్రాన్ని, 'అ' అక్షరాన్ని తీర్చిదిద్దారు. కిందన భాషలెన్నైనా నేర్చుకో...అమ్మభాషను అక్కున చేర్చుకో అని రాశారు. –రంగంపేట

ఎందుకంత తొందర రామోజీ!?

వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది

- నిజానికి.. చంద్రబాబు పాలనలో ఐదేళ్లూ కరువే..
- అప్పట్లో ఏనాడైనా ఈ వార్తలు రాశావా రామోజీ?
- రైతులను భయభ్రాంతులకు గురిచేసే రాతలు మానుకో..
- మీడియాతో వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల్లో ఇప్పటికే ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను అమలుచేస్తున్నామని చెప్పారు. అంతేకాక.. అన్నదాతలకు రైతుభరోసా సాయాన్ని అందజేయడంతోపాటు 60వేల క్వింటాళ్ల విత్తనాలను ఆర్బీకేల్లో పొజిషన్ కూడా చేశామన్నారు. డిమాండ్ మేరకు మరిన్ని విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లుచేస్తున్నామని ఆయన చెప్పారు. మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రైతులను భయభ్రాంతులకు గురిచేసేలా ఈనాడులో వస్తున్న కథనాలపై ఆయన మండిపడ్డారు. గతంలో ఎన్నడూలేని విధంగా రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహరహం శ్రమిస్తున్నారని చెప్పారు. ఎన్నో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలతో రైతులకు ముఖ్యమంత్రి అండగా నిలుస్తుంటే ఎల్లో మీడియా ఓర్వలేక విషం కక్కుతోందన్నారు. సాధారణంగా ఖరీఫ్ సీజన్ సెప్టెంబర్ నెలాఖరు వరకు ఉంటుందని, ఆ మాత్రం అవగాహన లేకపోతే ఎలా అని రామోజీని కాకాణి ప్రశ్నించారు. ఆగస్టు నెలాఖరులోగా ఆశించిన స్థాయిలో వర్షాలు పడితే విత్తుకోవాలని రైతులు ఎదురుచూస్తున్నారని మంత్రి చెప్పారు. ఆ దిశగా ఆర్బీకేల ద్వారా అవగాహన కూడా కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే రాయలసీమ జిల్లాల్లో రైతులు ఆర్బీకేల ద్వారా విత్తనాలు తీసుకుంటున్నారని మంత్రి చెప్పారు.

వచ్చే నెలాఖరు తర్వాత సమీక్ష..

మరోవైపు.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులకు తగిన ఆదేశాలు జారీచేస్తున్నారని.. ఈ విషయంలో ఇప్పటికే సమీక్ష కూడా నిర్వహించారని ఆయన గుర్తుచేశారు. ఈ విషయం రామోజీకి తెలియకపోవచ్చని.. ఎందుకంటే ఆయన నిత్యం చంద్రబాబు పల్లకీ మోయటంలో మునిగితేలుతున్నారని ఎద్దేవా చేశారు. ఇక సెప్టెంబర్ నుంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతున్నప్పటికీ ఇంతలోనే రైతులకు లేని బాధ మీకెందుకని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలాఖరు తర్వాత పూర్తిస్థాయిలో పరిస్థితిని సమీక్షించి ఆ తర్వాత రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. నిజానికి.. చంద్రబాబు, కరువు కవల పిల్లలని, టీడీపీ ఐదేళ్లు కరువు విలయతాండవం చేసిన విషయాన్ని మంత్రి కాకాణి గుర్తుచేశారు. చంద్రబాబు హయాంలో ఏటా కరువు మండలాలు ప్రకటించినా ఏ ఒక్క ఏడాది రైతులకు పైసా కూడా పరిహారం ఇవ్వలేదని.. అయినా ఏనాడు ఈనాడు సింగిల్ కాలమ్ వార్త కూడా రాసిన పాపాన పోలేదన్నారు.

రైతులకు రూ.2,558 కోట్లు ఎగ్గొట్టిన చంద్రబాబు

ఐదేళ్లలో 24.80 లక్షల మంది రైతులకు రూ.2,558 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ (పంట నష్టపరిహారం) బకాయిలు ఎగ్గొట్టిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత వైపరీత్యాల వేళ జరిగే పంట నష్టపరిహారాన్ని ఆ సీజన్ ముగియకుండానే ఇస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని కాకాణి చెప్పారు. అలాగే, ఇప్పటివరకు 22.74 లక్షల మంది రైతులకు రూ.1,965 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందించామన్నారు. ఇక టీడీపీ ఐదేళ్లలో 30.85 లక్షల మందికి రూ.3,411.20 కోట్ల బీమా పరిహారం ఇస్తే.. ఈ నాలుగేళ్లలో రైతులపై పైసా భారం పడకుండా 54.48 లక్షల మందికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.7,802 కోట్ల బీమా పరిహారం చెల్లించిందన్నారు. ఈ నాలుగేళ్లలో రైతులకు ప్రత్యేకంగా రూ.1,70,769 కోట్ల లబ్ధిచేకూర్చిన ప్రభుత్వంపై బురద జల్లడం మానుకోవాలని మంత్రి కాకాణి హితవు పలికారు.

రైతులకు తోడుగా ఉన్నాం

- వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల్లో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్ అన్నారు. 'పొలాలు బీడు–ఏదీ రైతుకు తోడు' శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనంలో ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. రైతులకు సాయం కోసం ప్రత్యామ్నాయ సాగు ప్రణాళిక చేపట్టడం లేదనడంలో వాస్తవం లేదన్నారు. సీజన్ ప్రారంభానికి నెల రోజులు ముందుగానే రాష్ట్ర ప్రభుత్వం ఐసీఏఆర్, సీఆర్ఐడీఏ, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల సూచనల మేరకు ఆర్బీకే, మండల, జిల్లా వ్యవసాయ సలహా మండళ్ల సమావేశాల్లో చర్చించి జిల్లాల వారీగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను తయారు చేశామన్నారు. అవసరమైన చోట లేట్ ఖరీఫ్ కింద ఇతర పంటలను సాగు చేసేందుకు రైతులకు అవగాహన కల్పించామన్నారు. ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా భూ యజమానులతో పాటు కౌలుదారులకు ఒక్కొక్క రైతుకు 2 హెక్టార్ల వరకు 80 శాతం రాయితీపై విత్తనాలను సిద్ధం చేసామన్నారు. జూలై నెలలో అధిక వర్షాల వల్ల పంట దెబ్బతిన్న రైతుకు సైతం 80 శాతం రాయితీపై విత్తనాలను సరఫరా చేశామన్నారు. ఈ విధంగా అర్హత, అవసరం ఉన్న రైతులను గుర్తించి ఆ జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శించామన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయాల్లో ప్రత్యామ్నాయ పంటలకు మారడానికి రైతులు ఆగస్టు చివరి వారం వరకు వేచి చూస్తారని చెప్పారు. కాగా.. ఖరీఫ్–2023లో ఇప్పటివరకు సాగైన పంటలను ప్రస్తుత వాతావరణంలో నిలదొక్కుకొని ఆశించిన దిగుబడులు సాధించేందుకు పాటించాల్సిన పంట యాజమాన్య పద్ధతులపై జిల్లా రిసోర్స్ సెంటర్స్, కేవీకే, ఏఆర్ఎస్, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలతో రైతులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నామన్నారు. ఇలా ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా తోడుగా నిలుస్తుంటే.. రైతులను ఆందోళనకు గురిచేసేలా, ప్రభుత్వం బురద జల్లే రీతిలో లేనిపోని ఆరోపణలు సరికాదన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

కార్యవర్గం ఎంపిక


దేవానంద్


సుధాకర్

కంప్లి: బళ్లారిలోని రూపనగుడి రోడ్డులోని హులిగమ్మ దేవి, చౌడేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం తొగటవీర క్షత్రియ నేకార సంఘం నూతన పదాధికారుల ఎంపిక జరిగింది. నేకార కుల బాంధవులందరి సహకారంతో జిల్లా అధ్యక్షునిగా సీ.దేవానంద్‌ను, ప్రధాన కార్యదర్శిగా కంప్లి వాసి జీ.సుధాకర్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కంప్లి తొగటవీర క్షత్రియ నేకార యువక సంఘం అధ్యక్షులు ఎం.ఈశ్వర్, పదాధికారులు అభినందించారు.

నోటు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలను అందించిన ఆప్ నాయకులు

బళ్లారిఅర్బన్: ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ముఖ్యమంత్రి చంద్రు జన్మదినం సందర్భంగా సోమవారం 36వ వార్డు కురిహట్టి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేసినట్లు ఆప్ నగర అధ్యక్షులు జేవీ మంజునాథ్ తెలిపారు. విద్యార్థుల సమక్షంలో స్వీట్లను పంచిపెట్టి పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. ఈసందర్భంగా పాఠశాల ముఖ్య ఉపాధ్యాయులు షణ్ముఖస్వామి, కురిహట్టి మల్లికార్జున, జమాపుర వీరేష్, నిరంజన్, గురుప్రసాద్, ఉమేష్, నాగరాజ్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరిహారం ఇవ్వండి


వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

రాయచూరు రూరల్: కొత్తదొడ్డిలో శుక్రవారం ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన విద్యార్థి మల్లేష్ కుటుంబానికి పరిహారం అందించాలని ఎస్ఆర్‌పీఎస్ పీయూ కళాశాల కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టిన సంచాలకులు అంబాపతి పాటిల్ మాట్లాడారు. యాదగిరి, రాయచూరు, కలబుర్గి జిల్లాల్లో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ ఇసుక రవాణా వల్ల అధికంగా సంభవిస్తున్న మరణాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు పరిహారం అందించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

కాంగ్రెస్‌లోకి వస్తే స్వాగతం: సీఎం

శివాజీనగర: కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాన్ని ఆమోదించి వస్తే పార్టీలోకి చేర్చుకొంటామని సీఎం సిద్దరామయ్య అన్నారు. ఆపరేషన్ హస్తం మాటలు వినిపిస్తుండగానే ఆయన స్పందిస్తూ పార్టీలోకి వచ్చేవారికి స్వాగతముందనే అర్థంలో మాట్లాడారు. మైసూరులో సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన, ఎవరైనా గానీ కాంగ్రెస్‌లో చేరవచ్చు. కాంగ్రెస్‌లోకి ఎవరు వచ్చినా స్వాగతిస్తామన్నారు.

కులదూషణ చేయలేదు


మాట్లాడుతున్న శివరాజ్

రాయచూరు రూరల్: జిల్లాలో కులం పేరుతో తాను ఎవరినీ దూషించలేదని బుడగ జంగమ సంఘం అధ్యక్షుడు శివరాజ్ పేర్కొన్నారు. ఆయన సోమవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమాజంలో జరిగిన పొరపాట్లకు రాజీ ప్రక్రియ పేరుతో జరిమానాలు విధిస్తున్నారన్నారు. కొంత మంది బుడగ జంగమ పేరుతో చేస్తున్న లోపాలను సవరించి వారిని సన్మార్గంలో వెళ్లమని చెప్పడం తప్పా? అని ప్రశ్నించారు.

ఆహార ధాన్యాల గోదాము సందర్శన


గోదామును సందర్శించిన దృశ్యం

కేజీఎఫ్: ప్రజలకు సరఫరా చేసే ఆహార ధాన్యాలను ఎలా సంరక్షిస్తారో తెలుసుకోవడానికి తాలూకాలోని దొడ్డచిన్నహళ్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సోమవారం నగరంలోని కోరమాండల్ ఆహార ధాన్యాల గోదామును ఉపాధ్యాయులతో కలిసి సందర్శించారు. గోదాము మేనేజర్ జగన్నాథన్ రేషన్ బియ్యాన్ని ఇక్కడ ఎలా నిల్వ చేస్తారు, ఇక్కడి నుంచి రేషన్ దుకాణాలను ఎలా చేరవేస్తారో విద్యార్థులకు వివరించారు. ఆహార ధాన్యాలను నిల్వ చేసేటప్పుడు ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకుంటారో తెలిపారు.

నేటి నుంచి మంత్రాలయంలో ఆరాధనోత్సవాలు

- హాజరు కానున్న ఏపీ గవర్నర్
- పలువురికి రాఘవేంద్రస్వామి అనుగ్రహ అవార్డుల ప్రదానం


విద్యుత్ దీపాలంకరణలో రాఘవేంద్ర స్వామి మఠం


పుష్పాలంకరణలో స్వామివారి మూల విరాట్

రాయచూరు రూరల్: మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామి మఠంలో రాఘవేంద్ర స్వాముల 352వ ఆరాధనోత్సవాలు, సప్తరథోత్సవాలు ఈనెల 29వ తేదీ మంగళవారం నుంచి సెప్టెంబర్ 4 వరకు వైభవంగా జరుగుతాయి. 31న పూర్వారాధన, 1న మధ్యారాధన, 2న ఉత్తరాధన జరగనుండగా, పూర్వారాధనలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొంటారు. రాఘవేంద్ర స్వామి అనుగ్రహ అవార్డులను విద్వాన్ విఠలాచార్య, విద్వాన్ గరికపాటి నరసింహారావు, చంద్రశేఖరన్, విశ్వనాథ్ కరడిలకు ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమాల కోసం విద్యుత్ దీపాలతో మఠాన్ని అలంకరించడంతో పాటు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆరాధనోత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర, గోవా, ఒడిశా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి భక్తుల సందడి అధికంగా ఉంటుంది. మంత్రాలయంలో భక్తులకు మౌలిక సౌకర్యాలు కల్పించారు.

కడసారి చూపునకు రాని బిడ్డలు

- విదేశాల్లో మంచి ఉద్యోగాల్లో సంతానం
- పోలీసులే వృద్ధుని అంత్యక్రియలు జరిపిన వైనం


మూల చంద్రశర్మ(ఫైల్), అంత్యక్రియలు చేసిన పోలీసులు

రాయచూరు రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన తండ్రి కడసారి చూపునకు విదేశాల్లో ఉన్న కొడుకు, కూతురు రాకపోవడంతో పోలీసులే అంత్యక్రియలు చేసిన ఘటన బెళగావి జిల్లా చిక్కోడి తాలూకా నగరమున్నోళిలో జరిగింది. రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ మూల చంద్రశర్మ(72) కొడుకు దక్షిణాఫ్రికాలో, కూతురు కెనడాలో మంచి ఉద్యోగాల్లో ఉన్నారు. ఆయన వద్ద ఓ పని మనిషిని నియమించి చిక్కోడి లాడ్జిలో ఉంచి బాగోగులు చూసుకునేలా ఏర్పాటు చేశారు. అయితే చంద్రశర్మ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో లాడ్జిలో మరణించారు. దీంతో ఆయన మరణవార్తను విదేశాల్లో ఉన్న కొడుకు, కూతురులకు పోలీసులు తెలిపినా అటు వైపు నుంచి అంత్యక్రియలకు హాజరయ్యే విషయంపై ఎలాంటి స్పందన లేకపోవడంతో పోలీసులే మానవతా దృష్టితో తామే అంత్య సంస్కారాలు జరపడంతో పోలీసుల సేవను ప్రజలు ప్రశంసిస్తున్నారు.

మణిపూర్ హింసను ఖండిస్తూ ధర్నా


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న వెంకప్ప డ్యానియల్

గంగావతి: మణిపూర్‌లో ఇటీవల జరిగిన హింసాత్మక ఘటనలను ఖండిస్తూ సోమవారం గంగావతి క్రైస్తవ సమాజం వారు బస్టాండ్ సర్కిల్‌లో ధర్నా చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి క్రైస్తవ కౌన్సిలింగ్ పదాధికారి వెంకప్ప డ్యానియల్ మాట్లాడుతూ ఇటీవల మైనార్టీలపై దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు, ఇళ్లను లూటీ చేయడం, నగ్నంగా ఊరేగించడం లాంటి పలు రకాల వేధింపులకు గురి చేశారన్నారు. ప్రభుత్వాలు మైనార్టీలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో పలు ప్రాంతాల్లో క్రైస్తవ సమాజంపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలన్నారు. పవిత్రంగా భావించే ప్రార్థన మందిరాలపై దాడి చేయడం తగదన్నారు. క్రైస్తవులు కూడా దేశభక్తి కలిగినవారేనని, భారతదేశం కోసం ప్రాణాలు సైతం అర్పించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. తమపై జరిగే దాడుల నుంచి రక్షణ కల్పించాలని ఒత్తిడి చేశారు. అంతకు ముందు వారు గండిలోని చర్చిలో నుంచి దుర్గమ్మ దేవస్థానం మీదుగా విచ్చేసి ధర్నాకు ఉపక్రమించారు. కార్యక్రమంలో క్రైస్తవ కౌన్సిలింగ్ ప్రముఖులు జాన్ ముళ్లూరు, విజయ్‌కుమార్, జాన్ అబ్రహం, జాన్ పలాం, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు సాగునీరు అందించండి


మాట్లాడుతున్న డివిజనల్ కమిషనర్ కృష్ణ వాజ్‌పేయి

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువలో సక్రమ నీటి నిర్వహణకు కలబుర్గి డివిజనల్ కమిషనర్ కృష్ణ వాజ్‌పేయి అధికారులకు పలు సూచనలు చేశారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన అధికారుల, రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 49, 69, 104వ మైళ్ల వద్ద నీటి నిర్వహణకు అధికారులు సహకరించి ఆయకట్టు చివరి భూములకు నీరందించడానికి గేజ్ సామర్థ్యాన్ని పెంచాలన్నారు. ఈ విషయంలో ఇంజినీర్లు సక్రమంగా కాలువలపై నీటి నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలన్నారు. పైభాగంలో అధికంగా అక్రమ నీటి చౌర్యం జరుగుతోందన్నారు. కాలువలో అక్రమ నీటి చౌర్యాన్ని అరికట్టాలన్నారు. 69వ మైలులో 12 మీటర్లు, 104వ మైలులో 10 మీటర్ల మేర నీరు వదిలితే ఆయకట్టు చివరి భూములకు నీరందుతాయని రైతులు వివరించారు. సమావేశంలో గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, ఎడమ కాలువ పోరాట సమితి గౌరవాధ్యక్షుడు చామరస మాలిపాటిల్, అధ్యక్షుడు శంకర్‌గౌడ, అమరేష్, శరణప్పగౌడ, బసనగౌడ, చుక్కి సూగప్పలున్నారు.

సాగునీటి కోసం రాస్తారోకో

కాగా తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు నీరందించాలని రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం సిరవారలో ఐదో రోజు రాస్తారోకో చేపట్టి రైతులు మాట్లాడారు. నీటి నిర్వహణలో గేజ్‌ను కాపాడాలని, ఆయకట్టు భూములకు నీరందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేశారు.

క-కలో 12 వేల ఉద్యోగాల భర్తీ

- మంత్రి రామలింగారెడ్డి

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటక(క-క)లో రవాణా శాఖలో ఖాళీగా ఉన్న 12 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం సింధనూరు ఆర్టీసీ బస్టాండ్‌లో వోల్వో మల్టీ యాక్సిల్ కళ్యాణరథ బస్సులను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ ఏడాది 700 కొత్త బస్సులను కేటాయిస్తామన్నారు. శక్తి పథకం ద్వారా బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగిందన్నారు. నగర సంచారానికి అనువుగా 150 విద్యుత్ చాలిత బస్సులను అందిస్తామన్నారు. గత ప్రభుత్వ పాలనలో అవినీతి, అక్రమాలు పెచ్చుమీరడంతో ప్రజలు విసుగు చెంది కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు హంపనగౌడ బాదర్లి, బసనగౌడ తుర్విహాళ, ఎమ్మెల్సీ శరణేగౌడ బయ్యాపూర్, అధికారులు రామచంద్రారెడ్డి, రాచప్ప, సంతోష్, చెన్నబోరయ్య, అరుణ్ కుమార్, మంజునాథ్‌లున్నారు.

ఇది నియంతృత్వ పాలన: బొమ్మై

శివాజీనగర: కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో ప్రజల విశ్వాసం పొందిందనటం అవాస్తవం. వారి ఎమ్మెల్యేల విశ్వాసాన్నే ప్రభుత్వం కోల్పోయింది. అన్ని రంగాల్లో విఫలం కావడం ఈ సర్కారు సాధన అని బీజేపీ నేత, మాజీ సీఎం బసవరాజ బొమ్మై ఎద్దేవా చేశారు. సర్కారుకు వ్యతిరేకంగా గళమెత్తే ప్రజలు, మీడియా, సంఘ సంస్థలపై పోలీస్ శాఖ ద్వారా అణచివేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన సోమవారం ట్విట్టర్లో స్పందిస్తూ ఇది రాజ్యాంగ వ్యతిరేక, నియంతృత్వ పాలన అనేది 100 రోజుల్లో చూపించారని విమర్శించారు. గ్యారంటీల నెపంతో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయని, కాంట్రాక్టర్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టుకొని కమీషన్ దందాకు పాల్పడుతోందని ఆరోపించారు. రైతులు కరువు కాటకాలకు గురవుతున్నా కూడా రైతుల వైపు తిరిగి చూడలేదన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు


గంధం అలంకరణలో కోట మల్లేశ్వర స్వామివారు

బళ్లారిఅర్బన్: శ్రావణమాసం సందర్భంగా సోమవారం నగరంలోని వివిధ శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. స్థానిక కోట మల్లేశ్వర ఆలయంలో, పెద్ద మార్కెట్ నీలకంఠేశ్వర ఆలయంలో, నగరేశ్వర ఆలయంలో, నాగేశ్వర ఆలయంలో, గ్రాహం రోడ్డు మల్లికార్జున ఆలయంలో, ఎస్ఎన్‌పేట్ కాశి విశ్వేశ్వర ఆలయం తదితర శివాలయాల్లో శ్రావణమాస పూజలు జరుపుకున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

హొసపేట: పంట నష్టంతో వ్యవసాయం కోసం చేసిన రుణాలను ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెంది ఓ రైతు ఆత్మహత్య చేసుకొన్న ఘటన ఆదివారం రాత్రి జరిగింది. హూవినహడగలి తాలూకా హ్యారడ గ్రామానికి చెందిన రైతు శివరాజ్(42) సుమారు రూ.1.50 లక్షలు ఖర్చు చేసి ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. కానీ వర్షాల లేమితో పంట ఎండిపోయింది. దీంతో రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నారు. ఘటనపై హూవినహడగలి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా స్ఫూర్తి అవసరం


పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు

కోలారు: ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలని దేవరాజ్ అరస్ విశ్వవిద్యాలయ సలహాదారు హనుమంతరావ్ అన్నారు. సోమవారం నగరంలోని దేవరాజ్ అరస్ నర్సింగ్ కళాశాలలో వార్షిక క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యం కోసం తరచుగా క్రీడల్లో పాల్గొనడం ఉత్తమం అన్నారు. మధుమేహం, రక్తపోటు వంటి రోగాలను దూరంగా ఉంచుతుందన్నారు. అనేక రోగాల నుంచి మనిషిని దూరం చేసి మానసిక ప్రశాంతతను అందిస్తుందన్నారు. పోటీల అనంతరం విజేత విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

కేజీఎఫ్: వ్యక్తిపై దాడి కేసుకు సంబంధించి గత తొమ్మిదేళ్లుగా పరారీలో ఉన్న నిందితుడిని బేతమంగల పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు..బేతమంగలకు చెందిన కృష్ణప్ప అనే వ్యక్తిపై 2014లో బేతమంగల పోలీస్ స్టేషన్‌లో వ్యక్తిపై దాడి కేసు నమోదైంది. అయితే అప్పటి నుంచి కోర్టుకు హాజరు కాకుండా నిందితుడు కృష్ణప్ప తప్పించుకు తిరుగుతున్నాడు. కోర్టు ఆదేశాల మేరకు బేతమంగల ఎస్ఐ సతీష్ తమ సిబ్బందితో కలిసి గాలించి ఎట్టకేలకు కృష్ణప్పను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

అధికారుల తీరుపై ఎమ్మెల్యే మండిపాటు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్

రాయచూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వర్షాలు లేక ప్రజలు వలస వెళుతుంటే వ్యవసాయ, రెవిన్యూ శాఖాధికారులు సమీక్షలు జరపకుండా కాలాయాపన చేసి మౌనం వహించడం వల్లే సర్కార్ రాయచూరు తాలూకాను కరువు ప్రాంతంగా ప్రకటించలేదని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ అధికారుల తీరుపై మండిపడ్డారు. సోమవారం జిల్లా పంచాయతీ సభాభవనంలో ఏర్పాటు చేసిన కేడీపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ శాఖాధికారిణి దీపా కులకర్ణి విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంపై జెడ్పీ సీఈఓకు ఫిర్యాదు చేస్తామన్నారు. తాలూకాలో తాగునీటి ఎద్దడి నెలకొనకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జలధారె పథకంలో జరిగిన లోపాలను సవరించాలన్నారు. అర్ధాంతరంగా ఆగిన పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాల పనులను పూర్తి చేయాలన్నారు. 30న జరిగే గృహలక్ష్మి పథకం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో అధికారులు శశికాంత్, చంద్రశేఖర్, బసవరాజ్, జయంతిరావ్ పతంగి, ప్రకాష్‌రాజ్‌లున్నారు.

గ్యారంటీలకు వారే తొలి దరఖాస్తుదారులు

- ధార్వాడలో మంత్రి మధుబంగారప్ప ఎద్దేవా


మాట్లాడుతున్న మంత్రి మధుబంగారప్ప

హుబ్లీ: కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారంటీ పథకాలపై విమర్శలు చేస్తున్న బీజేపీ నేతల కుటుంబ సభ్యులే తొలి దరఖాస్తుదారులని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి మధు బంగారప్ప ఎద్దేవా చేశారు. ఆయన సోమవారం ధార్వాడలో విలేకరులతో మాట్లాడారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం చేస్తున్న మహిళల్లో బీజేపీ నేతల కుటుంబ సభ్యులే ఎక్కువగా ఉన్నారన్నారు. వారు ప్రయాణించినా తమకేం అభ్యంతరం లేదన్నారు. వారు తమవారేనన్న భావన తమలో ఉందన్నారు. అందువల్ల ఈ విమర్శలకు స్వస్తి చెప్పాలన్నారు. కాంగ్రెస్‌లో విపక్ష నేతల చేరికపై స్పందిస్తూ పార్టీ సిద్ధాంతాలను మెచ్చి చేరేవారు చేరవచ్చన్నారు. ప్రభుత్వ కళాశాల అనుమతిలో జాప్యానికి ఆయన సమాధానమిస్తూ వీటి ప్రారంభానికి చాలా వరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. అయితే విద్యాశాఖలో పలు సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోగా ఆ కళాశాలలు ప్రారంభం అవుతాయన్నారు. 32 వేల మంది ఉపాధ్యాయులను బదిలీ చేశామన్నారు. దీంతో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటి స్థానంలో అతిథి ఉపాధ్యాయులను నియమిస్తామన్నారు. ఈ విషయంపై 10 రోజుల్లో సీఎంతో సమావేశం నిర్వహిస్తామన్నారు. బదిలీల్లో అక్రమాలు జరిగాయన్న విపక్షాల ఆరోపణలపై బదులిస్తూ ఆ బదిలీలన్నీ కౌన్సిలింగ్ ద్వారానే జరుపుతున్నా ఆరోపణలు చేశారన్నారు.

పోయిన బంగారు గొలుసు దొరికింది

- నిజాయతీ చాటిన ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్


సొంతదారుకు మంగళసూత్రాన్ని అందిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: ఆర్టీసీ బస్సు కండక్టర్, డ్రైవర్ల నిజాయతీతో బస్సులో పోయిందనుకున్న మంగళ సూత్రం తిరిగి లభించిన సంఘటన చోటు చేసుకుంది. ఆదివారం సాయంత్రం మాన్వి డిపోకు చెందిన కేఏ-36 ఎఫ్-1335 నంబరుగల బస్సులో విజయపురకు చెందిన నూర్‌జహాన్ ఇనాందార్ నాలత్వాడ నుంచి విజయపురకు ప్రయాణించిన సమయంలో బస్సులో ఐదు గ్రాముల మంగళసూత్రం పోగొట్టుకుంది. అయితే కండక్టర్ శివానంద, డ్రైవర్ రామప్ప కుందర్గిలు బస్సులో తమకు దొరికిన మంగళసూత్రాన్ని విజయపుర డిపో ఏటీసీ దేవేంద్రప్పకు అందజేశారు. మంగళసూత్రాన్ని పోగొట్టుకున్న నూర్జహాన్ ఈ విషయంపై గాంధీచౌక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు డిపో అధికారులను సంప్రదించి అధికారులు, ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్ల సమక్షంలో మంగళసూత్రాన్ని సొంతదారుకు అందించారు. కాగా కండక్టర్, డ్రైవర్ల నిజాయతీని అధికారులు ప్రశంసించి అభినందించారు.

ఎయిడ్స్‌పై అవగాహన పరుగు


పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు


పరుగు పందెంలో పాల్గొన్న యువత

హొసపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించి మేధో, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే హెచ్ఆర్.గవియప్ప సూచించారు. సోమవారం విజయనగర కళాశాలలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై నిర్వహించిన యువజనోత్సవ మారథాన్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కళాశాల విద్యార్థుల్లో ఆరోగ్య సంరక్షణ, ప్రాణాంతక వ్యాధులపై అవగాహన అవసరమన్నారు. జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ మాట్లాడుతూ ముందు అభివృద్ధి చెందని దేశాల్లో హెచ్ఐవీ వ్యాపించి కల్లోలం సృష్టించిందన్నారు. అవగాహన, నియంత్రణ సాధనాల వినియోగంతో వ్యాధి క్రమంగా తగ్గుతోందన్నారు. విద్యార్థులు దీనిపై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు.

ఉత్సాహంగా మారథాన్

విజయనగర కళాశాల సమీపంలో ప్రారంభమైన మారథాన్ మార్కండేశ్వరాలయం రోడ్డు, వాల్మీకి సర్కిల్, మదకరినాయక సర్కిల్, గాంధీచౌక్, పుణ్యమూర్తి సర్కిల్, రైల్వే స్టేషన్ రోడ్డు, కనకదాస సర్కిల్, చిత్తవాడ్గి, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా సాగి పునీత్ రాజ్‌కుమార్ సర్కిల్ దగ్గర ముగిసింది. జిల్లా కేంద్రంలో 5 కి.మీ.ల సుదూరం పాటు జరిగిన మారథాన్‌లో బళ్లారి, విజయనగర జిల్లాల్లోని వివిధ తాలూకాలకు చెందిన 120 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వర్షాల కోసం పూజలు

పావగడ: తాలూకావ్యాప్తంగా ఇంతవరకు బలమైన వర్షాలు కురవకపోవడంతో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. అరకొరగా సాగు చేసిన వేరుశనగ పంట చినుకులు పడక చిగురులోనే ఎండిపోతుంటే రైతులు దిగాలు పడిపోతున్నారు. మరోవైపు తాగునీటి కొరత ఛాయలు కనిపిస్తున్నాయి. పొలాలు, ఊర్లలో బోర్లలో నీళ్ళు తగ్గాయి, దీంతో గ్రామాల ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో వైఎన్ హొసకోట గ్రామ పంచాయతీ లోని గౌడ తిమ్మనహళ్లి గ్రామంలో దండిగా వర్షాలు కురవాలంటూ గ్రామస్థులు సోమవారం గంగమ్మ దేవికి పూజలు చేశారు. చెరువు కట్ట వద్ద పెద్దలు, మహిళలు, పిల్లలు కలసి భజనలు చేశారు.

ఎమ్మెల్యేలెవరూ జేడీఎస్‌ను వీడరు

- భూ మాఫియాకు సర్కారు అండ: దేవెగౌడ

శివాజీనగర: జేడీఎస్ పార్టీని ఏ ఎమ్మెల్యే విడిచి పెట్టరని, ఒకవేళ అటువంటి వారుంటే వారి పేర్లు చెప్పాలని పార్టీ అధినేత హెచ్.డీ.దేవెగౌడ సవాల్ చేశారు. సోమవారం బెంగళూరు జేడీఎస్ ఆఫీసులో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, ఈ వయస్సులో కూడా పార్టీని పటిష్టపరుస్తానన్నారు. జేడీఎస్‌ను కొందరు ఎమ్మెల్యేలు వదిలేస్తారనే వార్త అబద్ధమని అన్నారు. తాను ఏ పార్టీకి వ్యతిరేకంగా ద్వేష రాజకీయం చేయనని, సెప్టెంబర్ 10న ప్యాలెస్ మైదానంలో కార్యకర్తలతో సభ నిర్వహించి శక్తిని చాటుతామని చెప్పారు. రాష్ట్రంలో ఒక్క కార్యకర్తకు బాధ కలిగినా క్షమాపణ కోరుతాను. దేవేగౌడ ప్రాణాలతో ఉన్నాడు, ఈ సభకు రండి అని విన్నవించానని అన్నారు. కాగా, బెంగళూరులో భూమాఫియాకు ప్రభుత్వం కొమ్ము కాస్తోంది, సర్కారు భూముల కబ్జాకు గురవుతున్నాయన్నారు. దీనిపై తన వద్ద చాలా విషయాలు ఉన్నాయి, మునుముందు రోజుల్లో ఈ విషయమై మాట్లాడుతానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై కుమారస్వామి పెన్‌డ్రైవ్ విడుదల చేస్తానన్నారు, ఆయన ఏదీ అంత తేలికగా మాట్లాడరని కుమారున్ని సమర్థించారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని విమ్స్ మార్చురీకి తరలిస్తున్న పోలీస్, అంబులెన్స్ సిబ్బంది

బళ్లారిఅర్బన్: బ్రూస్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 13వ వార్డు మిల్లర్‌పేట్ గణేష్ గుడి ఎదురుగా నివసిస్తున్న ఆర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగి రామాంజినేయులు కుమారుడు రఘురాం(38) అనే వ్యక్తి అనారోగ్యంతో ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బ్రూస్‌పేట్ ఎస్ఐ సురేష్ తెలిపారు. సీఐ సింధూర్ ఆదేశాల మేరకు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అంబులెన్స్ ద్వారా విమ్స్ మార్చురీకి తరలించారు. షామియాన షాప్‌లో పని చేసే మూగ వ్యక్తి రఘురాం కిడ్నీ ఆపరేషన్ జరిగింది. అయినా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


నాగేంద్ర(ఫైల్)

రాయచూరు రూరల్: బట్టలు ఉతికే వాషింగ్ మిషన్ షాక్ కొట్టడంతో ఓ వ్యక్తి మరణించిన ఘటన చోటు చేసుకుంది. సోమవారం మస్కి తాలూకా దుర్గా క్యాంప్‌లో నాగేంద్ర(32)అనే వ్యక్తి వాషింగ్ మిషన్‌లో బట్టలు వేయడానికి ప్రయత్నించగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటనపై మస్కి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

యజ్ఞంగా మొక్కల పంపిణీ

మాలూరు: దైవ పూజ కంటే మొక్కల పోషణ ఎంతో పూజ్యనీయమని, అందువల్ల ప్రజలు మొక్కలను విరివిగా పెంచే అలవాటు చేసుకోవాలని పర్యావరణ ప్రేమికుడు వెంకటేషమూర్తి తెలిపారు. సోమవారం లక్కూరు ఫిర్కా డీఎస్ దొడ్డి జీపీలోని అంబేడ్కర్ వసతి పాఠశాలలో పలు జాతుల మొక్కలను ఉచితంగా పంపిణీ చేసి మాట్లాడారు. తాను గత నాలుగేళ్లుగా ఇళ్లు, పాఠశాలలు, కార్యాలయాలు, చర్చిలు, మసీదులు, ఆలయాలకు ఒక పెద్ద యజ్ఞంగా భావించి ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తున్నానన్నారు. పాఠశాల ఉపన్యాసకుడు ఎస్ఎం మునిరాజ్, ప్రిన్సిపాల్ జి ఉమాదేవి, ఉపన్యాసకుడు ఆర్‌టి మహేష్ పాల్గొన్నారు.